
బుధవారం 18-12-2024

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 267


'రాష్ట్రాన్ని, దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా తీర్చిదిద్దాలనేది నా స్వప్నం'



వాళ్లకు ప్రైవేట్ జాగీరు!
రాజ్యాంగంపై చర్చలో కాంగ్రెస్‌పై అమిత్ షా ధ్వజం
-6లో



బాంబు దాడిలో రష్యా ఆర్మీ జనరల్ మృతి
-6లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

తెలంగాణలో ఎంబీబీఎస్ చేస్తే.. పీజీలో 'స్థానికులే'

'లోకల్' అర్హత ఉండి రాష్ట్రం వెలుపల ఎంబీబీఎస్ చేసినా స్థానికులే

- మెడికల్ పీజీ సీట్ల భర్తీపై హైకోర్టు కీలక తీర్పు
- 2024–25 విద్యా సంవత్సరానికి మాత్రమే తీర్పు పరిమితం
- ప్రభుత్వం జారీచేసిన జీఓ 148, 149 చట్ట విరుద్ధమని ప్రకటన



- వివరాలు 16లో

ఏం చేద్దాం?

- హైకోర్టు తీర్పుతో కౌన్సెలింగ్‌పై సర్కార్ సమాలోచనలు
- ఇప్పటికే ఆలస్యమైన పీజీ మెడికల్ అడ్మిషన్ల ప్రక్రియ
- 2 రోజుల్లో కొత్త కౌన్సెలింగ్ విధానం ప్రకటించే అవకాశం

లోక్‌సభలో జమిలి బిల్లులు

విపక్షాల వ్యతిరేకత మధ్యే 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' బిల్లులను ప్రవేశపెట్టిన కేంద్రం


జమిలి బిల్లులను ప్రవేశపెడుతున్న కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రాం మేఘ్‌వాల్

- 129వ రాజ్యాంగ సవరణ, కేంద్రపాలిత ప్రాంతాల సవరణ బిల్లులను ప్రవేశపెట్టిన కేంద్రమంత్రి మేఘ్‌వాల్
- బిల్లులపై ఓటింగ్‌కు పట్టుబట్టిన కాంగ్రెస్ సహా విపక్షాలు
- అంగీకరించిన స్పీకర్.. కొత్త పార్లమెంటు భవనంలో తొలిసారి ఎలక్ట్రానిక్, పేపర్ స్లిప్ పద్ధతిన ఓటింగ్
- అనంతరం 90 నిమిషాలపాటు వాడీవేడి చర్చ
- రాజ్యాంగానికి, లౌకిక స్ఫూర్తికి విరుద్ధం: విపక్షాలు
- పార్లమెంటుకు సవరణాధికారం లేదన్న కాంగ్రెస్
- కొట్టిపారేసిన కేంద్రం, జేపీసీలో చర్చిద్దామన్న షా
- బిల్లులను జేపీసీకి నివేదిస్తూ నేడు సభలో తీర్మానం!

అనుకూలం 269

వ్యతిరేకం 198

కీలక ఎన్నికల వాగ్దానాన్ని నిలబెట్టుకునే దిశగా మోదీ ప్రభుత్వం ముందడుగు వేసింది. లోక్‌సభతో పాటు అన్ని రాష్ట్రాల శాసనసభలకూ ఏక కాలంలో ఎన్నికలు జరిపేందుకు ఉద్దేశించిన రెండు జమిలి బిల్లులను కేంద్రం మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. దీన్ని రాజ్యాంగంపైనే దాడిగా విపక్షాలు అభివర్ణించాయి. మోదీ సర్కారుది ఫక్తు నియంతృత్వ ధోరణి అంటూ మండిపడ్డాయి. అధికార, విపక్షాల ఆరోపణలు, ప్రత్యారోపణలతో సభలో యుద్ధ వాతావరణం నెలకొంది. చివరికి వ్యవహారం ఓటింగ్ దాకా వెళ్లింది. జమిలి బిల్లులపై జేపీసీలో కూలంకషంగా చర్చిద్దామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించినా విపక్షాలు శాంతించలేదు. రాజ్యాంగ సవరణ బిల్లుల ఆమోదానికి పార్లమెంటులో మూడింట రెండొంతుల మెజారిటీ లేదని తెలిసీ మోదీ సర్కారు విఫల యత్నం చేస్తోందని ఎద్దేవా చేశాయి.

- వివరాలు 6లో▶

అప్పుల లెక్కలు.. అన్నీ అబద్ధాలే

శాసనసభలో హరీశ్ వర్సెస్ భట్టి 12లో

కేటీఆర్‌పై కేసు పెట్టండి

- ఫార్ములా ఈ–కార్ల రేసు వ్యవహారంలో దర్యాప్తు ప్రారంభించండి
- ఏసీబీకి సీఎస్ శాంతికుమారి లేఖ

- వివరాలు 3లో▶


kisna.com
#HarGharKisna
60+ EXCLUSIVE SHOWROOMS
KISNA
DIAMOND & GOLD JEWELLERY
BY HARI KRISHNA GROUP
KFNC40218N | KFNC40218E
UPTO 100%
వజ్రాభరణాల తయారీ చార్జీలపై తగ్గింపు*
FLAT 15%
బంగారాభరణాల తయారీ చార్జీలపై తగ్గింపు*
only NATURAL DIAMONDS
Natural Diamond Council
షాపింగ్ చేయండి మరియు కారు గెలుచుకోండి*
90%* బైబ్యాక్
95%* ఎక్స్చేంజ్
వజ్రాల నగలపై తయారీ ఛార్జీలతో సహా
వివరాల కోసం
franchise@kisna.com
91524 84423
మా ప్రస్తుత షోరూమ్‌లు: తెలంగాణ, హైదరాబాద్ - సరత్ సిటీ మాల్, గచ్చిబౌలి 91005 50230 | ఇనార్బిట్ మాల్ - సైబరాబాద్, మైండ్‌స్పేస్, మాదాపూర్ 81212 78807
దుర్గానగర్ కాలనీ, సోమాజిగూడ 86554 75096 | సికింద్రబాద్ - త్యాగరాయ నగర్, ఏ.ఎస్. రావు నగర్ 86554 75100
ఆంధ్రప్రదేశ్, విశాఖపట్నం - మెయిన్ రోడ్ న్యూ గాజువాక, మోహిని థియేటర్ ఎదురుగా 86554 75085
వస్తున్న షోరూమ్‌లు: తెలంగాణ, హైదరాబాద్ - చందా నగర్ | గచ్చిబౌలి
ఆంధ్రప్రదేశ్, విజయవాడ - ఎమ్.జి.రోడ్ | శ్రీకాకుళం | గుంటూరు
SCAN HERE
KISNA ఇప్పుడు మొత్తం భారతదేశంలో 60కు పైగా ఎక్స్‌క్లూజివ్ షోరూమ్‌లు మరియు 1,500కు పైగా షాప్-ఇన్-షాప్ లొకేషన్లలో అందుబాటులో ఉంది.

కేటీఆర్‌పై కేసు పెట్టండి

ఫార్ములా ఈ-కార్ల రేసు వ్యవహారంలో దర్యాప్తు ప్రారంభించండి

ఏసీబీకి సీఎస్ శాంతికుమారి లేఖ

గవర్నర్ ఈ మేరకు అనుమతి ఇచ్చినట్లు వెల్లడి



త్వరలో నోటీసులు!

సీఎస్ లేఖ నేపథ్యంలో ఏసీబీ తక్షణమే కేటీఆర్, ఇతరులపై అవినీతి నిరోధక చట్టంలోని వివిధ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ మేరకు వారికి త్వరలోనే నోటీసులు జారీ చేయవచ్చని పేర్కొన్నాయి.

సాక్షి, హైదరాబాద్: ఫార్ములా ఈ-కార్ల రేసు వ్యవహారంలో పురపాలక శాఖ మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావుతో పాటు ఇతరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించాలని రాష్ట్ర అవినీతి నిరోధక విభాగాన్ని (ఏసీబీ) రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మంగళవారం ఏసీబీ డీజీ విజయ్‌కుమార్‌కు లేఖ రాశారు. ఫార్ములా ఈ-కార్ల రేసు వ్యవహారంలో జరిగిన అవకతవకతల విషయంలో మాజీ మంత్రి కేటీఆర్‌పై విచారణ నిర్వహించేందుకు అవినీతి నిరోధక చట్టం-2018లోని సెక్షన్ 17(ఏ) కింద రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతినిచ్చారని తెలిపారు. అప్పట్లో పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఈ వ్యవహారంలో కీలక పాత్ర పోషించిన అర్వింద్‌కుమార్‌తో పాటు హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ డీఎల్ఎన్ రెడ్డి తదితరులను సైతం కేసులో సహ నిందితులుగా చేర్చి విచారించాలని సీఎస్ ఆదేశించారు. కేటీఆర్, తదితరులపై ఏసీబీ విచారణకు ఆదేశించాలని, సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. నాటి మంత్రి కేటీఆర్ ఆదేశాలతోనే ఫార్ములా ఈ-కారు రేసు నిర్వాహకులకు చెల్లింపులు జరిపినట్లు అర్వింద్‌కుమార్ ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి వివరణ ఇచ్చారు. కాగా గవర్నర్ ఇచ్చిన అనుమతి లేఖతో పాటు అర్వింద్‌కుమార్ ఇచ్చిన వివరణ పత్రాలను సీఎస్ తన లేఖకు జత చేసినట్లు తెలిసింది.

‘ఫార్ములా - ఈ’ పై చర్చకు రెడీ

- ప్రజా సమస్యలపై దమ్ముంటే 15 రోజులు సభ పెట్టాలి
- అసెంబ్లీ నడిచినన్ని రోజులు లగచర్ల అంశాన్ని ప్రస్తావిస్తాం
- రేవంత్ స్థాయికి కేసీఆర్ సభకు రావాల్సిన అవసరం లేదు
- కొడంగల్ బీఆర్ఎస్ నేతల సమావేశంలో కేటీఆర్



సాక్షి, హైదరాబాద్ : ‘ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి దమ్ముంటే అసెంబ్లీ సమావేశాలను 15 రోజుల పాటు నిర్వహించాలి. ప్రజా సమస్యలపై చర్చించిన తర్వాత ఆయన ఆరోపిస్తున్న స్కామ్‌లు, ‘ఫార్ములా – ఈ’వంటి అంశాలపై చర్చించేందుకు మేము సిద్ధం. మంత్రివర్గ సమావేశాల పేరిట గంటల తరబడి ఎవరిని అరెస్టు చేయాలో అనే అంశంపై చర్చించడం కాదు. మంత్రివర్గ సమావేశాల్లో ప్రజలకు మంచి చేయడంపై ఆలోచన చేయాలి. అసెంబ్లీ సమావేశాలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రావాలని రేవంత్ డిమాండ్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న మా కార్యకర్తలనే తట్టుకోలేకపోతున్నాడు. రేవంత్ స్థాయికి కేసీఆర్ రావాల్సిన అవసరం లేదు’అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణభవన్‌లో మంగళవారం సాయంత్రం జరిగిన కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు సమావేశంలో ఆయన మాట్లాడారు. ‘లగచర్ల అంశాన్ని వదిలిపెట్టేది లేదు. అసెంబ్లీ నడిచినన్ని రోజులు లేవనెత్తుతూనే ఉంటాం. లగచర్ల రైతులు, బీఆర్ఎస్ నేతలను విడుదల చేయాలి. కొడంగల్ బీఆర్ఎస్ శ్రేణులను కాపాడుకునే బాధ్యత మాది’ అని కేటీఆర్ భరోసా ఇచ్చారు.

భవిష్యత్‌లో లగచర్ల నుంచే జైత్రయాత్ర

‘కొడంగల్ ప్రజల కోసం నిలబడిన మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి ఉక్కుమనిషిగా మారి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తుక్కుతుక్కు చేస్తాడు. భవిష్యత్‌లో లగచర్ల నుంచే ప్రారంభమయ్యే బీఆర్ఎస్ జైత్రయాత్రతో రేవంత్‌రెడ్డి పతనం ప్రారంభమవుతుంది. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో రేవంత్ నక్క వినయం, అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చారు. సీఎం సొంతూరు కొండారెడ్డిపల్లెతో సహా రాష్ట్రంలోని ఏ ఒక్క గ్రామంలోనూ వందశాతం రైతు రుణమాఫీ జరగలేదు. ఈ అంశంపై సవాలు విసిరితే సీఎం రేవంత్ పారిపోగా, రాహుల్‌గాంధీ మొదలుకొని కాంగ్రెస్ కార్యకర్తల ద్వారా సిగ్గు లేకుండా అబద్ధాలు చెబుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రైతులు కాంగ్రెస్‌కు బుద్ధి చెప్తారు. ఏడాది పాలనలోనే రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమై హామీలను అమలు చేయలేక ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుంది’అని కేటీఆర్ మండిపడ్డారు.

లగచర్లపై రేవంత్ కుటుంబం కన్ను

‘మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డికి బుధవారం కోర్టులో న్యాయం దక్కుతుందనే నమ్మకం ఉంది. తన బెయిల్ గురించి కాకుండా జైలులో ఉన్న రైతుల గురించి ఆయన ఆందోళన చెందుతున్నారు. సీఎం రేవంత్ సోదరుడు తిరుపతిరెడ్డి కనీసం వార్డుస్థాయి ప్రజాప్రతినిధి కూడా కాకపోయినా పోలీసుల అండతో అరాచకం చేస్తున్నాడు. పరిశ్రమలు పెట్టడం, ఉపాధి కల్పించడమే రేవంత్ లక్ష్యమైతే వెల్దండలో ఆయన కుటుంబానికి ఉన్న 500 ఎకరాల భూమిలో పెట్టాలి’అని కేటీఆర్ సవాల్ చేశారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, జగదీశ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, నవీన్‌రెడ్డి, గోరేటి వెంకన్న, పార్టీ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

రెవెన్యూ డివిజన్లు, మండలాల గందరగోళాన్ని సరిదిద్దుతాం

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



సాక్షి, హైదరాబాద్: ‘గత ప్రభుత్వ హయాంలో కొత్తగా రెవెన్యూ డివిజన్లు, మండలాలను అస్తవ్యస్తంగా ఏర్పాటు చేశారు. దీంతో ఇప్పుడు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యమంత్రి, ఇతర మంత్రులతో చర్చించి వాటిని సరిచేసేందుకు సానుకూల నిర్ణయం తీసుకుంటాం’అని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. మంగళవారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో పెద్దసంఖ్యలో సభ్యులు, రెవెన్యూ డివిజన్లు, మండలాల గందరగోళంపై అడిగిన ప్రశ్నలకు ఆయన ఈ మేరకు సమాధానమిచ్చారు. చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ సభ్యుడు పల్లా రాజేశ్వరరెడ్డి కోరారు. ఐదు మండలాలున్న చేర్యాల ప్రాంతంలో ప్రజలకు గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయని, పోలీసు సంబంధిత పనులకు హుస్నాబాద్‌కు, వ్యవసాయశాఖ పనులకు గజ్వేల్ కార్యాలయానికి, కలెక్టరేట్ కోసం సిద్దిపేటకు తిరగాల్సి వస్తోందని, దీన్ని సరిదిద్దాల్సిన అవసరముందన్నారు. ముధోల్, తాండూరు, జడ్చర్ల, వేములవాడ, నారాయణఖేడ్, వర్ధన్నపేట, మహబూబాబాద్.. ఇలా పలు నియోజకవర్గాల పరిధిలో నెలకొన్న ఇలాంటి సమస్యలపై సభ్యులు లేవనెత్తారు. చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు అంశం కలెక్టర్ పరిశీలనలో ఉందని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇలాంటి సమస్యలపై సీఎం, సహచర మంత్రులతో చర్చించి వాటిని సరిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

చెన్నూరులో కొత్త బస్టాండ్ ఏర్పాటు చేస్తాం

మంత్రి పొన్నం



భూసేకరణలో నెలకొన్న కోర్టు వివారం పరిష్కారం కాగానే చెన్నూరులో కొత్తగా బస్‌డిపో ఏర్పాటు చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. సభలో కాంగ్రెస్ సభ్యుడు వివేక్ అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానంగా వెల్లడించారు. ఈ సందర్భంగా పార్టీలతీతంగా పలువురు సభ్యులు ఆర్టీసీ బస్సులకు సంబంధించిన సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చారు.

19 ఏ ప్యాకేజీని పూర్తి చేస్తాం: మంత్రి ఉత్తమ్



కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో ఉన్న 19 ఏ ప్యాకేజీ పనులు చేపట్టి సింగూరులోకి నీటిని తరలించేందుకు ఏర్పాటు చేస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. కాంగ్రెస్ సభ్యుడు సంజీవరెడ్డి అడిగిన ప్రశ్నకు సమాధానంగా వెల్లడించారు. దీన్ని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, నల్లవాగు కాలువ ఆధునికీకరణ, అశ్వారావుపేటలోని జలగం వెంగళరావు ప్రాజెక్టు, బసవేశ్వర సంగమేశ్వర ప్రాజెక్టులను కూడా చేపడతామని పేర్కొన్నారు.

వివేకానందకు స్పీకర్ హెచ్చరిక

మాటిమాటికి వెల్‌లోకి దూసుకురావటం మంచి పద్ధతి కాదని, తీరు మార్చుకోవాలంటూ బీఆర్ఎస్ సభ్యుడు వివేకానందను స్పీకర్ ప్రసాద్‌కుమార్ హెచ్చరించారు. ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడేందుకు స్పీకర్ తమ పార్టీ వారికి మైక్ ఇవ్వటం లేదన్న ఆగ్రహంతో వివేకానంద వెల్‌లోకి వచ్చారు. దీంతో స్పీకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీశ్‌రావు వచ్చి వివేకానందను తన స్థానం వద్దకు తీసుకెళ్లారు.

డిప్యూటీ స్పీకర్ కాదు డిప్యూటీ సీఎం..

హరీశ్‌రావు సంబోధనను సరిదిద్దిన స్పీకర్

శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో అప్పులపై సంవాదం జరిగిన సందర్భంలో ఉపముఖ్యమంత్రి భట్టి పేరును ప్రస్తావించే సమయంలో బీఆర్ఎస్ సభ్యుడు హరీశ్‌రావు పలుమార్లు డిప్యూటీ స్పీకర్ అంటూ పేర్కొన్నారు. దీనిని గుర్తించిన స్పీకర్ ప్రసాద్‌కుమార్ కలుగజేసుకొని, ‘మీరు డిప్యూటీ సీఎంను డిప్యూటీ స్పీకర్ అంటున్నారు. అలా అనటం సరికాదు సరి చేసుకోండి’అని సూచించారు. ‘ఆయన గతంలో డిప్యూటీ స్పీకర్‌గా పని చేసి ఉండటంతో పొరపాటున అలా అన్నాను’అని హరీశ్‌రావు చెప్పారు.

లగచర్ల కేసులో నేడు తీర్పు

- బెయిల్ పిటిషన్‌పై ముగిసిన ఇరుపక్షాల వాదనలు
- తీర్పును రిజర్వ్ చేసిన ఏసీబీ కోర్టు

సిటీ కోర్టులు: లగచర్లలో అధికారులపై దాడి కేసులో రైతులు, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌పై నాంపల్లిలోని ఏసీబీ కోర్టులో ఇరుపక్షాల వాదనలు మంగళవారం ముగిశాయి. సోమవారం రైతుల తరఫున సురేందర్‌రావు, జక్కుల లక్ష్మణ్, జి.కిరణ్‌లు వాదనలు వినిపించగా, మంగళవారం పబ్లిక్ ప్రాసిక్యూటర్ కౌంటర్ దాఖలు చేసి వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న జడ్జి అఫ్రోజ్ అక్తర్ తీర్పును రిజర్వ్ చేస్తూ బుధవారానికి వాయిదా వేశారు. మొదటగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపిస్తూ ఎలక్ట్రానిక్ సమాచారంతోపాటు ఘటనకు సంబంధించి కొన్ని ఫొటోలు, వీడియోలు కోర్టుకు సమర్పించారు. వాటిని పరిశీలించి వెంటనే జోక్యం చేసుకున్న రైతుల తరఫు న్యాయవాదులు పీపీ దాఖలు చేసిన ఫొటోల్లో ఉన్న ఒక్కరిని కూడా అరెస్ట్ చేయలేదని, ఈ ఘటనకు సంబంధం లేని రైతులు, మాజీ ఎమ్మెల్యేను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టుకు సమర్పించిన ఆధారాల్లో ఒక్కరూ కూడా అరెస్టై రిమాండ్‌లో లేరని గుర్తు చేశారు. అయితే మాజీ ఎమ్మెల్యే అక్కడ దాడికి పాల్పడిన వ్యక్తితో ఫోన్‌లో మాట్లాడటం, వాట్సాప్ చాట్‌లు ఉన్నాయని అవన్నీ కోర్టుకు సమర్పించామని పబ్లిక్ ప్రాసిక్యూటర్ గుర్తుచేశారు. మాజీ ఎమ్మెల్యేతోపాటు రైతుల అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నారని వారి ఆరోగ్యం క్షీణిస్తుందని రైతుల తరఫు న్యాయవాదులు కోర్టు తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న జడ్జి తీర్పును రిజర్వ్ చేశారు. నేడు తీర్పును వెలువరించే అవకాశముంది.

క్లుప్తంగా...

సచివాలయం పక్కనే అసెంబ్లీ కట్టాలి

కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: సచివాలయం పక్కనే కొత్త అసెంబ్లీ భవనం కడితే బాగుంటుందని మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ఆయన మంగళవారం అసెంబ్లీ లాబీల్లో విలేకరులతో మాట్లాడుతూ.. పాలనా భవనాలు పక్కపక్కనే ఉంటే ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఎన్టీఆర్ ఘాట్ స్థలంలో కొత్త అసెంబ్లీ భవనం కడితే బాగుంటుందని సూచించారు. తనకు మంత్రి పదవి ఇచ్చే అంశం.. పార్టీ అధిష్టానం చేతుల్లో ఉందని స్పష్టం చేశారు.

హైదరాబాద్ ఇంజనీర్ల సంఘ కార్యవర్గం

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ ఇంజనీర్ల నూతన సంఘం ఎన్నికలు మంగళవారం ఎర్రమంజిల్ భవన్‌లో జరిగాయి. అధ్యక్షునిగా రాపోలు రవీందర్, ప్రధాన కార్యదర్శిగా చక్రధర్, గౌరవ అధ్యక్షునిగా ధర్మ, కోశాధికారిగా ఎస్.అంజనేయులు, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా కె.రాజశేఖర్, వి.రామకృష్ణ, ఆర్.సత్యనారాయణ, వి.విద్య సుమన్, శ్రీనివాస్‌గౌడ్, విజయలక్ష్మి, అసోసియేట్ ప్రెసిడెంట్లుగా డి.రమ, ఎం.కృష్ణ, చక్రపాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

చెత్త, ప్లాస్టిక్, పంట అవశేషాలు తగలబెట్టడాన్ని ఆపేయాలి

టీపీసీబీ హెచ్చరిక

సాక్షి, హైదరాబాద్: బహిరంగ ప్రదేశాల్లో చెత్తా, చెదారం, ప్లాస్టిక్, పంట అవశేషాలు-వ్యర్థాలు, ఇతర వస్తువులను తగలబెట్టడాన్ని వెంటనే నిలిపేయాలని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీపీసీబీ) స్పష్టంచేసింది. మంగళవారం టీపీసీబీ ఆధ్వర్యంలో నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ (ఎన్‌సీఏపీ)లో భాగంగా బహిరంగ వ్యర్థాలను తగులబెట్టడాన్ని నియంత్రించేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా టీపీసీబీ సభ్యకార్యదర్శి జి.రవి మాట్లాడుతూ వాయుకాలుష్య స్థాయిలు పెరగడం వల్ల తలెత్తే దుష్పరిణామాలను అందరూ చవిచూస్తున్నారన్నారు. బహిరంగంగా చెత్తను దహనం చేయకుండా అధికారులు, సిబ్బంది, ప్రజాసంస్థలు, సంఘాలను భాగస్వాములను చేయాలని సూచించారు. కేంద్ర అటవీ, పర్యావరణశాఖ దేశంలోని నగరాల్లో హైదరాబాద్‌ను కూడా ‘నాన్ అటైన్‌మెంట్ సిటీ’ (వాయు కాలుష్య నియంత్రణ తక్కువగా ఉన్న నగరం)గా పరిగణిస్తోందని చెప్పారు. హైదరాబాద్‌తో పాటు సంగారెడ్డి, నల్లగొండ కూడా ఇదే కేటగిరీలోనే ఉన్నాయన్నారు. ఐఐటీ బాంబే ప్రొఫెసర్ అనురాగ్ గార్గ్ మాట్లాడుతూ పరిశ్రమల వ్యర్థాలు, పంటల అవశేషాలు, ఘనవ్యర్థాలను తగల బెట్టడం పర్యావరణంపై దుష్ప్రభావాన్ని చూపుతాయన్నారు.

నల్లగొండ వాసికి సీశాబ్ బాధ్యతలు

మూడోసారి చైర్మన్‌గా నియమితులైన కరణం ఉమామహేశ్వర్‌రావు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: నల్లగొండ పట్టణ వాసి కరణం ఉమామహేశ్వర్ రావుకి కేంద్ర విద్యా శాఖ కీలక బాధ్యతలు అప్పగించింది. జాతీయ స్థాయి విద్యా సంస్థలైన ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ, జీఎఫ్‌టీఐ, ఇతర విద్యా సంస్థల్లో సీట్ల భర్తీకి సంబంధించిన కీలక బాధ్యతలు నిర్వహించే సెంట్రల్ సీట్ అలకేషన్ బోర్డు (సీశాబ్) చైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. కాగా, ఆయన ఈ బాధ్యతలు చేపట్టడం వరుసగా మూడోసారి కావడం విశేషం. నల్లగొండ పట్టణంలోని రామగిరికి చెందిన ఉమామహేశ్వర్‌రావు పదో తరగతి వరకు నల్లగొండలోని సెయింట్ అల్ఫోన్సస్ హైస్కూల్‌లో విద్యను అభ్యసించారు. ఇంటర్ హైదరాబాద్‌లోని నృపతుంగ జూనియర్ కళాశాలలో, బీటెక్ కొత్తగూడెం స్కూల్ ఆఫ్ మైన్స్ ఇంజనీరింగ్ కాలేజీలో చదివారు. బెనారస్ హిందూ యూనివర్సిటీ (ఐఐటీ బెనారస్)లో ఎంటెక్ పూర్తి చేశారు. 1989లో ఖరగ్‌పూర్ ఐఐటీలో పీహెచ్‌డీ పూర్తిచేశారు.

సీశాబ్ ఆధ్వర్యంలోనే సీట్ల భర్తీ

కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోనే ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ, గవర్నమెంట్ ఫండెడ్ టెక్నికల్ ఇనిస్టిట్యూషన్స్ (జీఎఫ్‌టీఐ) తదితర విద్యాసంస్థల్లో ఇంజనీరింగ్ సీట్ల భర్తీకి జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ (జోసా) ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ముఖ్యంగా ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ, జీఎఫ్‌టీఐ, కేంద్ర ప్రభుత్వ సహకారంతో కొనసాగే ఇతర విద్యాసంస్థల్లో మిగిలిపోయిన సీట్ల భర్తీకి 6, 7 విడతల్లో సీశాబ్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.

మీ సొంత ఖర్చులతో షెడ్ నిర్మించండి

- నాగర్‌కర్నూల్ డీపీఓకు హైకోర్టు ఆదేశం
- స్టే ఉత్తర్వులుండగా కూల్చివేతపై ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: చట్టవిరుద్ధంగా, స్టే ఆదేశాలను బేఖాతర్ చేస్తూ చిన్నషెడ్ కూల్చివేసినందుకు బాధ్యత వహిస్తూ సొంత ఖర్చుతో పునఃనిర్మించాలని నాగర్‌కర్నూల్ జిల్లా పంచాయతీ అధికారిని హైకోర్టు ఆదేశించింది. నిలిపివేత ఉత్తర్వులున్నా పాటించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. నిరుపేద దంపతులు కట్టుకున్న చిన్నషెడ్‌ను బుల్డోజర్‌తో కూల్చివేసి అధికారులు తమ ఆధిపత్యాన్ని చూపే ప్రయత్నం చేశారని మండిపడింది. ఇదే తీరులో పలుకుబడి వర్గానికి చెందిన వారి నిర్మాణాలకు కూల్చగలరా అని ప్రశ్నించింది. నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంటలో చాలా ఏళ్ల క్రితం ఇల్లు (చిన్నషెడ్) నిర్మించుకున్నామని, సంబంధిత డాక్యుమెంట్లు సమర్పించినా కూల్చివేతకు నోటీసులు జారీ చేశారంటూ కటకం మహేశ్, నాగలక్ష్మి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. చిన్న బడ్డీషాపు నిర్వహణకు ట్రేడ్ లైసెన్స్ తీసుకోవడంతోపాటు ఆస్తి పన్ను చెల్లిస్తున్న విషయాన్ని కూడా కనీసం పరిగణనలోకి తీసుకోలేదన్నారు. ఎలాంటి కారణం లేకుండానే నిర్మాణాల తొలగింపునకు పంచాయతీరాజ్ అధికారులు నోటీసులు జారీ చేశారన్నారు. ఈ నేపథ్యంలో తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని అధికారులను ఆదేశిస్తూ మధ్యంతర స్టే ఉత్తర్వులను కోర్టు మంజూరు చేసింది. మరోవైపు తమ వాదనలను దాఖలు చేయాలని పంచాయతీరాజ్ శాఖను కోర్టు ఆదేశించింది. కౌంటర్ దాఖలు చేయకుండా, మధ్యంతర స్టే ఉత్తర్వులు కొనసాగుతుండగానే మహేశ్, నాగలక్ష్మిల ఇంటిని అధికారులు కూల్చివేశారు. పిటిషన్‌పై జస్టిస్ టి.మాధవీదేవి విచారణ చేపట్టారు. సోమవారం విచారణ సందర్భంగా డీపీఓను నేరుగా హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశించడంతో మంగళవారం ఆయన కోర్టుకు హాజరయ్యారు. కోర్టు ధిక్కారానికి పాల్పడినందుకు సొంత ఖర్చుతో నిర్మాణం చేపట్టాలని న్యాయమూర్తి ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నిర్మల్ జిల్లాకు జాతీయస్థాయి పురస్కారం



పురస్కారాన్ని స్వీకరిస్తున్న డీఆర్డీఓ విజయలక్ష్మి


నిర్మల్ ఖిల్లా: ఆర్గానిక్ పద్ధతిలో సమీకృత సాగు చేస్తున్న మహిళా సంఘానికి, ఆ దిశగా ప్రోత్సహించిన జిల్లా అధికారులకు జాతీయ ఉత్తమ పురస్కారం దక్కింది. వారి కృషి ఫలితంగా నిర్మల్ జిల్లా పేరు ఢిల్లీలో ధ్వనించింది. ప్రఖ్యాత పెప్సికో సంస్థ జాతీయ స్థాయిలో నిర్వహించిన ‘రెవల్యూషనరీ ఉమెన్ ఎంపవర్‌మెంట్ పురస్కారం’ పోటీల్లో నిర్మల్ రూరల్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన ‘గణపతి మహిళా స్వయం సహాయక సంఘం’ ప్రథమ స్థానం దక్కించుకుంది. ఈ మేరకు ఢిల్లీలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో కేంద్రమంత్రి స్మృతీఇరానీ, కేంద్ర అధికారుల చేతుల మీదుగా డీఆర్డీఓ విజయలక్ష్మి పురస్కారాన్ని అందుకున్నారు.

చలికి రాలిన పండుటాకులు

ఆదిలాబాద్ జిల్లాలో ఇద్దరు వృద్ధుల మృతి



చిక్కాల పోసాని



నర్సింహారెడ్డి (ఫైల్)

సాక్షి, ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లాలో వారం రోజులుగా కనిష్ట ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోవడంతో ఇద్దరు వృద్ధులు కన్నుమూశారు. చలిని తట్టుకోలేక ఆదిలాబాద్ రూరల్ మండలం చాందా(టి) గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు చిక్కాల పోసాని, మావల మండలం బట్టిసావర్గాం గ్రామానికి చెందిన బూస నర్సింహారెడ్డి (78) మంగళవారం మృతి చెందినట్లు వారి కుటుంబసభ్యులు తెలిపారు. జిల్లాలోని మావలలో 5.9, భీంపూర్ మండలం అర్లి(టి)లో 6.3, బేలలో 6.3, జైనథ్‌లో 6.4, భోరజ్‌లో 6.4 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు మంగళవారం నమోదయ్యాయి. కాగా అర్లి(టి)లో కొద్ది రోజులుగా కనిష్ట ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోవడంతో గ్రామస్తులు విలవిల్లాడుతున్నారు. దీంతో వేకువజామునే చేను పనులకు వెళ్లే వారు.. ఇప్పుడు ఎండ వచ్చాకే వెళ్తున్నారు. ఎటు చూసినా చలిమంటలు కాగుతున్నారు.

వర్గీకరణకు వ్యతిరేకంగా రేపు అసెంబ్లీ ముట్టడి: జి.చెన్నయ్య



పంజగుట్ట (హైదరాబాద్): ఎస్సీ వర్గీకరణ కోసం వేసిన కమిటీ నివేదిక రాగానే వర్గీకరణ చేస్తామని ముఖ్యమంత్రి చెప్పడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ అన్ని మాల సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 19న వేలాది మంది మాలలతో అసెంబ్లీని ముట్టడిస్తామని మాల సంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య తెలిపారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ రాష్ట్ర ప్రభుత్వాలు చేసుకోవచ్చు అన్న తీర్పు సుప్రీంకోర్టు ఇచ్చింది కాదని, చంద్రబాబు నాయుడు, కిషన్‌రెడ్డి, మందకృష్ణ మాదిగల ఒత్తిడి మేరకు ప్రధాని నరేంద్రమోదీ సుప్రీంకోర్టు జడ్జిలతో చెప్పించిన తీర్పు అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మూడు నెలల్లో ముగించేద్దాం

చంద్రబాబు అవినీతి కేసులకు ఇదే డెడ్‌లైన్

- విజయవాడలో సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది లూథ్రా
- పోలీసు, సీఐడీ, ఇంటెలిజెన్స్ ఉన్నతాధికారులతో రెండు రోజులు భేటీ
- సాక్షులను బెదిరించండి.. పత్రాలు తారుమారు చేయండి
- ఎంతైనా వేధించండి... వాంగ్మూలాలు మార్చండి
- కేసులు క్లోజ్ చేసే పని నేను చూసుకుంటా.. లూథ్రా పకడ్బందీ పథకం సిద్ధం చేశారంటున్న పోలీసు వర్గాలు

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఇదండీ సంగతి



ఫీజు బకాయిలు త్వరలో చెల్లిస్తాం

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్, టెక్నికల్ కళాశాలల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను త్వరలోనే చెల్లిస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం సాయంత్రం సచివాలయంలో ప్రైవేట్ కళాశాలల యజమానులు, విద్యాశాఖ ఉన్నతాధికారులతో డిప్యూటీ సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కారం చేసుకుంటూ ముందుకు వెళుతున్నామని, అసెంబ్లీ సమావేశాల తదుపరి బకాయిలు దశలవారీగా చెల్లిస్తామని భరోసా ఇచ్చారు. ప్రైవేట్ ఉన్నత విద్యాసంస్థలు మనుగడ సాగించాలంటే బకాయిల చెల్లింపు అనివార్యమని ప్రజాప్రభుత్వం ఆలోచన చేసి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు దశలవారీగా చెల్లించాలని నిర్ణయించినట్టు యజమానులకు తెలిపారు.

ఉత్తీర్ణత పెంచడమే లక్ష్యం!

ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు ఇంటర్ బోర్డ్ ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియెట్‌లో ఈ ఏడాది మంచి ఫలితాలు సాధించాలని ప్రభుత్వ జూనియర్ కాలేజీల ప్రిన్సిపాళ్లను ఇంటర్ బోర్డ్ అధికారులు ఆదేశించారు. ఆ దిశగా అన్ని కాలేజీల్లోనూ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందివ్వాలని సూచించారు. గురుకులాల్లో ఫలితాలు వస్తున్నప్పటికీ ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఆశించిన ఫలితాలు రావడం లేదు. దీంతో ఇటీవల ప్రభుత్వ కాలేజీల్లో ఇంటర్ ఫలితాలపై అధికారులు సమీక్ష నిర్వహించి, అన్ని జిల్లాల ఇంటర్ విద్యాధికారుల నుంచి వివరణ కోరారు. ఈ ఏడాది మంచి ఫలితాలు సాధించటంపై కార్యాచరణను నిర్దేశించారు. 90 శాతం పాస్ సాధించిన కాలేజీలకు, అధ్యాపకులకు ప్రోత్సాహకాలు ఇవ్వాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ కాలేజీల్లోని విద్యార్థుల్లో జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపేవారికి ఈ ఏడాది నుంచి ప్రభుత్వ తోడ్పాటు ఉంటుందని అంటున్నారు. దీనిపై ఇప్పటికే అవసరమైన నివేదికలు సిద్ధం చేశామని ఓ ఉన్నతాధికారి తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రాక్టికల్స్‌ను ఇప్పటి వరకూ ఆయా కాలేజీల్లోనే నిర్వహిస్తున్నారు. దీనివల్ల ప్రైవేటు కాలేజీల్లో ఎక్కువ మార్కులు వస్తున్నాయి. ప్రాక్టికల్స్ పరీక్షలకు ప్రభుత్వ లెక్చరర్లే వెళ్లినా వారిని కాలేజీ యాజమాన్యాలు అనేక ప్రలోభాలకు గురి చేస్తున్నట్టు ఫిర్యాదులున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఈసారి జంబ్లింగ్ విధానం అనుసరించే ఆలోచన చేస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు.

నేటి నుంచి ఐఏఎస్‌ల విచారణ

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు బరాజ్‌ల నిర్మాణంలో అవకతవకలపై విచారణలో భాగంగా జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ బుధవారం నీటిపారుదలశాఖ మాజీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారులైన ఎస్‌కే జోషి, రజత్‌కుమార్‌లకు క్రాస్ ఎగ్జామినేషన్ చేయనుంది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో లోపాలను గుర్తించడానికి ఏర్పాటు చేసుకున్న నిపుణుల కమిటీ చైర్మన్ కామేశ్వర్‌రావును సైతం ప్రశ్నించనుంది. మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌కు చేరుకున్న జస్టిస్ ఘోష్ బుధవారం నుంచి క్రాస్ ఎగ్జామినేషన్ చేసి ఐఏఎస్‌లు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారులను ప్రశ్నిస్తారు. రిటైర్డ్ చీఫ్ సెక్రటరీ సోమేశ్‌కుమార్, స్మితా సభర్వాల్, వికాస్‌రాజ్‌లతోపాటు మరికొందరిని కమిషన్ ప్రశ్నించనున్నట్టు తెలిసింది. వారి తర్వాత బరాజ్‌ల నిర్మాణ సంస్థల ప్రతినిధులను ప్రశ్నించి ఈ దఫా విచారణ ముగించే అవకాశముంది. వచ్చే నెలలో మళ్లీ క్రాస్ ఎగ్జామినేషన్‌ను పునరుద్ధరించి మాజీ సీఎం కేసీఆర్, నీటిపారుదల శాఖ మాజీమంత్రి టి.హరీశ్‌రావును కమిషన్ ప్రశ్నించే అవకాశాలున్నాయని అధికారవర్గాలు తెలిపాయి. కమిషన్ గడువు ఈ నెలాఖరుతో ముగియనుండగా, మరో రెండు నెలలు పొడిగించే అవకాశముంది.

సంధ్య థియేటర్‌కు షోకాజ్ నోటీసులు

సాక్షి, హైదరాబాద్/చిక్కడపల్లి: హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో ఉన్న సంధ్య థియేటర్ వద్ద ఈ నెల 4న రాత్రి ‘పుష్ప-2’ సినిమా ప్రీమియర్ షో సందర్భంగా చోటుచేసుకున్న తొక్కిసలాట ఘటనకు థియేటర్ యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని పోలీసులు తేల్చారు. నిబంధనలు పాటించకపోవటం వల్లనే తొక్కిసలాటలో రేవతి అనే మహిళ చనిపోయిందని, ఆమె కుమారుడు శ్రీతేజ్ తీవ్రంగా గాయపడినట్లు పేర్కొన్నారు. ఆ చిత్ర హీరో సినిమా చూడటానికి వస్తున్నట్లు ముందుగా తమకు సమాచారం ఇవ్వలేదని తెలిపారు. రేవతి మరణంపై నమోదు చేసిన కేసు దర్యాప్తులో భాగంగా చిక్కడపల్లి పోలీసులు సంధ్య థియేటర్‌లో 11 లోపాలను గుర్తించారు. దీంతో ఆ థియేటర్ యాజమాన్యానికి హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ మంగళవారం షోకాజ్ నోటీసు జారీ చేశారు. 10 రోజుల్లోగా వివరణ ఇవ్వాలని, లేదంటే థియేటర్ సినిమాటోగ్రఫీ లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. కాగా, తొక్కిసలాట ఘటనకు సంబంధించి హీరో అల్లు అర్జున్ అసిస్టెంట్ మేనేజర్ కిరణ్‌ను మంగళవారం చిక్కడపల్లి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఆనందం అనేది స్వాధీనం వల్లనో, యాజమాన్యం వల్లనో రాదు.
వివేకవంతమైన, ప్రేమగల హృదయం ద్వారా వస్తుంది.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 18 డిసెంబర్ 2024

'జమిలి'కి వేళయిందా?!

మొత్తానికి బీజేపీ చిరకాల వాంఛ నెరవేరటంలో తొలి అడుగుపడింది. దేశంలో జమిలి ఎన్నికలకు సంబంధించిన రెండు ముసాయిదా బిల్లులు మంగళవారం లోక్‌సభలో ప్రవేశించాయి. అందరూ అనుకున్నట్టే ఈ బిల్లులకు విపక్షాల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. వచ్చినంత వేగంగా రెండు బిల్లులూ జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) పరిశీలనకు వెళ్లబోతున్నాయి. తరచు జరిగే ఎన్నికల వల్ల పాలనా నిర్వహణలో అస్థిరత నెలకొంటున్నదని, కీలకమైన ప్రాజెక్టుల సాకారంలో అంతులేని జాప్యం చోటుచేసుకుంటున్నదని, ఎన్నికలకు తడిసి మోపెడు వ్యయం అవుతున్నదని ప్రభుత్వ పెద్దలు చాన్నాళ్లుగా వాదిస్తున్నారు. ఎన్నికల నిర్వహణపై స్పష్టత వుంటే పాలన కుంటు పడదని, అధికార యంత్రాంగంపైనా, ఖజానాపైనా భారం తగ్గుతుందని, వోటింగ్ శాతం పెరుగుతుందని వారి వాదన. ఈ విషయమై కేంద్రం మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో నియమించిన బృందం సైతం పాలకుల వాదనకు అనుకూలంగా సిఫార్సులు చేసింది. జమిలి ఎన్నికల వల్ల సుస్థిరత ఏర్పడి పెట్టుబడులు పెరుగుతాయని, ఆర్థికాభివృద్ధికి వీలవుతుందని, వనరుల కేటాయింపు సమర్థంగా చేయొచ్చని వివరించింది. మతపరమైన ఉద్రిక్తతలు తగ్గి భద్రతా బలగాల వినియోగం పెద్దగా ఉండబోదన్నది ఆ బృందం అభిప్రాయం.

జమిలి ఎన్నికల నిర్వహణకు రాజ్యాంగంలోని 83, 172, 324 అధికరణాలను సవరించాల్సి వుంటుంది. అందుకోసమే ఈ బిల్లుల్ని ప్రవేశపెట్టారు. వోటర్ల జాబితాకు సంబంధించి రాజ్యాంగంలోని 325 అధికరణను సవరించే మరో బిల్లు అవసరమవుతుంది. కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) ఆధ్వర్యంలో లోపరహితమైన జాబితా రూపొంది లోక్‌సభ, అసెంబ్లీల ఎన్నికలు ఏకకాలంలో జరుగుతాయని ప్రభుత్వం చెబుతోంది. అంటే జమిలి కేవలం ఈ రెండు సభలకు సంబంధించిందే. ఈ ఎన్నికలు పూర్తయిన వందరోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలుంటాయి. మొత్తానికి ఎన్నికల జాతర అయిదేళ్లకోసారి మాత్రమే ఉంటుంది. మధ్యలో ఏ రాష్ట్రంలోనైనా ప్రభుత్వం కుప్పకూలి అసెంబ్లీ ఎన్నికలు తప్పనిసరైతే వాటిని జరుపుతారట. కానీ ఆ కొత్త ప్రభుత్వాల ఆయుష్షు ఆ మిగిలిన సంవత్సరాలకు మాత్రమే పరిమితమవుతుందట. అంటే అయిదేళ్ల కాలానికి ఎన్నికైన ప్రభుత్వం మూడేళ్లకే పతనమైతే... కొత్తగా ఎన్నికలై వచ్చే పాలకులకు కేవలం రెండేళ్లు మాత్రమే పదవీయోగం దక్కుతుందన్నమాట! సారాంశంలో 'ఒకే దేశం – ఒకే ఎన్నిక' ఆదర్శం కాస్తా అటకెక్కినట్టే అవుతుంది. మరి ఈ బిల్లులు సాధించదల్చుకున్నదేమిటి?

ఈ బిల్లులు గట్టెక్కటం అంత సులభమేమీ కాదు. ఏ రాజ్యాంగ సవరణ బిల్లుకైనా మూడింట రెండువంతుల మెజారిటీ తప్పనిసరి. ఆ రకంగా చూస్తే 543 మంది సభ్యులున్న సభలో ఈ బిల్లులకు మద్దతుగా కనీసం 362 మంది వోటేయాలి. కానీ ఎన్డీయే బలం 293. అంటే మరో 69 మంది మద్దతు అవసరమవుతుంది. రాజ్యసభ వరకూ చూస్తే 163 మంది బిల్లులకు అనుకూలంగా వోటేయాలి. కానీ ఎన్డీయే బలం 121. ఆ తర్వాత రాష్ట్రాల అసెంబ్లీల ఆమోదం కూడా తప్పనిసరి. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన చట్టాలు మార్చాలంటే కనీసం సగం అసెంబ్లీలు అందుకు అంగీకరించాలి. కోవింద్ కమిటీ ముందు 47 రాజకీయ పక్షాలు తమ అభిప్రాయాలు వినిపించాయి. 32 పార్టీలు అనుకూలం కాగా, 15 పార్టీలు 'ఒకే దేశం – ఒకే ఎన్నిక'కు వ్యతిరేకమని తేలింది.

ప్రజాస్వామ్యమంటే కేవలం అయిదేళ్లకోసారి జరిగే ఎన్నికలు మాత్రమే కాదన్న సంగతి పాలకులు మరిచిపోయి చాన్నాళ్లయింది. ఎన్నికల్లో చెప్పేది ఒకటైతే, గెలిచాక చేసేది మరొకటి. కేంద్రంలో మాత్రమే కాదు... ఏపీలోని ఎన్డీయే పాలన చూసినా ఈ సంగతి ఇట్టే అర్థమవుతుంది. ఏపీలో నదురూ బెదురూ లేకుండా ఇచ్చిన వాగ్దానాలన్నిటికీ ఎగనామం పెట్టారు. ఇక ఎక్కడ ఎన్నికలు జరిగినా ఈవీఎంలపై అనుమానాలు మొదలవుతున్నాయి. ఏపీలో ఎన్నికలు పూర్తయిన వెంటనే ఈసీ ప్రకటించిన ఓట్లకు లెక్కించినప్పుడు అదనంగా మరో పన్నెండున్నర శాతం ఓట్లు వచ్చిచేరాయి. దేశంలో అత్యధిక నియోజకవర్గాల్లో సగటున వెయ్యి ఓట్లు ఇలా అదనంగా చేరినట్టు బయటపడింది. దీనిపై సంజాయిషీ ఇవ్వాలన్న కనీస సంస్కారం ఈసీకి లేకపోగా... ఈవీఎంలలో పోలైన ఓట్లనూ, వీవీ ప్యాట్ స్లిప్‌లనూ సరిపోల్చాలన్న వినతుల్ని బుట్టదాఖలా చేసింది. పైగా అతి తెలివి ప్రదర్శించి డమ్మీ పోలింగ్ నిర్వహణకు దిగింది! ఏపీకి సంబంధించినంతవరకూ అయితే గడువుకు ముందే వీవీ ప్యాట్ స్లిప్‌లను ధ్వంసం చేశారు. ఈవీఎంల డేటా తొలగించారు. ఈ వైపరీత్యాలపై తామేం చేయాలన్న స్పృహ, వివేకం కేంద్ర పాలకులకు లేకపోగా... 'ఒకే దేశం–ఒకే ఎన్నిక'లోనే దేశ భవిష్యత్తు సర్వం ఆధారపడి వున్నట్టు భూమ్యాకాశాలు ఏకం చేస్తున్నారు.

పైగా ఈ మాదిరి ఎన్నికలు ప్రాంతీయ ఆకాంక్షలనూ, అవసరాలనూ పాతరపెడతాయన్న ఆరోపణలకు సరైన జవాబు లేదు. ఈ విధానం దేశ ఫెడరల్ స్వభావాన్ని దెబ్బతీస్తుందన్న విమర్శను బేఖాతరు చేస్తున్నారు. అసలు 140 కోట్ల జనాభా... 30 రాష్ట్రాలు, 6 కేంద్రపాలిత ప్రాంతాలున్న దేశాన్నీ... లెక్కకు మిక్కిలివున్న పార్టీలనూ 'జమిలి' చట్రంలో బిగించి ఒక్క వోటుకి కుదించాలన్న ప్రతిపాదనే వింతై నది. దానిపై బిల్లులు పెట్టేముందు విస్తృతంగా చర్చించి ఏకాభిప్రాయం సాధించాలన్న కనీస ఇంగితజ్ఞానం కొరవడితే ఎలా? అగ్రరాజ్యమైన అమెరికాలోనే నాలుగేళ్లకోసారి అధ్యక్ష ఎన్నికలు జరుపుతూ, రాష్ట్రాల సెనేట్‌లకూ, స్థానిక సంస్థలకూ, ప్రతినిధుల సభకూ నిర్ణీత కాలంలో విడివిడిగా ఎన్నికలు నిర్వహిస్తుండగా దాదాపు 97 కోట్లమంది వోటర్లున్న ఈ అతి పెద్ద దేశంలో జమిలికి తహతహలాడటంలోని మర్మమేమిటి?

వికటించిన స్నేహం చిగురించేనా?

సందర్భం



డా॥ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

అంతర్జాతీయ పరిణామాలెప్పుడూ స్థిరంగా ఉండవు. నిన్న మొన్నటి వరకు భారత్ నుంచి పెద్ద ఎత్తున సహాయ సహకారాలు పొందిన పొరుగుదేశం బంగ్లాదేశ్‌లో మారిన అంతర్గత రాజకీయ పరిస్థితులు భారత్‌కు ఆందోళనకరంగా మారాయి. అక్కడి హిందువులపై దాడులు జరగడం వికటించిన స్నేహానికి నిదర్శనం. పాకిస్తాన్ నుంచి తమ దేశానికి రావడానికి ఉన్న వీసా నిబంధనను కూడా బంగ్లాదేశ్ సడలించింది. దేశ ద్వారాలను బార్లా తెరవడం వల్ల ఉగ్ర మూకలు స్థిర నివాసం ఏర్పరచుకొనే ప్రమాదం ఉంది. భద్రతాపరంగా ఇది కూడా భారత్‌కు ఆందోళనకరమే. స్వతంత్ర దేశంగా బంగ్లాదేశ్ ఏర్పడటంలో భారత్ పోషించిన పాత్ర చరిత్రాత్మకం. అలాంటి బంధమున్న దేశంతో తగిన విధంగా స్పందించి పరిస్థితులను చక్కబెట్టాలి.

బంగ్లాదేశ్‌లో ఆగస్ట్ మాసంలో జరిగిన రాజకీయ విపరిణామాల కారణంగా ఆ దేశ ప్రధాని షేక్ హసీనా కట్టుబట్టలతో దేశం నుంచి పారిపోయి భారత్‌లో తలదాచుకొంటున్నారు. అప్పటినుంచీ భారత్, బంగ్లాదేశ్ మధ్య దాదాపు 5 దశాబ్దాల పాటు కొనసాగుతూ వచ్చిన స్నేహ సంబంధాలు ఒక్కసారిగా దెబ్బతిన్నట్లయ్యింది. 1971లో పాకిస్తాన్‌తో యుద్ధం చేసి, స్థానిక ప్రజల ఆకాంక్షల మేరకు ఓ స్వతంత్ర దేశంగా బంగ్లాదేశ్ ఏర్పడటంలో భారత్ పోషించిన పాత్ర చారిత్రాత్మకం. అందుకు భారత్ ఎంతో త్యాగం చేసింది. ఆ తర్వాత కూడా బంగ్లాదేశ్ పునర్ నిర్మాణంలో అన్ని రకాల సహాయ సహకారాలు అందించింది. తమకు స్వేచ్ఛను కల్పించినందుకు బంగ్లాదేశీయులకు సైతం భారత్ పట్ల గౌరవాభిమానాలు నిన్నమొన్నటి వరకు అవిచ్ఛిన్నంగా కొనసాగాయి.

మారిన పరిస్థితులు

ఇరు దేశాల మధ్య చక్కటి స్నేహ సంబంధాలు కొనసాగుతున్న తరుణంలో... బంగ్లాదేశ్‌లో చోటు చేసుకున్న పరిణామాలతో పరిస్థితులు తలకిందులయ్యాయి. 17 కోట్ల జనాభా కలిగిన బంగ్లాదేశ్‌లో దాదాపు కోటిన్నరకు పైగా హిందువులు ఉన్నారు. బౌద్ధులు, క్రైస్తవులు కూడా చెప్పుకోదగ్గ సంఖ్యలో ఉన్నారు. గత 4 నెలలుగా బంగ్లాదేశ్‌లోని హిందూ ఆలయాలు, హిందువులను లక్ష్యంగా చేసుకొని దాడులు జరుగుతున్నాయి. ఆర్థిక రంగంలో నోబెల్ బహుమతి గ్రహీత మహమ్మద్ యూనస్ నేతృత్వంలో ఏర్పాటైన మధ్యంతర ప్రభుత్వం ఈ దాడులను నిరోధించకపోవడం తీవ్ర ఆవేదన కలిగిస్తోంది. బంగ్లాదేశ్‌లో చోటు చేసుకొంటున్న పరిణామాలపై విదేశీ (ఇండియా) మీడియా వక్రభాష్యం చెబుతోందంటూ యూనస్ ఈ హింసను సమర్థించుకోవటానికి తాపత్రయపడుతున్నారు.

పొరుగునున్న బంగ్లాదేశ్ ఒక్కసారిగా ప్రత్యర్థిగా మారడాన్ని భారత్ నిశితంగానే పరిశీలిస్తోంది. పార్లమెంట్‌లో అధికార బీజేపీ సభ్యులు ఈ అంశంపై తమ ఆందోళనను వ్యక్తం చేశారు. శ్రీకృష్ణుడి జన్మస్థానమైన మథురకు ప్రాతినిధ్యం వహిస్తున్న సినీ నటి హేమమాలిని హిందువులపై జరుగుతున్న దాడులను ఎత్తిచూపడంతో పాటు, సాధువు చిన్మయి కృష్ణదాస్‌ను అరెస్ట్ చేయడంపై ఆందోళన వ్యక్తం చేశారు.

ఆశ్చర్యకరంగా, ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులతో తమకు సంబంధమే లేనట్టు వ్యవహరిస్తోంది. బంగ్లాదేశ్‌తో 2,216 కిలోమీటర్ల సరిహద్దును పంచుకొంటున్న పశ్చిమ బెంగాల్‌కు ముఖ్యమంత్రిగా ఉన్న మమతా బెనర్జీ సైతం... ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించడం లేదు.

ఆ ద్వేషమే భారత్ వ్యతిరేకతకు కారణం

ప్రధాన ప్రతిపక్షాలన్నీ బహిష్కరించిన జాతీయ ఎన్నికలలో ఈ ఏడాది గెలిచిన షేక్ హసీనా మూడవ పర్యాయం ప్రధానిగా అధికార



దాడులకు వ్యతిరేకంగా బంగ్లాదేశ్ హిందువుల నిరసన

పగ్గాలు చేపట్టిన తర్వాత కొన్ని వర్గాల ప్రజల్లో ఆగ్రహావేశాలు కట్టలు తెంచుకొన్నాయి. ప్రజాభిప్రాయాన్ని ప్రతిఫలించని ఆ ఎన్నికలలో హసీనా గెలుపును మెజారిటీ ప్రజలు జీర్ణించుకోలేకపోయారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని హసీనా, ఆమె ప్రాతినిధ్యం వహిస్తున్న అవామీ లీగ్ పార్టీ ప్రముఖులు పెద్ద ఎత్తున అధికార దుర్వినియోగానికీ, అవినీతికీ పాల్పడ్డారన్న క్రోధంతో ప్రజలు ఉన్నారు. పైగా, దేశంలో నిరుద్యోగం పెరుగుతుండగా స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబాలకు చెందిన వారికి ఉద్యోగాలలో రిజర్వేషన్లు అందించాలన్న హసీనా ప్రభుత్వ నిర్ణయంపై ప్రజల కోపం అగ్గి మీద గుగ్గిలం చల్లినట్లయింది. ఒక దశలో దేశాభివృద్ధి రేటులో ఆసియాలోనే అగ్రగామిగా ఉన్న తమ దేశం క్రమంగా హసీనా పరివారం అవినీతి, అసమర్థత కారణంగా పాతాళానికి పడిపోయిందన్న ఆగ్రహమూ ఏర్పడింది. ఈ అంశాలు బంగ్లా 'యువత'ను వీధుల్లోకొచ్చి ఉద్యమించేందుకు పురిగొల్పాయి.

సమస్యల్ని సామరస్యంగా పరిష్కరించకుండా ఉద్యమకారుల్ని అణచివేయడానికి ప్రభుత్వం సిద్ధపడటంతో పరిస్థితి చేయిదాటింది. యువత తిరుగుబాటు చేసి ప్రధాని నివాసాన్ని ముట్టడించి పాల్పడిన విధ్వంసాన్ని యావత్ ప్రపంచం చూసి నివ్వెరపోయింది. సకాలంలో షేక్ హసీనా, ఆమె సోదరి ఇద్దరూ తప్పించుకొని భారత్ చేరుకోవడంతో వారు ప్రాణాలతో బయటపడ్డారు. షేక్ హసీనాకు ఆశ్రయం ఇచ్చిన భారత్‌ను బంగ్లాదేశీయులు తప్పుపడుతున్నారు. భారత్‌పై వారు గుడ్డి వ్యతిరేకత ప్రదర్శించడానికి అదే కారణమని చెప్పాలి. ఆ వ్యతిరేకత కాస్తా హిందువుల పట్ల ద్వేష భావంగా రూపాంతరం చెందింది. దాంతో ఉద్యమకారులు హసీనా నివాసంపై దాడి చేశాక దేశంలోని హిందువులపైన, హిందువుల ప్రార్థనా మందిరాలపైన విరుచుకుపడి విధ్వంసం సృష్టించారు.

దేశం విడిచిన షేక్ హసీనాకు అమెరికా, బ్రిటన్, జర్మనీ వంటి దేశాలు ఆశ్రయం ఇవ్వడానికి నిరాకరించగా, భారత్ మాత్రం సాదరంగా ఆహ్వానించి ఆమెకు అన్ని సౌకర్యాలు కల్పిస్తోంది. హసీనా ప్రభుత్వం స్థానంలో మహమ్మద్ యూనస్ నేతృత్వంలో ఏర్పడిన ప్రభుత్వం ఎంతవరకూ వెళ్లిందంటే బంగ్లాదేశ్ జాతి పితగా పిలిచే షేక్ హసీనా తండ్రి ముజీబుర్ రహమాన్ చిహ్నాలను తొలగిస్తోంది. కరెన్సీ నోట్లపై ఆయన బొమ్మ ఉన్నందున, పాత కరెన్సీని తొలగించి దాని స్థానంలో ఆయన బొమ్మ లేకుండా కొత్త కరెన్సీని మరో 6 నెలల్లో చలామణీలోకి తెస్తోంది. కొత్తగా ముద్రించే కరెన్సీ నోట్ల మీద హసీనాపై చేపట్టిన తిరుగుబాటు చిత్రాలను ముద్రించనున్నట్లు బంగ్లా సెంట్రల్ బ్యాంకు ప్రకటించడం సంచలనం కలిగించింది.

పాక్‌తో సన్నిహితంగా బంగ్లా

పాకిస్తాన్ నుంచి తమ దేశానికి రావడానికి ఉన్న వీసా నిబంధనను బంగ్లాదేశ్ సడలించినట్లుగా వార్తలొచ్చాయి. ఇదొక అనూహ్య పరిణామం. ఒకవిధంగా, బంగ్లాదేశ్ తన కన్నును తానే పొడుచుకొన్నట్లు భావించాలి. పాకిస్తాన్‌తో స్నేహ సంబంధాలను నెరపుకోవడాన్ని ఎవ్వరూ తప్పుపట్టరు. కానీ, తమ దేశ ద్వారాలను బార్లా తెరవడం వల్ల ఉగ్రవాద మూకలు దేశంలోకి ప్రవేశించి స్థిర నివాసం ఏర్పరచుకొనే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలోనే బంగ్లాదేశ్, భారత సరిహద్దుల వెంబడి 3 బెటాలియన్ల రక్షణ దళాలను (బీఎస్ఎఫ్) మన ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

నిజానికి గత నాలుగైదు నెలలుగా భారత్ దౌత్యపరంగా అనేక దేశాలకు మరింత చేరువైంది. చైనా అండ చూసుకొని తోక జాడించాలనుకొన్న 'మాల్దీవులు' మళ్లీ తప్పు సరిదిద్దుకొని భారత్‌కు స్నేహహస్తం చాచింది. ప్రధాని నరేంద్ర మోదీ అక్టోబర్ మాసంలో రష్యా, ఆ తర్వాత నైజీరియా, బ్రెజిల్, గయానా దేశాలలో పర్యటించి ఆ దేశాలతో గల ద్వైపాక్షిక సంబంధాలను మరింత పటిష్ఠం చేశారు. మరోపక్క రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కూడా ఆఫ్రికా దేశాలలో పర్యటించడం వల్ల ఆ దేశాలతో భారత్ వ్యాపార, వాణిజ్య సంబంధాలు విస్తరించాయన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. నేడు ప్రపంచంలోనే భారత్ ఓ బలీయమైన దేశంగా, రష్యా–ఉక్రెయిన్ యుద్ధం, పాలస్తీనా–ఇజ్రాయెల్ యుద్ధాలను నిలువరించగలిగిన సామర్థ్యం గల దేశంగా పరిగణించబడుతున్న తరుణంలో చిరకాల మిత్రదేశం బంగ్లాదేశ్‌తో వైరం ఏర్పడటం ఆందోళనకరమే. 142 కోట్ల ప్రజల భద్రతకే కాదు, ప్రపంచ వ్యాప్తంగా 200 దేశాల్లో ఉన్న భారతీయుల భద్రతకు పూచీ పడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే. బంగ్లాదేశ్‌లో ఉన్న లక్షలాది మంది హిందువుల మనుగడ ప్రశ్నార్థకం కాకముందే భారత ప్రభుత్వం తగు విధంగా స్పందించి వారి పూర్తి రక్షణకు భరోసా కల్పించాల్సిన అవసరం ఉంది.

వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, శాసనమండలి సభ్యులు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

మంచి కేస్ స్టడీ



అర్జెంటీనా దార్శనిక అధ్యక్షుడు హావియెర్ మిలేయి ప్రభుత్వ వృథా ఖర్చులను కత్తిరిస్తున్నప్పుడు 'కీనీసియన్' ఆర్థికవేత్తలు దేశం నాశనమవుతుందని ఊహించారు. ముందు జీడీపీ పడిపోయింది, కానీ ఇప్పుడు నెమ్మదిగా పెరుగుతోంది. అలాగే శతాబ్ద కాలంలో మిగులు బడ్జెట్ చూపగలిగారు. అందుకే 'జీడీపీ' భావనను మనం సవరించుకోవాలి. దివాళా వైపు దారితీస్తూ కూడా ప్రభుత్వాలు వృద్ధిని చూపించొచ్చు; రుణం తడిసి మోపెడవుతున్నా కంపెనీలు రెవెన్యూ చూపించినట్టు! ఆధునిక కాలంలో అర్జెంటీనా ఉపయోగకరమైన కేస్ స్టడీ.

– శ్రీధర్ వెంబు, వ్యాపారవేత్త

నిలిచిపోయాం!



అమెరికన్లు మూర్ఖులు, తెలియనివాళ్లు అని తీర్పులిచ్చే యూరోపియన్లు నాకు నచ్చరు. మన ఖండం (యూరప్) నిజంగా స్తంభించిపోయింది. ఏమీ జరగడం లేదు. కనీసం వాళ్లకు డైనమిజం, యాక్షన్ అయినా ఉన్నాయి.

– అలెస్సాండ్రా బొక్కి, జర్నలిస్ట్

బహుముఖ ఆట



టెస్ట్ క్రికెట్‌లోని అందం ఏమిటంటే, ఒక క్రికెటర్‌లోని బహు పార్శ్వాలను వెలికితీసేలా ఆటగాళ్లు చాలా భిన్న అంశాల కోసం ఆడతారు. దీనివల్ల జట్టు క్యారెక్టర్ కూడా బయటపడుతుంది.

– యూసుఫ్ ఉంఝావాలా, సంపాదకుడు

జరిగేది అదేనా?



వరుస క్రమం: 1. ఒక దేశం, ఒకే ఎన్నిక; 2. ఒక దేశం, ఒకే పార్టీ; 3. ఒక దేశం, ఒకే నాయకుడు.

– అరవింద్ గుణశేఖర్, జర్నలిస్ట్

ఆపొద్దు!



నువ్వు శ్వాసిస్తున్నంత కాలమూ, ఏదైనా సాధ్యమే! ప్రయత్నాన్ని ఎప్పుడూ విరమించవద్దు.

– స్టాన్లీ టూచీ, నటుడు

జనాన్ని కాలుష్యంలో ముంచెత్తుతారా?

అభిప్రాయం



ఉమామహేశ్వర్ దహగామ

డిసెంబర్ 19న జరగనున్న ఎన్టీపీసీ 2400 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ విస్తరణకు ప్రజాభిప్రాయ సేకరణ జీవించే హక్కుకే వ్యతిరేకం. దీన్ని నిర్ద్వంద్వంగా వ్యతిరేకించాలి.

రామగుండం ఎన్టీపీసీ థర్మల్ పవర్ స్టేషన్ టీఎస్‌టీపీపీ 4,000 మెగావాట్ల (మె.వా.) విస్తరణలో భాగంగా రెండోదశలో 3x800 మె.వా. స్థాపనకు, విద్యుత్పత్తికి పర్యావరణ అనుమతి కోసం (ఈసీ) పెద్దపల్లి కలెక్టర్ ఆధ్వర్యంలో నియమానుసారం... ప్రజాభిప్రాయ సేకరణ జరగనున్నది.

కేవలం 13 కి.మీ. దూరంలో గోదావరి నది పక్కన మంచిర్యాల జిల్లా జైపూర్‌లో ఎస్‌సీసీఎల్ సొంత 1,200 మె.వా. థర్మల్ ప్లాంట్‌కు తోడుగా రామగుండం ఎన్టీపీసీలోని 4,200 మెగా వాట్లకు ఇది నూతన స్థాపిత సామర్థ్య ప్రతిపాదన. కొత్తగా టీజెన్‌కో రామగుండంలో 1,200 మెగావాట్లు, సింగరేణి వారు జైపూర్‌లోనే మరో 1,200 మెగావాట్ల విస్తరణకు ప్రతిపాదిస్తున్నారు. ప్రభుత్వ, ప్రజామోదంతో ఈ పరిశ్రమల ప్రతిపాదనలన్నీ కార్యరూపానికి వస్తే... కేవలం 13 కిలోమీటర్ల పరిధిలో బొగ్గు ఆధార విద్యుదుత్పత్తి సామర్థ్యం (10,200 మె.వా.) ఉన్న ఈ ప్రాంతం ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకర కాలుష్య కేంద్రంగా మారుతుంది.

రాక్షసి బొగ్గు, విద్యుత్తు ప్లాంట్లు, సిమెంటు, ఎరువుల పరిశ్రమలన్నీ దేశాభివృద్ధి కోసం ఏర్పాటు చేస్తున్నామని చెబుతున్నారు. వీటికోసం స్థానికంగా రామగుండం, కమాన్పూర్, మంచిర్యాల మండలాల్లో సేకరించిన 90,000 ఎకరాల భూమికి ఇప్పుడున్న మార్కెట్ ధరలతో పోల్చితే అత్యంత స్వల్ప పరిహారం సమర్పించారు. ఈ 15 కి.మీ. పరిధిలోని దాదాపు 3 లక్షల పైచిలుకు కుటుంబాలలోని 12 లక్షల మంది ప్రజలు తమ శాశ్వత జీవనాధార వ్యవసాయ, ఉపాధులను కారు చౌకగా త్యాగం చేశారు. అయినా స్థానిక యువతకు భూములు కోల్పోయిన కారణాన పరిహారంగా పట్టుమని 100 ఉద్యోగాలు కూడా అందలేదు. ఈ పచ్చినిజాన్ని అసత్యమని ఎవ్వరైనా అనగలరా?

విద్యుత్ భౌతిక శాస్త్ర నియమాల ప్రకారం క్రిటికల్, సూపర్, అల్ట్రా సూపర్, సబ్ క్రిటికల్ థర్మల్ ప్లాంట్ల ఇంధన దహన సామర్థ్యం 35 – 40 శాతం లోపే కదా! దూర ప్రాంతాల థర్మల్ విద్యుత్ స్టేషన్లకు బొగ్గు రవాణా చేసే ఖర్చు ఆదా చేయడానికి రామగుండం నుండి 13 కిలోమీటర్ల పరిధిలో 10,200 మె.వా. సాంద్ర స్థాయిన థర్మల్ విద్యుత్పత్తి చేయడాన్ని, చౌకధరకు (యూనిట్ 12 రూపాయలు) విద్యుత్పత్తి చేసే నెపంతో అనుమతించడమంటే... రామగుండం నుండి 15 కిలోమీటర్ల పరిధిలో 21,000 మెగావాట్లకు సమానమైన



ఉష్ణరాశితో, పరిసరాలను వేడిచేసే హీటర్లతో నిరంతరాయంగా మంటలు పెట్టినట్టే కదా?

భారత ప్రభుత్వ అటవీ పర్యావరణ మంత్రిత్వ శాఖ, ఇంధన శాఖ, నవరత్న ఎన్టీపీసీ సంస్థ, సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వారందరూ కలసి స్థానిక ప్రజారోగ్యాలను, జీవన నాణ్యతను రాజ్యాంగ నియమాలను పణంగా పెట్టి ఈ విస్తరణ చేపట్టడం సబబేనా? 15 కిలోమీటర్ల పరిధిలోని పర్యావరణ కాలుష్య మోతాదు తీవ్రతను పరిగణనలోకి తీసుకొన్న తర్వాతే ఎక్స్‌పర్ట్ అప్రైజల్ కమిటీ, ఎమ్‌ఓఎఫ్‌ఈసీసీ వారు కొత్త పరిశ్రమలకు, పాతవాటి విస్తరణలకు అనుమతులివ్వాలని సుప్రీంకోర్టు సూచించిన విషయాన్నెలా విస్మరించారు?

సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ, అధిక లాభాపేక్షతో 706 చ.కి.మీ. విస్తీర్ణంలో అధిక సాంద్ర పారిశ్రామికీకరణ చేపట్టడమే కదా! తక్కువ స్థలంలో ఎక్కువ ఒత్తిడితో, మనుషులు, జంతువులు కనీసం జీవించలేని పరిస్థితులను సృష్టిస్తున్న వైనాన్ని ప్రశ్నించడం ప్రజల రాజ్యాంగబద్ధ హక్కే కదా! పక్కనే పారుతున్న గోదావరి నది నీరు నాణ్యతా ప్రమాణాల్లో ఏ, బీ, సీ, డీ కేటగిరీలు దాటి హెచ్ కేటగిరీలోకి చేరింది. ఈ నీరు కనీసం జంతువులు తాగడానికి కూడా పనికి రాదు. 1,465 కిలోమీటర్ల పొడవునా ప్రవహించే గోదావరిని అతి ఎక్కువగా కలుషితపరిచేది, ట్రీట్మెంట్ చేయకుండా రామగుండం ఎన్టీపీసీ, సింగరేణి మైన్స్ వాడుకొని వదిలేస్తున్న వ్యర్థ జలాలు. ఇందుకు కారణం అది కాదని, పర్యావరణ మంత్రిత్వ శాఖ లేదా సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వారు చెప్పగలరా?

ప్రజారోగ్య సంరక్షణార్థం ఫ్లూ గ్యాస్ డీసల్ఫరైజేషన్ యూనిట్లు విధిగా థర్మల్ స్టేషన్ల నిర్వహణలో అంతర్భాగంగా నిర్మించాలి. పర్యావరణంలోకి విడుదలవుతున్న సల్ఫర్ డయాక్సైడ్‌ను 2022 నాటికే నివారించవలసిందిగా భారత సుప్రీం కోర్టు కఠినమైన డెడ్‌లైన్ విధించింది. ఇంతవరకు దేశంలో ఎన్నో థర్మల్ విద్యుత్ ప్లాంట్లలో వీటి నిర్మాణం ప్రారంభమే కాలేదు. ఉన్నవి కూడా పూర్తి స్థాయిలో పనిచేయడం లేదు.

ఎన్టీపీసీ వెబ్‌సైట్‌లో స్పష్టంగా చెప్పిన ప్రకారం... 76,531 మె.వా. విద్యుదుత్పత్తి కోసం పనిచేస్తున్న ఉద్యోగుల సంఖ్య 17,794. ఒక మెగా వాట్ విద్యుదుత్పత్తికి ఆరుగురికి ఉద్యోగం కల్పిస్తామని ఎన్టీపీసీ సంస్థ ప్రారంభంలో చెప్పారు. ప్రస్తుత ప్రతిపాదిత 2,400 మెగావాట్లకు 96 మందికి ఉద్యోగాలిస్తామని ఈఐఏ రిపోర్ట్ 'సోషల్ ఇంపాక్ట్' సెక్షన్‌లో చెప్పారు. అంటే, 25 మెగావాట్ల స్థాపనకు ఒక ఉద్యోగాన్ని కల్పించగలుగుతారట. రేపు ఆచరణలో ఏం చేస్తారో తెలియదు.

ఈ ప్రాంతంలో స్థానికంగా ప్రతిపాదిత ప్లాంట్‌కు 15 కి.మీ. పరిధిలోని పరిసర ప్రాంతాలలో 12 లక్షల జనాభా ప్రతీక్షణం పీల్చుకుంటున్న సాధారణ గాలి నాణ్యతా ప్రమాణం 45కు దిగువన ఉందనీ, ఉష్ణోగ్రత 43 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు దిగువన, ధ్వని తీవ్రత 50 డెసిబల్స్‌కు దిగువన ఉన్నాయనీ... అంటే అన్నీ సాధారణ స్థాయిలో ఉన్నాయని అవాస్తవ సమాచారాన్ని నివేదికలో సమర్పించి, ఎక్స్‌పర్ట్ అప్రైజల్ కమిటీ ద్వారా ఎన్విరాన్మెంటల్ క్లియరెన్స్ పొందారు. మరిన్ని పచ్చి అబద్ధాలు చెబుతూ ప్రజాభిప్రాయ సేకరణకు రామగుండం ఎన్టీపీసీ విస్తరణ ప్రాజెక్టుకు పూనుకుంటున్నది.

ఎన్విరాన్మెంట్ ఇంపాక్ట్ అసెస్మెంట్ రిపోర్టులో సుప్రీం కోర్టు ఆర్డర్లు, పర్యావరణ చట్టాలు తెలియనట్లు అమాయక రీతిలో 10 కి.మీ. పరిధిలో సర్వే చేసినామని చెబుతున్నారు. ప్రజాభిప్రాయ సేకరణకు ప్రతిపాదించిన ప్రాంతంలో... గాలి నాణ్యత 48 ఏక్యూఐ కన్నా దిగువన ఉన్నట్టు, ధ్వని తీవ్రత 40 డెసిబెల్స్ కన్నా తక్కువ ఉన్నట్టు, స్థానికంగా అత్యధిక ఉష్ణోగ్రత 43 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉన్నట్లు రాయడం పచ్చి అబద్ధాలే.

నిరూపిత శాస్త్ర సాంకేతిక సత్యాల పరిమితిలో విషయాలను అర్థం చేసుకోవాలి. రామగుండం ఎన్టీపీసీ–టీఎస్ఎస్‌టీపీపీ ప్రతిపాదిత 2,400 మె.వా. విస్తరణ కోసం ప్రజాభిప్రాయ సేకరణ చేయదలచిన వేదికపై ఈ విషయాలన్నీ కలెక్టర్ గారు అర్థం చేసుకోవడానికి, విశ్లేషించడానికి చొరవ చూపాలి.

ఇదివరకే జంతువులు, మనుషులు జీవించడానికి వీలుకాకుండా పరిసరాలు అధిక సాంద్ర పారిశ్రామికీకరణ వల్ల విధ్వంసమైపోయాయి. అందుకే జల, వాయు, ఘన వ్యర్థాల కాలుష్యాన్ని పరిహరించాలి. గాలి నాణ్యతను మెరుగుపరచాలి. సర్వత్రా కలుషితమైన భూగర్భ జలాలనూ, గోదావరి నదినీ మెరుగుపరిచే అన్ని చర్యలూ తీసుకోవాలి. ఇక ముందు సుస్థిరాభివృద్ధికి దోహదం చేసే గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ పరిశ్రమలనే ఈ కాలానికి కావలసినవిగా గుర్తించాలి. దేశాభివృద్ధి కోసం అంతటా, ముఖ్యంగా ఈ ప్రాంతంలో నిర్మించాలి.

వ్యాసకర్త పర్యావరణ నిపుణులు
మొబైల్: 94408 00500

మోక్ష మార్గాలు

మానవ జన్మకు పరమ లక్ష్యం మోక్ష ప్రాప్తి అని పెద్దలందరూ చెప్పేదే. ఈ మోక్షం సాధించే మార్గాలనూ, సాధనాలనూ ఎందరెందరో ఆచార్యులు ఎన్నోవిధాలుగా బోధించారు. కానీ సామాన్య మానవుడికి మాత్రం ఈ మార్గాలన్నీ ఒకదానికంటే ఒకటి అతి కష్టమైనవిగా, ఆచరణ సాధ్యం కానివిగా కనిపిస్తాయి. అందుకే కాబోలు, 'నాలుగే ముక్కలు చెప్తాను విను. చిత్తశుద్ధితో పాటిస్తే, అవి నిన్ను మోక్ష మార్గంలో ఉంచుతాయి' అంటున్నట్టుగా, ఆదిశంకరులు భజ గోవింద స్తోత్రంలో నాలుగు విధులను సూచించారు.

మొదటిది... **గేయం గీతా నామ సహస్రమ్:** భగవత్తత్వాన్నీ, మహిమనూ, గుణగణాలనూ వర్ణించే విష్ణుసహస్ర నామాలున్నాయి. అలాగే ఆయన చేసిన గీతాబోధన ఉంది. ఈ రెండూ పాటలా మననం చేస్తూ, చింతన చేయదగినవి. వీటిని వీలైనపుడల్లా పారాయణ చేయాలి. 'గేయం' అంటే పాడదగినది, పాడవలసినది.



జ్యోతిర్మయం

దాంతోపాటు, **'ధ్యేయం శ్రీపతి రూపం – అజస్రమ్'.** శ్రీహరి దివ్య రూపం సదా ధ్యానించదగినది. దాన్ని చిత్తంలో నిలిపి ఎప్పుడూ యథాశక్తి ధ్యానం చేయాలి. ధ్యేయం అంటే ధ్యానించదగినది, ధ్యానించవలసింది.

ఆ పైన **'నేయం సజ్జన సంగే చిత్తమ్'.** మనసును ఎప్పుడూ సజ్జనుల సాంగత్యం వైపు దారి తీయించాలి. సత్పురుషుల సహవాసం చేస్తూ, వాద ప్రవాదాల వాగార్భాటాలతో పెడదారి పట్టించే ధూర్తులకు దూరంగా ఉండాలి. నేయం అంటే నడపదగినది. నడపవలసింది.

తరవాత, **'దేయం దీన జనాయ చ విత్తమ్'.** నీతో సహా అన్ని ప్రాణులలోనూ అంతర్యామిగా ఒకే పరమాత్ముడు వెలుగుతున్నాడు. కనక, సాటి ప్రాణులకు కష్టంలో సాయపడటం కూడా మాధవ సేవే. కాబట్టి ఆర్జించిన ధనమంతా, ఆత్మలాభానికే వెచ్చించరాదు. దీన జనులకు అంతో ఇంతో దానధర్మాలు చేయడం అవసరం. దేయం అంటే దానం చేయదగినది, చేయవలసింది.

ఈ నాలుగు పనులలో దేన్నీ బొత్తిగా ఆచరణ సాధ్యం అనలేం. పరిపూర్ణంగా చేయలేకపోయినా, ఆత్మశుద్ధితో, సంకల్పశుద్ధితో అయినంతవరకూ ఆచరించడం అసాధ్యం కాదు.

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** బ.తదియ ప.11.54 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** పుష్యమి రా.3.26 వరకు, తదుపరి ఆశ్లేష, **వర్జ్యం:** ఉ.11.11 నుండి 12.46 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.33 నుండి 12.17 వరకు, **అమృతఘడియలు:** రా.8.55 నుండి 10.33 వరకు, సంకటహర చతుర్థి; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 6.28, **సూర్యాస్తమయం:** 5.25.

ఉమ్మడి ప్రవేశ పరీక్షల సీజన్ షురూ

సెట్ కన్వీనర్లను ఎంపిక చేసిన మండలి

సాక్షి, హైదరాబాద్: ఉన్నత విద్యా మండలి 2025లో జరిగే ఉమ్మడి ప్రవేశ పరీక్షలపై దృష్టి పెట్టింది. ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే టీజీఈఏపీ సెట్ సహా మరో ఆరు ప్రవేశ పరీక్షలకు కన్వీనర్లను, నిర్వహణ యూనివర్సిటీలను మంగళవారం ఖరారు చేసింది. ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, వైస్ చైర్మన్లు పురోషోత్తం, మహమ్మూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్ కన్వీనర్ల ఎంపికపై కొన్ని రోజులుగా కసరత్తు చేస్తున్నారు. త్వరలో ప్రవేశ పరీక్షల తేదీలను వెల్లడిస్తామని మండలి తెలిపింది.

ఉమ్మడి ప్రవేశ పరీక్షలు.. కన్వీనర్లు

ప్రవేశ పరీక్ష	యూనివర్సిటీ	కన్వీనర్	కోర్సులు
టీజీఈఏపీ సెట్	జేఎన్టీయూహెచ్	ప్రొఫెసర్ డీన్‌కుమార్	బీఈ, బీటెక్, ఫార్మా
పీజీఈసెట్	జేఎన్టీయూహెచ్	ప్రొఫెసర్ అరుణకుమారి	ఎంఈ, ఎంటెక్, ఎంఫార్మసీ
ఐసెట్	మహాత్మాగాంధీ	ప్రొఫెసర్ ఆవుల రవి	ఎంబీఏ, ఎంసీఏ
ఈసెట్	ఉస్మానియా	ప్రొఫెసర్ చంద్రశేఖర్	డిప్లొమాతో బీఈ, బీటెక్‌లో చేరిక
లాసెట్, పీజీ లాసెట్	ఉస్మానియా	ప్రొఫెసర్ విజయలక్ష్మి	మూడేళ్ల, ఐదేళ్ల లా కోర్సులు, ఎల్‌ఎల్‌ఎం
ఎడ్‌సెట్	కాకతీయ	ప్రొఫెసర్ వెంకట్రామ్‌రెడ్డి	బీఈడీ కోర్సులు
పీఈసెట్	పాలమూరు	ప్రొఫెసర్ ఎస్‌ఎస్ దిలీప్	బీపీఈడీ, యూజీ డీపీఈడీ

మారుమూల ప్రాంతాలకు వైద్యం అందాలి

మంగళగిరి ఎయిమ్స్ తొలి స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము


విద్యార్థినికి గోల్డ్‌మెడల్ అందజేస్తున్న రాష్ట్రపతి ముర్ము

సాక్షి, అమరావతి: వైద్య వృత్తిని ఎంచుకోవడమంటే సాటి మనుషులకు సేవ చేసే మార్గాన్ని ఎంచుకోవడమేనని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చెప్పారు. దేశంలోని మారుమూల పల్లెలు, గిరిజన ప్రాంతాలకు వైద్య సేవలు అందాలని, ఈ తరం యువ వైద్యులు అక్కడి ప్రజలకు వైద్య సేవలు అందించాలని రాష్ట్రపతి సూచించారు. రాష్ట్రపతి మంగళవారం ఏపీ మంగళగిరిలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) మొదటి స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అత్యున్నత ప్రతిభ చూపిన 2018 బ్యాచ్ వైద్య విద్యార్థులకు అవార్డులు అందించారు. అనంతరం స్నాతకోత్సవ ప్రసంగం చేశారు. డిగ్రీలు అందుకున్న యువ వైద్యులందరికీ హృదయపూర్వక అభినందనలు తెలియజేసారు. గ్రాడ్యుయేట్‌లలో మూడింట రెండొంతుల మంది యువ మహిళా డాక్టర్లు ఉన్నారని తెలిపారు. వైద్య వృత్తిలో పెరుగుతున్న మహిళల భాగస్వామ్యం, సహకారం మనం నిజంగా అభివృద్ధి చెందిన సమాజంగా మారుతున్నామని నిరూపిస్తున్నాయని చెప్పారు. ఏ ఉన్నత విద్యా సంస్థకైనా మొదటి బ్యాచ్ ఆ సంస్థకు గుర్తింపు (బ్రాండ్ అంబాసిడర్)గా మారుతుందని అన్నారు. విజయం సాధించడానికి సేవ, అధ్యయనం, పరిశోధన అనే మూడు విషయాలపై శ్రద్ధ వహించాలని వైద్యులకు సూచించారు. కీర్తి, అదృష్టంలో ఏదో ఒకదానిని ఎంచుకోవాల్సి వస్తే కీర్తికి ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాల్లో భారత వైద్యులు వారి ప్రతిభ, శ్రమ ఆధారంగా ప్రముఖ స్థానాన్ని సాధించారని రాష్ట్రపతి అన్నారు. ప్రపంచంలో చవకైన వైద్య పర్యాటకానికి భారతదేశం ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చెందుతోందని, ఇందులో వైద్యులు ప్రధాన పాత్ర పోషిస్తున్నారని రాష్ట్రపతి కొనియాడారు. ఇతర దేశాల ప్రజలు కూడా ఇక్కడ ఉన్న వైద్య సదుపాయాలను సద్వినియోగం చేసుకోవడానికి భారతదేశాన్ని సందర్శిస్తున్నారని తెలిపారు. సమయం, పరిస్థితుల ప్రభావంతో వైద్య శాస్త్రాలు కొత్త సవాళ్లను ఎదుర్కొంటాయని రాష్ట్రపతి చెప్పారు. ఇలాంటి సవాళ్లను ఎదుర్కొనేందుకు కొత్త పరిష్కారాలు అవసరమని, ఈ దిశగా ఎయిమ్స్ కొత్త పరిశోధనలు, చికిత్సలను అభివృద్ధి చేస్తుందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము విశ్వాసం వ్యక్తం చేశారు.

రాష్ట్రపతికి ఘన స్వాగతం


హకీంపేట విమానాశ్రయంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు స్వాగతం పలుకుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్ రెడ్డి. చిత్రంలో మంత్రి సీతక్క

సాక్షి, హైదరాబాద్: శీతాకాల విడిది కోసం హైదరాబాద్ చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు ఘన స్వాగతం లభించింది. మంగళవారం సాయంత్రం ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ప్రత్యేక విమానంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలోని హకీంపేట విమానాశ్రయానికి ఆమె చేరుకొన్నారు. రాష్ట్రపతి విమానం నుంచి దిగిన వెంటనే గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మహిళా శిశు సంక్షేమ శాఖమంత్రి సీతక్క, ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేణుగోపాల్‌రావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఇన్‌చార్జి డీజీపీ రవిగుప్తా తదితరులు పుష్పగుచ్ఛాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక వాహనంలో ఆమె బొల్లారంలోని రాష్ట్రపతి నిలయానికి వెళ్లారు. ఈనెల 21 వరకు రాష్ట్రపతి శీతాకాల విడిది కొనసాగనుంది.

ప్రేమికురాలికి ఫోన్ కొనిచ్చేందుకు తల్లినే చంపాడు..!

- దబ్బుల కోసం కొడుకు ఘాతుకం
- తండ్రి ఫిర్యాదు.. ఖమ్మంలో ఘటన


వాణి (ఫైల్)

ఖమ్మంఅర్బన్: ప్రేమికురాలికి ఫోన్ కొనివ్వడానికి అవసరమైన డబ్బు కోసం కన్నతల్లినే కడతేర్చాడో కొడుకు. హత్యానంతరం ఆమె ఒంటిపై ఆభరణాలు లాక్కొని పరారయ్యాడు. తమ చిన్న కుమారుడే ఈ ఘాతుకానికి పాల్పడ్డాడంటూ తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తండ్రి లక్ష్మీనారాయణ, బంధువుల కథనం ప్రకారం.. ఖమ్మం 7వ డివిజన్ ఖానాపురానికి చెందిన కొప్పెర లక్ష్మీనారాయణ- వాణి(45) దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు గోపి మద్యం, జల్సాలకు అలవాటు పడ్డాడు. మంగళవారం మధ్యాహ్నం తల్లి మాత్రమే ఉన్న సమయాన డబ్బు కావాలని ఒత్తిడి చేసినట్టు తెలిసింది. ఆమె డబ్బులు లేవని చెప్పడంతో ఒంటిపై ఆభరణాలైనా ఇవ్వాలని డిమాండ్ చేసినట్టు సమాచారం. దీనికి ఆమె ససేమిరా అనగా ఇద్దరి మధ్య పెనుగులాట జరగ్గా, గోపి తన తల్లి గొంతును లిమి దిండుతో ఊపిరి ఆడకుండా చేసి హత్యకు పాల్పడినట్టు అనుమానిస్తున్నారు. ఆపై తల్లి ఒంటిపై ఉన్న బంగారు చెవిదిద్దులు, నాన్ తాడు తీసుకొని పరారయ్యాడు. కాసేపటికి ఇంటి పక్కనవారు వచ్చి చూసేసరికి వాణి విగతజీవిగా పడి ఉండడంతో పోలీసులు, ఆమె భర్తకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు పోలీసులు చేరుకొని డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టగా, ఓ కర్చీఫ్ వద్ద ఆగిపోయింది. దీనిపై ఆరా తీయగా, గోపీదని తేలినట్టు సమాచారం. దీంతో ఆయన ఫోన్ లొకేషన్ ఆధారంగా వైరాలో అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాశ్ తెలిపారు. పూర్తి విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామన్నారు.

చికిత్స పొందుతూ ఆశ్రమ విద్యార్థి మృతి

చర్ల: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలంలో ఓ ఆశ్రమ పాఠశాల విద్యార్థి అనారోగ్యంతో ఖమ్మంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దుమ్ముగూడెం మండలం కొత్తపల్లి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో బూర్గంపాడు మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన బొర్రా చరణ్ (13) ఏడో తరగతి చదువుతున్నాడు. బాలుడికి శరీరమంతా దద్దుర్లు రావడంతో ఈనెల 13న తండ్రి వచ్చి ఇంటికి తీసుకెళ్లాడు. ఆ తర్వాత పరిస్థితి విషమించడంతో ఖమ్మం తరలించి చికిత్స అందిస్తుండగా ఈనెల 14న మృతి చెందడంతో మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఘటనపై ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సింహారావు మాట్లాడుతూ ఒళ్లంతా దద్దుర్లు రావడంతో తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చామని, తాము ఆస్పత్రిలో చూపిస్తామని చెప్పినా వినకుండా తండ్రి తీసుకెళ్లాడని తెలిపారు. చరణ్ మృతి చెందడం బాధాకరమన్నారు.

మైనారిటీ గురుకులంలో విద్యార్థులకు అస్వస్థత

సారంగపూర్: నిర్మల్ జిల్లా సారంగపూర్ మండలం చించోలి(బి) గ్రామ సమీపంలోని మైనార్టీ గురుకులంలో పలువురు విద్యార్థులు మంగళవారం అస్వస్థతకు గురయ్యారు. మధ్యాహ్న భోజనం అనంతరం వారికి విరేచనాలు కావడంతో.. ఉపాధ్యాయులు వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వేదవ్యాస్‌కు సమాచారం ఇచ్చారు. సిబ్బందితో వచ్చిన ఆయన గురుకులంలో వైద్య శిబిరం నిర్వహించారు. దాదాపు 80 మంది విద్యార్థులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. వివిధ సమస్యలున్న విద్యార్థులకు సైతం వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

ఏడో తరగతి విద్యార్థి ఆత్మహత్య

- నారాయణ రెసిడెన్షియల్ పాఠశాలలో ఘటన
- ఉపాధ్యాయుల ఒత్తిడే కారణమని తండ్రి ఆరోపణ
- కుటుంబ సభ్యులు, విద్యార్థి సంఘాల ఆందోళన


లోహితస్యరెడ్డి

హయత్‌నగర్ (హైదరాబాద్)/గోపాల్‌పేట: ప్రైవేటు పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి జరిగిన ఈ సంఘటనపై పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. వనపర్తి జిల్లా రేవల్లి మండలం శానాయిపల్లికి చెందిన పండగ మధుసూదన్‌రెడ్డి రైతు. ఆయన కొడుకు లోహితస్యరెడ్డి (12) హయత్‌నగర్‌లోని నారాయణ రెసిడెన్షియల్ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. సోమవారం రాత్రి భోజనం అనంతరం 8 గంటలకు తోటి విద్యార్థులంతా స్టడీ అవర్‌లో చదువుకునేందుకు వెళ్లగా.. లోహితస్యరెడ్డి ఒక్కడే గదిలో ఉన్నాడు. స్టడీ అవర్ తర్వాత గదిలోకి వచ్చిన విద్యార్థులకు.. ఫ్యాన్‌కు వేలాడుతూ లోహితస్యరెడ్డి కనిపించాడు. దీంతో వారు హాస్టల్ సిబ్బందికి చెప్పగా.. హయత్‌నగర్‌లోని సన్‌రైజ్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే విద్యార్థి మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. విషయం తెలుసుకున్న పోలీసులు విద్యార్థి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఉపాధ్యాయుల ఒత్తిడి, నిర్లక్ష్యం కారణంగానే తన కొడుకు ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుని తండ్రి మధుసూధన్‌రెడ్డి ఆరోపించారు. ఇక్కడ చదవనంటే.. ఈ ఏడాది పూర్తయ్యేవరకు చదవమని నచ్చజెప్పానని చెప్పారు. సోమవారం రాత్రి 7 గంటల సమయంలో కూడా ఫోన్ చేసి మాట్లాడాడని.. ఆ తర్వాతే ఉరివేసుకుని మరణించాడనే వార్త తెలిసిందని వాపోయారు. మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు, విద్యార్థి సంఘాల నాయకులు పాఠశాల గేటు ముందు ఆందోళన చేశారు.

ఎలుకలు కొరికిన బాలికకు రేబిస్ వ్యాక్సిన్!

కుటుంబీకులకు సమాచారమివ్వని గురుకులం సిబ్బంది


విద్యార్థిని కాలిపై గాయాలు


విద్యార్థినితో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

ఖమ్మం మయూరిసెంటర్ /రఘునాథపాలెం: ఖమ్మం జిల్లా దానవాయిగూడెం బీసీ గురుకులంలో ఎలుకలు కొరకడంతో ఓ విద్యార్థిని ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతిన్నది. బాధిత బాలిక తల్లి సాయిబిందు చెప్పిన ప్రకారం.. ఖమ్మంకు చెందిన లక్ష్మీ భవాని కీర్తి బీసీ గురుకులంలో ప్రస్తుతం పదో తరగతి చదువుతోంది. ఐదో తరగతిలో ఉన్నప్పుడు ఒకసారి ఎలుక కొరకగా వైద్యం అందించారు. మళ్లీ ఈ ఏడాది మార్చిలో ఎలుక కొరకడంతో అధికారులు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి రేబిస్ వ్యాక్సిన్ వేయించారు. కానీ ఈ విషయం కుటుంబీకులకు చెప్పలేదు. గత నెలలోనూ మరోమారు కీర్తి కాలిపై ఎలుక కరవగా బాధితురాలు చెప్పే వరకు బయటకు రానివ్వలేదు. ఇటీవల సాయిబిందు పాఠశాలకు వెళ్లినప్పుడు కీర్తి నడవలేని స్థితిలో కనిపించింది. వెంటనే తీసుకెళ్లి చికిత్స చేయించి తిరిగి గురుకులానికి పంపించారు. అయితే, గత మంగళవారం కీర్తి పూర్తిగా నడవలేని స్థితిలో ఉందని ఉపాధ్యాయులు చెప్పడంతో మళ్లీ ఆస్పత్రిలో చేర్పించారు. కీర్తికి ఒక కాలు, చేయి పని చేయడం లేదని వైద్యులు చెప్పారని సాయిబిందు తెలిపారు. ఘటనపై గురుకులం ప్రిన్సిపాల్ నాగమణి వివరణ కోరగా.. విద్యార్థిని తల్లి చెప్పే వరకు తనకు విషయం తెలియదన్నారు. కాగా, బాధిత విద్యార్థినికి మమత ఆస్పత్రిలో ఉచిత వైద్యం అందించనున్నట్లు మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు.

లోక్‌సభలో జమిలి బిల్లులు

విపక్షాల వ్యతిరేకత మధ్యే ప్రవేశపెట్టిన కేంద్రం

న్యూఢిల్లీ: జమిలి ఎన్నికలపై కేంద్రం మరో కీలక ముందడుగు వేసింది. లోక్‌సభతో పాటు అన్ని రాష్ట్రాల శాసనసభలకూ ఒకేసారి ఎన్నికలు జరిపేందుకు ఉద్దేశించిన రెండు బిల్లులను మంగళవారం లోక్‌సభలో ప్రవేశ పెట్టింది. విపక్షాల ఆందోళనల మధ్యే కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్‌రాం మేఘ్వాల్ రాజ్యాంగ (129వ సవరణ) సవరణ బిల్లును సభ ముందుంచారు. ఇది ఫక్తు నియంతృత్వ చర్య అంటూ కాంగ్రెస్ తదితర విపక్షాలు దుయ్యబట్టాయి. వాటి అభ్యంతరాలను మంత్రి కొట్టిపారేశారు. రాష్ట్రాలు అనుభవిస్తున్న ఏ అధికారాలనూ ఈ బిల్లు తగ్గించబోదని స్పష్టం చేశారు. దాదాపు 90 నిమిషాల పాటు అధికార, ప్రతిపక్షాల నడుమ వాడివేడి చర్చ జరిగింది. కాంగ్రెస్‌తో పాటు డీఎంకే, తృణమూల్, సమాజ్‌వాదీ, ఎన్సీపీ (ఎస్పీ), శివసేన (యూబీటీ), మజ్లిస్ తదితర పార్టీలు బిల్లులను తీవ్రంగా వ్యతిరేకించాయి. వాటిపై ఓటింగ్‌కు పట్టుబట్టాయి. దాంతో ఎలక్ట్రానిక్, పేపర్ స్లిప్ పద్ధతిన ఓటింగ్ జరిగింది. 269 మంది అనుకూలంగా ఓటేయడంతో బిల్లులను ప్రవేశపెట్టారు. దానికి వ్యతిరేకంగా ఏకంగా 198 మంది ఓటేయడం విశేషం. నూతన పార్లమెంటు భవనంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ వ్యవస్థను ఉపయోగించడం ఇదే తొలిసారి. కేంద్రపాలిత ప్రాంతాల సవరణ బిల్లును కూడా మంత్రి సభలో ప్రవేశపెట్టారు. పుదుచ్చేరి, ఢిల్లీ, జమ్మూ కశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతాల అసెంబ్లీ ఎన్నికలను కూడా లోక్‌సభతో పాటే నిర్వహించేందుకు వీలు కల్పించడం దీని ఉద్దేశం. ప్రతిపాదిత బిల్లులు మౌలిక నిర్మాణ సూత్రానికి గొడ్డలిపెట్టన్న విపక్షాల ఆరోపణలు నిరాధారాలని మేఘ్వాల్ అన్నారు. రాజ్యాంగ సార్వభౌమత్వం, దాని సమాఖ్య–లౌకిక స్వభావాలు, కేంద్ర–రాష్ట్రాల మధ్య అధికారాల విభజన, న్యాయ సమీక్ష వంటి కీలక సూత్రాలకు ఈ బిల్లుల ద్వారా అణుమాత్రం కూడా మార్పులు చేయబోవడం లేదని స్పష్టం చేశారు. విపక్షాల ఆరోపణలన్నీ రాజకీయ దురుద్దేశపూరితాలని విమర్శించారు. వాటిని విపక్ష సభ్యులు తీవ్రంగా ఖండించారు. బిల్లుపై తమ అభ్యంతరాలను వారంతా సభ ముందుంచారు. వాటిపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పందించారు. జమిలి బిల్లుపై ప్రతి దశలోనూ లోతైన చర్చ జరగాలన్నదే ప్రధాని నరేంద్ర మోదీ ఉద్దేశమని తెలిపారు. ''జమిలి బిల్లులు కేంద్ర మంత్రివర్గం ముందుకు వచ్చినప్పుడు మోదీ అదే చెప్పారు. లోతైన చర్చ నిమిత్తం సంయుక్త పార్లమెంటరీ సంఘం పరిశీలనకు పంపాలని అభిప్రాయపడ్డారు'' అని మంత్రి వెల్లడించారు. డీఎంకే సభ్యుడు టీఆర్ బాలు కూడా వాటిపై జేపీసీ పరిశీలన కోరారని గుర్తు చేశారు. ''రాజ్యాంగ (129వ సవరణ) బిల్లుపై జేపీసీలో విస్తృతంగా చర్చ చేపట్టవచ్చు. అనంతరం జేపీసీ ఇచ్చే నివేదికను కేంద్ర కేబినెట్ ఆమోదిస్తుంది. తదనంతరం బిల్లుపై పార్లమెంటులో మరోసారి మనమంతా చర్చించుకోవచ్చు'' అని విపక్షాలకు సూచించారు. రెండు బిల్లులను జేపీసీకి నివేదిస్తూ సభలో తీర్మానం ప్రవేశపెడతానని మేఘ్వాల్ ప్రకటించారు. ఆ మేరకు బుధవారం తీర్మానం లోక్‌సభ ముందుకు వచ్చే అవకాశముంది. ఈ రాజ్యాంగ సవరణ బిల్లులను పార్లమెంటులో ప్రవేశపెట్టేందుకు సాధారణ మెజారిటీ చాలు. కానీ అవి గట్టెక్కాలంటే ఉభయ సభల్లోనూ మూడింట రెండొంతుల మెజారిటీతో ఆమోదం పొందాల్సి ఉంటుంది. ఎన్డీఏ ప్రభుత్వానికి ప్రస్తుతం రెండు సభల్లోనూ అంతటి మెజారిటీ లేదు. జమిలి ఎన్నికలపై ఏర్పాటైన మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కమిటీ ముందు 32 పార్టీలు ప్రతిపాదనకు మద్దతివ్వగా 15 పార్టీలు వ్యతిరేకించడం తెలిసిందే.

పాలనలో స్థిరత్వానికే: కేంద్రం

జమిలి ఎన్నికలు భారత్‌కు కొత్తేమీ కాదని కేంద్రం పేర్కొంది. 1951 నుంచి 1967 దాకా అన్ని రాష్ట్రాల శాసనసభలకూ లోక్‌సభతో పాటే ఎన్నికలు జరిగాయని గుర్తు చేసింది. ''పలు రాష్ట్రాల్లో అసెంబ్లీలు గడువుకు ముందే రద్దవడం వల్ల 1968, 1969 నుంచి జమిలికి బ్రేక్ పడింది'' అని మంగళవారం ఉదయం లోక్‌సభలో జమిలి బిల్లులను ప్రవేశపెట్టడానికి ముందు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. నాలుగో లోక్‌సభ కూడా 1970లో గడువుకు ముందే రద్దయింది. దాంతో 1971లో సాధారణ ఎన్నికలు జరిగి ఐదో లోక్‌సభ కొలువుదీరింది. ఎమర్జెన్సీ నేపథ్యంలో దాని గడువును ఆర్టికల్ 352 సాయంతో 1977 దాకా పొడిగించారు. అనంతర కాలంలో ఆరో, ఏడో, తొమ్మిదో, 11వ, 12వ, 13వ లోక్‌సభలు కూడా అర్ధాంతరంగానే ముగిశాయి. ''పలు రాష్ట్రాల్లో శాసనసభలకూ అదే పరిస్థితి ఎదురవుతూ వస్తోంది. దాంతో తరచూ ఎక్కడో ఒకచోట ఎన్నికలు జరిగే పరిస్థితి నెలకొంది. దాంతో పార్టీలు, నేతలు, చట్టసభ్యులు, అధికారులు పాలనను పక్కన పెట్టి ఎన్నికలను ఎదుర్కోవడంలో గడపాల్సి వస్తోంది. అందుకే కోవింద్ కమిటీ సిఫార్సులకు అనుగుణంగా దేశ ప్రయోజనాల రీత్యా జమిలి ఎన్నికలను తిరిగి పట్టాలపైకి తేవాలని సంకల్పించాం. పాలనలో స్థిరత్వానికి అది వీలు కల్పిస్తుంది'' అని కేంద్రం వివరించింది.



మూడొంతుల మెజారిటీ ఏదీ?

జమిలి బిల్లులు రాజ్యాంగ వ్యతిరేకమని, సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా విమర్శించారు. పార్లమెంటు ఆవరణలో ఆమె మీడియాతో మాట్లాడారు. బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు పునరుద్ఘాటించారు. రాజ్యాంగ సవరణలకు కావాల్సిన మూడింట రెండొంతుల మెజారిటీ బీజేపీకి లేదని లోక్‌సభలో ఓటింగ్‌తో తేలిందని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ అన్నారు. ''కేంద్రంలో ప్రభుత్వం పడిపోతే రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఎందుకు కుప్పకూలాలి? ఇందులో ఏమన్నా అర్థముందా?'' అని ప్రశ్నించారు. సభలో రాజ్యాంగాన్ని ఖూనీ చేసేందుకు మోదీ సర్కారు ప్రయత్నించిందని మనీశ్ తివారీ మండిపడ్డారు. ఓటింగ్ వ్యవహారం బీజేపీకే బెడిసికొట్టిందని పార్టీ ఎంపీ మాణిక్కం ఠాగూర్ అన్నారు.

రాజ్యాంగంపై దాడి: కాంగ్రెస్

జమిలి బిల్లులను రాజ్యాంగ మౌలిక నిర్మాణంపై దాడిగా కాంగ్రెస్ సభ్యుడు మనీశ్ తివారీ అభివర్ణించారు. వాటిని తమ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. రాజ్యాంగంలోని ఇటువంటి కీలకాంశాలను సవరించే అధికార పరిధి పార్లమెంటుకు లేదని ఆయన గుర్తు చేశారు. ''జమిలి ఎన్నికలు జరపాలంటే కేంద్ర, రాష్ట్రాల చట్టసభలకు నిర్దీత కాలావధి కల్పించే ఆర్టికల్ 83, 172లను కూడా సవరించాల్సి ఉంటుంది. కనుక సమాఖ్య వ్యవస్థ మౌలిక లక్షణమైన ప్రజాస్వామ్య నిర్మాణపు పునాదులనే ఈ బిల్లులు కదిలిస్తాయి'' అని వాదించారు. దేశంలో నియంతృత్వాన్ని తేవడమే బీజేపీ ఉద్దేశమని సమాజ్‌వాదీ పార్టీ సభ్యుడు ధర్మేంద్ర యాదవ్ ఆరోపించారు. అసెంబ్లీల గడువును లోక్‌సభతో ముడిపెట్టడం ప్రజా తీర్పును న్యూనతపరచడమేనని తృణమూల్ సభ్యుడు కల్యాణ్ బెనర్జీ విమర్శించారు. తమకు నచ్చిన ప్రభుత్వాన్ని ఐదేళ్ల కాలానికి ఎన్నుకునే హక్కు ప్రజలకు ఉంటుందని టీఆర్ బాలు గుర్తు చేశారు. జమిలి ద్వారా దానికి గండికొట్టే అధికారం కేంద్రానికి లేదన్నారు. బిల్లులపై మాట్లాడేందుకు అధికార పక్ష సభ్యులకే స్పీకర్ ఓం బిర్లా ఎక్కువగా అవకాశమిస్తున్నారని విపక్ష సభ్యులు అభ్యంతరం వెలిబుచ్చడం ఉద్రిక్తతకు దారితీసింది. ''పార్లమెంటుకు మీరు మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నారా? ఆ హక్కు ప్రతి పార్టీకీ ఉంది'' అంటూ రిజిజు దుయ్యబట్టారు. బిల్లులకు బేషరతుగా మద్దతిస్తున్నట్టు బీజేపీ మిత్రపక్షాలు శివసేన (షిండే), టీడీపీ ప్రకటించాయి. బిల్లులను జేపీసీకి పంపాలని సుప్రియా సులే (ఎన్సీపీ–ఎస్పీ) కోరారు. ఈ బిల్లులు ప్రాంతీయ పార్టీలకు మరణ శాసనమని అసదుద్దీన్ ఒవైసీ (మజ్లిస్) ఆరోపించారు.



మంగళవారం జైపూర్‌లో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

వాళ్లు చెయ్యరు.. ఇతరుల్ని చెయ్యనివ్వరు..!

కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ ధ్వజం

జైపూర్: రైతులకు అండగా ఉంటామంటూ గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ నేతలు.. వాస్తవానికి అన్నదాతల కోసం ఏమీ చేయలేదని, ఇతరులను కూడా చేయనివ్వరని మండిపడ్డారు. రాష్ట్రాల మధ్య జలవివాదాలను పరిష్కరించడానికి బదులుగా ఆ పార్టీ రెచ్చగొడుతుందని ఆరోపించారు. కాంగ్రెస్ వైఖరికి ఈస్టర్న్ రాజస్తాన్ కెనాల్ ప్రాజెక్టు(ఈఆర్‌సీపీ) ప్రత్యక్ష ఉదాహరణ అని పేర్కొన్నారు. ఈఆర్‌సీపీ అసంపూర్తిగా ఇంతకాలం నిలిచిపోవడానికి కాంగ్రెస్సే కారణమన్నారు. చంబల్ నదీ పరివాహక ప్రాంతం నుంచి రాజస్తాన్‌లోని 13 జిల్లాలకు నీటిని అందించడమే ఈ ప్రాజెక్టు లక్ష్యం. 'నీటి వివాదాలకు పరిష్కారం వెదకాలని కాంగ్రెస్ ఏనాడూ భావించలేదు. మన నదుల్లోని నీరు సరిహద్దులు దాటి వెళుతోంది. కానీ, మన రైతులకు ఏమాత్రం ఉపయోగపడటం లేదు. దీనికి పరిష్కారం చూపడం ఇష్టం లేని కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాల మధ్య నీటి పంపకం వివాదాలను ప్రేరేపిస్తోంది'అని ఆయన అన్నారు. రాజస్తాన్‌లోని బీజేపీ ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం జైపూర్‌లో ఏర్పాటైన కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని మోదీ పైవ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆయన రూ.46,300 కోట్ల విలువైన ఇంధనం, రహదారులు, రైల్వేలు, జల సంబంధం 24 ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. గుజరాత్ సీఎంగా ఉండగా నర్మదా నదీ జలాలను సద్వినియోగం చేసుకునేలా పలు ప్రాజెక్టులను తలపెడితే కాంగ్రెస్, కొన్ని ఎన్జీవోలు వాటిని అడ్డుకునేందుకు అనేక విధాలుగా ప్రయత్నించాయన్నారు.

బీజేపీ కొత్త అధ్యక్షుడి ఎన్నిక ఫిబ్రవరిలో

న్యూఢిల్లీ: భారతీయ జనతా పార్టీకి కొత్త అధ్యక్షుడి ఎన్నిక ఫిబ్రవరిలో జరుగుతుందని పార్టీలోని విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి. జేపీ నడ్డా నుంచి కొత్త అధ్యక్షుడు ఫిబ్రవరిలో పగ్గాలు చేపడతారని వెల్లడించాయి. సగం కంటే ఎక్కువ రాష్ట్రాల్లో సంస్థాగత ఎన్నికలు జనవరి మధ్యకల్లా పూర్తవుతాయని, తదుపరి జాతీయ అధ్యక్షుడి ఎన్నిక ఉటుందని వివరించాయి. 60 శాతం రాష్ట్రాల్లో పార్టీ అధ్యక్షుల పదవీకాలం ముగిసిందని, వీరి స్థానాల్లో .జనవరి మధ్యకల్లా కొత్త అధ్యక్షులు ఎన్నికవుతారని తెలిపాయి. కొత్త జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకోవాలంటే.. సగం రాష్ట్రాల్లో పార్టీ సంస్థాగత ఎన్నికలు పూర్తికావాలని బీజేపీ నిబంధనావళి చెబుతోంది. మంత్రివర్గంలో నుంచి ఒకరిని కొత్త అధ్యక్షుడిగా ఎన్నుకుంటారా అని ప్రశ్నించగా.. మంత్రి కావొచ్చు లేదా పార్టీలో ఒకరు కావొచ్చు.. అని విశ్వసనీయవర్గాలు పేర్కొన్నాయి. కొత్త అధ్యక్షుడెవరనే విషయంలో ఇంకా ఏదీ ఖరారు కాలేదని వివరించాయి. ప్రస్తుతం బీజేపీ అధ్యక్షుడిగా ఉన్న కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా 2020 ఫిబ్రవరిలో పార్టీ పగ్గాలు చేపట్టారు. సాధారణంగా అధ్యక్షుడికి మూడేళ్ల కాలపరిమితి ఉంటుంది. అయితే లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా నడ్డాకు పొడిగింపునిచ్చిన విషయం తెలిసిందే.

మద్దతిచ్చిన వైఎస్సార్‌సీపీ, టీడీపీ

సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికల నిర్వహణకు ఉద్దేశించిన రాజ్యాంగ (129 సవరణ) బిల్లు–2024, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల సవరణ బిల్లు–2024లను ప్రవేశ పెట్టడానికి జరిగిన ఓటింగ్‌కు వైఎస్సార్ కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు మద్దతివ్వగా ఎంఐఎం పార్టీ ఈ బిల్లును పూర్తిగా వ్యతిరేకించింది. ఒకే దేశం–ఒకే ఎన్నికలకు సంబంధించి తెచ్చిన బిల్లును ప్రవేశపెట్టేందుకు కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ తీసుకొచ్చిన తీర్మానంపై ఓటింగ్‌లో టీడీపీ, వైఎస్సార్‌సీపీ పార్టీలకు చెందిన ఎంపీలు బిల్లుకు అనుకూలంగా ఓటేశారు. ఈ సందర్భంగా టీడీపీ తరఫున కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ, 'దేశమంతా ఒకే దశలో అసెంబ్లీ, లోక్‌సభకు ఎన్నికలను నిర్వహించాలనుకుంటోన్న కేంద్రం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం' అని అన్నారు. జాతీయ మీడియాతో మాట్లాడిన వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి 'ఏకకాల ఎన్నికలతో పార్టీకి ఎలాంటి ఇబ్బందులు లేవు. ఇప్పటికే సార్వత్రిక ఎన్నికలతో పాటు ఏపీ రాష్ట్రానికి కూడా ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తున్నందున మాకు పెద్దగా సమస్యలు లేవు' అన్నారు.

ప్రాంతీయ పార్టీలను దెబ్బతీస్తుంది: ఒవైసీ

జమిలి ఎన్నికల బిల్లును ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్రంగా వ్యతిరేకించారు. 'ఇది స్వయం పాలన హక్కును, పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తోంది. ఫెడరలిజం సూత్రాలను ఉల్లంఘిస్తోంది. ఈ తరహా చట్టంతో రాష్ట్రాల అసెంబ్లీలకు మధ్యంతర ఎన్నికలకు వస్తాయి. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు విఘాతం. దీనిని ఆమోదించే సామర్థ్యం పార్లమెంటుకు లేదు. రాష్ట్రపతి తరహా ప్రజాస్వామ్యం కోసం నేరుగా ఈ బిల్లు తీసుకొచ్చారు. ఈ బిల్లు దేశంలోని అన్ని ప్రాంతీయ పార్టీల ఉనికిని దెబ్బతీస్తుంది. చివరగా ఈ బిల్లును కేవలం అత్యున్నత నాయకుడి అహాన్ని సంతృప్తి పరచడానికే తీసుకొచ్చారు' అని పేర్కొన్నారు.

కాల్పులు జరిపింది

15 ఏళ్ల బాలిక

మాడిసన్: అమెరికాలోని విస్కాన్సిన్ రాష్ట్రంలో ఒక స్కూలులో కాల్పులకు తెగబడింది 15 ఏళ్ల బాలిక అని పోలీసులు వెల్లడించారు. అబుండంట్ లైఫ్ క్రిస్టియన్ స్కూలులో సోమవారం కాల్పులు జరగ్గా.. ఒక టీచర్, మరో టీనేజర్ విద్యార్థి మృతి చెందారు. స్టడీ హాలులో సదరు బాలిక కాల్పులు మొదలుపెట్టడంతో మరో ఆరుగురు గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని మాడిసన్ పోలీసు చీఫ్ బార్నెస్ తెలిపారు.




ఈసారి బంగ్లాదేశ్ బ్యాగ్..

న్యూఢిల్లీ: కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ వాద్రా తనదైన శైలిలో బ్యాగులతో సందేశానిచ్చే ప్రయత్నం కొనసాగిస్తున్నారు. పాలస్తీనా అని ముద్రించి ఉన్న బ్యాగుతో సోమవారం ఆమె పార్లమెంట్ సమావేశాలకు హాజరైన విషయం తెలిసిందే. అలాగే, మంగళవారం బంగ్లాదేశ్‌లోని హిందువులు, క్రైస్తవులకు అండగా ఉంటాం(వియ్ స్టాండ్ విత్ ది హిందూస్ అండ్ క్రిస్టియన్స్ ఆఫ్ బంగ్లాదేశ్) అని రాసి ఉన్న బ్యాగుతో వచ్చారు. బంగ్లాదేశ్‌లో హిందువులు, క్రైస్తవులపై అత్యాచారాలను నిరసిస్తూ మంగళవారం పార్లమెంట్ ఆవరణలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీలతోపాటు ప్రియాంక కూడా ఈ బ్యాగ్‌ను ధరించి పాల్గొన్నారు. బంగ్లాదేశ్‌లో మైనారిటీలకు జరగాలంటూ వారు నినాదాలు చేశారు. కాగా, బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై జరుగుతున్న అఘాయిత్యాలపై సోమవారం లోక్‌సభలో ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడి ప్రభుత్వ మద్దతుతోనే ఇవి సాగుతున్నాయని ఆరోపించారు. అంతకు ముందు, వారం క్రితం ఆమె మరో బ్యాగుతో పార్లమెంట్ వద్ద కనిపించారు. ఆ బ్యాగుపై ప్రధాని మోదీ, పారిశ్రామిక వేత్త గౌతమ్ అదానీలు కలిసున్న చిత్రంతోపాటు 'మోదీ అదానీ భాయీభాయీ'అని ముద్రించి ఉంది.

రాజ్యాంగం వాళ్లకు ప్రైవేట్ జాగీరు!

కాంగ్రెస్‌పై అమిత్ షా ధ్వజం

- పార్లమెంటునే మోసగించింది
- రాజకీయ స్వార్థం కోసం ముస్లిం రిజర్వేషన్లకు పాకులాడుతోంది
- ఆ ప్రయత్నాలను సాగనివ్వబోం
- రాజ్యాంగంపై చర్చలో మంత్రి



న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీపై, నెహ్రూ– గాంధీ కుటుంబంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా మంగళవారం రాజ్యసభలో నిప్పులు చెరిగారు. ''కాంగ్రెస్ పార్టీతో పాటు రాజ్యాంగాన్ని కూడా తమ వ్యక్తిగత జాగీరుగా ఆ కుటుంబం పరిగణించింది. అందుకే కనీసం పార్లమెంటు అనుమతి కూడా లేకుండానే రాజ్యాంగంలోకి ఆర్టికల్ 35ఏను చొప్పించే దుస్సాహసానికి తెగబడింది. చివరికి పార్లమెంటును కూడా మోసగించిన చరిత్ర కాంగ్రెస్‌ది! రాజ్యాంగం పేరిట 75 ఏళ్లుగా లెక్కలేనన్ని ద్రోహాలకు పాల్పడుతూ వస్తోంది'' అంటూ మండిపడ్డారు. స్వీయ రాజకీయ లబ్ధి కోసం రాజ్యాంగాన్ని కాంగ్రెస్ ఇష్టానికి సవరించిందంటూ పలు ఉదంతాలను ఉటంకించారు. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు గండికొట్టే తొలి రాజ్యాంగ సవరణతో దేశ మొదటి ప్రధాని నెహ్రూయే ఇందుకు తెర తీశారని ఆరోపించారు. ''సంతుష్టీకరణ రాజకీయాలకు కాంగ్రెస్ చిరునామా. తన ఓటు బ్యాంకుకు భంగం కలుగుతుందని ముస్లిం మహిళలకు ఏళ్ల తరబడి హక్కులను నిరాకరించిన చరిత్ర ఆ పార్టీది. ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించేందుకు 50 శాతం పరిమితిని అతిక్రమించేందుకు కూడా వెనకాడలేదు! తన పాలనలోని రెండు రాష్ట్రాల్లో రాజ్యాంగ విరుద్ధంగా మతాధారిత రిజర్వేషన్లు తెచ్చింది'' అంటూ ఆరోపించారు. రాజ్యాంగ వజ్రోత్సవాల సందర్భంగా రాజ్యసభలో జరిగిన రెండు రోజుల చర్చకు మంత్రి బదులిచ్చారు. బీజేపీకి పార్లమెంటులో ప్రాతినిధ్యం ఉన్నంత కాలం మతాధారిత రిజర్వేషన్లను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని ప్రకటించారు. వెనకబడ్డ వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ ఏనాడూ ప్రయత్నించలేదని షా ఆరోపించారు. ఎన్నికల ఓటమికి ఈవీఎంలను సాకుగా చూపడం ఇప్పటికైనా కాంగ్రెస్ మానుకోవాలని సూచించారు. ఉత్తరాఖండ్‌లో మాదిరిగా అన్ని రాష్ట్రాల్లోనూ ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేస్తామని పునరుద్ఘాటించారు.

జమిలి బిల్లు కాంగ్రెస్ పుణ్యమే: నడ్డా



కేంద్రంలో దశాబ్దాల పాటు అధికారంలో ఉండగా కాంగ్రెస్ చేసిన నిర్వాకాల వల్లే మోదీ సర్కారు జమిలి ఎన్నికల బిల్లు తేవాల్సిన అవసరం ఏర్పడిందని రాజ్యసభ నాయకుడు జేపీ నడ్డా అన్నారు. మంగళవారం రాజ్యాంగ వజ్రోత్సవాలపై రాజ్యసభలో చర్చలో ఆయన మాట్లాడారు. ''లోక్‌సభకు, అన్ని అసెంబ్లీలకూ తొలుత ఒకేసారి ఎన్నికలు జరిగేవి. అప్పట్లో కాంగ్రెస్ పాలకులు తమకు ఇష్టం లేని రాష్ట్ర ప్రభుత్వాలను యథేచ్ఛగా కూలదోయడంతో జమిలికి బ్రేక్ పడింది'' అని చెప్పారు. ''ఎమర్జెన్సీ కాంగ్రెస్ చరిత్రపై చెరగని మచ్చ. అందుకు ఆ పార్టీ క్షమాపణలు చెప్పిందనడం పచ్చి అబద్ధం. మైనారిటీల సంతుష్టీకరణ రాజకీయాల్లో భాగంగా మతాధారిత రిజర్వేషన్లకు కాంగ్రెస్ తెర తీయజూస్తోంది. ఆ ప్రయత్నాలను పలుమార్లు కోర్టులు అడ్డుకున్నా దాని తీరు మారడం లేదు. ట్రిపుల్ తలాక్, ఆర్టికల్ 370పై కాంగ్రెస్ వైఖరి మొదలుకుని షాబానో తీర్పును నిర్వీర్యం చేసేందుకు రాజ్యాంగ సవరణ దాకా ఇందుకు ఉదాహరణలెన్నో'' అని నడ్డా ఆరోపించారు. వాటిపై ఆ పార్టీ సభ్యులు తీవ్ర అభ్యంతరం వెలిబుచ్చారు. గుజరాత్‌లో బీజేపీ ప్రభుత్వం కల్పించిన రిజర్వేషన్ల మాటేమిటని కాంగ్రెస్ సభ్యుడు జైరాం రమేశ్ ప్రశ్నించారు. అవి కేవలం ఆర్థిక వెనకబాటు ప్రాతిపదికన కల్పించినవంటూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కల్పించుకున్నారు. సభను జైరాం తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ కూడా సామాజిక, ఆర్థిక వెనకబాటు ప్రాతిపదికనే రిజర్వేషన్లు కల్పించింది తప్ప మతాధారితంగా కాదంటూ జైరాం బదులిచ్చారు. వారిద్దరి మధ్య వాడివేడి చర్చ సాగింది.

వనౌటులో భారీ భూకంపం

పసిఫిక్ ద్వీప దేశంలో తీవ్ర నష్టం

వెల్లింగ్టన్(న్యూజీలాండ్): పసిఫిక్ ద్వీప దేశం వనౌటులో మంగళవారం శక్తివంతమైన భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై 7.3గా నమోదైన ఈ భూకంపం తాకిడి తీవ్ర నష్టం సంభవించింది. పోర్ట్ విలాలోని వివిధ దేశాల దౌత్యకార్యాలయాలున్న భవన సముదాయం సహా నేలమట్టమైన పలు భవనాల దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్ష మయ్యాయి. పోర్ట్ విలాలోని నౌకాశ్రయం దెబ్బతింది. అక్కడి విమానాశ్రయంలో రాకపోకలు నిలిచిపోయాయి. పోర్ట్ విలా దౌత్య కార్యాలయంలోని తమ సిబ్బంది అందరూ సురక్షితంగానే ఉన్నారని, ప్రస్తుతానికి కార్యాలయాన్ని మూసి వేశామని అమెరికా, ఆస్ట్రేలియా తెలిపాయి. క్షతగాత్రులతో ఆస్పత్రులు నిండిపోయాయి. పలువురు మృతి చెందినట్లు చెబుతున్నారు. విద్యుత్, సమాచార వ్యవస్థలు దెబ్బతినడంతో పూర్తి వివరాలు తెలియడం లేదు. ప్రజలను తీర ప్రాంతాలకు దూరంగా వెళ్లాలని హెచ్చరించారు. నష్ట సమాచారం సామాజిక మాధ్యమాల్లో మాత్రమే కొంతమేర సమాచారం బయటకు వస్తోంది. పోర్ట్ విలాకు 30 కిలోమీటర్ల దూరంలో భూమికి 37 కిలోమీటర్ల లోతులో మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఒక్కసారిగా తీవ్ర ప్రకంపనలు మొదలయ్యాయి. అనంతర ప్రకంపనల తీవ్రత రిక్టర్ స్కేలుపై 5.5గా నమోదైంది.

బాంబు దాడిలో రష్యా ఆర్మీ జనరల్ మృతి

తమ సీక్రెట్ సర్వీస్ పనేనని ప్రకటించుకున్న ఉక్రెయిన్



మాస్కో: రష్యా రాజధానిలోని మాస్కోలో జరిగిన బాంబు పేలుడు ఘటనలో రష్యా ఆర్మీ సీనియర్ జనరల్ మృత్యువాతపడ్డారు. ఆర్మీ అణు, జీవ, రసాయన భద్రతా విభాగం చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ ఇగోర్ కిరిల్లోవ్(54) మంగళవారం కార్యాలయానికి వెళ్లేందుకు తన నివాసం ఆవరణలోని కారు వద్దకు రాగా ఆ పక్కనే స్కూటర్‌లో అమర్చిన బాంబు పేలింది. ఘటనలో కిరిల్లోవ్‌తోపాటు ఆయన సహాయకుడు కూడా ప్రాణాలు కోల్పోయారు. దీని వెనుక తమ సీక్రెట్ సర్వీస్(ఎస్‌బీయూ) హస్తముందని ఉక్రెయిన్ అధికారులు ప్రకటించారు. సోమవారం జనరల్ కిరిల్లోవ్‌పై పలు నేరారోపణలను సంధించిన ఎస్‌బీయూ, మరునాడే ఈ చర్యకు పాల్పడటం గమనార్హం. ఉక్రెయిన్‌లో రష్యా బలగాలు ముందుకు సాగుతున్న వేళ తాజా పరిణామం చోటు చేసుకుంది. ఉక్రెయిన్‌లో రష్యా పాల్పడుతున్న దారుణాల్లో కిరిల్లోవ్ కీలకంగా ఉన్నారంటూ కెనడా, బ్రిటన్ తదితర దేశాలు ఆయనపై ఆంక్షలు విధించాయి. ఉక్రెయిన్ ఆర్మీపై నిషేధిత రసాయన ఆయుధాల వినియోగానికి కిరిల్లోవ్ ఆదేశాలే కారణమని సోమవారం ఎస్‌బీయూ ఆరోపణలు చేసింది. 'కిరిల్లోవ్ యుద్ధ నేరస్తుడు, తమ న్యాయబద్ధమైన లక్ష్యం' అంటూ వ్యాఖ్యానించింది. 2022 ఫిబ్రవరిలో రష్యా దురాక్రమణ మొదలైనప్పటి నుంచి ఉక్రెయిన్ యుద్ధ క్షేత్రంలో 4,800 పర్యాయాలకుపైగా రష్యా రసాయన ఆయుధాలను ప్రయోగించినట్లు ఎస్‌బీయూ ఆరోపిస్తోంది. మొదటి ప్రపంచ యుద్ధంలో వాడిన క్లోరోపిక్రిన్ అనే విష వాయువును ఉక్రెయిన్ బలగాలపై రష్యా ప్రయోగించినట్లు అమెరికా అంటోంది. ఈ ఆరోపణలను రష్యా తీవ్రంగా ఖండించింది.

తగు రీతిలో ప్రతీకారం తప్పదు

జనరల్ కిరిల్లోవ్‌ను చంపేందుకు స్కూటర్‌లో అమర్చిన బాంబును రిమోట్‌తో పేల్చినట్లు గుర్తించామని రష్యా అధికారులు చెప్పారు. రష్యా దీనిని ఉగ్రవాద చర్యగా పేర్కొంది. ఉక్రెయిన్‌ను తగు రీతిలో దండిస్తామని ప్రకటించింది. అధ్యక్షుడు పుతిన్ సారథ్యంలోని రష్యా సెక్యూరిటీ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు దిమిత్రీ మెద్వెదెవ్ స్పందిస్తూ..సైనిక వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే ఉక్రెయిన్ ఈ చర్యకు పాల్పడిందన్నారు. ఆ దేశ సైనిక, రాజకీయ నాయకత్వం ప్రతీకార చర్యలను ఎదుర్కోక తప్పదని ఆయన హెచ్చరించారు. గతంలోనూ ఇటువంటి దాడుల్లో పలువురు రష్యా ప్రముఖులు ప్రాణాలు కోల్పోయారు. వీటికి ఉక్రెయినే కారణమని రష్యా నిందించింది.

ఉన్నత విద్య ఎంట్రన్స్‌లకే ఎన్‌టీఏ పరిమితం

కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడి



న్యూఢిల్లీ: 2025 నుంచి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ని ఉద్యోగ ఎంపిక పరీక్షల నిర్వహణ బాధ్యతల నుంచి తప్పిస్తున్నట్లు కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడించారు. కేవలం ఉన్నత విద్యా ప్రవేశ పరీక్షలను మాత్రమే ఎన్‌టీఏ ఇకపై నిర్వహిస్తుందన్నారు. వచ్చే ఏడాదిలో ఈ మేరకు ఎన్‌టీఏను పునర్వ్యవస్థీకరించి, అవసరమైన కొత్త పోస్టులను సృష్టిస్తామని చెప్పారు. అంతేకాకుండా, నీట్‌ను సంప్రదాయ పెన్, పేపర్ విధానం బదులుగా కంప్యూటర్ ఆధారిత పరీక్ష(సీబీటీ)గా చేపట్టేందుకు ఆరోగ్య శాఖతో సంప్రదింపులు జరుపుతున్నామని మంత్రి ప్రధాన్ మంగళవారం మీడియాకు చెప్పారు. వైద్య కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించే నీట్ సహా పలు పరీక్షా పత్రాల లీకేజీలు, రద్దు వంటి పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వం ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ ఇచ్చిన సిఫారసుల ఆధారంగా పునర్వ్యవస్థీకరణకు పలు చర్యలు తీసుకుంటోంది. కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (క్యూయెట్–యూజీ)ను ఇకపైనా ఏడాదిలో ఒక్క పర్యాయం మాత్రమే నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుతానికి ఎన్‌టీఏను ప్రవేశ పరీక్షల బాధ్యతలను మాత్రమే అప్పగించాలి. దాని సామర్థ్యాన్ని పెంచిన తర్వాత ఇతర పరీక్షల బాధ్యతలను అప్పగించే విషయం ఆలోచించాలి'అని ఇస్రో మాజీ చీఫ్ ఆర్. రాధాకృష్ణన్ సారథ్యంలోని కమిటీ సిఫారసు చేసింది. సంబంధిత కోర్సుల్లో జాయినయ్యే విద్యార్థి మాత్రమే ఆన్‌లైన్ పరీక్ష రాసేలా డిజీ–యాత్ర మాదిరిగానే డిజీ–ఎగ్జామ్ విధానాన్ని తీసుకురావాలని కమిటీ పేర్కొంది. ఇందుకోసం, ఆధార్, బయో మెట్రిక్‌తోపాటు ఏఐ ఆధారిత డేటా అనలిటిక్స్‌ను వినియోగించుకోవాలని సూచించింది. పరీక్షల నిర్వహణ, భద్రత, నిఘా, సాంకేతికత వంటి అంశాలకు సంబంధించి డైరెక్టర్ స్థాయిలో 10 సిఫారసులను చేసింది

ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్య పుస్తకాల ధర తగ్గింపు

2025 నుంచి ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్య పుస్తకాల ధరలను తగ్గించనున్నట్లు మంత్రి ప్రధాన్ వివరించారు. ప్రస్తుతం ఏడాదికి 5 కోట్ల టెక్స్ట్ బుక్స్‌ను మాత్రమే ప్రచురిస్తున్నారన్నారు. 2025 నుంచి ముద్రణ సామర్థ్యాన్ని 15 కోట్లకు పెంచుతామని, నాణ్యమైన పుస్తకాలను అందిస్తామని ప్రకటించారు. పాఠ్య పుస్తకాల ధరలను పెంచి, విద్యార్థుల తల్లిదండ్రులపై భారం పెంచబోమన్నారు. మారిన సిలబస్ ప్రకారం 2026–27 నుంచి 9 నుంచి 12వ తరగతి వరకు కొత్త పాఠ్య పుస్తకాలను అందుబాటులోకి తెస్తామని మంత్రి వెల్లడించారు.

సాక్షి హైదరాబాద్

బుధవారం । 18 । డిసెంబర్ । 2024



సిటీజనుల ఆహ్లాదం కోసమే సుందరీకరణ

నగర ప్రజలకు ఆహ్లాదాన్ని కల్పించేందుకు భారీగా సుందరీకరణ పనులు చేపడుతున్నట్లు మేయర్ విజయలక్ష్మి తెలిపారు. -8లో



శీతల ప్రయాణం

నగరవాసులకు వరుసగా సెలవులు అందుబాటులోకి వచ్చాయి. దీంతో ట్రావెలింగ్ మంత్‌గా డిసెంబర్‌ను ఎంచుకుంటున్నారు. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 29.0/23.0

నగరంలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం పొగమంచు ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. గరిష్టంగా 29, కనిష్టంగా 23 ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.





క్రిస్మస్ కోలాహలం!

నగరంలో క్రిస్మస్ కోలాహలం మొదలైంది. ఈ నెల 25న జీసస్ జన్మదినం.. క్రైస్తవులకు పర్వదినం. ఈ సందర్భంగా క్రిస్మస్ ట్రీలు, శాంటాక్లాజ్ బొమ్మలు, క్రిస్మస్ స్టార్‌ల కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ప్రీ కిస్మస్ వేడుకలు, కేక్ మిక్సింగ్‌లతో సందడి వాతావరణం నెలకొంది. పంజాగుట్టలోని ఓ షాపింగ్ మాల్‌లో మంగళవారం ఈ దృశ్యాలు కనిపించాయి.



క్లబ్ హౌస్‌లు కబ్జా!

వసతుల బ్లాక్‌ను నివాసిత సంఘానికి అప్పజెప్పాల్సిందే

- నివాసితులకు సభ్యత్వంతో సరిపెట్టేస్తున్న బిల్డర్లు
- రెరా నిబంధనలను ఖాతరు చేయని డెవలపర్లు
- బార్, రెస్టారెంట్, సూపర్ మార్కెట్ వంటి క్లబ్ హౌస్ థర్డ్ పార్టీకి విక్రయం
- టీజీ- రెరాను ఆశ్రయిస్తున్న రెసిడెంట్స్ అసోసియేషన్స్



సాక్షి, సిటీబ్యూరో: నివాసిత సంఘానికి చెందాల్సిన క్లబ్ హౌస్‌లను డెవలపర్లు కబ్జా చేస్తున్నారు. తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేషన్ అండ్ డెవలప్‌మెంట్ (టీజీ-రెరా) చట్టం ప్రకారం ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ వచ్చిన మూడు నెలల్లోపు క్లబ్ హౌస్‌ను రెసిడెంట్స్ అసోసియేషన్‌కు అప్పగించాలి. కానీ.. చాలా మంది బిల్డర్లు రెరా నిబంధనలను బేఖాతరు చేస్తున్నారు. అక్రమ మార్గంలో క్లబ్ హౌస్‌లను థర్డ్ పార్టీకి లీజుకు లేదా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో న్యాయం చేయండంటూ నివాసిత సంఘాలు రెరాను ఆశ్రయిస్తున్నాయి.

డెవలపర్ల జేబుల్లోకి డబ్బులు..

జీఓ 168 ప్రకారం వంద యూనిట్లకు పైగా ఉన్న రెసిడెన్షియల్ ప్రాజెక్ట్‌లలో వసతుల కోసం మొత్తం బిల్టప్ ఏరియాలో 3 శాతం లేదా 50 వేల చ.అ. (ఏది తక్కువైతే అది) కేటాయించాలి. క్లబ్ హౌస్‌లో స్విమ్మింగ్ పూల్, జిమ్, యోగా, బాంక్వెట్ హాల్, సూపర్ మార్కెట్ వంటి వసతులు ఉంటాయి. క్లబ్ హౌస్‌ను నివాసిత సంఘానికి రిజిస్ట్రేషన్ చేసి యాజమాన్య హక్కులను అప్పజెప్పాలి. కానీ.. డెవలపర్లు తెలివిగా నివాసితులకు కేవలం క్లబ్ హౌస్‌లోని వసతులను వినియోగించుకునేందుకు సభ్యత్వం ఇచ్చి సరిపెట్టేస్తున్నారు. క్లబ్ హౌస్‌ను థర్డ్ పార్టీకి లీజుకు లేదా విక్రయిస్తున్నారు. ఆయా సొమ్మును డెవలపర్లే జేబులో వేసుకుంటున్నారు.

ఒకటే క్లబ్ హౌస్ రెండు ప్రాజెక్ట్‌లకు..

రెరా సెక్షన్ 17 ప్రకారం ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) వచ్చిన మూడు నెలల్లోపు డెవలపర్లు వసతుల బ్లాక్‌ను రెసిడెంట్స్ అసోసియేషన్‌కు చట్టబద్ధంగా అప్పగించాలని స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నప్పటికీ వారు వీటిని అతిక్రమిస్తున్నారు. క్లబ్ హౌస్ బ్లాక్‌ను థర్డ్ పార్టీకి లీజుకు లేదా విక్రయిస్తున్నారు. కొందరు బిల్డర్లు క్లబ్ హౌస్‌ను ప్రాజెక్ట్‌లో ఎక్కడైనా నిర్మించే అవకాశం ఉన్నప్పటికీ.. థర్డ్ పార్టీకి వినియోగించేందుకు వీలుగా ఉండేలా ప్రధాన మార్గానికి యాక్సెస్ ఉన్న ప్రాంతంలోనే నిర్మిస్తున్నారు. ఒకే క్లబ్ హౌస్‌ను రెండు ప్రాజెక్ట్‌లకు కలిపి వాడుతున్నారు.

నిర్వహణ వ్యయం కార్పస్ ఫండ్ నుంచే..

అపార్ట్‌మెంట్ కొనుగోలు సమయంలో కస్టమర్ల నుంచి వసూలు చేసే కార్పస్ ఫండ్‌ను బిల్డర్లు సొంతానికి వినియోగించుకోకూడదు. ఆ సొమ్మును వడ్డీతో సహా అసోసియేషన్‌కు ప్రత్యేకంగా ఎస్క్రో ఖాతా తెరిచి జమ చేయాలి. క్లబ్ హౌస్‌లో రెస్టారెంట్, బార్ వంటి వాణిజ్య సముదాయాలను నిర్మించి, వాటిని థర్డ్ పార్టీకి లీజుకు లేదా విక్రయిస్తున్నారు. క్లబ్ హౌస్ నిర్వహణ వ్యయాన్ని కూడా డెవలపర్లు అక్రమంగా కస్టమర్ల నుంచి వసూలు చేసిన కార్పస్ ఫండ్ నుంచే ఖర్చు చేస్తున్నారు.

> **క్లబ్ హౌస్ యజమానుల హక్కు**
>
> 
>
> ఇంటి యజమానులకు సౌకర్యాలను వినియోగించుకునే హక్కు ఉంటుంది. డెవలపర్లు కస్టమర్లకు ఇచ్చిన హామీలను తప్పనిసరిగా పూర్తి చేయాలి. వ్యాపార ప్రయోజనాల కోసం క్లబ్ హౌస్ స్థలాలను వినియోగించడం చట్ట విరుద్ధం. ఈ తరహా కేసులలో కస్టమర్లకు న్యాయం జరిగేలా రెరా తగిన చర్యలు తీసుకుంటుంది.
>
> – కె.శ్రీనివాస రావు, టీజీ- రెరా సభ్యుడు

హజ్ యాత్రికులకు ఏ లోటూ రానీయం

రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ సయ్యద్ అఫ్జల్ బియబానీ



సాక్షి, సిటీబ్యూరో: హజ్ యాత్రకు ఏర్పాట్ల ప్రక్రియ ప్రారంభమైంది. యాత్రికులకు ఏ లోటూ రాకుండా అన్ని రకాల వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ మౌలానా సయ్యద్ అఫ్జల్ బియబానీ ఖుస్రో పాషా అన్నారు. మంగళవారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల హజ్ సొసైటీలతో నాంపల్లిలోని హజ్‌హౌస్‌లో జరిగిన సమన్వయ సమావేశం అనంతరం విలేకరుల ఆయన మాట్లాడారు. 2025 హజ్ యాత్ర కోసం ఏర్పాట్లు చేశామన్నారు. 150 మంది యాత్రికులకు ఒక హజ్ సేవకుడు వెళ్తున్నట్లు చెప్పారు. జిల్లా సొసైటీలు యాత్రికులను షెడ్యూల్ ప్రకారం నాంపల్లి హజ్ హౌస్‌కు పంపించాలని ఆయన సూచించారు. హజ్ ఆరాధనలతో పాటు మక్కా, మదీనా నగరాల్లో వసతులు, ప్రయాణ వివరాలు, లగేజ్ తదితర విషయాలు సొసైటీ సభ్యులు యాత్రికులకు అవగాహన కల్పించాలన్నారు.



ఆశల రేషన్!

సంక్రాంతి తర్వాత నయా కాంతులేనా!

సాక్షి, సిటీబ్యూరో: 'సంక్రాంతి పండగ తర్వాత కొత్త రేషన్ కార్డుల ప్రక్రియను ప్రారంభిస్తాం. ప్రస్తుతం ఉన్న కార్డుల స్థానంలో స్మార్ట్ కార్డులు జారీ చేస్తాం'.. అసెంబ్లీ సాక్షిగా పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ ఏడాది ఆరంభంలో నిర్వహించిన ప్రజాపాలనలో పేద కుటుంబాలు ఆరు గ్యారంటీల పథకాలతో పాటు ప్రత్యేకంగా రేషన్ కార్డుల కోసం భారీ సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నాయి. అయినా ఇప్పటి వరకు ఎలాంటి కదలిక లేకుండా పోయింది. వర్షాకాల అసెంబ్లీ సమావేశాల్లో సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కొత్త రేషన్ కార్డుల జారీని నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తామని ప్రకటించారు. అయితే.. అప్పట్లో లోక్‌సభ ఎన్నికల కోడ్ వచ్చింది.. ముగిసింది. కానీ.. ప్రక్రియ మాత్రం ప్రారంభం కాలేదు. పేదలు మాత్రం కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు మీ సేవ చుట్టూ చక్కర్లు కొడుతూనే ఉన్నారు. తాజాగా ప్రభుత్వం మరోసారి హామీ ఇవ్వడంతో కొత్త రేషన్ కార్డుల ప్రక్రియపై ఆశలు చిగురిస్తున్నాయి.

ఆన్‌లైన్ ద్వారానే..

- పౌరసరఫరాల శాఖ సంస్కరణలో భాగంగా ఆన్‌లైన్ ద్వారా సేవలు ప్రారంభించింది. కొత్త రేషన్ కార్డుల కోసం ఆన్‌లైన్ లాగిన్ ద్వారానే దరఖాస్తులను స్వీకరించి కొత్త కార్డులను మంజూరు చేస్తూ వస్తోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం ఉమ్మడి రాష్ట్రంలో మంజూరు చేసిన తెల్ల రేషన్ కార్డులను రద్దు చేసి వాటి స్థానంలో ఆహార భద్రత కార్డులుగా మార్పు చేసింది. కొత్త కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అంటూ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించి కొద్దికాలం జారీ ప్రక్రియ కొనసాగించింది.
- నాలుగేళ్లగా కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తుల చేసుకునే పౌరసరఫరా శాఖ వెబ్‌సైట్ ఆన్‌లైన్ లాగిన్‌ను నిలిపివేసి అప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల్లో కేవలం 40 శాతం మాత్రమే క్లియర్ చేసి మిగతా దరఖాస్తులను తిరస్కరించింది. అప్పటి నుంచి కొత్త కార్డుల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కూడా లేకుండాపోయింది. తాజాగా ఆ లాగిన్ పునఃప్రారంభమై గ్రీన్ సిగ్నల్ లభిస్తే దరఖాస్తుల ప్రక్రియ ముందుకు సాగే అవకాశాలు కనిపిస్తున్నాయి

కొత్త రేషన్ కార్డులపై పేదల ఆశలు

- ఏడాదిగా మీ సేవ చుట్టూ చక్కర్లు
- అంతకుముందు ఆరేళ్లూ ఇదే దుస్థితి
- గ్రేటర్‌లో 10 లక్షలకుపైగా కుటుంబాల ఎదురుచూపులు




మొత్తం 40 లక్షల కుటుంబాలు..

నగరంలో సుమారు 10 లక్షల కుటుంబాలకుపైగా రేషన్ కార్డులు లేవు. సుమారు కోటిన్నర జనాభా ఉన్న భాగ్యనగరంలో దాదాపు 40 లక్షల కుటుంబాలు ఉన్నాయి. అందులో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న (బీపీఎల్) కుటుంబాలు 27.21 లక్షల వరకు ఉన్నట్లు అంచనా. ప్రస్తుతం హైదరాబాద్-రంగారెడ్డి జిల్లా, మేడ్చల్ జిల్లాలో 17.21 లక్ష కుటుంబాలు మాత్రమే తెల్ల రేషన్ కార్డులు కలిగి ఉన్నాయి. మిగతా కుటుంబాలు రేషన్ కార్డులు లేక వివిధ సంక్షేమ పథకాల వర్తింపు కోసం తల్లడిల్లుతున్నాయి.

> **పెండింగ్‌లో 5.73 లక్షల దరఖాస్తులు**
>
> ఇప్పటికే సుమారు 5.73 లక్షల కుటుంబాలు కొత్త కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ప్రజా పాలనా కార్యక్రమం నిర్వహించగా సుమారు 24 లక్షల 74 వేల 325 కుటుంబాలు వివిధ పథకాల వర్తింపు కోసం దరఖాస్తు చేసుకున్నాయి. అందులో అయిదు గ్యారంటీల కోసం సుమారు 19,01,256 కుటుంబాలు, రేషన్ కార్డు కోసం 5,73,069 కుటుంబాలు దరఖాస్తు చేసుకున్నట్లు అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

శివారులో 7.. సిటీలో 11.9

- పడిపోతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు
- వణికిపోతున్న నగర వాసులు



కనిష్ట ఉష్ణోగ్రతలు ఇలా

ప్రాంతం	డిగ్రీలు
పటాన్‌చెరు	7
రాజేంద్రనగర్	8.5
దుండిగల్	11.5
హయత్‌నగర్	12.6
హకీంపేట	12.7

సాక్షి, సిటీబ్యూరో: నగరాన్ని చలి వణికిస్తోంది. రాత్రి పూట కనిష్ట ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయి. తెల్లవారుజామున పొగ మంచు రోడ్లను కమ్మేస్తోంది. రాత్రుళ్లు చలి తీవ్రత మరింత పెరుగుతోంది. శివారులో అత్యల్పంగా కనిష్ట ఉష్ణోగ్రత 7 డిగ్రీలకు పడిపోయింది. నగరంలో మాత్రం కనిష్ట ఉష్ణోగ్రత 11.9 డిగ్రీలు నమోదైంది. సగటు కంటే 4 నుంచి 5 డిగ్రీల వరకు మైనస్‌లో పడిపోయింది.

మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యమివ్వండి

- యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలి
- జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం చేపట్టిన పనుల్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సీఈ భాస్కర్ రెడ్డి, డిప్యూటీ సీఈ వనసరెడ్డిలతో కలిసి ఇంజినీరింగ్ పనులపై జోన్ల వారీగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో ప్రజా సదుపాయాల దృష్ట్యా చేపట్టిన పనుల్ని నిర్దేశిత కాల వ్యవధిలో పూర్తి చేయాలని ఆదేశించారు. సమస్యాత్మకంగా ఉన్న 141 వాటర్ లాగింగ్ పాయింట్లను తగ్గించేందుకు శాశ్వత నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేసి, వచ్చే వర్షాకాలంలోగా సమస్యల్లేకుండా పనులు పూర్తి చేయాలన్నారు. 125 జంక్షన్ల అభివృద్ధి పనులకు సంబంధించి భూసేకరణ, యుటిలిటీ షిఫ్టింగ్ సమస్యల పరిష్కారానికి ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, ఎలక్ట్రికల్, అడ్వర్టైజ్మెంట్, యూబీడీ విభాగాల అధికారులతో అంతర్గత కమిటీ వేసినట్లు తెలిపారు. కాన్ఫరెన్స్‌లో జోనల్ ఎస్.ఈలు చిన్నారెడ్డి, రత్నాకర్, మహేష్ రెడ్డి, నిత్యానంద్, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జూలైకి ముందున్న నిర్మాణాల జోలికెళ్లం

ఆ తర్వాత నిర్మించిన అక్రమ కట్టడాలనే కూల్చివేస్తాం

- స్పష్టం చేసిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్
- కాముని చెరువు, మైసమ్మ చెరువుల పరిశీలన

మోతీనగర్: హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) ఏ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటుందనే అంశంపై కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టత ఇచ్చారు. ఈ ఏడాది జూలైలో హైడ్రా ఏర్పాటైందని, ఆ తర్వాత నిర్మించిన అక్రమ నిర్మాణాలపైనే చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. దానికి ముందు నిర్మించిన నివాసాలు సక్రమమైనా, అక్రమమైనా వాటి జోలికి హైడ్రా వెళ్లదని పునరుద్ఘాటించారు. అయితే.. ఇది వాణిజ్య సముదాయాలకు వర్తించదన్నారు. మంగళవారం మూసాపేటలోని కాముని చెరువు, మైసమ్మ చెరువులను హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. కాముని చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దటానికి ప్రణాళికలు సిద్ధమవుతున్న నేపథ్యంలో అక్కడ ఉన్న అవాంతరాలను తొలగించటానికి హైడ్రా సహకారం కావాలని హెచ్‌ఎండీఏ కోరింది. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ.. 'కాముని చెరువులో నిర్మాణ వ్యర్థాలతో పాటు మట్టిని నింపి కొంతమంది ఆక్రమిస్తున్నారు. అదేమంటే పట్టా భూములని చెబుతున్నారు. ఈ చెరువులకు అనుసంధానంగా ఉండే కాలువల కబ్జాపైనా ఫిర్యాదులు అందడంలో క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నాం. కాముని చెరువులో మట్టి పోసిన వారిని వదిలి పెట్టేది లేదు. నిర్మాణాలు చేపడితే కూల్చివేస్తాం. చెరువు కబ్జాపై స్థానికులు సంఘటితమై ఫిర్యాదు చేయటమే కాకుండా చెరువును కాపాడటంలో ప్రభుత్వ యంత్రాంగానికి సహకరిస్తామని ముందుకు వచ్చారు.

పేదల ఇళ్ల జోలికి వెళ్లం. భవిష్యత్తులో చెరువులు, కుంటలు, నాలాల్లో అక్రమంగా నిర్మించే ఏ కట్టడమైనా కూల్చివేస్తాం. ఇప్పటికే ఈ చెరువులను ఆనుకుని కట్టిన నిర్మాణాలను కదిలించబోం. సోషల్ మీడియాలో వస్తున్న వదంతులు నమ్మి, అఘాయిత్యాలకు పాల్పడవద్దు' అని స్పష్టం చేశారు. చెరువులు, కుంటలు, నాలాలు కబ్జా కాకుండా స్థానికులే కాపాడుకోవాలని రంగనాథ్ సూచించారు. కాముని చెరువు నుంచి మైసమ్మ చెరువు వరకు వరద కాలువ పనులు పూర్తి కాకుండా అక్కడ ఓ భవన నిర్మాణ సంస్థ నిర్మాణాలు చేపట్టింది. దీన్ని గమనించిన రంగనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 17 మీటర్ల వెడల్పుతో నిర్మించతలపెట్టిన వరద నీటి కాలువ పనులను తక్షణం పూర్తి చేయాలని నిర్మాణ సంస్థకు సూచించారు. వరద కాలువను మళ్లించటం వల్ల దిగువన ఉన్న సఫ్దర్‌నగర్, రాజీవ్ గాంధీనగర్ బస్తీలు వర్షాకాలంలో మునిగి పోతున్నాయని స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. వచ్చే వర్షాకాలానికి ఇబ్బంది లేకుండా కాముని చెరువు, మైసమ్మ చెరువు మధ్య ఉన్న వరద కాలువ నిర్మాణ పనులను పూర్తి చేసేలా చూడాలని అధికారులను హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశించారు.



కాముని చెరువును పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఇతర అధికారులు

బుకాయించబోయారు.. బుక్కయ్యారు!

భవనంపై నుంచి పడి వాచ్‌మన్ దుర్మరణం

- మృతదేహాన్ని చెత్త కుప్పల్లో పడేసిన భవన యజమానులు
- పన్నాగం బెడిసికొట్టి అడ్డంగా దొరికిపోయిన నిందితులు



యాకయ్య మృతదేహం

కంటోన్మెంట్: నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి పడి వాచ్‌మన్ మృతి చెందగా.. యజమానులు మృతదేహాన్ని సమీపంలోని చెత్త కుప్పల్లో పడేసిన ఘటన బోయిన్‌పల్లి పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీ నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ముంజంపల్లి యాకయ్య (55), సావిత్రి దంపతులు ఉపాధి కోసం నగరానికి వచ్చి అంజయ్య నగర్‌లో నివాసముంటున్నారు. యాకయ్య మనోవికాస్ నగర్‌లో నిర్మాణంలో ఉన్న ఓ భవనం వద్ద వాచ్‌మన్‌గా పని చేస్తున్నారు. సోమవారం సాయంత్రం క్యూరింగ్ నిమిత్తం నీళ్లు పట్టే క్రమంలో ప్రమాదవశాత్తు భవనంపై నుంచి పడి జారిపడి ఆయన మృతి చెందారు. కొద్దిసేపటి తర్వాత గమనించిన భవన యజమాని జహంగీర్ కుటుంబ సభ్యులు ఎవరికీ అనుమానం రాకుండా సమీపంలోని చెట్ల పొదల్లో యాకయ్య మృతదేహాన్ని పడేశారు. మృతుడి భార్య యజమానులను ఆరా తీసినప్పటికీ, తమకేమ తెలియదని బుకాయించారు. అంజయ్యనగర్ దారిలో వెళ్లే వాహనదారులు, యాకయ్య మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి వివరాలు కనుక్కున్న పోలీసులు, భవన యజమానిపై అనుమానం వచ్చి తమదైన శైలిలో విచారించడంతో వాస్తవాన్ని అంగీకరించారు. భవనం వద్ద ఏర్పాటు చేసిన సీసీ టీవీ కెమెరాలో నిక్షిప్తం అయిన దృశ్యాలను పోలీసులు పరిశీలించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఎల్‌బీనగర్ జంక్షన్‌లో కళాకృతులు

> **రూ. 1.50 కోట్లతో సుందరీకరణ**
>
> - టెండర్లు పిలిచిన జీహెచ్‌ఎంసీ
> - త్వరలో పనులు ప్రారంభం

సాక్షి, సిటీబ్యూరో: ఇప్పటికే పలు ఫ్లై ఓవర్లు, సెంట్రల్ మీడియన్లు, జంక్షన్లు తదితర ప్రాంతాలను వివిధ కళాకృతులు, థీమ్ పెయింటింగులతో సుందరీకరిస్తూ అభివృద్ధి చేస్తున్న జీహెచ్‌ఎంసీ.. ఎల్‌బీనగర్ జంక్షన్‌ను విభిన్నంగా తీర్చిదిద్దేందుకు సిద్ధమైంది. గ్రేటర్‌లో అత్యధిక రద్దీ ప్రాంతాల్లో ఒకటైన ఎల్‌బీనగర్ జంక్షన్‌ను పాదచారులకు సదుపాయంగా మార్చడంతో పాటు చూడగానే ప్రత్యేక ఆకర్షణగా ఆకట్టుకునేందుకు వివిధ పనులను చేపట్టనుంది. జంక్షన్‌లోని ఫ్లై ఓవర్లకు చెందిన ఎనిమిది స్తంభాల చుట్టూ ప్రత్యేక శిల్పాలను ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యేక థీమ్‌తో బ్యూటిఫికేషన్ తదితర పనులు చేయనుంది. ఎండా వానలకు దెబ్బ తినకుండా ఉండేందుకు వెదర్‌ప్రూఫ్ మెటీరియల్ వినియోగించనుంది. ఏపీ వైపు ప్రయాణాలు సాగించే వారు, సికింద్రాబాద్, ఉప్పల్ తదితర ప్రాంతాల నుంచి శంషాబాద్ విమానాశ్రయం వైపు ఎక్కువ మంది ఈ మార్గం నుంచే వెళ్తుండటం తెలిసిందే. అధిక రద్దీ ఉండే ఈ జంక్షన్‌ను ప్రత్యేకంగా తీర్చిదిద్దేందుకు రూ. 1.50 కోట్ల అంచనా వ్యయంతో పనులకు సిద్ధమై, టెండర్లు పిలిచింది. త్వరలోనే టెండరు ప్రక్రియ పూర్తిచేసి పనులు ప్రారంభించనున్నారు.

రూ. 150 కోట్లతో 225 ప్రాంతాల్లో..

వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చే సందర్శకులకు కనువిందు చేసేలా సిటీ ఇమేజ్‌ను పెంచేందుకు దాదాపు 225 ప్రాంతాల్లో పనులు చేసేందుకు సిద్ధమైన జీహెచ్‌ఎంసీ ఇందుకోసం రూ.150 కోట్లు ఖర్చు చేసేందుకు ప్రణాళికలు రూపొందించింది. వాటిలో ఇప్పటికే రూ.5 కోట్లకు పైగా వ్యయంతో 15 పనులు పూర్తయ్యాయి. మరికొన్ని పురోగతిలో ఉన్నాయి. ఇంకా కొన్ని ప్రారంభం కావాల్సి ఉన్నట్లు అధికారులు తెలిపారు.

అవగాహనతోనే సైబర్ నేరాల నియంత్రణ



సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి

చందానగర్: అవగాహనతోనే సైబర్ నేరాలను నియంత్రించవచ్చని సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి పేర్కొన్నారు. మంగళవారం గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రాజెక్ట్ 'ప్రొటెక్ట్' (ప్రివెంటింగ్ రిస్క్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ కొలాబొరేషన్స్ అండ్ ట్రెనింగ్) కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. 2016 నుంచి 2024 వరకు సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో సుమారు రూ.700 కోట్లు సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లాయన్నారు. ఈ సంవత్సరం రూ.74 కోట్లు రికవరీ చేశామని తెలిపారు. సోషల్ మీడియా ద్వారా సైబర్ నేరాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సైబర్ నేరం జరిగిన వెంటనే 1930కి డయల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ వారియర్స్, ఎస్సీఎస్సీ, సంగమిత్ర, దిల్‌సే వివిధ స్వచ్ఛంద సంస్థల వలంటీర్లతో ఈ నెల 18 నుంచి సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు ప్రారంభిస్తున్నామన్నారు. అనంతరం ప్రాజెక్ట్ 'ప్రొటెక్ట్' పోస్టర్, వలంటీర్ల ప్రొటెక్ట్ టీ షర్టులను ఆవిష్కరించారు. సైబర్ క్రైం డీసీపీ శ్రీబాల, ఎస్సీఎస్సీ సెక్రటరీ జనరల్ రమేష్ కాజా, సీఈఓ నవీద్ ఖాన్, ఉమెన్ అండ్ చైల్డ్ భద్రత వింగ్ డీసీపీ సృజన, మాదాపూర్ డీసీపీ వినీత్, ఏసీపీలు రవీందర్‌రెడ్డి, చంద్రకాంత్, సైబర్ ఎక్స్‌పర్ట్ ప్రవీణ్ తంగళ, భాను మూర్తి తదితరులు పాల్గొన్నారు.



ప్రాజెక్ట్ 'ప్రొటెక్ట్' పోస్టర్ ఆవిష్కరిస్తున్న అవినాష్ మహంతి తదితరులు

అక్రమ మద్యంపై ఆబ్కారీ ఉక్కుపాదం

- డిసెంబర్ 31 వేడుకలపై ఎక్సైజ్ శాఖ దృష్టి
- డ్రగ్స్, గంజాయి, అక్రమ మద్యం కట్టడికి వ్యూహాలు
- నగరానికి రవాణా అవుతున్న గంజాయి స్వాధీనం



సాక్షి, సిటీబ్యూరో: డిసెంబర్ 31 వేడుకలను దృష్టిలో ఉంచుకొని ఇతర రాష్ట్రాల నుంచి నగరానికి తరలిస్తోన్న అక్రమ మద్యం, డ్రగ్స్, గంజాయి తదితర మత్తుపదార్థాల సరఫరాపై ఎక్సైజ్ శాఖ ఉక్కుపాదం మోపింది. నగరంలో దాడులను ఉధృతం చేసింది. రెండు, మూడు రోజులుగా వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో మధ్య ప్రదేశ్, ఢిల్లీ, గోవా తదితర రాష్ట్రాలకు చెందిన సుమారు 100 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.2 లక్షల వరకు ఉంటుందని అంచనా. అలాగే వివిధ ప్రాంతాలకు చెందిన నిందితులపైన కేసులు నమోదు చేసి అరెస్ట్ చేశారు. వాహనాలు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

అతిపెద్ద విజయం..

న్యూఇయర్ వేడుకలను దృష్టిలో ఉంచుకొని డ్రగ్స్, గంజాయి విక్రయాలకు పాల్పడే ముఠాల పైన కూడా ఎక్సైజ్ అధికారులు సీరియస్‌గా దృష్టి సారించారు. ఈ దిశగా ధూల్‌పేట్‌ను జల్లెడ పట్టారు. చాలా కాలంగా ఇటు పోలీసులకు, అటు ఎక్సైజ్ బృందాలకు చిక్కకుండా పెద్ద ఎత్తున గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న ముఠా నాయకురాలు అంగూరి బాయిని ఇటీవల అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఆమెతో పాటు కుటుంబ సభ్యులను కూడా ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. దీంతో ఆపరేషన్ ధూల్‌పేట్‌లో భాగంగా అతి పెద్ద విజయాన్ని నమోదు చేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ అంజిరెడ్డి నేతృత్వంలో ఎక్సైజ్ పోలీసులు వ్యూహాత్మకంగా దాడులు నిర్వహిస్తూ ధూల్‌పేట్‌లో ఎక్కడికక్కడ కట్టడి చేయడం గమనార్హం. గంజాయి డాన్‌గా కొన్ని సంవత్సరాలుగా చెలామణి అవుతున్న అంగూరి బాయి పోలీసులకు చిక్కకుండా తప్పించుకొని తిరుగుతోంది. గంజాయి వ్యాపారాన్ని తన గుప్పెట్లో పెట్టుకొని వేల మంది జీవితాలను చిన్నాభిన్నం చేస్తుందని అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు.

21 కిలోల గంజాయి స్వాధీనం

మరోవైపు టాస్క్‌ఫోర్స్ అడిషనల్ ఎస్పీ భాస్కర్ నేతృత్వంలో డీఎస్పీ తుల శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు నిర్వహించిన దాడుల్లో ధూల్‌పేట్‌కు గంజాయిని తరలిస్తున్న ముఠా నుంచి 21 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురు నిందితులు లకాన్ సింగ్, తండ్రి, ఇంద్రేష్ సింగ్, ఆదిత్య సింగ్, శుభం సింగ్, జలేంద్ర హరిజన్, సురేష్ హరిజన్‌లను అరెస్ట్ చేశారు. నిందితుడు లకాన్ సింగ్ గంజాయి అక్రమ వ్యాపారాన్ని తన ప్రధాన ఆదాయంగా మలచుకుని జీవనం సాగిస్తున్నాడు. ఇతడు గతంలో పలు కేసుల్లో నిందితుడు. మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్‌లో ఇతడిపై అర డజనుకు పైగా కేసులు ఉన్నాయి. అందులో హత్యా యత్నం, దొమ్మి కేసులుండగా ఇతనిపై రౌడీషీట్ కూడా నమోదైంది. ఇటీవలి కాలంలో అరెస్టై బెయిల్‌పై 2 నెలల క్రితమే బయటకు వచ్చాడు. శుభంసింగ్ అనే మరో నిందితుడు అయ్యప్పమాల ధారణతో పోలీసుల దృష్టి మళ్లించి గంజాయి వ్యాపారాన్ని నిరాటంకంగా సాగించడం గమనార్హం. ఇతడు కూడా పలు నేరాల్లో నిందితుడు. 'గంజాయి డాన్' అంగూరి బాయికి మేనల్లుడు అని పోలీసులు తెలిపారు.

యూట్యూబ్ చానల్ ఉద్యోగినిపై లైంగికదాడి

- ముగ్గురిపై కేసు నమోదు

బంజారాహిల్స్: ఆధ్యాత్మిక ప్రసారాలు చేసే ఓ యూట్యూబ్ చానల్‌లో పనిచేస్తున్న యువతిని పెళ్లిచేసుకుంటానని నమ్మించి లైంగిక దాడికి పాల్పడిన నిందితుడితో పాటు మరో ఇద్దరిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే..బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–10లో ఆధ్యాత్మిక విశేషాలు బోధించే యూట్యూబ్ చానల్‌లో ఓ యువతి 2021 నుంచి రిసెప్షనిస్ట్‌గా పనిచేస్తుంది. ఇదే యూట్యూబ్ చానల్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న నవకాంత్ 2022 అక్టోబర్‌లో యువతిని నమ్మించి ఓ గెస్ట్ హౌజ్‌కు తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవరికీ చెప్పవద్దని, పెళ్లి చేసుకుంటానని నమ్మబలికాడు. అనంతరం యూట్యూబ్ కార్యాలయంలోనే చాలా మార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. పెళ్లి విషయమై నిలదీస్తే పట్టించుకోలేదు. గత జులైలో నవకాంత్ మరో యువతిని పెళ్లి చేసుకున్నట్లుగా తెలియడంతో ఆమె ఇదేమిటని నిలదీసింది. మాట్లాడుకుందామని నవకాంత్ తన స్నేహితుడు నటరాజ్‌ను తీసుకుని బాధితురాలితో కలిసి ఇటీవల కేబీఆర్ పార్కు పార్కింగ్ ప్లేస్‌కు తీసుకువచ్చాడు. ఇదే విషయంపై ముగ్గురి మధ్య తీవ్ర ఘర్షణ జరిగింది. ఆమెను అక్కడే వదిలేసి ఇద్దరూ జారుకున్నారు. రజిత అనే యువతి మధ్యలో కల్పించుకుంటూ తన అంతుచూస్తానంటూ బెదిరించసాగింది. పోలీసులకు ఫిర్యాదు చేస్తే నీ నగ్న ఫోటోలు యూట్యూబ్‌లో వైరల్ చేస్తామంటూ బెదిరించారు. దీంతో తాను మోసపోయాయనని తెలుసుకుని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. నవకాంత్, నటరాజ్, రజితలపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లలో ఐపీసీ సెక్షన్ 376, 341, 506, 323, రెడ్‌విత్ 34 కింద కేసు నమోదైంది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఓఆర్ఆర్‌పై రూ.20 వేలు పడేస్తున్నానంటూ రీల్స్

- యువకుడిపై కేసు నమోదు



ఓఆర్ఆర్‌పై నోట్ల కట్టను పడేస్తున్న భానుచందర్

ఘట్‌కేసర్: సోషల్ మీడియాలో వైరల్ అయ్యేందుకు ఓ యూట్యూబర్ 'మనీ హంటింగ్ చాలెంజ్' పేరిట రీల్స్ చేసి రెచ్చగొడుతున్నాడు. ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీఐ పరుశురాం తెలిపిన వివరాల ప్రకారం..నగరంలోని బాలానగర్‌కు చెందిన భానుచందర్ యూట్యూబర్. ఘట్‌కేసర్ ఓఆర్ఆర్ ఎగ్జిట్ 9 వద్ద మనీ హంటింగ్ పేరిట రీల్ షూట్ చేసి చాలెంజ్ చేశాడు. ఘట్‌కేసర్ వద్ద ఓఆర్ఆర్‌పై రూ.20 వేలు పడేస్తున్నానని, ఎవరైనా వచ్చి తీసుకోవచ్చని రెండు వందల నోట్లు గల ఓ కట్టను చెట్లల్లోకి విసిరేస్తున్నట్లు రీల్స్‌లో చెప్పాడు. ఈ రీల్స్‌ను ట్విట్టర్, సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేశాడు. వీడియోను వీక్షించిన వారు అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తప్పుడు సమాచారంతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాడని ఓఆర్ఆర్ పెట్రోలింగ్ సిబ్బంది ఘట్‌కేసర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జాతీయ రహదారుల చట్టం అనుసరించి అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా భానుచందర్‌ను ఘట్‌కేసర్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది.

అక్రమ మద్యం పట్టివేత

సాక్షి, సిటీబ్యూరో: ఢిల్లీ నుంచి ట్రెయిన్‌లో మద్యం బాటిళ్లను హైదరాబాద్‌కు తరలిస్తున్నారనే సమాచారం మేరకు ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ పోలీసులు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో మహబూబ్‌నగర్‌కు చెందిన రాజశేఖర్‌రెడ్డి అనే వ్యక్తి నుంచి 35 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.60 వేలు ఉంటుందని అంచనా. ఢిల్లీలో తక్కువ ధరకు మద్యం కొనుగోలు చేసి తెలంగాణలో విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు.

అసెంబ్లీ ముట్టడికి యత్నం

- పీడీఎస్‌యూ నేతలు అరెస్టు



ఆందోళనకారులను అరెస్టు చేసి తరలిస్తున్న దృశ్యం

నాంపల్లి: విద్యారంగ సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నేతలు, కార్యకర్తలు మూకుమ్మడిగా అసెంబ్లీ ముట్టడికి యత్నించారు. అసెంబ్లీ గేటు దగ్గరకు వెళ్లిన పీడీఎస్‌యూ నేతలను పోలీసులు ఒక్కసారిగా అడ్డుకున్నారు. లోనికి దూసుకెళ్లకుండా నిలువరించారు. దూసుకువచ్చిన ఆందోళనకారులను అరెస్టు చేసి వారిని అక్కడి నుంచి తరలించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ వద్ద పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. దీంతో అక్కడ కాసేపు తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. అనంతరం పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు పెద్దింటి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ మాట్లాడుతూ... రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడచినా విద్యా రంగ అభివృద్ధికి, పేద విద్యార్థుల అభ్యున్నతికి ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. విద్యారంగాన్ని వ్యాపారమయం చేస్తూ ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు విచ్చలవిడిగా లక్షల రూపాయల ఫీజుల వసూళ్లకు పాల్పడుతుంటే అరికట్టకుండా..యాజమాన్యాల ఫీజుల దోపిడీకి వత్తాసు పలకడం సిగ్గుచేటని అన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థల్లో వందలాది మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా వాటిపై చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో అసెంబ్లీలో స్కాలర్‌షిప్, ఫీజు రీఎంబర్స్‌మెంట్ పట్ల తమ వైఖరిని తెలియజేయాలని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంపై అసెంబ్లీలో చర్చించి సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే భవిష్యత్తులో జరిగే పరిణామాలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం బాధ్యత వహించాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నరసింహారావు, ఎస్.అనిల్, ఎం.నరేందర్, భాస్కర్ రాష్ట్ర సహాయ కార్యదర్శులు కాంపాటి పృథ్వీ, సాయి, కోశాధికారి సురేష్, రాష్ట్ర నాయకులు వి.వెంకటేష్, రాకేష్, సీతారాం, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీతేజను పరామర్శించిన నగర పోలీస్ కమిషనర్



కిమ్స్ ఆస్పత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న సీపీ ఆనంద్

రాంగోపాల్‌పేట్: సంధ్యా థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడి సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజను నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ పరామర్శించారు. మంగళవారం వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినాతో కలిసి ఆయన శ్రీతేజను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీతేజ కోలుకోవడానికి ఇంకా సమయం పట్టొచ్చని వైద్యులు తెలిపారని, ప్రభుత్వ పరంగా శ్రీతేజ ఆరోగ్యంపై ఆస్పత్రి యాజమాన్యం, డాక్టర్లతో ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తున్నామని చెప్పారు. శ్రీతేజ చికిత్సకు ప్రభుత్వ పరంగా పూర్తి సహకారం అందిస్తున్నామని తెలిపారు. త్వరలోనే బాలుడు పూర్తి ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు.

తెలంగాణ యూనివర్సిటీ చట్టాలను మార్చండి

- ఉద్యోగాల పర్మనెంట్‌కు కాంట్రాక్టు అధ్యాపకుల డిమాండ్

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీ చట్టాలను మార్చాలని తెలంగాణ ఆల్ వర్సిటీల కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ చైర్మన్ డా.రామేశ్వర్‌రావు, వర్కింగ్ చైర్మన్ డా.శ్రీధర్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం రాష్ట్ర ఉన్నత విద్య మండలి కార్యాలయం ఎదుట కాంట్రాక్టు అధ్యాపకులను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత వర్సిటీల చట్టాలను మార్చకపోవడం వల్ల అన్ని వర్గాలకు అన్యాయం జరుగుతోందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో యూనివర్సిటీ చట్టాలను తెలంగాణలో రద్దు చేసి రాష్ట్రానికి కొత్త చట్టాలను చేయాలన్నారు. ఉమ్మడి ఏపీ చట్టాల ద్వారా కాంట్రాక్టు అధ్యాపకుల ఉద్యోగాలను యూజీసీ నిబంధనల మేరకు పర్మనెంట్ చేయలేరన్నారు. తెలంగాణకు వర్సిటీల చట్టాన్ని రూపొందించి రాష్ట్ర నిబంధనల మేరకు అబ్జార్షన్ ద్వారా కాంట్రాక్టు అధ్యాపకులను పర్మనెంట్ చేయవచ్చు అన్నారు. అనంతరం ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ.బాలకృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ ప్రొ.ఇటిక్యాల పురుషోత్తంలకు వినతి పత్రాలు అందచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ కో చైర్మన్ డా.వెంకటేశ్వర్లు, డా.ఉదయ్, హర్షిత, ఆదిత్య, మూర్తి తదితరులు పాల్గొన్నారు.



బాలకృష్ణారెడ్డికి వినతి పత్రం అందచేస్తున్న అధ్యాపకులు

వినతులు స్వీకరించిన ఏకసభ్య కమిషన్

సాక్షి, సిటీబ్యూరో: ఎస్సీ కులాల ఉప వర్గీకరణ కోసం బహిరంగ విచారణ నిర్వహించి వివిధ ఎస్సీ కులాల నుండి వినతులను స్వీకరించామని ఎస్సీ ఏకసభ్య కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్ వెల్లడించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల విచారణ కమిషన్ ఆధ్వర్యంలో షెడ్యూల్ కులాల్లో ఉప వర్గీకరణపై వివరణాత్మక అధ్యయనం కోసం హైదరాబాద్ పరిధిలో బహిరంగ విచారణ నిర్వహించారు. వర్గీకరణపై వివిధ ఎస్సీ కుల సంఘాలు ఇచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ కుల సంఘాల నుంచి 31 వినతులు అందాయని తెలిపారు. వీటిపై అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్నారు. అనంతరం సోషల్ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ షమీమ్ అక్తర్‌ను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. అంతకు ముందు కలెక్టర్ అనుదీప్ కలెక్టరేట్ వద్ద షమీమ్ అక్తర్‌కు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ అదనపు సంచాలకులు శ్రీధర్, అడిషనల్ కలెక్టర్ ముకుందరెడ్డి, డీఆర్‌ఓ వెంకటాచారి, ఆర్‌డీఓ రామకృష్ణ, సోషల్ వెల్ఫేర్ ఇన్‌చార్జి డీడీ కోటాజీ, బీసీ వెల్ఫేర్ డీడీ ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించాలి

- ఏకసభ్య కమిషన్‌కు మంద కృష్ణమాదిగ విజ్ఞప్తి



వినతిపత్రం అందజేసున్న మంద కృష్ణ తదితరులు

సాక్షి, సిటీబ్యూరో: జనాభా ప్రాతిపదికన ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించాలని ఏకసభ్య కమిషన్‌కు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ విజ్ఞప్తి చేశారు. మంగళవారం హైదరాబాద్ కలెక్టరేట్‌లో షెడ్యూల్ కులాల్లో ఉప వర్గీకరణపై వివరణాత్మక అధ్యయనం కోసం నిర్వహించిన బహిరంగ విచారణకు హాజరైన ఆయన ఏకసభ్య కమిషన్ చైర్మన్ డాక్టర్ షమీమ్ అక్తర్‌కు వినతులతో కూడిన నివేదిక అందించారు. రాజ్యాంగంలో రిజర్వేషన్లను జనాభా ప్రాతిపదికనే నిర్ధారించడం జరిగిందని, అదే మాదిరిగా ఎస్సీలలో ఉన్న అన్ని కులాలకు వారి వారి జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు అందేలా వర్గీకరణను అమలు చేయాలని నివేదికలో సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో మాదిగల జనాభా 70 శాతం ఉందని, 15 శాతం ఎస్సీ రిజర్వేషన్లలో మాదిగలకు జనాబాకు అనుగుణంగా వాటాను కేటాయించాలన్నారు. ఎస్సీలలో ఉన్న ప్రతి కులాన్ని స్వతంత్రంగానే గుర్తించాలని, ఏ కులానికి ఆ కులం స్వతంత్రంగా ఉండాలో లేదా ఎవరితో కలిసి ఉండాలో నిర్ణయించుకునే స్వేచ్ఛ వారికే వదిలేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్, జాతీయ నాయకులు నరేంద్ర బాబు, మాదిగ మహిళ జాతీయ నాయకులు జేపీ లత, సీనియర్ నేత తిప్పారపు లక్ష్మణ్, జాతీయ అధ్యక్షుడు సోమశేఖర్, రాష్ట్ర అధ్యక్షుడు సందే కార్తీక్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు టీవీ నరసింహ, దప్పు మల్లికార్జున, అరుణ్, విజయ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ట్రావెల్స్ బస్సులో 4 కేజీల గంజాయి పట్టివేత

- ఇద్దరు వ్యక్తుల అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: నాగ్‌పూర్ నుంచి హైదరాబాద్‌కు గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎస్‌టీఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో గంజాయి తరలిస్తున్నారన్న ముందస్తు సమాచారంతో సుచిత్ర కూడలిలో ఎస్‌టీఎఫ్ భిక్షారెడ్డి బృందం తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో 4 కేజీల గంజాయి ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..నాగపూర్ లోహపూల్ ప్రాంతానికి చెందిన చాచా అలియాస్ ఐజాష్ అనే వ్యక్తి వివిధ మార్గాల్లో హైదరాబాద్‌కు గంజాయి సరఫరా చేస్తుంటాడు. ఈ క్రమంలోనే నాగ్‌పూర్‌కు చెందిన అమ్జద్‌కు గంజాయి అప్పగించి హైదరాబాద్‌లో ఎవరికి చేరవేయాలో చెప్పాడు. సుచిత్ర కూడలిలో గంజాయి కోసం మెహరాజ్ అలీ అలియాస్ అమీర్ అనే వ్యక్తి గంజాయి తెస్తున్న అమ్జద్ కోసం ఎదురు చూస్తున్నాడు. గంజాయి ఇస్తుండగా ఎస్‌టీఎఫ్ పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. గంజాయిని పట్టుకున్న టీమ్‌ను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి, ఎస్‌టీఎఫ్ టీమ్ లీడర్ ప్రదీప్‌రావు అభినందించారు.

సిటీజనుల ఆహ్లాదం కోసమే సుందరీకరణ

- మేయర్ విజయలక్ష్మి



శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో జంక్షన్ల సుందరీకరణ పనులను ప్రారంభించిన మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే గాంధీ తదితరులు

గచ్చిబౌలి: నగర ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు పెద్ద ఎత్తున సుందరీకరణ పనులు చేపడుతున్నట్లు నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. మంగళవారం రాత్రి శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని జీఆర్‌సీ జంక్షన్, బయోడైవర్సిటీ జంక్షన్, గచ్చిబౌలి స్టేడియం, ఖాజాగూడ జంక్షన్లలో శిల్పాలు, ఫౌంటెన్లు, లైటింగ్‌తో చేపట్టిన సుందరీకరణ పనులను శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగర ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు రూ.125 కోట్ల అంచనా వ్యయంతో 195 సుందరీకరణ పనులు చేపట్టామన్నారు. వీటిలో ఇప్పటి వరకు సుమారు 28 పనులు పూర్తి చేశామన్నారు. మిగతా 167 పనులు వివిధ దశల్లో ఉన్నాయని, వాటిని వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ రైజింగ్‌తో నగరంలో మౌలిక సదుపాయాలు, రవాణా సౌకర్యం మెరుగు పరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దడానికి సుమారు రూ.7 వేల కోట్లు మంజూరు చేసిందని ఆమె గుర్తు చేశారు. అభివృద్ధితోపాటు గ్రేటర్‌లోని స్వయం సహాయ సంఘాలకు చెందిన కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, ఎస్ఈ శంకర్‌నాయక్, కార్పొరేటర్లు రాగం నాగేందర్‌యాదవ్, గంగాధర్‌రెడ్డి, హమీద్‌పటేల్, ఉప్పలపాటి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

లైంగికదాడికి యత్నించిన సూపర్‌వైజర్‌పై కేసు నమోదు



కామేశ్వరరావు

నాంపల్లి: నిలోఫర్ ఆసుపత్రిలో పనిచేసే మహిళా గార్డుపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎస్‌కెఎస్ఎస్ ఏజెన్సీ సూపర్‌వైజర్ ఎం.కామేశ్వరరావుపై నాంపల్లి శాంతిభద్రతల పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు బాధితురాలు మంగళవారం రాత్రి నాంపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్ఐ సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం..ఎస్‌కెఎస్ఎస్ అనే ఏజెన్సీ నిలోఫర్ ఆసుపత్రిలో కాంట్రాక్టును దక్కించుకుని శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బందిని నియమించింది. ఈ క్రమంలో ఈ సంస్థ నుంచే ఓ యువతి(24) నిలోఫర్ ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తోంది. అయితే సూపర్‌వైజర్ కామేశ్వర్ రావు తనపై అనుచితంగా ప్రవర్తించాడంటూ ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

22న సనాతన హిందూ ధర్మ జాగృతి మహాసభ



కరపత్రం ఆవిష్కరిస్తున్న స్వామీజీలు

పంజగుట్ట: దేశంలోని 85శాతం మంది హైందవులను ఐక్యం చేసేందుకు అఖండ భారత్‌ను స్థాపించేందుకు ఈనెల 22వ తేదీన సంగారెడ్డి జిల్లా అమీన్పూర్ మండల్‌లోని శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి దేవాలయంలో 'సనాతన హిందూ ధర్మ జాగృతి మహాసభ' నిర్వహిస్తున్నట్లు శ్రీ సద్గురు మహాదేవ్ స్వామీజీ మహాదేవ మఠం వ్యవస్థాపకులు మహదేవ్ స్వామీజీ తెలిపారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ కరపత్రాన్ని వీర ధర్మజస్వామి, తెలంగాణ జంగమ సమాజం అధ్యక్షులు ఆర్.విశ్వేశ్వరయ్యలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీఠం, సనాతన హిందూ ధర్మ జాగృతి సేవా సంస్థల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమం నాదేశం..నా ధర్మం, సనాతన బోర్డే మా లక్ష్యం అనే నినాదంతో సాగుతుందన్నారు. కార్యక్రమానికి 108 మంది పీఠాధిపతులు, ధార్మిక సంఘాల పెద్దలు, కులసంఘాలు హాజరవుతున్నాయని తెలిపారు. దేశంలో హిందువులపై ఎన్నో దాడులు జరుగుతున్నా ఇంకా హిందువులు నిద్రావస్థలోనే ఉన్నారని వారిని జాగృత పరిచేందుకే ఈ కార్యక్రమం చేస్తున్నామని యావత్ హిందూ సమాజం వారి కుటుంబ సభ్యులతో కార్యక్రమానికి హాజరు కావాలన్నారు. 22వ తేదీ ఉదయం 9కి గోమాత పూజతో ప్రారంభమై స్వామీజీల సందేశాలు, ప్రవచనాలు, హిందూ ధర్మంపై జరుగుతున్న దాడుల గురించి వివరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో శివకుమార్ స్వామి, శశిధర్ ఆచార్య, శివస్వామి తదితరులు పాల్గొన్నారు.

రైతుల హక్కులు కాలరాస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

రాజ్యాంగాన్ని కాపాడాలని అంబేడ్కర్ విగ్రహానికి వినతి

బంజారాహిల్స్: రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ప్రవర్తిస్తున్నదని, లగచర్లలో రైతుల హక్కులను కాలరాస్తున్నదని బీఆర్ఎస్ నేతలు అన్నారు. మంగళవారం బంజారాహిల్స్ రోడ్ నెం. 1లోని జీవీకే ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు వినతి పత్రాన్ని అందజేసి నిరసన వ్యక్తం చేశారు. ఖైరతాబాద్ నియోజకవర్గం అధ్యక్షుడు మన్నె గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేతలు దాసోజు శ్రవణ్, రావుల శ్రీధర్‌రెడ్డి పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ లగచర్ల గ్రామంలో రైతుల హక్కులను కాలరాస్తూ ప్రభుత్వం ప్రత్యక్ష దాడులకు పాల్పడుతుందని వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని విమర్శించారు. వెంటనే వారిని విడుదల



అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న దాసోజు తదితరులు

చేయాలని డిమాండ్ చేశారు. రైతుల, గిరిజనుల హక్కులను రేవంత్‌రెడ్డి సర్కారు కాలరాస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి, స్థానిక బీఆర్ఎస్ నేతలు రాంచందర్, రావుల విజయ్‌కుమార్, జేజోళ్ల రాజు, అహ్మద్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా ఎమ్మెల్యే కాలనీ పార్కు



పార్కులో తాగిపడేసిన మద్యం సీసాలు



పార్కులో పేరుకుపోయిన గ్రీన్ వేస్టేజ్

బంజారాహిల్స్: సందర్శకులు, కాలనీవాసులకు ఆహ్లాదాన్ని పంచాల్సిన కొన్ని పార్కులు అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు కేరాఫ్‌గా మారుతున్నాయి. బంజారాహిల్స్ రోడ్ నెం. 12 ఎమ్మెల్యే కాలనీలోని యూరో కిడ్స్ ఎదురుగా ఉన్న కాలనీ పార్కు తాగుబోతులు, ఆవారా యువకులకు అడ్డాగా మారడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చీకటి పడిందంటే నిత్యం కొందిమంది యువకులు ఈ పార్కుకు చేరుకొని మద్యంతోపాటు గంజాయి తాగుతూ న్యూసెన్స్‌కు పాల్పడుతున్నారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. పార్కుకు సెక్యూరిటీ సిబ్బంది లేకపోవడంతోపాటు కనీసం తాళం వేసే వారు కూడా లేనికారణంగా ఈ పరిస్థితి దారుణంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఈ పార్కులో నెలలతరబడి గ్రీన్‌వేస్టేజ్, చెత్తా చెదారం తరలించకపోవడంతో పార్కులో అపరిశుభ్ర వాతావరణం కనిపిస్తున్నది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ పార్కుకు సరైన భద్రత ఏర్పాటు చేయడంతో పాటు పార్కులో పేరుకుపోయిన గ్రీన్ వేస్టేజీని తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఎరుకలకు తగిన గుర్తింపునివ్వాలి



సమావేశంలో ఎరుకల ప్రతినిధులతో తిరుపతి తదితరులు

కాచిగూడ: పార్టీలు ఎరుకలను ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నారు తప్ప తగిన గుర్తింపు ఇవ్వడం లేదని తెలంగాణ ఎరుకల ప్రజాసమితి రాష్ట్ర అధ్యక్షుడు కె. తిరుపతి అన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం తెలంగాణ ఎరుకల ప్రజా సమితి రాష్ట్ర ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లో ఉన్న ఎరుకల్లో 90 శాతం ప్రజలు పందుల పెంపకంపైనే ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. ఎరుకల యువత కోసం స్వయం ఉపాధి పథకాలు ఏర్పాటు చేయడంతోపాటు బ్యాంకులతో సంబంధం లేకుండా వంద శాతం సబ్సిడీతో రుణాలు ఇవ్వాలని కోరారు. హైదరాబాద్ కేంద్రంలో ఏకలవ్య యూత్ హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పందుల పెంపకందారుల ప్రతీ కుటుంబానికి 5 గుంటల భూమి కేటాయించాలని కోరారు. ఎరుకల కులస్తుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలుపుకోవాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లలో మొదటి అవకాశం ఇళ్లు లేని ఎరుకలకు కల్పించాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఎరుకలందరూ సంఘటితంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో తెలంగాణ ఎరుకల ప్రజా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ఉపేందర్, ఉండాడి అంజయ్య, మనువాటి రవి, రెవెల్లి తిరుపతి, మొగిలి శేఖర్, ఉండాడి వెంకటేష్, నడిగడ్డ కుమారస్వామి, ఉండాడి సాగర్ తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల వివరాలు యాప్‌లో నమోదు చేస్తున్న టీచర్

- అంగన్‌వాడీలో యాప్‌ను అందుబాటులోకి తెచ్చిన కేంద్ర ప్రభుత్వం
- ఈ ప్రక్రియతో సేవలు మరింత పారదర్శకం
- ఖైరతాబాద్‌లో మొదలైన ఫేస్ రికగ్నైజేషన్ ప్రక్రియ

ఇకపై ఫేస్ రికగ్నైజేషన్

బంజారాహిల్స్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారం, బాలమృతం లబ్ధిదారులకు సక్రమంగా అందేలా 'పోషణ్ అభియాన్ యాప్' దోహదం చేస్తోంది. 2020 ఏప్రిల్ నుంచి వినియోగంలోకి తెచ్చిన పోషణ్ ట్రాకర్ యాప్‌తో లబ్ధిదారులకు సకాలంలో సేవలు అందజేస్తున్నారు. ప్రతిరోజూ అంగన్‌వాడీ కేంద్రం తెరిచిన వేళలు, పిల్లల హాజరు, గృహ సందర్శన, టీహెచ్ఆర్, కోడి గుడ్లు, బాలామృతం తదితర సమాచారం ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు అందుతుంది. దీనికి అదనంగా పోషణ్ అభియాన్ యాప్‌లో కేంద్ర ప్రభుత్వం తాజాగా ఫేస్ రికగ్నైజేషన్ (ముఖ ధృవీకరణ) సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. దీని ద్వారా పిల్లలు, గర్భిణులు, బాలింతలు తదితర లబ్ధిదారుల ఫొటోలను నిక్షిప్తం చేసి మరింత పారదర్శకంగా సేవలు అందించనున్నారు. ఐసీడీఎస్ ఖైరతాబాద్ పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్, షేక్‌పేట, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, ఎర్రగడ్డ, బోరబండ, వెంగళరావునగర్ తదితర డివిజన్ల పరిధి కిందికి వచ్చే 151 అంగన్‌వాడీ కేంద్రాల్లో ముఖ ధృవీకరణ అమలుకు శ్రీకారం చుట్టారు. అంగన్‌వాడీ కేంద్రాల ఉపాధ్యాయులు మొబైల్ ఫోన్‌లోని పోషణ్ అభియాన్ ట్రాకర్ యాప్‌ను అప్‌డేట్ చేసుకోవాలని అధికారులు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. అంగన్‌వాడీ టీచర్లకు అందజేసిన మొబైల్ ఫోన్‌లోని ఫేస్ రికగ్నైజేషన్ ప్రోగ్రాం ద్వారా లబ్ధిదారుల ఫొటో, ఆధార్ వివరాలు, లబ్ధిదారుల సెల్‌ఫోన్ నెంబర్ ఇందులో నమోదు చేస్తారు. ఇది పూర్తికాగానే లబ్ధిదారుల సెల్‌ఫోన్‌కు వచ్చిన వన్‌టైమ్ పాస్‌వర్డ్‌ను ఈ యాప్‌లో పొందుపర్చి ఈ ప్రక్రియను పూర్తిచేస్తారు. ధృవీకరించినట్లు ఈ యాప్‌లో సందేశం రాగానే అథెంటికేషన్ పూర్తయినట్లు నిర్ధారణ అవుతుంది. ఇలా ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలోని మొత్తం లబ్ధిదారుల ఫేస్ రికగ్నైజేషన్ ప్రక్రియ ఇప్పటికే మొదలైంది. సజావుగా పూర్తి చేసేందుకు అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కలిగిస్తున్నారు. ఆన్‌లైన్ ద్వారా సంబంధిత అధికారులకు అవగాహన కూడా పూర్తయ్యింది. ప్రస్తుతం పోషణ్ అభియాన్ ప్రతినిధులు అంగన్‌వాడీ టీచర్లకు దీనిపై శిక్షణ కూడా ఇస్తున్నారు.

పాత ఫోన్లతో సేవలకు అంతరాయం..

అంగన్‌వాడీ కేంద్రాల్లోని టీచర్లు పోషణ్ అభియాన్ ద్వారా అందిస్తున్న సేవలకు కంప్యూటర్లు, ఇతర సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. పలువురి అంగన్‌వాడీ టీచర్ల మొబైల్ ఫోన్లు పాతబడ్డాయి. ఇందులో సిమ్‌కార్డు మరో ఫోన్‌లోకి వేస్తే అవి పనిచేయడం లేదు. ఈ విషయాన్ని ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. సాంకేతిక సమస్యలపై అధికారులు దృష్టిసారించారు. కొత్త సెల్‌ఫోన్లు అందజేయాలని టీచర్లు కోరుతున్నారు. ఈ యాప్ విజయవంతంగా ముందుకుసాగాలంటే ఇప్పుడున్న సెల్‌ఫోన్లు పనిచేయవని పలువురు అంగన్‌వాడీ టీచర్లు ఆరోపిస్తున్నారు. పోషణ్ అభియాన్ యాప్‌లో ముఖ ధృవీకరణ చేయాలంటే నాణ్యమైన సెల్‌ఫోన్లు ఉండాలని వీరు కోరుతున్నారు. యాప్‌ను సక్రమంగా వినియోగించేలా పోషణ్ అభియాన్ ఉద్యోగులు, సిబ్బంది కృషి చేస్తుండగా టీచర్లు మాత్రం తమ సెల్‌ఫోన్లు మొరాయిస్తున్నాయని ఆరోపిస్తున్నారు. ఈనెల నాల్గో వారం నుంచి ఫేస్ రికగ్నైజేషన్ ద్వారా లబ్ధిదారులకు కోడిగుడ్లు, బాలామృతం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

రేపటి నుంచి ఏఐటీయూసీ జాతీయ జనరల్ కౌన్సిల్ సమావేశాలు

లిబర్టీ: ఆల్ ఇండియా కాన్ ఫెడరేషన్ ఆఫ్ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఏఐటీయూసీ జాతీయ జనరల్ కౌన్సిల్ సమావేశాలు ఈ నెల 19వ తేదీ నుంచి జరుగుతున్నాయని జాతీయ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి మారగోని ప్రవీణ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. మంగళవారం సంఘం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 19, 20, 21 తేదీలో ఒడిశాలోని పూరిలో యూత్ హాస్టల్‌లో జనరల్ కౌన్సిల్ సమావేశాలు జరుగుతాయని వెల్లడించారు. జాతీయ అధ్యక్షులు కె.రవి, జాతీయ ప్రధాన కార్యదర్శి విజయంతో పాటు ఆఫీస్ బేరర్లు పాల్గొంటారని పేర్కొన్నారు. ముఖ్యంగా భవన కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, కేంద్రంలోని ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు, నిర్మాణ కార్మికుల సంక్షేమం, సమగ్ర చట్టం, సామాజిక భద్రత, గుర్తింపు కార్డులపై చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖైరతాబాద్‌లో అగ్ని ప్రమాదం

ఖైరతాబాద్: షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగి ఇంట్లో సామగ్రి పూర్తిగా కాలిపోయిన సంఘటన ఖైరతాబాద్‌లో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... ఖైరతాబాద్ డివిజన్‌లోని ప్రభుత్వ క్వార్టర్స్‌లో సి.హనుమాన్, అనామిక దంపతులు నివాసముంటున్నారు. సోమవారం దంపతులిద్దరు ఇంట్లో నుంచి బయటకు వెళ్లారు. ఆ సమయంలో రాత్రి షార్ట్ సర్క్యూట్ కారణంగా వీరు నివాసముంటున్న మొదటి అంతస్తు ఫ్లాట్‌లో అగ్ని ప్రమాదం జరిగి మంటలు ఎగిసిపడ్డాయి. గమనించిన స్థానికులు ఫైర్ ఇంజన్‌కు సమాచారమిచ్చారు. ఫైర్ ఇంజన్ సాయంతో మంటల్ని పూర్తిగా ఆర్పివేశారు. అప్పటికే ఇంట్లోని సామగ్రి పూర్తిగా కాలిపోయింది. కాలిపోయిన సామగ్రి విలువ సుమారు రెండు లక్షల వరకు ఉంటుందని బాధితులు తెలిపారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని వారు వేడుకున్నారు.

వేణుగోపాల స్వామికి ధనుర్మాస శోభ



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని భవానీ నగర్ విశ్వసాయి మందిరంలో కొలువుదీరిన వేణుగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవోపేతంగా నిర్వహిస్తున్నారు. వేడుకల్లో భాగంగా మంగళవారం ఉదయం స్వామివారికి తిరుమంజరిసేవ, చామంతి తులసీ పుష్పార్చన అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి స్వామివారి ధనుర్మాస అలంకరణను దర్శించుకున్నారు.

రాంగ్‌రూట్‌లో వచ్చి.. ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి..

వెంగళరావునగర్: రాంగ్‌రూట్‌లో వచ్చిన కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... శ్రీకృష్ణానగర్‌లో నివసించే ఎం.గిరి వెంకటసాయి తన ద్విచక్ర వాహనంపై ఈనెల 15 రాత్రి రహమత్‌నగర్ నుంచి యూసుఫ్‌గూడబస్తీ వైపు వెళుతున్నాడు. అదే సమయంలో జానకమ్మ తోట మీదుగా రాంగ్‌రూట్‌లో వస్తున్న బొలేరో వాహనం వెంకటసాయి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ సంఘటనలో వెంకటసాయికి గాయాలయ్యాయి. బాధితుడి బావ వంశీరామకృష్ణ ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి తాగుతున్న వ్యక్తి అరెస్టు

బంజారాహిల్స్: కేబీఆర్ పార్కును ఆనుకుని ఉన్న జీహెచ్ఎంసీ వాక్‌వే గేటు నెంబర్-6 వద్ద ఓ వ్యక్తి గంజాయి తాగుతుండగా ఫుట్ పెట్రోలింగ్ పోలీసులు పట్టుకుని బంజారాహిల్స్ పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే... టోలిచౌకి చెందిన మొఫిజుల్ ఇస్లాం (32) వెల్డింగ్ వర్క్ చేస్తుంటాడు. అస్సాంకు చెందిన ఇస్లాం కొంతకాలంగా ఇక్కడ ఉంటూ గంజాయికి అలవాటుపడ్డాడు. సోమవారం సాయంత్రం గచ్చిబౌలిలో తన స్నేహితుల వద్దకు వెళ్లాడు. అక్కడి నుంచి కొంత గంజాయిని తీసుకుని కేబీఆర్ పార్కు జీహెచ్ఎంసీ వాక్ వే వద్దకు వచ్చి తాగుతుండగా ఫుట్ పెట్రోలింగ్ పోలీసులు గుర్తించారు. వెంటనే అదుపులోకి తీసుకుని బంజారాహిల్స్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారం కోసమే బస్తీబాట



అధికారులకు సమస్యలను వివరిస్తున్న బాబా ఫసియుద్దీన్

రహమత్‌నగర్: ప్రజా సమస్యలు పరిష్కరించేందుకే బస్తీబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ స్పష్టం చేశారు. బస్తీబాట కార్యక్రమంలో భాగంగా బోరబండ సైట్-3 వీకర్ సెక్షన్ బస్తీల్లో ఆయన మంగళవారం పర్యటించి అక్కడి సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాబా ఫసియుద్దీన్ మాట్లాడుతూ బస్తీవాసులు వారి బస్తీల్లోని సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. నాలా మూలంగా దోమలు వ్యాప్తి చెందుతున్నాయని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా స్పందించిన ఆయన నాలాలోని వ్యర్థాలను తొలగించి, ఫాగింగ్ చేయాలని సంబంధిత జీహెచ్ఎంసీ అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశించారు. పలువురు మహిళలు తమకు ఇళ్లు లేవని విన్నవించంగా నిరుపేదలందరికీ గృహజ్యోతి పథకం ద్వారా ఇళ్లు వచ్చేలా కృషి చేస్తానని బాబా ఫసియుద్దీన్ హామీ ఇచ్చారు. అంతకుముందు బస్తీలో తాగునీటి పైప్‌లైన్ పనులను బస్తీ నాయకులతో ప్రారంభింపజేశారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ రాజేందర్, నాయకులు కవిత, షేక్ వలి, చంద్రకళ, నర్సి, గోపాల్‌రెడ్డి బస్తీవాసులు తదితరులు పాల్గొన్నారు.

లగచర్ల రైతులను తక్షణమే విడుదల చేయాలి



నిరసన తెలియజేస్తున్న కార్పొరేటర్లు దేదీప్య విజయ్

వెంగళరావునగర్: లగచర్ల రైతులను తక్షణమే విడుదల చేయాలని కార్పొరేటర్లు దేదీప్య విజయ్, రాజ్‌కుమార్‌లు డిమాండ్ చేశారు. లగచర్ల రైతులపై ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం యూసుఫ్‌గూడ చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. దీనిలో భాగంగా బీఆర్ఎస్ నేతలు నల్ల దుస్తులు, బ్యాడ్జీలు ధరించి నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా నేతలు మాట్లాడుతూ లగచర్ల రైతుల కస్టడీ అనేది ప్రభుత్వ దమననీతికి నిదర్శనమని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి రైతులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లతో పాటు బీఆర్ఎస్ నేతలు విజయ్ ముదిరాజ్, శ్యాంరావు, విజయ్‌కుమార్, విజయ్‌సింహ, మేరీ, బాలు రజక, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

19న కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ వర్ధంతి



చొప్పరి శంకర్ ముదిరాజ్

కాచిగూడ: స్వాతంత్య్ర సమరయోధులు, ముదిరాజ్ సంఘం వ్యవస్థాపకులు కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ 58వ వర్ధంతిని ఈ నెల 19వ తేదీన జూబ్లీబస్ స్టేషన్ వద్ద నిర్వహించనున్నట్లు మన ముదిరాజ్ మహాసభ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్ తెలిపారు. మంగళవారం హైదర్‌గూడలోని మన ముదిరాజ్ మహాసభ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ వర్ధంతి కార్యక్రమానికి మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాష్ ముదిరాజ్, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముదిరాజ్, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బుర్రా జ్ఞానేశ్వర్, నీలం మధు, కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

ఐఎస్‌సీఏ నూతన కార్యవర్గం ఎన్నిక



పంజగుట్ట: ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఆడిట్ కంట్రోల్ అసోసియేషన్ (ఐఎస్ఏసీఏ) హైదరాబాద్ చాప్టర్ తన వార్షిక సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం సోమాజిగూడలోని ఓ హోటల్‌లో నిర్వహించింది. ఈ సందర్భంగా హైదరాబాద్ చాప్టర్ కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా ఈసీఎస్ శర్మ, ఉపాధ్యక్షుడు జీ.వీ.వంశీకృష్ణ, కోశాధికారి సి. వెంకట్రామ్, కార్యదర్శి రాజ్ పవార్, మెంబర్‌షిప్ డైరెక్టర్‌గా రజనీష్ దాసరి, ప్రోగ్రామ్ డైరెక్టర్‌గా సతీష్ బొట్ట, ప్రభుత్వ రిలేషన్స్ డైరెక్టర్ పవన్ కుమార్ మారెళ్ల, షీలీడ్స్ టెక్ డైరెక్టర్ అర్ధ వరలక్ష్మి, అకాడమిక్ డైరెక్టర్ డా.సౌజన్య పొన్నలూరు ఎన్నికయ్యారు. అనంతరం నూతన అధ్యక్షుడు జీ.సీ.ఎస్.శర్మ మాట్లాడుతూ హైదరాబాద్ చాప్టర్‌లో మొత్తం 1200 మంది సభ్యులు ఉన్నారని, ప్రమాదాలు నివారించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

నేడు సంకటహర చతుర్థి

సనత్‌నగర్: సంకటహర చతుర్థి సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ దేవాలయంలోని శ్రీ గణపతి దేవాలయంలో ఉ.6.30 గంటలకు గణపతి హోమం, సాయంత్రం 6 గంటలకు పంచామృత అభిషేకం, అనంతరం ప్రత్యేక అలంకరణ దర్శనం, తీర్థ ప్రసాద వితరణ జరుగుతాయని ఈఓ సత్యనారాయణ తెలిపారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: కూరగాయల ధరలు కిలోకు రూపాయల్లో ఈవిధంగా ఉన్నాయి. టమాట.15, నల్లవంకాయ 31, పొడుగు వంకాయ 25, బెండకాయ 45, పచ్చిమిర్చి 28, బజ్జీమిర్చి 28, క్యాప్సికమ్ 60, పచ్చకాకర 38, పందిరి బీర 58, క్యాబేజీ 19, క్యారెట్ 35, దొండ 35, గుండు బీన్స్ 48, గింజ చిక్కుడు 50, గోకరకాయ 35, కీర 35, దోసకాయ 23, బీట్‌రూట్ 40, ఉల్లిగడ్డ 45, ఆలుగడ్డ 28, చామగడ్డ 35, మొరంగడ్డ 28, కందగడ్డ 60లు ఉండగా ఈ ధరలు బుధవారం ఉదయం వరకు మాత్రమే వర్తిసాయని అధికారులు తెలిపారు.

రాకపోకలు కష్టంగా మా'రాయి'

- దశాబ్దాల కాలంగా రాకపోకలకు ఇబ్బందులు
- బండరాయి తొలగించాలని వేడుకోలు

రహమత్‌నగర్: ఎస్పీఆర్‌హిల్స్ వినాయకనగర్ బస్తీలో ఉన్న బండరాయి రాకపోకలకు అడ్డంకిగా మారింది. దశాబ్దాల కాలంగా ఇబ్బందులు పెడుతున్న ఈ సమస్యను పరిష్కరించాలని బస్తీవాసులు ఏళ్లుగా వేడుకుంటున్నారు. స్థానికంగా ఉన్న ఓ వీధిలో ఉన్న ఈ బండరాయి మూలంగా దాదాపు 100 కుటుంబాలు చుట్టు తిరిగి రావాల్సి వస్తోంది. "పక్క వీధిలో ఏదైన శుభాకార్యం, ఎవరైన చనిపోయిన సందర్భాల్లో బండపై భాగంలో నివాసముంటున్న వారు దారిలేక చుట్టూ తిరిగి రాకపోకలు కొనసాగించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక అత్యవసర పరిస్థితుల్లో రాకపోకలు మరింత ఇబ్బందిగా మారుతుందని బస్తీవాసులు వాపోతున్నారు. గతంలో పలుమార్లు ఈ బండను తొలగించాలని జీహెచ్ఎంసీ అధికారులకు విన్నవించినా పట్టించుకున్న పాపాన పోలేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా బండను తొలగించి రాకపోకలు సుగమం చేయాలని బస్తీవాసులు కోరుతున్నారు.

అధికారుల దృష్టికి మరోసారి తీసుకెళతా : సీఎన్ రెడ్డి (కార్పొరేటర్)

వినాయనగర్ బస్తీలో ఉన్న బండరాయి సమస్యను మరోసారి జీహెచ్ఎంసీ అధికారులు దృష్టికి తీసుకెళ్తాం. సాధ్యమైన తొందరలో బండరాయి తొలగించి రాకపోకలకు అంతరాయం లేకుండా చేస్తాం. జీహెచ్ఎంసీ అధికారులతో వినాయకనగర్ బస్తీలో పర్యటించి నివేదికలు రూపొందిస్తాం.



అడ్డంకిగా ఉన్న బండరాయి....

ఏ క్షణంలోనైనా..!

పక్కకు ఒరిగిన కరెంటు స్తంభం...

జూబ్లీహిల్స్ డివిజన్ బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2లోని ఇందిరానగర్ స్ట్రీట్‌నెంబర్-3లో ఓ కరెంటు స్తంభం పక్కకు ఒరిగి ప్రమాదకరంగా మారింది. స్థానిక ట్రాన్స్‌కో ఏఈకి జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ పలుమార్లు ఈ సమస్యపై ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు. ఏ క్షణంలోనైనా ఈ స్తంభం కూలిపోవడానికి సిద్ధంగా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ ఈ స్తంభం కూలిపోతే కరెంటు వైర్లు రోడ్డుతో పాటు ఇళ్లపై కూడా పడతాయని బస్తీవాసులు పేర్కొంటున్నారు. రోజురోజుకూ స్తంభంపై బరువు పెరుగుతుండడంతో పాటు రోడ్డంతా కొట్టుకుపోతుండడంతో ప్రమాదం పొంచి ఉందని, ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి ఈ స్తంభాన్ని మార్చి కొత్తది వేయాలని వేడుకుంటున్నారు. -ఫిలింనగర్



నగరంలో నేడు

- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని తాజ్‌కృష్ణా హోటల్‌లో డిజైనర్స్ హాత్ ఎగ్జిబిషన్ ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు ఉంటుంది.
- నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా వింటర్ ఉత్సవ్ మేళా సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుంది.
- సికింద్రాబాద్ ఆర్పీ రోడ్డులోని ప్యారడైజ్ ఫుడ్ కోర్టు ఆధ్వర్యంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు రాయల్ ఫుడ్ ఫెస్టివల్ జరుగుతుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామం సందర్శకుల కోసం ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అవకాశం ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 7 గంటలకు ఇండియన్ ఫొటో ఫెస్టివల్ జరుగుతుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఆలిండియా క్రాఫ్ట్ మేళా ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- కేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో బేసిక్ లైఫ్ సపోర్ట్ స్కిల్స్‌పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం శంషాబాద్‌లోని ఎంఎంఆర్ కన్వెన్షన్ హాలులో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

ఉర్దూ మాధ్యమంపై చిన్నచూపు!

డీఎస్సీ-2024లో 40 శాతమే పోస్టులు భర్తీ

- రిజర్వేషన్ కేటగిరితో 714 పోస్టులు భర్తీ కానీ వైనం
- ఊసే లేని ప్రత్యేక ఉర్దూ డీఎస్సీ హామీ
- రెండో జాబితా కోసం మెరిట్ విద్యార్థుల ఆందోళన



సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రంలో రెండవ అధికార భాష ఉర్దూ నిర్లక్ష్యానికి గురవుతోంది. ఉర్దూ మీడియం పాఠశాలల్లో సరిపడా టీచర్ల పోస్టులు భర్తీ లేక ముస్లిం సామాజికవర్గం విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారు. విద్యార్థుల సంఖ్య తగ్గుతుండటంతో క్రమంగా పాఠశాలలు కూడా మూతపడుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మైనార్టీ డిక్లరేషన్‌లో భాగంగా స్పెషల్ ఉర్దూ డీఎస్సీ ప్రకటిస్తామన్న హామీతో ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా దాని ఊసే లేక పోగా, ఇటీవల నిర్వహించిన జనరల్ డీఎస్సీ-2024లో నోటిఫై చేసిన ఉర్దూ మీడియం పోస్టులు సైతం పూర్తి స్థాయిలో భర్తీ చేయకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. వాస్తవంగా ఉర్దూ మీడియం పోస్టుల భర్తీకి విచిత్ర పరిస్థితి నెలకొంది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ అవుతున్నా.. ప్రతిసారి రిజర్వేషన్ కేటగిరి తీరుతో అర్హులైన అభ్యర్థులు లేక పోస్టులు భర్తీకి నోచుకోక బ్యాక్ లాగ్ కింద పడిపోతున్నాయి. ఫలితంగా ఉర్దూ పాఠశాలల్లో ఖాళీల భర్తీకాక విద్యాబోధన అధ్వానంగా తయారైంది. ఎప్పటి మాదిరిగానే ఈసారి డీఎస్సీ-2024లో కూడా పాత పరిస్థితి పునరావృత్తమైంది.

ఈసారి ఇలా..

- డీఎస్సీ-2024లో ఉర్దూ మీడియానికి సంబంధించిన 1,183 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ అయ్యింది. డీఎస్సీ పరీక్ష ద్వారా అర్హత సాధించిన అభ్యర్థులను ఎంపిక చేసి 469 పోస్టులను మాత్రమే భర్తీ చేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ కేటగిరిలోని సుమారు 714 పోస్టులకు అర్హులైన అభ్యర్థులు లేక భర్తీని పెండింగ్‌లో పడేసింది. హైదరాబాద్ జిల్లాలో 310 పోస్టులకు గాను 194 పోస్టులు భర్తీకి నోచుకోలేదు. సంగారెడ్డి జిల్లాలో 166 పోస్టులకు గాను 64 పోస్టులు మాత్రమే భర్తీకి నోచుకున్నాయి. నిజామాబాద్ జిల్లాలో 139 పోస్టులకు 88 పోస్టులు భర్తీకి నోచుకోలేదు. మిగితా జిల్లాల్లో సైతం మొత్తం పోస్టులకు సగం పోస్టులు కూడా భర్తీకి నోచుకోలేదు.
- 2017లో సైతం 900 ఉర్దూ టీచర్ పోస్టులకు నోటిఫికేషన్లు విడుదల చేసింది. అందులో 365 పోస్టులను మాత్రమే భర్తీ చేసి రిజర్వ్‌డ్ అభ్యర్థులు లేకపోవడం వల్ల 535 పోస్టులు భర్తీకి నోచుకోలేదు.

రెండున్నర దశాబ్దాలుగా..

రెండున్నర దశాబ్దాలుగా నిర్వహిస్తున్న డీఎస్సీల్లో సైతం రిజర్వేషన్ కేటగిరిలో అభ్యర్థులు లేక పోస్టులు భర్తీకి నోచుకోకుండా పోతున్నాయి. నిబంధల ప్రకారం ప్రభుత్వం పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టుల భర్తీ ప్రక్రియలో రిజర్వేషన్ల ప్రకారం పోస్టుల కేటాయింపు చేస్తూ వస్తోంది. ఉర్దూ మీడియంలో సైతం బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ల ఆధారంగా పోస్టులు కేటాయిన్నా.. రిజర్వేషన్ కేటగిరిలో అభ్యర్థుల కొరత వెంటాడుతోంది. జనరల్ కేటగిరిలో అర్హులైన అభ్యర్థులు ఉన్నప్పటికీ రిజర్వేషన్ల మెలికతో ఉర్దూ మీడియం ఉపాధ్యాయ పోస్టులు భర్తీకి ఆటంకంగా తయారైంది. ఫలితంగా రిజర్వేషన్ కేటగిరి పోస్టులన్నీ ఖాళీగానే వెక్కిరిస్తున్నాయి. డీఎస్సీ రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో సమాన ప్రాతినిధ్యం కల్పించాలని ఎన్నో ఏళ్లుగా డిమాండ్ వ్యక్తమవుతున్నా.. ఉర్దూ మీడియానికి మాత్రం వర్తించడం లేదు.

అన్‌ఫిల్డ్ పోస్టుల భర్తీ కోసం మెరిట్ జాబితా ప్రకటించాలి

డీఎస్సీ-2024లో ఉర్దూ మీడియం ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో అర్హులైన అభ్యర్థులు లేక భర్తీ కానీ పోస్టులను తక్షణమే మెరిట్ అభ్యర్థులతో భర్తీ చేయాలి. మరో వైపు మిగిలిన భర్తీకానీ పోస్టులను డీ-రిజర్వేషన్‌తో జనరల్ కేటగిరి కిందకు బదిలీ చేసి తక్షణమే భర్తీకి చర్యలకు చేపట్టాలి. రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో ఉర్దూ మాట్లాడేవారికి న్యాయమైన ప్రాతినిధ్యం కల్పించాలి.

– సబా ఐజాజ్, కన్వీనర్, డీఎస్సీ-2024 అభ్యర్థుల కోర్ కమిటీ.

డీఎస్సీ-2024లో ఉర్దూ మీడియం పోస్టుల పరిస్థితి ఇలా..

సబ్జెక్టు	ప్రకటించిన పోస్టులు	భర్తీ చేసిన పోస్టులు	భర్తీకానీ పోస్టులు
ఎస్జీటీ	879	336	543
ఎస్‌ఏ	177	81	96
పండిత్	74	38	36
పీఈటీ	34	12	22
ఎస్జీటీ(స్పెషల్ ఎడ్యుకేషన్)	15	1	14
ఎస్‌ఏ (స్పెషల్ ఎడ్యుకేషన్)	4	1	3



నానక్‌రాంగూడ స్టార్ హాస్పిటల్ డాక్టర్లతో రోగి రామారావు, భార్య, కొడుకు

ఒకే సమయంలో కాలేయం, కిడ్నీ మార్పిడి

- స్టార్ హాస్పిటల్ వైద్యుల ఘనత

గచ్చిబౌలి: స్టార్ హాస్పిటల్ వైద్యులు 54 ఏళ్ల రోగికి ఒకే సమయంలో కాలేయం, కిడ్నీ మార్పిడిని విజయవంతంగా నిర్వహించారు. దీనికి సంబంధించిన వివరాలను స్టార్ లివర్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ అండ్ లీడ్ సర్జన్ డాక్టర్ మెట్టు శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఒంగోలుకు చెందిన 54 ఏళ్ల వ్యాపారవేత్త రామారావు 8 సంవత్సరాలుగా కాలేయం, కిడ్నీ వైఫల్యం, అధిక రక్తపోటు, మధుమేహం, హెపటైటిస్ బి ఇన్ఫెక్షన్ వంటి అనేకమైన తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతూ స్టార్ ఆస్పత్రికి వచ్చారు. హెపటైటిస్-బి కారణంగా కాలేయ సిర్రోసిస్ ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. అతడి పరిస్థితి కాలక్రమేణా క్షీణించింది. శరీరంలో నీటి నిలుపుదల(ఆసిటిస్), కిడ్నీ వైఫల్యం పరిస్థితిని మరింత తీవ్రతరం చేసిందని తెలిపారు. వీటితో పాటు తీవ్ర ఇన్ఫెక్షన్, రక్తపోటు, హెపాటిక్ కోమా, కాలేయం, కిడ్నీ వైఫల్యం కారణంగా రక్తంలో విష పదార్థాలు పేరుకుపోవడంతో రోగిని ఐసీయూలో చేర్చి నిరంతర పర్యవేక్షణ చేపట్టారు. కాలేయం, మూత్రపిండాల మార్పిడి చేయకపోతే ఆ వ్యక్తి మనుగడకు 10 శాతం కంటే తక్కువ అవకాశాలు ఉంటాయని గుర్తించడం జరిగిందన్నారు. రోగి భార్య కిడ్నీని, కొడుకు కాలేయంలో కొంత భాగాన్ని దానం చేయగా వైద్యులు 12 గంటల పాటు శస్త్ర చికిత్స చేసి కాలేయం, కిడ్నీ మార్పిడిని విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. కాలేయం, కిడ్నీ దాతలతో పాటు రోగికి పక్క పక్కనే ఉన్న ఆపరేషన్ థియేటర్లలో దాదాపు ఏక కాలంలో శస్త్ర చికిత్సలు చేసినట్లు తెలిపారు. ఇద్దరు దాతలు ఒకే వారంలో పూర్తి ఆరోగ్యంతో డిశ్చార్జ్ అయ్యారని వివరించారు. సమావేశంలో హెపటాలజీ అండ్ ట్రాన్స్‌ప్లాంట్ హెపటాలజీకి క్లినికల్ లీడ్ కన్సల్టెంట్ డాక్టర్ గోలమారి శ్రీనివాస్‌రెడ్డి, స్టార్ హాస్పటల్స్ నెఫ్రాలజీ అండ్ రీనల్ ట్రాన్స్‌ప్లాంట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీధర్, చీఫ్ మెంటర్ రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యమే లక్ష్యం

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

వెంగళరావునగర్: రాష్ట్రంలోని నిరుపేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలియజేశారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని ఎర్రగడ్డ ప్రభుత్వ ఛాతీ ఆస్పత్రి ప్రాంగణంలో జరుగుతున్న టిమ్స్ నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏడాది కాలంలో రూ.1500 కోట్లు ఎల్‌ఓసీలు, సీఎంఆర్‌ఎఫ్‌లకు చెల్లించినట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీని పటిష్టం చేసి రూ.10 లక్షలకు పెంచామన్నారు. నిరుపేదలు కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లి అప్పుల పాలు కాకుండా ఉండేందుకే టిమ్స్‌ల నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. తమది స్కీముల ప్రభుత్వం కాగా బీఆర్‌ఎస్‌ది స్కాముల ప్రభుత్వమని విమర్శించారు. ఆ ప్రభుత్వం స్కాంలు చేసి అబాసుపాలైనట్లు చెప్పారు. రెండు మూడు నెలల్లో గోషామహల్ స్టేడియంలో ఉస్మానియా నయా దవాఖానా నిర్మాణం చేపడుతున్నామని, నిమ్స్ దవాఖానాను వీలైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ఆర్‌అండ్‌బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్‌రాజ్, సీఈ రాజేశ్వర్ రెడ్డి, ఎలక్ట్రిసిటీ విభాగం సీఈ లింగారెడ్డి, ఎస్‌ఈ విశ్వకుమార్, ఈఈలు, మెఘా ఇంజినీరింగ్ సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'ఏకలవ్య కాలనీ ఎరుకుల జీవన గాథలు' గ్రంథావిష్కరణ



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ఎన్.వేణుగోపాల్, చిత్రంలో కె.శివారెడ్డి, ఏకే ప్రభాకర్

నాంపల్లి: ఎరుకుల కుటుంబాల్లోని సాంస్కృతిక జీవన వైవిధ్యం, స్వీయ చరిత్రాత్మకమైన ఆత్మాశ్రయ కథనాలను రచయిత పలమనేరు బాలాజీ పుస్తక రూపంలో వెలువరించడం అభినందనీయమని సాహిత్య విమర్శకుడు ఎన్.వేణుగోపాల్ పేర్కొన్నారు. తెలుగు సాహిత్యంలో తొలి ఎరుకుల కథా సంపుటి, రచయిత పలమనేరు బాలాజీ రచించిన 'ఏకలవ్య కాలనీ ఎరుకుల జీవన గాథలు' గ్రంథావిష్కరణ సభ మంగళవారం సైఫాబాద్ సామ్రాట్ కాంప్లెక్స్ సైబాబా సాధి బుక్‌స్టాల్‌లో జరిగింది. వీక్షణం పత్రిక సంపాదకులు, సాహిత్య విమర్శకుడు ఎన్.వేణుగోపాల్ ముఖ్య అతిథిగా హాజరై గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ గ్రంథాన్ని కవి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత కె.శివారెడ్డి స్వీకరించారు. ఏకే ప్రభాకర్ పుస్తక సమీక్ష చేశారు. కథకుడిగా, కవిగా విమర్శకుడిగా నవలాకారుడిగా సృజనను కొనసాగిస్తూ ఇప్పుడు ఎరుకల కథలను గ్రంథస్తం చేయడం ద్వారా తెలుగు సాహిత్యానికి ఏకలవ్య కాలనీ పేరుతో ఒక మంచి కథా సంపుటిని అందించారని ప్రశంసించారు. తెలుగు సమాజాల నుంచి ఎరుకుల కథా సాహిత్యాన్ని వెలువరించడం ద్వారా పలమనేరు బాలాజీ గిరిజన జీవితాల్లోని ఉద్వేగాలను తెలుగు పాఠకులకు కథా సంపుటి ద్వారా పరిచయం చేయడం మంచి విషయమని కవి కె.శివారెడ్డి అన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు సైబాబా, కృపాకర్ మాదిగ, జూపాక సుభద్ర, తాయమ్మ కరుణ, సమ్మెట ఉమాదేవి, దాట్ల దేవదానం రాజు, సుకోజి దేవేంద్రచారి, ఇంద్రవెల్లి రమేష్, ఎంచి రామిరెడ్డి, మెర్సీ మార్గరెట్, ఆర్.కే, ఆర్టీసీ జి.శ్రీనివాస్, వాసిరెడ్డి నవీన్ పాల్గొన్నారు.

'మనూ'లో మహిళల కోసం కోర్సులు ప్రారంభం

రాయదుర్గం: వచ్చే విద్యా సంవత్సరం నుంచి నగరంలో మహిళల కోసం ప్రత్యేక కోర్సులు ప్రారంభించనున్నట్లు మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో డీన్ పూర్వ విద్యార్థుల వ్యవహారాలు, 'మనూ' పూర్వ విద్యార్థుల సంఘం నిర్వహించిన 'ఉర్దూ యూనివర్సిటీ సే తలీమ్ మేరీ కామియాబి కా రాజ్' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌ను ఆయన మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ విద్యావిధానం ప్రకారం విద్యా సంస్థలు ఇప్పుడు విద్యార్థుల కోసం వేచి ఉండాల్సిన అవసరం లేదన్నారు. ఎన్‌ఈపీ మార్గదర్శకాల ప్రకారం మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ తన క్యాంపస్‌ను విస్తరిస్తోందన్నారు. సెమినార్‌లో పాల్గొన్న వారికి వైస్‌చాన్స్‌లర్ చేతులమీదుగా సర్టిఫికెట్లను కూడా పంపిణీ చేశారు. కార్యక్రమంలో 'మనూ' అల్యూమ్నీ అఫైర్స్ డీన్, కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ సయ్యద్ నజాముల్ హసన్, ఎంసీజే కో ఆర్డినేటర్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మహ్మద్ ముస్తఫా అలీ, 'మనూ' పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఐజజ్ అలీ ఖురైషి, పూర్వ విద్యార్థులు, పలువురు ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ, అధికారులు పాల్గొన్నారు.

జనసంద్రంగా సీఎం ప్రజావాణి

లక్డీకాపూల్: మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమం జనసంద్రంగా మారింది. ఇందిరమ్మ ఇళ్ల కోసం వెల్లువలా దరఖాస్తులు అందాయి. దరఖాస్తులను ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జీ.చిన్నారెడ్డి స్వీకరించారు. వివిధ అంశాలపై ప్రజలు అందజేసిన అర్జీలు తీసుకుని వాటిపై ఎండార్స్‌మెంట్ చేసి సంబంధిత శాఖల అధికారులకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్యలు అక్కడికక్కడే పరిష్కారం అయ్యేవిధంగా చర్యలు తీసుకున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు ఇందిరమ్మ ఇళ్ల కోసం పెద్ద ఎత్తున ప్రజావాణికి తరలివచ్చారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రభుత్వం ఆన్‌లైన్ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని విధి విధానాలు రూపొందించినప్పటికీ ఆ విషయం తెలియని ప్రజలు ప్రజావాణికి తరలివచ్చారు. చిన్నారెడ్డి సూచన మేరకు సిబ్బంది ప్రజల నుంచి దరఖాస్తులు సేకరించి హౌసింగ్ శాఖ అధికారులకు ప్రత్యేకంగా అందజేశారు. 465 దరఖాస్తులు అందాయి. పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖకు సంబంధించి 130 దరఖాస్తులు, మైనార్టీ సంక్షేమ శాఖకు సంబంధించి 87, విద్యుత్ శాఖకు 68, రెవెన్యూ శాఖకు 60, హోంశాఖకు 20, ఇతర శాఖలకు సంబంధించిన 99 దరఖాస్తులు వచ్చాయని ప్రజావాణి అధికారులు తెలిపారు.

ఔటర్ నుంచి ర్యాంప్ నిర్మాణం

- ఐటీ ఉద్యోగులకు ఊరట
- నానక్‌రాంగూడ సర్కిల్‌లో తగ్గనున్న ట్రాఫిక్
- మణికొండ, నార్సింగివాసులకు ఉపశమనం
- పనులు ప్రారంభించిన హెచ్‌ఆర్‌డీసీఎల్ అధికారులు
- కొద్ది దూరం సైకిల్ ట్రాక్ సోలార్ ప్యానల్స్ తొలగింపు



ర్యాంప్ నిర్మించే చోట తొలగించిన సైకిల్ ట్రాక్ సోలార్ ప్యానల్స్

మణికొండ: నానక్‌రాంగూడ ఔటర్ రింగ్ రోడ్డు సర్కిల్‌లో ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యను నివారించేందుకు హెచ్‌ఆర్‌డీసీఎల్ అధికారులు చర్యలు చేపడుతున్నారు. గచ్చిబౌలి నుంచి నానక్‌రాంగూడ వరకు వస్తున్న ద్విచక్ర, త్రిచక్ర, కార్లలో వస్తున్న ప్రయాణికులు అక్కడ దిగడంతో ట్రాఫిక్ విపరీతంగా పెరిగి గంటల తరబడి సర్కిల్‌లో వేచి ఉండాల్సి వస్తుంది. ఇప్పటికే అక్కడ ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసినా అది దాటేందుకు అధిక సమయం పట్టడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. నార్సింగివైపు నుంచి గచ్చిబౌలి, మైండ్ స్పేస్ వెళ్లే ప్రయాణికుల పరిస్థితి నానక్‌రాంగూడ సర్కిల్‌లో అలాగే ఉండటంతో ఇప్పటికే సర్కిల్ కంటే ముందే ఔటర్ రింగ్ రోడ్డు ఎక్కే అవకాశం కల్పించడంతో అక్కడ ట్రాఫిక్ రద్దీ తగ్గింది. అదే తరహాలో గచ్చిబౌలి నుంచి వచ్చే ప్రయాణికులు నానక్‌రాంగూడ సర్కిల్ వద్ద కాకుండా మరింత ముందుకు వచ్చి కిందకు దిగితే సర్కిల్‌లో ట్రాఫిక్ సమస్య తీరుతుందని మాదాపూర్ ట్రాఫిక్ పోలీసులు సూచించారు. దాంతో స్పందించిన హెచ్‌ఆర్‌డీసీఎల్ అధికారులు మంగళవారం ర్యాంప్ నిర్మాణ పనులు చేపట్టారు. అడ్డుగా ఉన్న సైకిల్ ట్రాక్‌పై ఉన్న సోలార్ ప్యానళ్లను 80 మీటర్ల పొడవు వరకు తొలగించారు. గచ్చిబౌలి, మైండ్‌స్పేస్ తదితర ప్రాంతాల్లో ఉన్న ఐటీ సంస్థల్లో పనిచేసి మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలోని వారి నివాసాలకు వచ్చే ఉద్యోగులు నానక్‌రాంగూడ సర్కిల్‌లో కాకుండా కొంత ముందుకు వచ్చి కొత్తగా ఏర్పాటు చేయనున్న ర్యాంప్ వద్ద ఔటర్ దిగి టోల్ గేట్ నుంచి మణికొండ ల్యాంకోహిల్స్ సర్కిల్‌కు ఏర్పాటు చేసిన కొత్త రోడ్డు ద్వారా వచ్చే అవకాశం కలుగుతుంది. దాంతో నానక్‌రాంగూడ సర్కిల్‌తో పాటు ఖాజాగూడ, డీపీఎస్ స్కూల్ ప్రాంతాల్లోనూ ట్రాఫిక్ తగ్గుతుందని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

ఘనంగా ఎంసీఈఎంఈ వార్షికోత్సవం

- హాజరైన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



గ్రాడ్యుయేట్లకు పట్టాలు ప్రదానం చేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

రసూల్‌పురా: తిరుమలగిరిలోని మిలిటరీ కాలేజ్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ మెకానికల్ ఇంజినీరింగ్ (ఎంసీఈఎంఈ) ఆడిటోరియంలో 106వ స్నాతకోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరై డిగ్రీ ఇంజినీరింగ్ కోర్సు 105 మంది, టెక్నికల్ ఎంట్రీ స్కీమ్ కోర్సు పూర్తి చేసిన 42 మంది ఈఎంఈ విద్యార్థులకు, విదేశీ అధికారులతో సహా 49 మంది అధికారులకు గ్రాడ్యుయేషన్ కోర్సుల పట్టాలను ఆయన అందజేశారు. ప్రతిభ కనబర్చిన గ్రాడ్యుయేట్లకు బంగారు, రజత పతకాలను బహూకరించారు. ఫీల్డ్ ఆర్మీ కోసం అత్యుత్తమ యుద్ధానికి సిద్ధంగా సాంకేతిక నిపుణులను ప్రోత్సహించడంలో ఎంసీఈఎంఈ దేశం గర్వించదగ్గ శిక్షణ కార్యాలయం అని కొనియాడారు. గ్రాడ్యుయేట్స్ సాయుధ దళాలు, దేశానికి సేవలు అందించాల్సిన బాధ్యత అన్నారు. రక్షణ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డ్రోన్స్, అటానమస్ రోబోలు, మెషిన్ లెర్నింగ్ విభాగాల్లో ఎంసీఈఎంఈ అధికారులు రూపొందించిన అభివృద్ధి చేసిన ప్రాజెక్టుల ప్రదర్శనను గవర్నర్ తిలకించారు. టీఈఎస్-42 ఉత్తమ ఆల్ రౌండర్ విద్యార్థి లెఫ్టినెంట్ ముదిత్‌గుప్తాకు జీవోసీ ఇన్ చీఫ్ ఆర్ ట్రాక్ ట్రోఫీని, ఆర్డర్ ఆఫ్ మెరిట్‌లో మొదటి స్థానంలో నిలిచిన మేజర్ అమృత్‌యాదవ్‌కు గోల్ మెడల్‌ను గవర్నర్ అందజేశారు. లెఫ్టినెంట్ జనరల్ నీరజ్ వర్షిని తదితరులు పాల్గొన్నారు.

ఖనిజ సంపదను కార్పొరేట్‌కు కట్టబెట్టేందుకే..

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్‌కౌంటర్లు మొదలు పెట్టాయి
- ప్రొఫెసర్ హరగోపాల్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

సుల్తాన్‌బజార్: చత్తీస్‌ఘడ్‌లోని ఆదివాసీల ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్‌కౌంటర్లు చేయడం మొదలు పెట్టాయని ప్రొఫెసర్ హరగోపాల్ ఆరోపించారు. హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక రాష్ట్ర కన్వినర్ ప్రొఫెసర్ జి.లక్ష్మణ్, సీఎల్‌సీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణరావుతో కలిసి ఆయన మాట్లాడారు. చత్తీస్‌ఘడ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లాలోని అటవీ ప్రాంతంలో ఈ నెల 11, 12 తేదీల్లో జరిగిన ఎన్‌కౌంటర్ బూటకమన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా 2026 మార్చి వరకు మావోయిస్టు ఉద్యమాన్ని పూర్తిగా అణిచివేస్తామని, నక్సలైట్లు అనే వారిని లేకుండా చేస్తామని బహిరంగంగా ప్రకటించారన్నారు. చత్తీస్‌ఘడ్‌లో విలువైన ఖనిజాలు ఉండటంతో వాటిని కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తే దేశ అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందని ఆ రాష్ట్ర సీఎం చెప్పారని, దీనికి ఎవరు అడ్డు వచ్చినా సహించేది లేదని ప్రకటించారన్నారు. పరిరక్షిస్తామని అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు ఎన్‌కౌంటర్లు చేయడం మొదలు పెట్టాయని, ఒక మనిషి ప్రాణాలు తీయడం రాజ్యాంగానికి విరుద్ధమని, ఈ ఎన్‌కౌంటర్లపై సిట్టింగ్ జడ్జిచే న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వేదిక రాష్ట్ర కన్వీనర్ ప్రొఫెసర్ అన్వర్‌ఖాన్, అనురాధ, షేక్ షావలి తదితరులు పాల్గొన్నారు.

షేక్‌పేట డిప్యూటీ ఐఓఎస్ సస్పెన్షన్

సాక్షి, సిటీబ్యూరో: షేక్‌పేట మండలంలోని ఉపాధ్యాయులు బోధన సమయంలో పాఠశాలలను మూసివేసి లంచ్ పార్టీకి అనుమతించిన షేక్‌పేట మండల డిప్యూటీ ఐఓఎస్ కే.యాదగిరిని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సస్పెండ్ చేశారు. ఈ నెల 13న షేక్‌పేట ఉపాధ్యాయులు తరగతి గదులను మూసేసి అంతా ఒకచోట చేరి లంచ్ పార్టీ చేసుకోవడానికి అనుమతించి విధుల పట్ల నిర్లక్ష్యం వహించినందుకు ఆయనను సస్పెండ్ చేశారు. లంచ్ పార్టీలో పాల్గొన్న మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 80 మంది ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

రాత పరీక్ష నిబంధన ఎత్తివేయాలి



కోఠి డీఎంహెచ్‌ఎస్ వద్ద ధర్నా చేస్తున్న ఏఎన్‌ఎంలు

సుల్తాన్‌బజార్: ఈనెల 29న జరగనున్న ఏఎన్ఎం/ఎంపీహెచ్ఏ(ఎఫ్) రిక్రూట్‌మెంట్ రాత పరీక్షను నిలిపివేయాలని కోరుతూ కోఠిలోని డీఎంహెచ్‌ఎస్ ఆవరణలో తెలంగాణ వైద్య ఆరోగ్య ఉద్యోగ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. సంఘం రాష్ట్ర నాయకులు యాదనాయక్, సాయిరెడ్డి, భూపాల్ మాట్లాడుతూ.. 20 సంవత్సరాల నుంచి కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ సర్వీస్ చేస్తున్న ఏఎన్‌ఎంలకు రిక్రూట్‌మెంట్ బోర్డు రాత పరీక్షను పెట్టడం సబబు కాదన్నారు. రాత పరీక్షను తక్షణమే నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. మెరిట్, స్థానికత ఆధారంగా రోల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించి 20 సంవత్సరాల క్రితం నియమించారని గుర్తుచేశారు. ఇన్ని సంవత్సరాల సర్వీస్‌కు 50 మార్కులు, ఏఎన్ఎం ట్రైనింగ్‌లో పొందిన మార్కుల ఆధారంగా 50 మార్కుల విధానాన్ని పాటించి రాత పరీక్ష లేకుండా రెగ్యులరైజేషన్ చేయడాన్ని పరిశీలించాలని కోరారు. అలాగే సర్వీస్‌లో ఉన్నవారికి వయోపరిమితి ఎత్తివేయాలన్నారు. ధర్నాలో పెద్ద ఎత్తున ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల సాధనకు నిరంతర పోరాటం

అడ్డగుట్ట: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు ఎంప్లాయిస్ సంఘ్ ఎల్లప్పుడూ కార్మికుల పక్షాన పోరాడుతూనే ఉంటుందని ఎన్ఎఫ్ఐఆర్, దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య వెల్లడించారు. రైల్వే ట్రేడ్ యూనియన్ ఎన్నికల్లో గుర్తింపు సాధించిన దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ నాయకులు మంగళవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. హైదరాబాద్ భవన్ నుంచి రైల్ నిలయం వరకు పెద్ద సంఖ్యలో ర్యాలీగా వెళ్లి రైల్ నిలయం ఆవరణలో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మర్రి రాఘవయ్య మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన ఎన్నికల్లో విజయవాడ, సికింద్రాబాద్ డివిజన్లలో మెజార్టీ తగ్గినా గుర్తింపు సాధించామని తెలిపారు. రైల్వేలోని 13 జోన్లలో విజయం సాధించామని, 17 అంశాలపై జనరల్ మేనేజర్‌తో మంగళవారం చర్చించామని తెలిపారు. ఎంప్లాయిస్ సంఘ్ జోనల్ కార్యదర్శి భరణి భాను ప్రసాద్, సహాయ కార్యదర్శులు షేక్ రవూఫ్, రుద్రారెడ్డి, కేవీఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అర్హత ప్రకారం పదోన్నతులు కల్పించాలి



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీలో పనిచేస్తున్న సిబ్బందికి అర్హతల ప్రకారం పదోన్నతులను కల్పించాలని భారతీయ మజ్దూర్ సంఘ్ దక్షిణ రాష్ట్రాల ఆర్గనైజింగ్ సెక్రటరీ దొరై రాజు డిమాండ్ చేశారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి ఉద్యోగ విరమణ పొందిన రోజునే అన్ని రకాల బెనిఫిట్స్ చెల్లించాలని కోరారు. కార్మికులు, ఉద్యోగుల ప్రయోజనాల పరిరక్షణకు బీఎంఎస్ 70 ఏళ్లుగా రాజీలేని పోరాటం చేస్తోందని తెలిపారు. బాగ్‌లింగంపల్లి, నెహ్రూపార్కు, ఖైరతాబాద్ తదతర ప్రాంతాల్లో పర్యటించి సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బీఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూర్పు రాంరెడ్డి మాట్లాడుతూ రూ.వేల కోట్ల లాభాల బాటలో ఉన్న జీహెచ్‌ఎంసీని గత పాలకులు అప్పుల ఊబిలోకి నెట్టేశారని ఆరోపించారు. కనీసం రాష్ట్ర ప్రభుత్వ ఆస్తుల నుంచి రావాల్సిన ప్రాపర్టీ ట్యాక్స్ కూడా రాకపోవడంతో ఖజానా దివాలా తీసిందని విమర్శించారు. బీఎంఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ, ఉపాధ్యక్షుడు నాగమణి, అడిషనల్ ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, కార్యదర్శి రూపేష్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, బుధవారం, 18, డిసెంబర్, 2024





శీతల ప్రయాణం..

పర్యాటక ప్రాంతాలకు సిద్ధమవుతున్న నగర వాసులు

కొద్ది రోజుల క్రితం సాధారణ స్థాయిలో ఉన్న విమానయాన ధరలు అమాంతం రెట్టింపయ్యాయి. ముఖ్యంగా డిసెంబర్ 15 నుంచి 31 తేదీల్లో గతంతో పోల్చితే రెండింతలు, మూడింతల మేర పెరిగాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. నగర వాసుల్లో ప్రయాణాల పట్ల ఉన్న ఆసక్తే దీనికి కారణం. కాగా ప్రస్తుత నెలల్లో వరుసగా క్రిస్మస్, ఇయర్ ఎండ్, న్యూఇయర్, సంక్రాంతి వంటి పండుగల నేపథ్యంలో నగరవాసులకు భారీగా సెలవులు అందుబాటులోకి వచ్చాయి. దీంతో ట్రావెలింగ్ మంత్‌గా డిసెంబర్‌ను ఎంచుకుంటున్నారు. ప్రతి యేడాదీ డిసెంబర్ నెలలో ఏదో ఒక టూర్ వేయడం అందివచ్చిన సెలవులను వినియోగించుకోవడం నగర వాసులకు అలవాటే. ఇందు కోసం ముందస్తుగానే నగరంలోని ప్రయాణ ప్రేమికులు వారి ప్రయాణ గమ్యస్థానాలకు మార్గాలను సుగమం చేసుకున్నారు. యువత, టెకీలు ట్రావెలింగ్ ప్లాన్స్‌లో బిజీగా ఉన్నారు. ముఖ్యంగా డొమెస్టిక్ ప్రయాణాలు ఇప్పటికే సోల్డ్ ఔట్ బోర్డ్‌పెట్టే పరిస్థితులు కనిపిస్తున్నాయి. - సాక్షి, సిటీబ్యూరో



- ఓవైపు ఇయర్ ఎండింగ్.. మరోవైపు క్రిస్మస్, న్యూ ఇయర్
- వరుస పండుగలతో బోలెడన్ని సెలవులు
- ట్రెయిన్, బస్సు, ఫ్లైట్ టికెట్లు ముందస్తుగా బుకింగ్
- శీతాకాలమైనా నార్త్‌కే సై అంటున్న నగరవాసులు

కొందరు ఐటీ ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ టెకీలు యేడాదంతా వారి సెలవులను వినియోగించకుండా తమ తమ విధులు నిర్వహిస్తుంటారు. దీంతో పాటు మరికొందరు టెకీలకు, కాల్ ఇంటర్నేషనల్ కాల్ సెంటర్ ఉద్యోగులకూ డిసెంబర్ నెలలో భారీగా సెలవులు ఉంటాయి. దీంతో ఆయా సెలవుదినాలను డిసెంబర్ డెస్టినేషన్ కోసమే వినియోగిస్తుంటారు.. నగరంలో విస్తరిస్తున్న ఐటీ ట్రెండ్‌తో గత కొన్నేళ్లుగా ట్రావెలింగ్ రంగంలోనూ భారీ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఓ వైపు మిగిలిపోయిన సెలవులు, మరోవైపు నగరంలోని విదేశాలకు చెందిన గ్లోబల్ కంపెనీల క్రిస్మస్ లీవ్స్ దీనికి ప్రామాణికం అవుతున్నాయి. వీటిని ఎంజాయ్ చేయడానికి ఇప్పటికే యుద్ధప్రాతిపధికన టీమ్ హెడ్‌లకు మెయిల్స్ పెట్టేయడం, ట్రావెల్ ఏజెన్సీలను సంప్రదించడం, పర్యాటక ప్రాంతాల్లో విడిది, విందు, వినోదం తదితరాలకు సన్నాహాలు పూర్తయ్యాయి. ఇది కొత్తేం కాకపోయినప్పటికీ.. ఈ కల్చర్ ఈ ఏడాది మరింత పుంజుకోవడం విశేషం. సాధారణ రోజుల్లో 4 వేల నుంచి 9 వేల వరకూ ఉండే దేశీయ విమాన చార్జీలు ప్రస్తుతం 14 నుంచి 20 వేలకు పైగా కొనసాగడం ఈ సంస్కృతి ప్రభావానికి నిదర్శనం. కన్యాకుమారి, కేరళ మొదలు.. మనాలి, డార్జిలింగ్ వంటి శీతల ప్రదేశాలకు బయలు దేరుతున్నారు. మరికొందరైతే స్విస్ దేశాలు, సింగపూర్, మలేషియా, బ్యాంకాక్ వంటి విదేశాలకు బుకింగ్‌లు మొదలెట్టారు.

ఏడాదికి వీడ్కోలు..

పాత సంవత్సరానికి గుడ్ బై చెప్పడం, నూతన ఏడాదికి నూతనోత్సాహాన్ని పొందడం కోసం కూడా ట్రావెలింగ్ డెస్టినేషన్‌లనే ఎంచుకుంటున్నారు ఈ తరం యువత. ఇయర్ ఎండ్ వేడుకలకైతే గోవాలాంటి మ్యూజికల్ నైట్స్ కోసం పరితపిస్తున్నారు నగర వాసులు. ఇందులో భాగంగానే హైదరాబాద్ నుంచి నేరుగా గోవాకు వేసిన కొత్త రైలు సేవలు పొందడానికి ముందస్తుగానే బెర్త్ కరారు చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఆలస్యంగా బుక్ చేస్తే ఈ చార్జీలు మరింత పెరిగిపోతాయని ఇప్పటికే చాలా టూర్స్ ప్లానింగ్, బుకింగ్ పూర్తయ్యాయని గూగుల్ చెబుతుంది. ఈ వేదికల్లో అవకాశం లేకపోతే ప్రైవేటు ట్రావెల్స్‌ను సైతం ఆశ్రయిస్తూ, సెల్ఫ్ డ్రైవింగ్‌కు సై అంటున్నారు. ఈ నేపథ్యంలో నగరంతో పాటు దేశంలోని వివిధ పర్యాటక ప్రాంతాల్లోని ట్రావెలింగ్ ఏజెన్సీలు, ఈవెంట్ ఆర్గనైజర్లు ముందస్తు పండగలు చేసుకుంటున్నారు.

ఎత్తయిన ప్రదేశాలకు..

ఇప్పటికే ఈ సీజన్‌లో దక్షిణాది రాష్ట్రాల్లోని కూర్గ్, ఊటీ, మున్నార్, వయనరాడ్, కొడైకెనాల్, ఇడుక్కి, యరక్కాడ్, కున్నూర్ వంటి హిల్ స్టేషన్స్‌కి భారీగా టికెట్లు బుక్ అయ్యాయని లోకల్ ట్రావెల్ ఏజెన్సీల నిర్వాహకులు చెబుతున్నా మాట. దీంతోపాటు ఈ మధ్య కాలంలో మనాలి, డార్జిలింగ్, సిమ్లా, షిల్లాంగ్ వంటి చల్లటి ప్రకృతి ప్రాంతాలను ఆస్వాదించడానికి ఉవ్విళ్లూరుతున్నారు. ఈ ట్రిప్స్‌లో భాగంగానే నార్త్‌కు ఎక్కువగా ప్రయాణమవుతున్నారు. అంతేకాకుండా సాంస్కృతిక వైవిధ్యాన్ని తిలకించడానికి కేరళ, ఊటీ వంటి ప్రదేశాలను వారి గమ్యస్థానాలుగా చేర్చుకున్నారు.







గోవా పార్టీలకు...

యేడాది చివరి వేడుకలకు నగర యువత భారీగా ఆసక్తి చూపిస్తోంది. వీరిలో అత్యధికులు వెళ్లే ఏకైక డెస్టినేషన్ మాత్రం గోవానే. ఎందుకంటే..నగర కల్చర్‌లో భాగంగా పంబ్ పార్టీలు, లైవ్ కాన్సర్ట్, డీజే మ్యూజిక్ వంటి ట్రెండ్స్‌ని ఆస్వాదించే వారు, ప్రకృతిని కోరుకునే వారు వేరు వేరుగా ఈస్ట్ గోవా, నార్త్ గోవాలను ఎంచుకుంటారు. తమకు అనుకూలమైన, అనువైన స్పాట్స్‌ను ముందస్తుగానే ఎంచుకుని అందుకు అనుగుణంగా ప్రయాణాలకు టికెట్లను బుక్ చేసుకుంటున్నారు. ఈ లిస్ట్‌లో వైజాగ్, అరకు వ్యాలీ సైతం టాప్‌లోనే ఉన్నాయి.

డోగ్రీ గానులో పూనమ్



సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ నటి పూనమ్ కౌర్ జమ్మూ వీధుల్లో సందడి చేశారు.. ఇక్కడి అందాలతో మనసు పరవశించిపోయిందని పూనమ్ తన సంతోషాన్ని పంచుకున్నారు. జమ్మూ చివరి రాజు హరిసింగ్‌కు సేవలందించిన కెప్టెన్ దివాన్ ఇంటిని సందర్శించారు. ఈ సందర్భంగా 100 ఏళ్ల నాటి డోగ్రీ ప్రజల సంప్రదాయ బంగారు జరీ డ్రెస్సును ధరించి.. తనను తాను చూసుకొని మురిసిపోయారు.

గచ్చిబౌలిలో ఫిట్ ఇండియా సైక్లింగ్ డ్రైవ్

- పారా ఒలింపిక్స్ పతక విజేత జీవన్ జీ దీప్తి హాజరు



గచ్చిబౌలి: ఫిట్ ఇండియా సైక్లింగ్ డ్రైవ్‌ను పారా ఒలింపిక్ పతక విజేత జీవన్ జీ దీప్తి ప్రాంభించారు. ఆరోగ్యకరమైన, ఫిట్ ఇండియా ఉద్యమం దేశ వ్యాప్తంగా వెయ్యి ప్రాంతాల్లో ప్రారంభమైంది. సోమవారం గచ్చిబౌలి హాకీ స్టేడియంలో మంగళవారం 'ఫిట్ ఇండియా సైక్లింగ్ ట్యూస్‌డేస్'ను పారా ఒలింపిక్స్ విజేత దీప్తి ప్రారంభించారు. సైక్లింగ్‌ను ప్రోత్సహించే లక్ష్యంగా చేపట్టిన 3 కిలోమీటర్ల రైడ్‌లో దాదాపు 125 మంది పాల్గొన్నారు. ఫిట్‌నెస్‌కి డోస్, ఆదా గంటా రోజ్ అన్న ప్రధాని మోదీ సందేశాన్ని ప్రతిధ్వనించే విధంగా దేశ వ్యాప్తంగా సైక్లింగ్ రైడ్స్ చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆరోగ్యకరమైన జీవన శైలీ, శారీరక దారుఢ్యం కోసం సైక్లింగ్‌ను ప్రోత్సహించడమే లక్ష్యమని పేర్కొన్నారు.



ఏఐతో శిశువు వీక్షణ..

- ముఖ కవళికలు చూసే అవకాశం
- జీవీకే హెల్త్ హబ్‌లో ఏఐ, 5డీ సాంకేతికత

సాక్షి, సిటీబ్యూరో: మాతృత్వం ఓ అందమైన అనుభూతి. కడుపులో బిడ్డ పడ్డప్పటి నుంచి భూమిపైకి వచ్చే వరకూ కడుపులో బిడ్డ గురించి ప్రతి క్షణం ఆలోచిస్తూ ఉంటారు. బిడ్డ కదిలినప్పుడు, తన్నినప్పుడు వచ్చే సంతోషం తల్లికి మాత్రమే తెలుసు. అయితే పాప ఎలా ఉంటుందో చూడాలని తాపత్రయ పడుతుంటారు. శిశువు హావభావాలు, ముఖ కవళికలు కూడా స్పష్టంగా చూసే సరికొత్త సాంకేతికత మన నగరంలో తొలిసరిగా అందుబాటులోకి వచ్చింది.

అదో అనుభూతి..

ఏఐ సాంకేతికత సాయంతో పనిచేసే 5డీ బేబీ ఎక్స్ ప్రెషన్ టెక్నాలజీ సాయంతో పాప ముఖాన్ని గర్భంలో ఉండగానే స్పష్టంగా చూడొచ్చు. నగరంలోని జీవీకే హెల్త్ హబ్ ఈ ఆధునాతన సాంకేతికతను అందుబాటులోకి తెచ్చింది. కడుపులో ఉన్న బిడ్డ నవ్వినా, ఏడ్చినా, ఆవలింతలు తీసినా ఆ ఎక్స్ ప్రెషన్స్ ఇమేజింగ్ టెక్నాలజీ.. మన కళ్ళకు కట్టినట్టు చూపిస్తుంది.

సమస్యలూ గుర్తించొచ్చు..

5డీ స్కానింగ్‌తో శిశువు శారీరక, మానసిక ఎదుగుదలను గుర్తించే వీలుందని నిపుణులు చెబుతున్నారు. శిశువును అన్ని కోణాల్లో పరిశీలించిన తర్వాత సమస్యలేవైనా ఉంటే సరిదిద్దే అవకాశం ఉందో తెలుసుకుంటామని పేర్కొన్నారు. ఏఐ సాంకేతికత.. శిశువు శరీర పెరుగుదలను అంచనా వేస్తుందని అంటున్నారు. **దీనిని ఎట్టి పరిస్థితుల్లోనూ లింగ నిర్ధారణకు వినియోగించబోమని నిర్వాహకులు చెబుతున్నారు.**

పుస్తకం.. సమస్తం..

- విభిన్న భాషలు.. భిన్న సాంస్కృతిక పార్శ్వాలు
- హైదరాబాద్ జాతీయ పుస్తక మహోత్సవానికి 37 వసంతాలు
- ప్రతి రోజు మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 9 వరకూ ప్రదర్శన



సాక్షి,సిటీబ్యూరో : చదువరి చెంతకు చేరేందుకు పుస్తకం సన్నద్ధమైంది. విభిన్న సంస్కృతులు, బహుభాషలకు నిలయమైన భాగ్యనగరంలో యేటా పుస్తక వేడుక లక్షలాది మంది పాఠకమహాశయుల జ్ఞానదాహార్తిని తీరుస్తోంది. నగరంలో ఎనిమిదో దశాబ్దంలో మొదలైన ఈ జాతీయ పుస్తక ప్రదర్శన 37వ వేడుకలు ఈ నెల 19న గురువారం ప్రారంభం కానున్నాయి. 29 వరకు 10 రోజుల పాటు ఎన్టీఆర్ స్టేడియంలో జాతీయ, అంతర్జాతీయ పుస్తక సంస్థలతో పాటు, తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖ పుస్తక ప్రచురణ సంస్థలు పాల్గొనున్నాయి. 350 స్టాళ్లలో ఇంగ్లిష్ పుస్తక ప్రచురణ సంస్థలకు 170, తెలుగు పుస్తక సంస్థలకు 131 స్టాళ్లను కేటాయించినట్లు నిర్వాహకులు వాసు తెలిపారు. రచయితల కోసం ప్రత్యేకంగా 8 స్టాళ్లను ఏర్పాటు చేశారు. 22 మంది రచయితలు స్వయంగా తమ పుస్తకాలను విక్రయించుకొనేందుకు ఏర్పాట్లు చేశారు. ఇందులో వైవిధ్యభరిత భాగ్యనగర సంస్కృతి, విభిన్న జీవన శైలులను సమున్నతంగా ఆవిష్కరించే వివిధ భాషల పుస్తకాలకు అపూర్వ ఆదరణ లభిస్తోంది.

పుస్తక ప్రియుల కోసం..

సామాజిక మాధ్యమాలు, ఇంటర్నెట్‌లు, స్మార్ట్ ఫోన్‌లు రాజ్యమేలుతున్న ప్రస్తుత తరుణంలోనూ వేలాది మంది పుస్తక ప్రియులు తమకు నచ్చిన పుస్తకం కోసం ప్రతి సంవత్సరం ప్రదర్శనకు తరలివస్తూనే ఉన్నారు. బాలల సాహిత్యం, ఆధ్యాత్మికం, వ్యక్తిత్వ వికాసం, వైద్యం, ఆరోగ్యం వంటి అన్ని రంగాలకు చెందిన పుస్తకాలతో పాటు, చరిత్ర, సాహిత్యం, ప్రముఖుల జీవిత చరిత్ర గ్రంథాలపై పాఠకులు మక్కువ చూపుతున్నారు.

ఇదీ నేపథ్యం..

నగరంలో 1980లలో మొదటిసారి పుస్తక ప్రదర్శన ప్రారంభమైంది. వాస్తవానికి నిజాంల కాలం నుంచే పుస్తకాలకు ఆదరణ ఉంది. అధికార భాష ఉర్దూతో పాటు తెలుగు, మరాఠా, కన్నడ భాషలకు చెందిన ప్రజలతో పాటు హిందీ, ఇంగ్లిష్ పుస్తకాలు బాగా చదివే ప్రజలు కూడా మొదటి నుంచీ ఇక్కడ ఉన్నారు. దీంతో పాఠకుల అభిరుచికి తగిన విధంగా పుస్తక ప్రచురణ సంస్థలు, అమ్మక సంస్థలు ఆవిర్భవించాయి. కోఠీలోని బడీచౌడీ ఒక పుస్తక బజార్‌గా వెలుగొందింది. ఈ బుక్ సెల్లర్సే హైదరాబాద్ బుక్ ఫెయిర్‌కు శ్రీకారం చుట్టారు. విశాలాంధ్ర, ప్రజాశక్తి, మిళింద ప్రకాశన్, ఎమెస్కో, నవోదయ వంటి సంస్థలు అప్పటి నుంచి ఇప్పటి వరకూ ఇతోధికమైన కృషి కొనసాగిస్తున్నాయి.

నేషనల్ బుక్ ట్రస్టు కృషి..

దేశవ్యాప్తంగా పుస్తక పఠనాన్ని పెంచే ఉన్నత లక్ష్యంతో నేషనల్ బుక్ ట్రస్టు ఆవిర్భవించింది. లక్ష్యసాధనలో భాగంగానే 1986లో 'హైదరాబాద్ బుక్ ఫెయిర్'ను కేశవ మెమోరియల్ స్కూల్ మైదానంలో మొదటిసారి ఏర్పాటు చేశారు. అనంతరం నిజాంకళాశాల మైదానం, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయం, నెక్లెస్‌రోడ్డు ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు.

దాశరథి ప్రాంగణం..

పుస్తక ప్రాంగణానికి ఈ ఏడాది దాశరథి కృష్ణమాచార్య ప్రాంగణంగా నామకరణం చేశారు. ఇటీవల కన్నుమూసిన ప్రముఖ రచయిత్రి డాక్టర్ బోయి విజయభారతి స్మారక వేదికను ఏర్పాటు చేశారు. అలాగే తోపుడు బండిపై పుస్తకాలతో రెండు తెలుగు రాష్ట్రాల్లో విస్తృతంగా తిరిగిన సాధిక్ పేరిట మరో వేదికను ఏర్పాటు చేశారు.



డిజైనర్స్ హాత్‌లో తారల తళుక్..

బంజారాహిల్స్: రోడ్ నెం.1లోని తాజ్ కృష్ణా హోటల్‌లో ఏర్పాటు చేసిన డిజైనర్స్ హాత్ ఎగ్జిబిషన్ (ఐడీహెచ్) ఆకట్టుకుంది. ఈ ఎగ్జిబిషన్‌ను మిస్ ఇండియా తెలంగాణ–2023 ఊర్మిలా చౌహాన్ ముఖ్య అతిథిగా హాజరై సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి ప్రసిద్ధిగాంచిన డిజైనర్లు రూపొందించిన వస్త్రాలతో పాటు ఆభరణాలు ఈ ఐడీహెచ్‌లో ప్రత్యేకంగా లభిస్తాయని వెల్లడించారు. రెండు రోజుల పాటు ఈ ఎగ్జిబిషన్ కొనసాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఇక్కడ లభిస్తున్న దుస్తులు, ఆభరణాలతో మోడల్స్ సందడి చేశారు.



క్లుప్తంగా...

నేడు అసెంబ్లీ ముందుకు ఆర్‌ఓఆర్- 2024 బిల్లు

ప్రవేశపెట్టనున్న మంత్రి పొంగులేటి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర రెవెన్యూ వ్యవస్థలో కీలక పరిణామం చోటు చేసుకోనుంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అమలులోకి తెచ్చిన భూచట్టం స్థానంలో కొత్త చట్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అమలులోకి తేనుంది. ఈ మేరకు రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్‌ఓఆర్)-2024 బిల్లును బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టనుంది. ఈ చట్టం అమల్లోకి వస్తే రెవెన్యూ వ్యవస్థలో కీలక మార్పులు చోటుచేసుకుంటాయి. సాదా బైనామాల పరిష్కారం, మ్యుటేషన్ తదితర కీలక అంశాలపై ఈ చట్టంతో స్పష్టత వస్తుంది. వాస్తవానికి, ఈ చట్టాన్ని తదుపరి సమావేశాల్లో ఆమోదించాలన్న ఆలోచన ప్రభుత్వానికి ఉన్నా, రైతుల ప్రయోజనార్థం ఈ సమావేశాల్లోనే చట్టాన్ని అమలులోకి తేవాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే బుధవారం అసెంబ్లీలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బిల్లును ప్రవేశపెట్టనున్నారు.

కేటీఆర్, హరీశ్‌ల దొరతనం మరోసారి బయటపడింది..

వారెందుకు బేడీలు వేసుకోలేదు: మంత్రి సీతక్క ప్రశ్న



సాక్షి, హైదరాబాద్: కేటీఆర్, హరీశ్‌ల దొరతనం మరోసారి బయటపడిందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క మండిపడ్డారు. ఇతర బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకు బేడీలు వేశారు తప్ప కేటీఆర్, హరీశ్‌లు వేసుకోలేదన్నారు. నిరసనల్లో కూడా బీఆర్‌ఎస్ నేతల్లో సమానత్వం లేదని, ఇందులోనూ వారు తమ దురహంకారాన్ని ప్రదర్శించారని విమర్శించారు. మంగళవారం అసెంబ్లీ లాబీల్లో మంత్రి సీతక్క విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. రైతులకు బేడీలు వేయడంపై బీఆర్‌ఎస్ నేతలకు మాట్లాడే అర్హత లేదని ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు పది సార్లకు పైగా బేడీలు వేశారని, అప్పుడు అందుకు కారణమైన అధికారులపై చర్యలు కూడా తీసుకోలేదని అన్నారు. రైతులకు బేడీలు వేసిన అంశాన్ని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్రంగా పరిగణించి వెంటనే చర్యలు తీసుకున్నారని గుర్తుచేశారు. అసెంబ్లీలో సభ్యుల ప్రవర్తన విషయంలో బీఆర్‌ఎస్ హయాంలో పెట్టిన నిబంధనలపై వాళ్లే అభ్యంతరం చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. 'గతంలో వెల్‌లోకి వస్తే సభ నుంచి సస్పెండ్ చేసేవారు. ఇప్పుడు వాళ్లు పెట్టిన నిబంధనలను వారే కాలరాస్తున్నారు'అని సీతక్క వ్యాఖ్యానించారు.

కెప్టెన్ లేని బీఆర్‌ఎస్ నావ తుపానులో చిక్కుకుంది

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

సాక్షి, హైదరాబాద్: పార్టీకి నాయకుడు లేకపోతే ఎలా ఉంటుందో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను సభలో చూస్తే స్పష్టంగా అర్థమవుతోందని మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. మంగళవారం అసెంబ్లీ లాబీల్లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కెప్టెన్ లేని బీఆర్‌ఎస్ నావ తుపానులో చిక్కుకుందన్నారు. ఆ నావ ఎక్కడకు వెళుతుందో వారికే తెలియడం లేదని చెప్పారు. ప్రజా సమస్యలపై సభలో చర్చ జరగకూడదన్నది బీఆర్‌ఎస్ టార్గెట్‌గా కనిపిస్తోందని, ఆ పార్టీ ఎమ్మెల్యేలు సభను తప్పు దోవ పట్టిస్తున్నారని తెలిపారు. భూమిలేని పేదలకు డబ్బులు ఇస్తామంటే బీఆర్‌ఎస్ వద్దంటోందని, రైతులకు మేలు జరగడం వారికి ఇష్టం లేదని విమర్శించారు. తనపై సభా హక్కుల తీర్మానం ఎందుకు ఇచ్చారో వారికే అర్థం కావడం లేదని భట్టి చెప్పారు.

పొంగులేటి పేల్చేవి తుస్సు బాంబులు!

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద

సాక్షి, హైదరాబాద్: మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేల్చేవి తుస్సు బాంబులని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ అన్నారు. నిజంగా పేలే బాంబులు అయితే బయటపెట్టాలని డిమాండ్ చేశారు. మంత్రి తన పేరును పొంగులేని బాంబులేటి శ్రీనివాస్‌రెడ్డిగా మార్చుకోవాలన్నారు. మంగళవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుతో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్‌ఎస్‌పై కక్షసాధింపు చర్యలు కొనసాగిస్తోందని ఆరోపించారు. తాజాగా కేటీఆర్ ను ఫార్ములా ఈ రేస్ కేసులో ఇరికించేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఇంతకు ముందు కేటీఆర్ బావమరిది ఇంట్లో డ్రగ్స్ ఉన్నాయని ఇరికించే ప్రయత్నం చేశారని ధ్వజమెత్తారు. లగచర్లలో రైతులు తిరుగుబాటు చేస్తే కేటీఆర్ పేరు ఎఫ్ఐఆర్‌లో చేరుస్తున్నారని పేర్కొన్నారు. కాళేశ్వరం కూలిపోయిందని అసత్య ప్రచారం చేశారని, విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందంలో కేసీఆర్‌పై బురద చల్లుతున్నారని మండిపడ్డారు. ఏడాది నుంచి ఎలాగైనా కేటీఆర్‌ను జైల్లో పెట్టాలని రేవంత్ సర్కార్ విశ్వ ప్రయత్నం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అప్పుల లెక్కలు.. అన్నీ అబద్ధాలే



శాసనసభలో హరీశ్ వర్సెస్ భట్టి

- ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారంటూ పరస్పర విమర్శలు
- వాస్తవాలు నిరూపించేందుకు సిద్ధమంటూ సవాళ్లు
- ఎఫ్ఆర్‌బీఎం కింద రూ.51,277 కోట్లు మాత్రమే అప్పు చేశామన్న భట్టి



- గ్యారంటీల కింద రూ.61,991 కోట్లు, గ్యారంటీ లేని రుణాలు రూ.10,999 కోట్లు సమీకరించినట్లు వెల్లడి
- కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కాలంలోనే రూ.1,27,208 కోట్లు అప్పు చేసిందన్న హరీశ్
- తాము పదేళ్లలో కేవలం రూ.4,17,496 కోట్లు మాత్రమే అప్పు చేసినట్లు వెల్లడి

సాక్షి, హైదరాబాద్: గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో చేసిన అప్పులు.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలో చేసిన అప్పులు.. మంగళవారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయాన్ని వేడెక్కించాయి. ఆరోపణలు.. ప్రత్యారోపణలు, సవాళ్లు.. ప్రతి సవాళ్లతో సభ అట్టుడికింది. ప్రస్తుత ఆర్థిక శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క...గత ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా ఉన్న హరీశ్‌రావుల మధ్య వాడివేడి వాదనలు కొనసాగాయి. అసత్యాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని పరస్పరం విమర్శించుకుంటూ వారివారి లెక్కలను సభ ముందుంచారు.

ప్రివిలేజ్ మోషన్‌పై మాట మార్చారు: భట్టి

'రాజకీయాలు చేయటమే లక్ష్యంగా వ్యవహరించే హరీశ్‌రావు సభలో అన్నీ అబద్ధాలే చెబుతారు. ఏడాదిలో మేం చేసిన అప్పులపై ఆయన చెప్పే లెక్కలు సరికాదు. పదేళ్ల వారి పాలనలో జరిగిన ఆర్థిక విధ్వంసాన్ని చక్కదిద్దేందుకు కొంత అప్పు చేయక తప్పలేదు. ఇక పదేళ్ల వారి హయాంలో చేసిన అప్పుల లెక్కల్లోనూ ఆయనది ప్రజలను తప్పుదారి పట్టించే పద్ధతే. అందుకే మేం అధికారంలోకి రాగానే శ్వేతపత్రం రూపంలో వాస్తవాలను ప్రజల ముందుంచాం. మళ్లీ చర్చ పెడితే నిరూపించేందుకు సిద్ధం. బీఆర్‌ఎస్ నేతలు 10 సంవత్సరాల పాలనలో తప్పులు చేసినందుకు గత డిసెంబర్‌లో జనం శిక్షించారు. ఆరు నెలల్లో పార్లమెంటు ఎన్నికలప్పుడు డిపాజిట్ దక్కకుండా వారికి మతిపోయేలా చేశారు. అయినా వారిలో మార్పు రాలేదు. ఆ పార్టీది భూస్వామ్య మనస్తత్వం. భూమిలేని నిరుపేదలకు ఆర్థిక సాయం చేయరా? అని ఖమ్మంలో ఓ విలేకరి అడిగినప్పుడు, వారికి ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని చెప్పా. దాని ఆధారంగా ప్రివిలేజ్ మోషన్ ఇచ్చి, ఇప్పుడు అప్పుల మీద అవాస్తవాలు మాట్లాడితే ఇచ్చామంటున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో వారికి అనుకూలంగా సభ నియమాలు రూపొందించుకున్నారు. వారి నిబంధనల్లోనే సభలోకి ప్లకార్డులు తీసుకురావద్దని ఉంది..కానీ నిన్న తీసుకొచ్చారు. వీరా నామీద ప్రివిలేజ్ మోషన్ ఇచ్చేది? వారి హయాంలో స్పీకర్ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నప్పుడు బీఏసీలో పాటించిన పద్ధతినే మేం ఇప్పుడు అనుసరిస్తున్నాం. ఇప్పుడు ప్రసాద్ కుమార్ స్పీకర్‌గా ఉన్నారు. వ్యక్తి మారారు తప్ప స్పీకర్ స్థానం అదే. ఆ స్థానాన్ని గౌరవించాలి కదా.. నిన్న బీఏసీలో కాగితాలు విసిరి బయటకొచ్చి ఏవేవో మాట్లాడుతున్నారు.

ఆ ప్రచారంలో వాస్తవం లేదు

మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.లక్ష కోట్లు అప్పు చేసిందని విపక్షాలు చేసే ప్రచారంలో వాస్తవం లేదు. ఎఫ్ఆర్‌బీఎం కింద మేము రూ.51,277 కోట్లు మాత్రమే అప్పు చేశాం. గ్యారంటీల కింద రూ.61,991 కోట్లు, గ్యారంటీ లేని రుణాలు రూ.10,999 కోట్లు సమీకరించాం. మీ హయాంలో చేసిన అప్పుపై వడ్డీ రూపేణ రూ.66 వేల కోట్లు చెల్లించాం. మీరు పెట్టిపోయిన పెండింగు బిల్లులు రూ.40 వేల కోట్లలో ఇప్పటికి రూ.14 వేల కోట్లు చెల్లించాం. ప్రజల ఆస్తిగా కాంగ్రెస్ ప్రభుత్వం రూపొందించిన ఔటర్ రింగురోడ్డును ఆ ప్రభుత్వం 30 ఏళ్ల లీజు పేరుతో అమ్ముకుంది. అదే పద్ధతిలో మేం వచ్చే 30 ఏళ్ల కాలానికి జీఎస్టీ లాంటి ఆదాయ వ్యవహారాలను ఏ అదానికో, అంబానికో లీజుకిస్తే రాష్ట్ర పరిస్థితి ఏం కావాలి?..'అని భట్టి నిలదీశారు.

పరిమితంగానే మా అప్పులు: హరీశ్‌రావు

'మా ప్రభుత్వం పరిమితంగా చేసిన అప్పును తప్పుడు లెక్కలతో పెంచి భూతద్దంలో చూపి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. అబద్ధపు అప్పుల బూచి చూపి ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం తప్పించుకునే ప్రయత్నం చేస్తోంది. ఈ ఆటలు సాగనివ్వం. మేం చెప్పే లెక్కలే సరైనవని నిరూపించేందుకు సిద్ధం. సభలో ప్రత్యేక చర్చ పెట్టండి, ఆడిటర్లను, ఆర్థిక నిపుణులను పిలిపించుకోండి.. నేను చెప్పేవే సరైన లెక్కలని నిరూపిస్తాను. ఇది నా ఛాలెంజ్. ఆర్బీఐ నేటి లెక్కల ప్రకారం గత ఏడాది కాలంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న అప్పులు రూ.1,27,208 కోట్లు. ఐదేళ్లలో చేయబోయే అప్పు దాదాపు రూ.6,36,400 కోట్లు. కానీ మా ప్రభుత్వం పదేళ్ల కాలంలో తెచ్చిన అప్పులు కేవలం రూ.4,17,496 కోట్లు మాత్రమే. 'ఆర్‌బీఐ తాజాగా విడుదల చేసిన గణాంకాలను ఆయన ఉటంకించారు) కరోనా కారణంగా కేంద్రం అదనంగా 1.75 శాతం అప్పు తీసుకోవాలని సూచించడంతో తీసుకున్నాం. లేకపోతే అంతకూడా అప్పు అయ్యేది కాదు. దీనిపై నేను సవాల్ విసురుతున్నా.. చర్చకు సిద్ధం. మేం రూ.6,71,757 కోట్లు అప్పు తీసుకున్నామని ఒకసారి, రూ.7 లక్షల కోట్లు అని మరోసారి, సభలో రూ.7,11,911 కోట్ల అప్పులంటూ నోటికొచ్చినట్టు అబద్ధాలు చెబుతున్నారు. ప్రత్యేక చర్చ పెడితే వాస్తవాలు నిరూపిస్తా. ఏడాది పూర్తవుతున్నా ఆరు గ్యారంటీలు అమలు చేయకుండా, గత ప్రభుత్వం చేసిన అప్పులపై తప్పుడు లెక్కలు చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. బీఏసీతో సంబంధం లేకుండా సభలో బిల్లులు ప్రవేశపెట్టడం వింతగా ఉంది. గత సభలో అప్పుల గురించి తప్పుడు లెక్కలు చూపినందుకే భట్టి విక్రమార్కపై ప్రివిలేజ్ మోషన్ ఇచ్చాం. కానీ మరో అంశంపై ప్రివిలేజ్ మోషన్ ఇచ్చినట్టు అబద్ధాలు చెప్తున్నారు. చర్చ పెడితే వాస్తవాలు నిరూపిస్తాం..'అని హరీశ్ రావు సవాల్ చేశారు.



కనీసం వెయ్యి కోట్లయినా ఇవ్వండి

- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.5,020 కోట్ల మేర పేరుకుపోయాయి
- జీరో అవర్‌లో అక్బరుద్దీన్ ఒవైసీ
- వివిధ సమస్యలు ప్రస్తావించిన సభ్యులు



సాక్షి, హైదరాబాద్: విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.5,020 కోట్ల మేర పేరుకు పోయాయని, అందులో కనీసం రూ.1,000 కోట్లయినా విడుదల చేయాలని ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ ప్రభుత్వాన్ని కోరారు. 20 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన బకాయిలు విడుదల చేయకపోవడంతో కళాశాలల నిర్వహణ కష్టంగా మారిందని మంగళవారం జీరో అవర్ సందర్భంగా ఆయన అసెంబ్లీ దృష్టికి తెచ్చారు. విదేశీ విద్యానిధి పథకం కింద విద్యార్థికి రూ.20 లక్షలు మంజూరు చేసేందుకు రూ.5 లక్షలు కమీషన్ తీసుకుంటున్నారని ఆరోపించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించారని.. ఏపీ, తెలంగాణలో లక్షలాది మంది విద్యార్థులు ప్రయోజనం పొందారని గుర్తుచేశారు.

ఉస్మానియా తరలింపు ఆపండి: రాజాసింగ్



ఉస్మానియా ఆస్పత్రిని గోషామహల్ పోలీస్ గ్రౌండ్స్‌కు తరలించే ప్రతిపాదనను రద్దు చేయాలని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ కోరారు. గోషామహల్‌లో ఆస్పత్రి కడితే ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని, ఉస్మానియా వెనుకవైపు ఉన్న విశాలమైన స్థలంలో కొత్త నిర్మాణం జరపాలని సూచించారు. సింగరేణిలో పనిచేస్తున్న 30 వేల మంది కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలను అమలు చేయాలని ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్ కోరారు. 1950 ప్రెసిడెన్షియల్ ఆర్డర్ ప్రకారం కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలను కలిపి కార్పొరేషన్‌గా ఏర్పాటు చేసి ఎన్నికలు నిర్వహించాలని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ.. దళితబంధు పథకం కింద హుజూరాబాద్‌లో 5 వేల కుటుంబాలకు ఇవ్వాల్సిన రెండోవిడత ఆర్థిక సాయాన్ని విడుదల చేయాలని కోరారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామ్యూల్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ తదితరులు తమ నియోజకవర్గాల్లోని సమస్యలను సభ దృష్టికి తెచ్చారు.

బీఆర్‌ఎస్ హయాం, కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధం

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల సవాల్

సాక్షి, హైదరాబాద్: పదేళ్ల బీఆర్‌ఎస్ పాలన, ఏడాది కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధమని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు సవాల్ విసిరారు. మంగళవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, అనిల్‌జాదవ్ విలేకరులతో మాట్లాడారు. లగచర్ల ఘటనపై చర్చకు రెండ్రోజులుగా పట్టుబట్టినా ప్రభుత్వం పారిపోయిందని, సభా నియమాలపై నీతులు చెబుతూ ప్రభుత్వమే ఉల్లంఘించిందని ఆరోపించారు. పాలక పక్షం ప్లకార్డులు లోనికి తెస్తే స్పీకర్ ఎలా అనుమతించారో చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులు కన్నీరు పెడుతుంటే సీఎం, మంత్రులు జల్సాలో మునిగి తేలుతున్నారని ఆరోపించారు. ప్రతిపక్షాన్ని ఎదుర్కొనే దమ్ము ఈ ప్రభుత్వానికి లేదని, లగచర్లపై ఈ ప్రభుత్వాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. అసెంబ్లీని కాంగ్రెస్ ప్రభుత్వం ఓ ప్రహసనంగా మార్చేసిందని, అన్ని వ్యవస్థలను సీఎం రేవంత్ నిర్వీర్యం చేశారని విరుచుకుపడ్డారు. కేసీఆర్, కేటీఆర్‌లపై కేసులు, అరెస్టులు అంటూ నాలుగు గోడల మధ్య ఉండి రేవంత్ వార్తలు రాయిస్తున్నారని ధ్వజమెత్తారు. ఫార్ములా వన్ మీద దమ్ముంటే చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మోసాలపై చర్చకు సిద్ధమని, దమ్ముంటే శాసనసభను పదిహేను రోజులు నడపాలని సవాల్ విసిరారు.



మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నేతలు పల్లా, జగదీశ్‌రెడ్డి, అనిల్‌జాదవ్

బాయ్‌కాట్ చేయాలి.. బయటకు పోవాలి

- అభివృద్ధిపై చర్చను అడ్డుకుంటున్న ప్రతిపక్షాలు
- గల్లీలో కుస్తీ.. ఢిల్లీలో దోస్తీగా బీఆర్‌ఎస్, బీజేపీ... ప్రతిపక్షాల తీరుపై కాంగ్రెస్ ఎమ్మెల్యేల మండిపాటు

సాక్షి, హైదరాబాద్: 'శాసనసభ నుంచి బాయ్‌కాట్ చేయాలి.. బయటకు పోవాలి'అన్న తీరుగా బీఆర్‌ఎస్, బీజేపీలు వ్యవహరిస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు ధ్వజమెత్తారు. మంగళవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆది శ్రీనివాస్, విజయరమణారావు, శంకర్ వీర్లపల్లి, బీర్ల ఐలయ్య, మక్కన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, రాంమోహన్‌రెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. గల్లీలో కుస్తీ పడుతూ.. ఢిల్లీలో దోస్తానా చేస్తూ.. ఈ పార్టీలు రెండు రోజులుగా అసెంబ్లీని నడవకుండా అడ్డుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. లగచర్ల ఘటనపై రాద్ధాంతం చేస్తున్నాయని నిప్పులు చెరిగారు. ఆరు గ్యారంటీలను ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తుంటే, ప్రతిపక్ష సభ్యులు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఎన్నికల్లో ఓడినా బీఆర్‌ఎస్‌కు సిగ్గు రాలేదన్నారు. మూసీ, టూరిజం, పారిశ్రామిక రంగాలపై చర్చకు రావాలని కోరినా విపక్ష సభ్యులు రావడంలేదని, ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి ఏమీ తీసుకురాని బీజేపీ నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ఏమిటో అర్థం కావడంలేదన్నారు. పది నిమిషాలు సభకు ఆలస్యంగా వచ్చిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను ఉద్దేశించి.. అసెంబ్లీకి ఆలస్యంగా రావడం ఏమిటన్న బీఆర్‌ఎస్ నేతలు, గత ఏడాదిగా ప్రతిపక్ష నేత కేసీఆర్ సభకు ఎందుకు రావడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణను పదేళ్లు దోచుకున్నారని, ఇప్పుడు సోషల్ మీడియాలో ప్రభుత్వంపై విషప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

డీపీఆర్ ఖరారైతేనే మూసీ వ్యయంపై స్పష్టత

- మండలిలో మంత్రి శ్రీధర్‌బాబు
- ఫీజు బకాయిలు గత సర్కారు ఘనకార్యమే: సీతక్క



సాక్షి, హైదరాబాద్: మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ (డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు) ఖరారైన తర్వాతే వ్యయంపై స్పష్టత వస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు. మంగళవారం మండలి ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు ఎంఎస్ ప్రభాకర్‌రావు, జీవన్‌రెడ్డి, మహేశ్‌కుమార్‌గౌడ్ లేవనెత్తిన ప్రశ్నలకు ఆయన జవాబిచ్చారు. మూసీ ప్రాజెక్టు కోసం రూ.లక్షన్నర కోట్లు ఖర్చు చేస్తున్నారని అసత్య ప్రచారం చేస్తూ బీఆర్‌ఎస్ నేతలు రాజకీయ లబ్ధిపొందే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం మూసీ అభివృద్ధి కోసం చేసిందేమీ లేదని ధ్వజమెత్తారు. ఫాక్స్‌కాన్ సంస్థ రాష్ట్రంలో మరో రంగంలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు త్వరలో ప్రకటన చేయనుందని మంత్రి చెప్పారు. రాష్ట్ర ఐటీ ఎగుమతులు.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రూ.3 లక్షల కోట్లు దాటాయన్నారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టు డీపీఆర్ దశలో ఉందని, నివేదిక పూర్తయిన తర్వాత దీనిపై ఒక నిర్ణయానికి వస్తామని చెప్పారు.

భగీరథకు ముందు ఏం తాగి పెరిగారు: సీతక్క

గురుకులాలకు సంబంధించి గతంలో కార్యదర్శిగా ఉన్న వ్యక్తే ఇప్పుడు వాటిపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి సీతక్క విమర్శించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ ఘనకార్యం వల్లే రూ.5 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సభ్యులు రవీందర్‌రావు, మధుసూదనాచారి, వాణీదేవి లేవనెత్తిన అంశాలపై సీతక్క స్పందించారు. మిషన్ భగీరథ తర్వాతే ప్రజలు మంచినీళ్లు తాగుతున్నారని రవీందర్‌రావు చేసిన వాఖ్యలపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. వాంకిడి ఆశ్రమ పాఠశాల విద్యార్థిని శైలజ వైద్యం కోసం ప్రభుత్వం రూ.12.55 లక్షలు చెల్లించిందని తెలిపారు. కాగా లగచర్ల రైతులకు బేడీలు వేసి అరెస్టులు చేయడానికి నిరసనగా బీఆర్‌ఎస్ సభ్యులు నల్లచొక్కాలతో సభకు హాజరయ్యారు. సభ వాయిదా పడిన తర్వాత ఎమ్మెల్సీ కవిత మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. మూసీ ప్రాంత ప్రజలకు ఆస్తి నష్టం జరిగితే ఊరుకోబోమని హెచ్చరించారు.

సభకు కావాలనే బీఆర్‌ఎస్ ఆటంకాలు

మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: శాసనసభ సమావేశాలు జరగకుండా బీఆర్‌ఎస్ సభ్యులు కావాలనే సభా కార్యకలాపాలకు ఆటంకాలు కల్పిస్తున్నారని పరిశ్రమలు, శాసనసభా వ్యవహారాల శాఖమంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. బీఆర్‌ఎస్ సభ్యులు లేవనెత్తే అంశాలపై సభలో లఘుచర్చకు తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టంచేశారు. మంగళవారం అసెంబ్లీ లాబీల్లో మీడియా ప్రతినిధులతో శ్రీధర్‌బాబు ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. సభను ఎన్ని రోజులు నిర్వహించాలనే దానిపై స్పీకర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. అయితే ప్రభుత్వపరంగా తాము జనవరి మొదటివారం దాకా కూడా సభా సమావేశాలను నడిపేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు చేతులకు బేడీలతో అసెంబ్లీకి రావడంపై విలేకరులు ప్రస్తావించగా.. విపక్ష సభ్యులు నిరసన తెలుపుతూ బేడీలు వేసుకొని అసెంబ్లీ లోపలికి రాలేదు కదా అని శ్రీధర్‌బాబు బదులిచ్చారు. అసెంబ్లీ లాబీల్లో శ్రీధర్‌బాబుతో పాటు ఉన్న మరో మంత్రి జూపల్లి కృష్ణారావును ఉద్దేశించి.. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు బేడీలతో అసెంబ్లీకి రావడంపై స్పందించాలని విలేకరులు కోరారు. జూపల్లి స్పందిస్తూ పదేళ్లపాటు అధికారంలో ఉన్నపుడు చేసిన తప్పులకు బేడీలు వేసుకునేందుకు తాము అర్హులమనే సంకేతాన్ని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఇచ్చారని వ్యాఖ్యానించారు.

ఐదు ప్రశ్నలపై చర్చ

సాక్షి, హైదరాబాద్: శాసనసభ ప్రారంభమైన వెంటనే స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రశ్నోత్తరాలను చేపట్టారు. పది ప్రశ్నలకు గాను ఐదు ప్రశ్నలపై మాత్రమే చర్చ జరగ్గా, మరో ఐదు ప్రశ్నలకు సమాధానం ఇచ్చినట్లుగా భావించాలని స్పీకర్ ప్రకటించారు. ప్రభుత్వ రుణాలు, చెన్నూరులో ఆర్టీసీ డిపో, చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు, కాళేశ్వరం ప్రాజెక్టు 19 ఎ ప్యాకేజీ పనులకు సంబంధించిన ప్రశ్నలు ప్రస్తావనకు వచ్చాయి. అనంతరం గంట పాటు సాగిన జీరో అవర్‌లో 18 మంది ఎమ్మెల్యేలు వివిధ అంశాలను ప్రస్తావించారు. ప్రశ్నోత్తరాల్లో భాగంగా రాష్ట్రంలో ఎఫ్ఆర్‌బీఎం కిందకు వచ్చే రుణాలతో పాటు ఎఫ్ఆర్‌బీఎం పరిధిలోకి రాని రుణాలపై డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క చేసిన ప్రకటనతో బీఆర్‌ఎస్ విభేదించడంతో వాగ్వివాదం చోటు చేసుకుంది. ఇలావుండగా భద్రాచలం సీతారామచంద్ర స్వామి ఆలయ భూములను సాగు చేసుకుంటున్న రైతులకు రైతుబంధు వర్తింప చేయడంతో పాటు పట్టాలు ఇవ్వాలని సీపీఐ సభ్యుడు కూనమనేని సాంబశివరావు మరో వాయిదా తీర్మానం ఇచ్చారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యేపై ఫిర్యాదు

ఒక్కో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే రూ.వేయి కోట్లు సంపాదించారని కాంగ్రెస్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సభలో చేసిన వ్యాఖ్యలపై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు.

పెట్టుబడులపై తప్పుడు ప్రచారం

సాక్షి, హైదరాబాద్: 'రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా ప్రతిపక్షాలు తప్పుదారి పట్టించేలా సమాచారం వ్యాప్తి చేస్తున్నాయి. ప్రముఖ అంతర్జాతీయ కంపెనీ ఫాక్స్‌కాన్ ఇప్పటికే తెలంగాణలో పెట్టుబడులు పెట్టి తన ప్రణాళికలు అమలు చేస్తోంది. ఫాక్స్‌కాన్ పలు రాష్ట్రాల్లో తమ కార్యకలాపాలను విస్తరించుకుంటూ, స్థానిక సాంకేతిక నైపుణ్యాన్ని వినియోగించుకుని, సమర్థవంతమైన పెట్టుబడి నిర్ణయాలు తీసుకుంటోంది. తెలంగాణలో భారీ స్థాయిలో పెట్టుబడులు పెట్టేందుకు ఫాక్స్‌కాన్ గతంలో చేసిన ప్రకటనలకు కట్టుబడి ఉంది. వచ్చే మూడు రోజుల్లోనే ఫాక్స్‌కాన్ నుంచి భారీ పెట్టుబడుల ప్రకటన వస్తుంది. ప్రగతిని అడ్డగించే తప్పుడు ప్రచారాన్ని ఆపివేసి అన్ని పార్టీలూ అభివృద్ధికి మద్దతు ఇవ్వాలి. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం ఏర్పాటుకు కృషి చేయాలి'అని అసెంబ్లీ లాబీల్లో ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు.

అరుపులు.. నిరసనలు!

మంగళవారం అట్టుడికిన అసెంబ్లీ

సాక్షి, హైదరాబాద్: శాసనసభ మళ్లీ దద్దరిల్లింది. వాయిదా తీర్మానాలపై చర్చకు పట్టుబడుతూ బీఆర్‌ఎస్, బీజేపీ సభ్యులు ఆందోళన నిర్వహించడంతో మంగళవారం కూడా సభ అట్టుడికింది. జీరో అవర్ ముగిశాక విరామం అనంతరం సభ పునఃప్రారంభమైన వెంటనే ఇరు పార్టీల సభ్యులు పోటాపోటీగా వెల్‌లోకి దూసుకువచ్చి ప్లకార్డులు ప్రదర్శిస్తూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. బీఆర్‌ఎస్ సభ్యులు అరుపులు, కేకలతో ఆద్యంతం సభా కార్యకలాపాలను అడ్డుకున్నారు. అయితే పోడియం పైకి ఎవరూ వెళ్లకుండా మార్షల్స్ రక్షణ గోడగా నిలిచారు. ఈ గందరగోళం మధ్య చర్చ లేకుండానే 3 బిల్లులు పాసైనట్టు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రకటించారు. నూతన పర్యాటక విధానంపై స్వల్ప చర్చ అనంతరం చర్చ ముగిసిందని ప్రకటించిన స్పీకర్.. సభను బుధవారం ఉదయం 10 గంటలకు వాయిదా వేశారు.

రైతుల నిర్బంధంపై కేటీఆర్.. ఆరు గ్యారంటీలపై ఏలేటి

పరిశ్రమలకు సాగు భూముల సేకరణను వ్యతిరేకిస్తున్న రైతులను నిర్బంధించడంపై చర్చించాలని బీఆర్‌ఎస్ సభ్యుడు కె.తారక రామారావు, ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించాలని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఇచ్చిన వాయిదా తీర్మానాలను తిరస్కరిస్తున్నట్టు జీరో అవర్ చివర్లో ప్రకటించిన స్పీకర్ సభను కొద్దిసేపు వాయిదా వేశారు. మధ్యాహ్నం 3 గంటలకు సభ పునఃప్రారంభమైన వెంటనే బీఆర్‌ఎస్, బీజేపీ సభ్యులు రెండు సమూహాలుగా వెల్‌లోకి చొచ్చుకువచ్చి వాయిదా తీర్మానాలపై చర్చించేందుకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్పీకర్ వైపు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఇది కొనసాగుతుండగానే తెలంగాణ వ్యాయాయ విద్య, క్రీడా విశ్వవిద్యాలయం బిల్లు-2024, తెలంగాణ విశ్వవిద్యాలయాల చట్ట సవరణ బిల్లు-2024, తెలంణ వస్తు, సేవల పన్ను చట్ట సవరణ బిల్లు-2024పై చర్చను స్పీకర్ ప్రారంభించారు. విపక్ష పార్టీల నినాదాల హోరు మధ్య క్రీడా వర్సిటీ బిల్లుపై మంత్రి శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ సభ్యుడు రాజ్ ఠాకూర్ కొద్దిసేపు మాట్లాడారు. సభ అదుపు తప్పడంతో ఆ తర్వాత చర్చ లేకుండానే స్పీకర్ ఓటింగ్ నిర్వహించి 3 బిల్లులు పాసైనట్టు ప్రకటించారు. ప్రత్యేక నిబంధనలను ఉటంకిస్తూ సభా కార్యకలాపాలను (పరోక్షంగా చర్చ) రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు.



లగచర్ల బాధితులపై కేసులు ఎత్తివేయాలంటూ నల్లచొక్కాలు ధరించి, చేతులకు సంకెళ్లు వేసుకొని అసెంబ్లీకి వస్తున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు

చర్చకు సిద్ధం: మంత్రి శ్రీధర్ బాబు

విపక్ష పార్టీలు లేవనెత్తిన లగచర్ల ఘటన, ఆరు గ్యారెంటీల అమలు, రెసిడెన్షియల్ స్కూల్స్ వంటి అంశాలపై స్పీకర్ అనుమతిస్తే చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని శాసనసభా వ్యవహారాల మంత్రి డి.శ్రీధర్‌బాబు ప్రకటించారు. పత్రికల్లో కనబడాలనే సభను అడ్డుకుంటున్నారని విమర్శించారు. గత ప్రభుత్వంలో భూములు లాక్కుని నిర్వాసితులతో ఎలా వ్యవహరించారో అందరికీ తెలుసని అన్నారు. అమాయక రైతులను అడ్డుపెట్టుకుని 10 వేల మంది క్రియాశీలక బీఆర్‌ఎస్ కార్యకర్తలు లగచర్లలో భూసేకరణను అడ్డుకోవడానికి ప్రయత్నించారని ఆరోపించారు. సభా హక్కుల ఉల్లంఘనపై స్పీకర్‌కు నోటీసులివ్వకుండానే ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

వారి పాలనలో రైతులకు బేడీలు: మంత్రి సీతక్క

బీఆర్‌ఎస్ పాలనలో ఖమ్మం, జగిత్యాల, గౌరారం, భువనగిరి, హుజూరాబాద్‌లో రైతులకు బేడీలు వేసి అరెస్టు చేశారంటూ మంత్రి సీతక్క ఎదురుదాడి చేశారు. బీఆర్‌ఎస్ పాలనలో బేడీలేసిన వారిపై ఏం చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. కాగా బీఆర్‌ఎస్ పాలనలో రైతులకు బేడీలు వేసిన ఘటనలకు సంబంధించిన ప్లకార్డులను కాంగ్రెస్ పార్టీ సభ్యులు కొద్దిసేపు ప్రదర్శించారు.

బీఆర్‌ఎస్ పాలనతో సాంస్కృతిక విధ్వంసం: మంత్రి జూపల్లి

అమరవీరుల ఆకాంక్షల మేరకు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనతో పాటు ధ్వంసమైన సంస్కృతిని పునరుద్ధరించి పెట్టుబడులు ఆకర్షించాలనే లక్ష్యంతో కొత్త పర్యాటక విధానం తీసుకొచ్చామని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. 10 ఏళ్ల బీఆర్‌ఎస్ పాలనలో తెలంగాణలో సంస్కృతి ధ్వంసమైందనడానికి సభలో బీఆర్‌ఎస్ సభ్యుల వ్యవహార శైలే నిదర్శనమని విమర్శించారు. అరుపులు, కేకల హోరు మధ్యే పర్యాటక విధానంపై లఘు చర్చలో ఆయనతో పాటు విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడారు.

నల్ల చొక్కాలు.. చేతులకు బేడీలతో బీఆర్‌ఎస్ నిరసన

లగచర్ల గిరిజన రైతుకు బేడీలు (సంకెళ్లు) వేసిన ఘటనపై బీఆర్‌ఎస్ మంగళవారం కూడా నిరసన కొనసాగించింది. సభ ప్రారంభానికి ముందే ఉదయం 9.30కే అసెంబ్లీ ఆవరణలోని బీఆర్‌ఎస్ శాసనసభా పక్ష కార్యాలయానికి పార్టీ ఎమ్మెల్యేలు చేరుకున్నారు. నల్ల చొక్కాలు ధరించి, చేతులకు బేడీలు వేసుకుని నినాదాలు చేస్తూ కేటీఆర్ నేతృత్వంలో హరీశ్‌రావు, గంగుల కమలాకర్, జగదీశ్‌రెడ్డి, వివేకానంద్, మల్లారెడ్డి, గోపీనాథ్, సబితా ఇంద్రారెడ్డి తదితరులు సభలోకి వెళ్లారు. 'రైతులకు బేడీలా సిగ్గు సిగ్గు.. ఇదేమి రాజ్యం.. లాఠీ రాజ్యం.. తూటా రాజ్యం'అంటూ నినాదాలు చేశారు. మధ్య మధ్యలో జై తెలంగాణ అంటూ నినదించారు. నహీ చలేగా..నహీ చలేగా అని బీఆర్‌ఎస్ సభ్యులు అనగా నే..కేసీఆర్‌కా నహీ చలేగా అంటూ కాంగ్రెస్ సభ్యులు నినాదాలు చేశారు. బీఆర్‌ఎస్ సభ్యులు పాడి కౌశిక్ రెడ్డి, ఇతరులు .. మార్షల్స్ మధ్య ఒకటి రెండుసార్లు స్వల్ప తోపులాట జరిగింది. కౌశిక్‌రెడ్డి తమ పార్టీ సభ్యుడు బండారు లక్ష్మారెడ్డిని ఎత్తుకుని తీసుకొచ్చి మార్షల్స్‌పైకి తోసేయడం కనిపించింది. మరో బీఆర్‌ఎస్ సభ్యుడు కాగితాలు చింపి వెల్‌లోకి విసిరేస్తూ కనిపించారు.

'నీ ప్రయాణంలో కరాటే అనేది వెలిగే కాగడాలా ఉండాలి' అంటాడు ఒక మార్షల్ ఆర్టిస్ట్. పరిస్థితుల ప్రభావం వల్ల, రకరకాల కారణాల వల్ల దారి పొడుగునా ఆ వెలుగును కాపాడుకోవడం అందరి వల్ల సాధ్యం కాకపోవచ్చు. తండ్రి పక్కనపెట్టిన కాగడా పట్టుకొని కరాటేలో విజయపథంలో దూసుకుపోతోంది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలానికి చెందిన మన్యం బిడ్డ కొండపల్లి చందన.


కొండపల్లి చందన

● సాధనమే చం'ధనం'

తగ్గేదే లేదు.. ఒగ్గేదే లేదు!

కొస్త సరదాగా చెప్పుకోవాలంటే చందన వాళ్ల ఇంట్లో 'కరాటే' అనేది పాత చుట్టంలాంటిది. తండ్రి కొండపల్లి జంపన్నకు కరాటే అంటే ఎంతో ఇష్టం. ఎన్నో కలలు కన్నాడు. బ్లాక్‌బెల్ట్ వరకు వెళ్లాడు.

తెల్లవారుజామునే 'హా' 'హూ' అంటూ తండ్రి సాధన చేస్తుంటే ఆ శబ్దాలు నిద్రలో ఉన్న చందన చెవుల్లో పడేవి. ఆ శబ్దాల సుప్రభాతం తోనే నిద్ర లేచేది. నాన్న సాధన చేస్తుంటే ఆసక్తిగా చూసేది. ఆ తరువాత సరదాగా తాను కూడా సాధన చేసేది. అలా కరాటేతో పరిచయం మొదలైంది.

చిన్నప్పటి నుంచే ఆటల్లో ప్రతిభ కనబరుస్తున్న చందనను తల్లిదండ్రులు మహబూబాబాద్ జిల్లా కొత్తగూడలో ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో చేర్పించారు. అక్కడ పని చేస్తున్న ఉపాధ్యాయిని సుధకు కరాటేలో ప్రవేశం ఉంది. ఇతర ఆటలతో పాటు కరాటే కూడా విద్యార్థులతో సాధన చేయించేది. స్కూలు మొత్తంలో ఓ పది మంది విద్యార్థినులు కరాటేలో ప్రతిభ చూపిస్తుండటంతో ఆ శిక్షణను కొనసాగిస్తూనే వివిధ పోటీలకు విద్యార్థులను తీసుకువెళ్లేవారు. ఎనిమిదో తరగతి నుంచే కరాటే పోటీలలో పాల్గొంటూ బహుమతులు గెలుస్తూ వచ్చింది చందన.

విరామం కాదు ఆరంభ సంకేతం

వరంగల్‌లో జరిగిన జిల్లా స్థాయి కరాటే పోటీల్లో బంగారు పతకం గెలుచుకోవడంతో చందన విజయపరంపర మొదలైంది. విశాఖపట్నం, ఖమ్మంలలో జరిగిన పోటీల్లోనూ తన ప్రతిభను చాటుకుంది. తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా ముంబై, ఢిల్లీలో జరిగిన పోటీల్లోనూ పతకాలు సాధించింది.

అయితే పదోతరగతి తర్వాత ఆటలతోపాటు చదువు ముఖ్యం అంటూ కుటుంబంపై వచ్చిన ఒత్తిడి కారణంగా సోషల్ వెల్ఫేర్ స్కూల్ నుంచి బయటకు వచ్చి హన్మకొండలోని ఒక ప్రైవేటు కాలేజీలో ఇంటర్‌లో చేరింది.

'ఇక కరాటే ఆపేసినట్లేనా!' అడిగే వాళ్లు చాలామంది.

అయితే ఆ విరామం మరిన్ని విలువైన విజయాలు సాధించడానికి ఆరంభ సంకేతం అనేది చాలామందితో పాటు చందనకు కూడా తెలియదు.

ఇప్పటికీ కలగానే ఉంది!

కరాటేలో అద్భుత ప్రతిభ కనబరుస్తున్న చందనను వదులుకోవడానికి గురుకుల పాఠశాల వారు ఇష్టపడ లేదు. ఆమె వేరేచోట చదువుతున్నా తమ స్కూల్ తరఫున పోటీలకు పంపడం ప్రారంభించారు. గత నెల గోవాలో జరిగిన అండర్ 18, వరల్డ్‌కప్ ఛాంపియన్‌షిప్‌లో చందన పాల్గొంది. తొలి రౌండ్‌లో కర్ణాటక అమ్మాయిపై గెలిచింది. ఆ తర్వాత వరుసగా ఆఫ్రికా, చైనాలకు చెందిన అమ్మాయిలపై విజయం సాధించింది.

'గోవాకు వెళ్లేప్పటికి నాకు తెలుగు తప్ప మరో భాష రాదు. అక్కడంతా బాగా పాష్‌గా కనిపించడంతో కొంత తడబడ్డాను. ప్రాక్టీస్ కూడా ఎక్కువ చేయలేదు. దీంతో నేషనల్, ఇంటర్నేషనల్ ఛాంపియన్లతో పోటీపడి నెగ్గగలనా అని సందేహించాను. కర్ణాటక అమ్మాయితో త్వరగానే గేమ్ ముగిసింది. ఆ తర్వాత నాకంటే ఎంతో స్ట్రాంగ్‌గా ఉన్న ఆఫ్రికన్ అమ్మాయితో పోటీ పడ్డాను. ఇక్కడే నా పని అయిపోతుందనుకున్నా. గేమ్‌నే నమ్ముకుని గెలిచాను. చిన్నప్పటి నుంచి కరాటే అంటే చైనానే గుర్తుకు వస్తుంది. అలాంటిది చివరగా చైనా అమ్మాయిపై విజయం సాధించడం ఇప్పటికీ కలగానే ఉంది' అంటుంది చందన.

గోవా విజయంతో 2025 జనవరిలో మలేషియాలో జరగబోయే పోటీలకు అర్హత సాధించింది.

కనే కల విజయాన్ని పరిచయం చేస్తుంది. ఆ విజయం ఎప్పుడూ మనతో చెలిమి చేయాలంటే ఆత్మవిశ్వాసం ఒక్కటే సరిపోదు. లక్ష్యసాధన కోసం బాగా కష్టపడే గుణం కూడా ఉండాలి.

కొండపల్లి చందనలో ఆ గుణం కొండంత ఉంది. ఆమె మరిన్ని విజయాలు సాధించాలని ఆశిద్దాం.

– కృష్ణ గోవింద్,
సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం
ఫొటోలు : యాసారపు యాకయ్య


అంతర్జాతీయ వేదికపై చందన

అదే నా లక్ష్యం

నాన్నకు కరాటే అంటే ప్రాణం. అయితే కొన్ని పరిస్థితుల వల్ల ఆయన కెరీర్ మధ్యలోనే ఆగిపోయింది. ఆయనకు ఎన్నో కలలు ఉండేవి. స్కూల్‌లో నేను కరాటే బాగా ప్రాక్టీస్ చేస్తున్నానని ఎవరో చెబితే నాన్న ఎంతో సంతోషించారు. దీంతో మరింత ఇష్టం, పట్టుదలతో కరాటే సాధన చేశాను. 'ఆడపిల్లకు కరాటేలు ఎందుకు! చక్కగా చదివించక' అంటుండే వారు ఇరుగు పొరుగు, బంధువులు. అయితే వారి మాటలతో అమ్మానాన్నలు ప్రభావితం కాలేదు. అమ్మ శారద నా వెన్నంటే నిలిచింది. అంతర్జాతీయ స్థాయిలో దేశానికి పతకాలు తేవాలన్నదే నా లక్ష్యం. అయితే ఈ ప్రయాణంలో ముందుకు వెళ్లే కొద్దీ ఖర్చులు పెరుగుతున్నాయి. చేయూత అందిస్తే నా ప్రయాణం సులువు అవుతుంది.

– చందన



న్యూస్‌మేకర్
కమలిని

తమిళనాడుకు చెందిన ఆ అమ్మాయి 12 ఏళ్ల వయసు వరకూ స్కేటింగ్ చేసింది. అదృష్టమో దురదృష్టమో లాక్‌డౌన్ వచ్చింది. బోర్ కొట్టి బ్యాట్ అందుకుంది. సరిగ్గా నాలుగేళ్లు. డబ్ల్యూపీఎల్ ఆక్షన్‌లో 10 లక్షలు పలికితే గొప్పనుకుంటే కోటీ అరవై లక్షలు పలికింది. అద్భుతమైన ప్రతిభ, కృషి ఉంటే విధిని తిరగరాయొచ్చని చెబుతుంది జి.కమలిని.

వయసు 16 ఆట ఖరీదు 1.6 కోట్లు


కమలిని

మొన్నటి ఆదివారం (డిసెంబర్ 15) ఏం జరిగిందో తెలుసా? కౌలాలంపూర్లో మహిళల అండర్–19 ఆసియా కప్‌లో భాగంగా పాకిస్తాన్–ఇండియాల మధ్య మ్యాచ్ జరుగుతోంది. ఫస్ట్ బ్యాటింగ్‌లో పాకిస్తాన్ బ్యాటర్స్ రన్స్ కోసం బాల్‌ను బాదినప్పుడల్లా వికెట్స్ వెనుక నుంచి ఆ అమ్మాయి గట్టిగట్టిగా కేకలు వేస్తూ బాల్‌ను విసరమని ఫీల్డర్లను ఉత్సాహపరుస్తోంది. ఆ అమ్మాయి హుషారు ప్రేక్షకులను ఆకట్టుకుంది. మధ్యాహ్నం టార్గెట్‌ను ఛేదించే బాధ్యత ఇండియన్స్‌ది. వికెట్‌కీపర్‌గా ఉన్న అమ్మాయి ఇప్పుడు బ్యాట్ పట్టుకొని క్రీజ్ మీదకు వచ్చింది. అంతవరకే గుర్తుంది... అందరికీ. ఆ తర్వాత ఆ అమ్మాయి కొడుతున్న షాట్లకి గతం భవిష్యత్తు మర్చిపోయి వర్తమానంలో మునకలేశారు. షాట్ షాట్‌కు కేరింతలే. మొత్తం 44 రన్స్ చేసిందా అమ్మాయి. లాస్ట్ బంతిని భారీ సిక్స్ కొట్టి ఆట ముగించింది.

కౌలాలంపూర్‌లో ఇలా ఆట ముగుస్తున్న సమయానికి బెంగళూరులో డబ్ల్యూపీఎల్ కోసం మహిళా క్రికెటర్ల ఆక్షన్ జరుగుతోంది. ఇదే అమ్మాయి పేరును పిలిచారు. అంతవరకూ ఆమె 10 లక్షల రూపాయలకు వేలంలో దక్కుతుందని అందరూ భావించారు. కాని కౌలాలంపూర్ ఆట ప్రభావం చూపింది. ముంబై ఇండియన్స్ టీమ్, ఢిల్లీ కాపిటల్స్ టీమ్ పాట పెంచుతూ పోటీ పడ్డాయి. చివరకు కోటీ అరవై లక్షలతో ఆక్షన్ ముగిసి ఆ అమ్మాయి ముంబై ఇండియన్స్ జట్టు భాగస్వామి అయ్యింది.

ఒకేరోజు ఇలా కౌలాలంపూర్‌లో ఇటు బెంగళూరులో మార్మోగిన ఆ అమ్మాయి పేరు కమలిని. వయసు 16.

మదురై అమ్మాయి

కమలినిది మధ్యతరగతి కుటుంబం. మదురైలో ఉండేది. స్కేటింగ్ నేర్చుకుంటూ హుషారుగా ఉండే కమలిని 12 ఏళ్ల వరకు క్రికెట్ జోలికే వెళ్లలేదు. 2022లో కరోనా రావడంతో లాక్‌డౌన్ వచ్చి ఆమె తండ్రి గుణాలన్ కాలక్షేపానికి కొడుకుతో వీధిలో క్రికెట్ ఆడటం మొదలుపెట్టాడు. ఒక రోజు కమలినిని పిలిచి నువ్వు బౌలింగ్ చెయ్ అన్నాడాయన. కమలిని బౌలింగ్ చేస్తే దిమ్మెర పోయాడు. అలా ఆ వయసులో అలా బౌలింగ్ చేసే పిల్లలు లేరు. కమలినికి ఇది సహజసిద్ధంగా వచ్చిందని గ్రహించిన తండ్రి మరి ఆలస్యం చేయలేదు. మరుసటి సంవత్సరమే చెన్నై కాపురం మార్చి 'చైన్నై సూపర్‌కింగ్స్ అకాడెమీ'లో చేర్చాడు. అక్కడ ఆమె ప్రతిభ గమనించి వెంటనే 'తమిళనాడు అండర్–19'లోకి తీసుకున్నారు. విమెన్స్ అండర్ 19 టి 20 కప్‌లో 8 మేచెస్‌లో 311 పరుగులు కొట్టింది కమలిని. అంతేకాదు సిక్సర్ల కమలినిగా పేరు పొందింది. ఆమె సిక్స్‌కు బాల్‌ని లేపితే బౌండరీ దాటాల్సిందే.

తండ్రి అంటే ప్రేమ

కమలినికి తండ్రంటే చాలా ప్రేమ. ఆయనకు గుండె సమస్య తలెత్తితే తల్లడిల్లిపోయింది కమలిని. 'మా నాన్నంటే నాకు చాలా ఇష్టం' అంటుంది. ఆ సమయంలో ఆటమీద మనసు లగ్నం చేయలేకపోయింది. అయితే తండ్రికి సర్జరీ అయ్యి ఇంకేం పర్వాలేదని డాక్టర్లు చెప్పాక ఆ మరుసటి రోజే తమిళనాడు– ఆంధ్రల మధ్య మ్యాచ్ ఉంటే చెలరేగి సెంచరీ బాదింది కమలిని.

ప్రతిభ, తల్లిదండ్రుల ఆశీస్సులు, ప్రేక్షకుల ప్రోత్సాహం సమృద్ధిగా ఉన్న ఈ అమ్మాయి ముమ్ముందు మరిన్ని ఘనవిజయాలు సాధిస్తుంది.

పని నుంచి పారిపోవలసి వస్తే!

కష్టాలను తట్టుకొని, త్వరగా కోలుకొని, తిరిగి మామూలు స్థితిలోకి వచ్చే మానసిక దృఢత్వాన్ని ఇంగ్లిష్‌లో 'రిజిలియన్స్' అని, తెలుగులో 'స్థితిస్థాపకత్వం' అని మనం అంటే అంటూండవచ్చు కానీ.. ఇక్కడ మాత్రం.. 'జాక్వెలిన్ ఫెర్నాండేజ్' అని మాత్రమే ఆ.. దృఢత్వానికి అర్థం చెప్పుకోవాలి!

జాక్వెలిన్ బాలీవుడ్‌లోకి వచ్చి 15 ఏళ్లు అయింది. ఈ ఒకటిన్నర దశాబ్దాలలో ఆమె అనేక విజయాలను చవి చూశారు. కొన్ని కష్టకాలాలు కూడా ఆమెకు తమ తడాఖా చూపించాయి. అయితే – ''కష్టం లేనిదే జీవితం లేదు. ఆ కష్టం నుంచి జీవితం ఏం నేర్పిందన్నదే మనకు ముఖ్యం'' అని అంటారు జాక్వెలిన్.

''నేనైతే గాలి దుమారంలా వచ్చిపోయే ఒడిదుడుకులకు గట్టిగా నిలబడటం నేర్చుకున్నాను. నాపై నేను నమ్మకాన్ని ఏర్పరచుకోవడాన్ని సాధన చేశాను. చేస్తున్న పని నుండి పారిపోవలసి వస్తే అసలా పనిలోకి ఎన్ని ఆశలతో వచ్చామన్నది మొదట గుర్తు చేసుకోవాలి. అక్కడి వరకు సాగిన మన ప్రయాణాన్ని వృథా కానివ్వకూడదని సంకల్పించుకోవాలి. ఇక నాకైతే నన్ను ప్రేమించే కుటుంబ సభ్యులు అండగా ఉన్నారు. నన్ను సంతోషంగా ఉంచే వ్యాపకాలూ నాకు తోడుగా ఉన్నాయి'' అంటారు జాక్వెలిన్.


జాక్వెలిన్ ఫెర్నాండేజ్

శ్రీలంక నుంచి వచ్చి, 'అలాద్దీన్' (2009) చిత్రంతో బాలీవుడ్‌కు పరిచయమై, 'మర్డర్–2' తో ఇండస్ట్రీలో నిలదొక్కుకున్న జాక్వెలిన్.. ''ఇండియా నన్ను స్వీకరిస్తే చాలు నన్నదే అప్పటి నా కల'' అంటారు. ''అయితే ఈ దేశం నన్ను అక్కున చేర్చుకుని, ఆ కలను మించిన గుర్తింపునే ఇచ్చింది. మొదట్లో భాష కొంచెం కష్టంగా అనిపించినప్పటికీ, బాలీవుడ్ ప్రేక్షకులు నాకిది పరాయి దేశం అన్న భావన కలగనంతగా నన్ను ఆదరించారు'' అని ఆమె తెలిపారు.

ఈ పదిహేనేళ్లలోనూ 30కి పైగా చిత్రాలలో నటించిన జాక్వెలిన్ రెండు నెలల క్రితమే 'స్టార్మ్ రైడర్' మ్యూజిక్ వీడియోతో సంగీత ప్రపంచంలోకి కూడా ప్రవేశించారు. ప్రస్తుతం షూటింగ్‌లో ఉన్న 'హౌస్‌ఫుల్ 5' చిత్రంలో నటిస్తున్నారు. అందులో హీరో అక్షయ్ కుమార్.

''ఏ రంగంలోనైనా ఎదుగుతున్న క్రమంలో సవాళ్లు ఎదురవటం మామూలే. అయితే ఊహించని వైపుల నుంచి సవాళ్లు చుట్టుముట్టినప్పుడు (బహుశా ఈడీ దాడులు, మీడియా రాతలు అని ఆమె ఉద్దేశం కావచ్చు) జీవితం తలకిందులు అయినట్లుగా అనిపిస్తుంది. అప్పుడే మనం దృఢంగా ఉండాలి.. '' అని హార్పర్స్ బజార్'కు ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో చెప్పారు జాక్వెలిన్.

లీగల్

ఆ బాండ్లు చెల్లవు... మీరేం భయపడనక్కరలేదు!

నేను ప్రస్తుతం పని చేస్తున్న కంపెనీలోని ఇబ్బంది వల్ల వేరే ఉద్యోగం చూసుకున్నాను. ప్రస్తుతం ఉన్న కంపెనీలో కనీసం మూడు సంవత్సరాలు పనిచేస్తాను అని అగ్రిమెంట్ మీద సంతకం చేశాను. కానీ, రాజీనామా ఇస్తున్నాను అని చెప్పిన తర్వాత కూడా ఫుల్ అండ్ ఫైనల్ సెటిల్మెంట్ ఇస్తాము అని చెప్పారు. తీరా రాజీనామా చేసే సమయానికి 'మేము రిలీవింగ్ ఇవ్వము. నీ ఒరిజినల్ సర్టిఫికెట్లు కూడా ఇవ్వము. అగ్రిమెంట్ ప్రకారం మూడేళ్లు పనిచేయాల్సిందే – అంటే ఇంకో 14 నెలలపాటు ఇక్కడే ఉండాలి అంటున్నారు.' ఇదే కంపెనీలో పని చేస్తే నేను జీవితాన్ని కోల్పోతాను. ఎంతో హెరాస్మెంట్‌గా ఉంది. తగిన సలహా ఇవ్వగలరు.

– ఒక ఐ.టీ. ఉద్యోగి, హైదరాబాద్

అసలు మీ ఒరిజినల్ సర్టిఫికెట్లు కంపెనీ వారికి ఎందుకు ఇచ్చారు? అలా తీసుకునే హక్కు కానీ, తీసుకుని వారి వద్దనే ఉంచుకునే హక్కు కానీ ఎవరికీ లేదు. పరిశీలించిన తర్వాత ఒరిజినల్ సర్టిఫికెట్లు మీకు తిరిగి ఇచ్చేయాల్సి ఉంటుంది. అలా కాదని ఎవరైనా చేస్తే అది చట్టరీత్యా తప్పు. ఐటీ కంపెనీలలో సాధారణంగా ఫ్రెషర్స్ గా వచ్చిన వారితో బాండు రాయించుకోవడం చూస్తుంటాము. కానీ, బాండు రాయించుకున్నంత మాత్రాన మీరు వారి వద్ద బానిసత్వం చేయాలి అని అర్థం కాదు. అలాంటి బాండ్లు అన్నివేళలా చెల్లవు కూడా. కంపెనీవారు మీకు ఏదైనా ప్రత్యేకమైన శిక్షణ ఇచ్చి, (స్పెషల్ ట్రైనింగ్, స్కిల్ డెవలప్‌మెంట్ కోర్స్ వంటివి) ఆ శిక్షణ ద్వారా మీరు లబ్ధి పొంది ఉంటే, సదరు శిక్షణ నుంచి మీరు నేర్చుకున్న పని ఆ కంపెనీకి ఉపయోగకరం అయినప్పుడు మాత్రమే వారు ఇచ్చిన శిక్షణకు ప్రతిఫలంగా కొంతకాలం వారి వద్ద పనిచేయాలి అనే నిబంధన చెల్లుతుంది. అంతేకానీ ప్రతి ఒక్క ఉద్యోగి దగ్గర ఇలాంటి బాండ్లు రాయించుకుంటే అవి చెల్లవు. వాటికి భయపడాల్సిన అవసరం లేదు.

కొన్ని మినహాయింపులు ఉన్నప్పటికీ, ఇండియన్ కాంట్రాక్టు యాక్ట్, సెక్షన్ 27 ఒక వ్యక్తిని తన వాణిజ్య/వ్యాపారాలు చేయడం వీలు లేదు అని రాసుకున్న ఏ అగ్రిమెంట్ అయినా కాంట్రాక్టు అయినా చెల్లవు. మీరు రాసుకున్న అగ్రిమెంట్/ఎంప్లాయిమెంట్ కాంట్రాక్ట్ లోని పదజాలాన్ని ఒకసారి పరిశీలించండి. మీరు లిఖితపూర్వక నోటీసు ఇచ్చి, నోటీసు సమయాన్ని పూర్తి చేసి ఆ కంపెనీని వదిలి వెళ్లవచ్చు. వీలుంటే ఒక లాయర్‌ని సంప్రదించి ఆ కాంట్రాక్టు చెల్లుతుందో లేదో చూసుకోండి. ఐటీ ఉద్యోగి అయినప్పటికీ, మీరు చేసే పని గనుక లేబర్ యాక్ట్ పరిధిలోకి వస్తే, మీరు లేబర్ కోర్టును కూడా సంప్రదించవచ్చు. అలాగని అందరు ఐటీ ఉద్యోగులకూ లేబర్ చట్టాలు వర్తించవు. కొందరికి మాత్రమే వర్తిస్తాయి. ప్రత్యామ్నాయంగా మీరు సివిల్ కోర్టును మీరు ఆశ్రయించవచ్చు. కొంత సమయం పట్టినప్పటికీ మీకు సరైన న్యాయం దొరుకుతుంది.



– శ్రీకాంత్ చింతల, హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.

చైతన్య పథం

మహిళలను దూషిస్తే జరిమానా



మద్యపానంపై నిషేధం విధించిన ఊళ్లు, ఆ నిషేధాన్ని ఉల్లంఘించిన వారిపై జరిమానాలు వేసే ఊళ్లు మనకు తెలుసు.

గ్రామ పరిశుభ్రతలో భాగంగా ఎక్కడ పడితే అక్కడ చెత్తవేసే వారిపై జరిమానా వేసే ఊళ్లు, బహిరంగ ప్రదేశాలలో పొగ తాగేవారిపై జరిమానా వేసే ఊళ్ల గురించీ మనకు తెలుసు.

అయితే మహారాష్ట్రలోని సౌందాల గ్రామం వినూత్న జరిమానాతో దేశం దృష్టిని ఆకర్షిస్తోంది.

బహుశా ఇలాంటి జరిమానా దేశ చరిత్రలోనే మొదటిసారి కావచ్చు.

మహారాష్ట్రలోని సౌందాల గ్రామంలో మహిళలను కించపరిచినట్లు మాట్లాడినా, తిట్టినా జరిమానా విధిస్తారు. అహల్యానగర్ జిల్లా నెవాసా తాలూకాలోని సౌందాల గ్రామ సభ మహిళలపై అసభ్య పదజాలానికి వ్యతిరేకంగా తీర్మానం చేసింది.

ముంబైకి మూడు వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామంలో వాదోపవాదాల సమయంలో, తగాదాలలో తల్లులు, సోదరీమణులను లక్ష్యంగా చేసుకొని బూతులు తిట్టడం సాధారణ దృశ్యంగా కనిపించేది.

'తమ ఇంట్లో కూడా మహిళలు ఉన్నారు అనే విషయం బూతులు మాట్లాడేవారు మరిచిపోతారు. బూతు పదాలు వాడిన వారిపై రూ.500 జరిమానా విధించాలని నిర్ణయించాం. సమాజంలో మహిళల గౌరవాన్ని, ఆత్మగౌరవాన్ని కాపాడే ప్రయత్నమే ఈ నిర్ణయం' అంటాడు తీర్మానం ప్రవేశపెట్టిన శరద్ ఆర్గాడే.

వితంతువులను మతపరమైన, సామాజిక ఆచారాలలో భాగస్వామ్యం చేయడంలోనూ గ్రామం ముందుంటుంది.

భర్త చనిపోయిన తరువాత సింధూరం తుడవడం, గాజులు పగల కొట్టడం, మంగళ సూత్రం తొలగించడంలాంటివి ఆ గ్రామంలో నిషిద్ధం. సౌందాల వివాదరహిత గ్రామంగా రాష్ట్ర స్థాయిలో అవార్డ్ అందుకుంది.


'జరిమానా వల్ల మార్పు వస్తుందా? అని మొదట్లో చాలామంది సందేహించారు. విధించే జరిమానా చిన్న మొత్తమే కావచ్చు. అయితే ఈ తీర్మానం వల్ల బూతు మాటలు మాట్లాడడం తప్పు అనే భావన గ్రామస్థుల మనసులో బలంగా నాటుకుపోతుంది. మహిళలను కించపరిచేలా మాట్లాడడం తగ్గిపోతుంది' అంటుంది విమల అనే గృహిణి.

● ముగ్గు-ముచ్చట


శాంతి సర్వా, సరూర్‌నగర్, హైదరాబాద్


18 చుక్కలు, 6 వరసలు అటు ఇటు వదిలి 6 వరకు


ఎం. ధనలక్ష్మి
కల్లూరిపల్లి హౌసింగ్ బోర్డ్ కాలనీ, నెల్లూరు


15 చుక్కలు, 1 వచ్చేవరకు – సరిచుక్క

ముగ్గులకు ఆహ్వానం



ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు-ముచ్చట,
సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్,
రోడ్ నెం.1, బంజారాహిల్స్,
హైదరాబాద్–34.
ఈ మెయిల్:
muggulu.sakshi@gmail.com



గుకేశ్‌కు ఘన సత్కారం... రూ. 5 కోట్లు నజరానా అందించిన తమిళనాడు సీఎం స్టాలిన్

సాక్షి, చెన్నై: ప్రపంచ చెస్ కొత్త చాంపియన్ గుకేశ్ దొమ్మరాజును తమిళనాడు ప్రభుత్వం మంగళవారం ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా గుకేశ్‌కు రూ. 5 కోట్లు నగదు పురస్కారాన్ని తమిళ నాడు సీఎం స్టాలిన్, డిప్యూటీ సీఎం ఉదయనిధి అందజేశారు. అంతకుముందు చెన్నై వీధులలో ఓపెన్ టాప్ వాహనంలో తాను సాధించిన ట్రోఫీతో గుకేశ్ ప్రయాణించాడు. అనంతరం జరిగిన వేడుకలో తల్లిదండ్రుల సమక్షంలో గుకేశ్‌ను సీఎం స్టాలిన్, డిప్యూటీ సీఎం ఉదయనిధి సత్కరించారు. ఐదుసార్లు ప్రపంచ చాంపియన్ నిలిచిన విశ్వనాథన్ ఆనంద్, క్రీడల శాఖ కార్యదర్శి అతుల్య మిశ్రా, స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అథారిటీ సీఈఓ జె.మేఘనాథరెడ్డి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. గుకేశ్‌ను సత్కరించిన సీఎం స్టాలిన్ రూ. 5 కోట్ల చెక్‌ను అందజేశారు.

పోరాడి... ఫాలోఆన్ తప్పించుకొని...

వర్షం దోబూచులాడుతున్న మూడో టెస్టులో విజయం సాధించి సిరీస్‌లో ఆధిక్యంలోకి వెళ్లాలంటే ఆస్ట్రేలియా ముందున్న ఏకైక అవకాశం భారత్‌ను ఫాలోఆన్ ఆడించడం! ముందుగా పరుగుల లోటును పూరించి ఆపై ఆసీస్‌కు లక్ష్యం విధించాలంటే భారత్ ఎంతో బాగా ఆడాలి. ఈ ఒత్తిడిలోకి నెట్టి చిత్తు చేయవచ్చని కంగారూలు భావించారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ స్కోరు 213/9 వద్ద అది జరిగేలా కనిపించింది. ఫాలోఆన్ తప్పించాలంటే మరో 33 పరుగులు చేయాల్సిన ఈ స్థితిలో చివరి జోడీ బుమ్రా, ఆకాశ్‌దీప్‌పై ఆశలు లేవు. ఆస్ట్రేలియా కూడా ఇదే భావించింది. కానీ భారత ద్వయం వారి లెక్కను మార్చేసింది. 53 బంతులు ఆడిన ఈ జోడీ అభేద్యంగా 39 పరుగులు జత చేసి భారత్‌ను ఫాలోఆన్ నుంచి తప్పించింది. ఒకే రోజు ఆట మిగిలి ఉండగా బుధవారం కూడా వాన ముప్పు కూడా ఉన్న నేపథ్యంలో ఈ మ్యాచ్ 'డ్రా'గా ముగియడం దాదాపు ఖాయమే!

తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 252/9

- రాహుల్, జడేజా అర్ధసెంచరీలు
- 'డ్రా' దిశగా మూడో టెస్టు


ఆకాశ్‌దీప్, బుమ్రా

బ్రిస్బేన్: బోర్డర్–గావస్కర్ ట్రోఫీ మూడో టెస్టులో భారత్ కీలక సమయంలో ఇన్నింగ్స్ ఓటమి నుంచి తమను తాము రక్షించుకుంది. ఇందుకు 'గాబా' మైదానంలో వాన అంతరాయాలతో పాటు అదృష్టం కూడా కాస్త కలిసొచ్చింది. మ్యాచ్ నాలుగో రోజు వెలుతురులేమితో అంపైర్లు ముందుగానే ఆటను నిలిపివేసే సమయానికి భారత్ తమ మొదటి ఇన్నింగ్స్‌లో 74.5 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 252 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్ (139 బంతుల్లో 84; 8 ఫోర్లు), రవీంద్ర జడేజా (123 బంతుల్లో 77; 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధసెంచరీలు చేశారు. ఆకాశ్‌దీప్ (31 బంతుల్లో 27 బ్యాటింగ్; 2 ఫోర్లు, 1 సిక్స్), జస్‌ప్రీత్ బుమ్రా (27 బంతుల్లో 10 బ్యాటింగ్; 1 సిక్స్) క్రీజులో ఉండగా... భారత్ మరో 193 పరుగులు వెనుక బడి ఉంది. వర్షం వరుస అంతరాయాలతో నాలుగో రోజు 57.5 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. చివరి రోజు మిగిలిన కనీసం 98 ఓవర్ల ఆటలో ఒకవేళ ఆసీస్ బ్యాటింగ్‌లో వేగంగా పరుగులు చేసి భారత్‌కు సవాల్ విసిరినా... మిగిలిన సమయంలో భారత్‌ను ఆలౌట్ చేయడం అసాధ్యమే! వాతావరణ శాఖ అంచనా ప్రకారం బుధవారం కూడా టెస్టుకు వర్షం అంతరాయం కలిగించే అవకాశం ఉంది.


స్టార్క్, కమిన్స్ సంబరం

కీలక భాగస్వామ్యాలు...

మంగళవారం మొదటి బంతితోనే అదృష్టం మన జట్టు పక్షాన నిలిచింది. కమిన్స్ వేసిన ఈ బంతికి రాహుల్ స్లిప్‌లోకి ఆడగా అతని సునాయాస క్యాచ్‌ను స్టీవ్ స్మిత్ వదిలేశాడు. అయితే మరోవైపు రోహిత్ శర్మ (10) వైఫల్యం కొనసాగింది. ఈ దశలో రాహుల్, జడేజా భాగస్వామ్యం జట్టును నడిపించింది. రాహుల్ 85 బంతుల్లో హాఫ్ సెంచరీ అందుకోగా... చక్కటి సమన్వయంతో ఆడిన వీరిద్దరు ఆరో వికెట్‌కు 67 పరుగులు జోడించారు. స్లిప్‌లో స్మిత్ అద్భుత క్యాచ్‌తో రాహుల్ సెంచరీ అవకాశం చేజార్చుకున్నాడు. స్మిత్ వదిలేసిన, పట్టిన ఈ క్యాచ్ మధ్య రాహుల్ 51 అదనపు పరుగులు సాధించడం విశేషం! ఆ తర్వాత నితీశ్ రెడ్డి (16)తో కలిసి జడేజా బాధ్యత తీసుకున్నాడు. నియంత్రణతో కూడిన బ్యాటింగ్ ప్రదర్శన చేసిన జడేజా 82 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. జడేజా, నితీశ్ కుమార్ రెడ్డి ఏడో వికెట్‌కు 53 పరుగులు జత చేయడంలో సఫలమయ్యారు. గాయంతో మూడో పేసర్ హాజల్‌వుడ్ ఆటకు దూరం కావడం కూడా ఆసీస్ సమస్యను పెంచింది. అయితే ఏడు పరుగుల వ్యవధిలో నితీశ్, సిరాజ్ (1) అవుట్ కాగా... భారీ షాట్ ఆడే క్రమంలో జడేజా కూడా వెనుదిరిగాడు. ఈ దశలో ఆస్ట్రేలియా పైచేయి సాధించినట్లు అనిపించింది. కానీ ఆకాశ్‌దీప్, బుమ్రా బ్యాటింగ్ వారిని తీవ్ర నిరాశలో ముంచింది.

జోడీ అదిరింది

'మీకు నా బ్యాటింగ్ సత్తా ఏమిటో తెలియకపోతే గూగుల్‌లో వెతకండి'... సోమవారం మీడియాతో బుమ్రా చేసిన వ్యాఖ్య ఇది. టెస్టు ఓవర్‌లో అత్యధిక పరుగులు చేసిన తన రికార్డు (33 పరుగులు)ను గుర్తు చేస్తూ అతను ఈ మాట అన్నాడు. బ్రిస్బేన్ టెస్టులో భారత్‌తో ఫాలోఆన్ నుంచి తప్పించే ప్రయత్నంలో అతని 27 బంతుల విలువేమిటో కనిపించగా... 11వ నంబర్ ఆటగాడు ఆకాశ్‌దీప్ 31 బంతులు పాటు ఆడి బుమ్రాకు సరైన జోడీగా నిలిచాడు. వీరిద్దరు ఎలాగూ భారీ షాట్లకు ప్రయత్నిస్తారని భావించి ఎక్కువ మంది ఫీల్డర్లను కమిన్స్ బౌండరీ వద్ద ఉంచాడు. అయితే భారత బ్యాటర్లు చాలా జాగ్రత్తగా సింగిల్స్‌తోనే ఒక్కో పరుగు పేర్చుకుంటూ చేరువగా తీసుకొచ్చారు. ఎట్టకేలకు ఆ క్షణం వచ్చింది. ఫాలోఆన్‌ను తప్పించేందుకు మరో నాలుగు పరుగులు అవసరం కాగా, కమిన్స్ బౌలింగ్‌లో ఆకాశ్‌దీప్ ఫోర్ కొట్టడంతో ఒక్కసారిగా భారత బృందంలో సంతోషం కనిపించింది. మరో రెండు బంతుల తర్వాత మిడ్‌వికెట్ మీదుగా ఆకాశ్‌దీప్ బాదిన భారీ సిక్సర్ నాలుగో రోజు ఆటలో హైలైట్‌గా నిలిచింది. ఈ అనూహ్య ప్రతిఘటన అనంతరం సహజంగానే ఆసీస్ ఆటగాళ్లు నిరాశగా మైదానం వీడారు.


రాహుల్ జడేజా

స్కోరు వివరాలు


ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 445; భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) మార్ష్ (బి) స్టార్క్ 4; రాహుల్ (సి) స్మిత్ (బి) లయన్ 84; గిల్ (సి) మార్ష్ (బి) స్టార్క్ 1; కోహ్లి (సి) కేరీ (బి) హాజల్‌వుడ్ 3; పంత్ (సి) కేరీ (బి) కమిన్స్ 9; రోహిత్ (సి) కేరీ (బి) కమిన్స్ 10; జడేజా (సి) మార్ష్ (బి) కమిన్స్ 77; నితీశ్ రెడ్డి (బి) కమిన్స్ 16; సిరాజ్ (సి) కేరీ (బి) స్టార్క్ 1; బుమ్రా (బ్యాటింగ్) 10; ఆకాశ్‌దీప్ (బ్యాటింగ్) 27; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (74.5 ఓవర్లలో 9 వికెట్లకు) 252. వికెట్ల పతనం:** 1-4, 2-6, 3-22, 4-44, 5-74, 6-141, 7-194, 8-201, 9-213. **బౌలింగ్:** స్టార్క్ 24-3-83-3, హాజల్‌వుడ్ 6-2-22-1, కమిన్స్ 20.5-2-80-4, లయన్ 21-0-54-1, హెడ్ 1-0-1-0, మార్ష్ 2-0-6-0.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

హేలీ మాథ్యూస్ మెరుపులు

47 బంతుల్లో 17 ఫోర్లతో 85 నాటౌట్

- రెండో టి20లో విండీస్ విజయం
- తొమ్మిది వికెట్లతో ఓడిన భారత్


హేలీ మాథ్యూస్


ముంబై: వెస్టిండీస్‌తో గత టి20 మ్యాచ్ ప్రదర్శనను భారత మహిళలు పునరావృతం చేయలేకపోయారు. సమష్టి వైఫల్యంతో రెండో టి20 మ్యాచ్‌ను పర్యాటక జట్టుకు అప్పగించారు. మంగళవారం జరిగిన ఈ పోరులో విండీస్ మహిళల జట్టు 9 వికెట్ల తేడాతో భారత్‌పై ఘన విజయం సాధించింది. తాజా ఫలితంతో మూడు మ్యాచ్‌ల సిరీస్ 1–1తో సమం కాగా, చివరి టి20 రేపు జరుగుతుంది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేయగా... వెస్టిండీస్ 15.4 ఓవర్లలో వికెట్ నష్టానికి 160 పరుగులు చేసి విజయాన్నందుకుంది. భారత్ ఇన్నింగ్స్‌లో స్మృతి మంధాన (41 బంతుల్లో 62; 9 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీ సాధించగా, వికెట్ కీపర్ రిచా ఘోష్ (17 బంతుల్లో 32; 6 ఫోర్లు) దూకుడుగా ఆడింది. స్మృతి ఇచ్చిన మూడు సునాయాస క్యాచ్‌లను (30, 40, 40 పరుగుల వద్ద) విండీస్ ఫీల్డర్లు వదిలేయడం కూడా ఆమెకు కలిసొచ్చింది. 37 బంతుల్లో ఆమె అర్ధ సెంచరీ పూర్తి చేసుకుంది. అయితే మిగతా ఆటగాళ్లంతా విఫలం కావడంతో జట్టు భారీ స్కోరు సాధించలేకపోయింది. ఛేదనలో వెస్టిండీస్ కెప్టెన్ హేలీ మాథ్యూస్ (47 బంతుల్లో 85 నాటౌట్; 17 ఫోర్లు), ఖియానా జోసెఫ్ (22 బంతుల్లో 38; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) తొలి వికెట్‌కు 40 బంతుల్లోనే 66 పరుగులు జోడించి శుభారంభం అందించారు. ఖియానా వెనుదిరిగినా...మాథ్యూస్, షిమైన్ క్యాంప్‌బెల్ (26 బంతుల్లో 29 నాటౌట్; 4 ఫోర్లు) కలిసి జట్టును గెలిపించారు. వీరిద్దరు రెండో వికెట్‌కు అభేద్యంగా 55 బంతుల్లోనే 94 పరుగులు జత చేయడంతో మరో 26 బంతులు మిగిలి ఉండగానే విండీస్ విజయం ఖాయమైంది. మోకాలికి స్వల్ప గాయంతో బాధపడుతున్న కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ రెండో టి20కి దూరం కావడంతో స్మృతి సారథిగా వ్యవహరించింది. ఆమె స్థానంలో ఉత్తరాఖండ్‌కు చెందిన 20 ఏళ్ల రాఘ్వీ బిస్త్ ఈ మ్యాచ్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగు పెట్టింది.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: స్మృతి (సి) ఫ్లెచర్ (బి) మాథ్యూస్ 62; ఉమా ఛెత్రి (బి) డాటిన్ 4; జెమీమా (ఎల్బీ) (బి) మాథ్యూస్ 13; రాఘ్వీ (ఎల్బీ) (బి) ఫ్లెచర్ 5; దీప్తి శర్మ (రనౌట్) 17; రిచా (సి) క్యాంప్‌బెల్ (బి) డాటిన్ 32; సజన (ఎల్బీ) (బి) ఫ్లెచర్ 2; రాధ (సి) డాటిన్ (బి) హెన్రీ 7; సైమా (సి) డాటిన్ (బి) హెన్రీ 6; టిటాస్ (నాటౌట్) 1; రేణుక (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 159. వికెట్ల పతనం:** 1-6, 2-35, 3-48, 4-104, 5-108, 6-113, 7-144, 8-149, 9-155. **బౌలింగ్:** చినెల్ హెన్రీ 4-0-37-2, డాటిన్ 4-0-14-2, హేలీ మాథ్యూస్ 4-0-36-2, కరిష్మా 3-0-19-0, ఫ్లెచర్ 3-0-28-2, అఫ్సిని 2-0-25-0.

వెస్టిండీస్ ఇన్నింగ్స్: హేలీ మాథ్యూస్ (నాటౌట్) 85; ఖియానా జోసెఫ్ (సి) రిచా (బి) సైమా 38; క్యాంప్‌బెల్ (నాటౌట్) 29; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (15.4 ఓవర్లలో వికెట్ నష్టానికి) 160. వికెట్ల పతనం:** 1-66. **బౌలింగ్:** రేణుకా సింగ్ 3-0-29-0, టిటాస్ సాధు 2-0-32-0, దీప్తి శర్మ 3-0-26-0, సైమా ఠాకూర్ 3-0-28-1, రాధ యాదవ్ 2-0-27-0, సజీవన్ సజన 2.4-0-17-0.

సినిమా



మోసం చేశావు... ఇడిచిపెట్టను


మృణాల్ ఠాకూర్, అడివి శేష్

'అవును వదిలేశాను... కానీ మనస్ఫూర్తిగా ప్రేమించాను...' అని 'ఎక్స్'లో షేర్ చేశారు మృణాల్ ఠాకూర్. 'అవును ప్రేమించావు... కానీ మోసం చేశావు... ఇడిచి పెట్టను... తేల్చాల్సిందే...' అని అడివి శేష్ కౌంటర్ ఇచ్చారు. ఈ ఇద్దరూ ఒకప్పుడు ప్రేమించుకున్నారు. ఇప్పుడు మాజీ ప్రేమికులు. మరి... వీరి కథకి కొనసాగింపు ఏంటి? అనేది 'డెకాయిట్'లో చూడాల్సిందే. అడివి శేష్ హీరోగా రూపొందుతున్న పాన్ ఇండియా యాక్షన్ మూవీ 'డెకాయిట్'లో హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్‌ని ఖరారు చేశారు. శేష్ పుట్టినరోజు (డిసెంబర్ 17) సందర్భంగా హీరోయిన్‌ని ప్రకటించి, కొత్త ఫొటోను విడుదల చేశారు. షానీల్ డియో దర్శకత్వంలో ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తున్నారు. సునీల్ నారంగ్ సహ నిర్మాత. హిందీ, తెలుగు భాషల్లో ఏకకాలంలో రూపొందుతున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ఆ తర్వాత మహారాష్ట్రలో ఓ లెంగ్తీ షెడ్యూల్‌ని ప్లాన్ చేశారు. ''తనకు ద్రోహం చేసిన లవర్ పై ప్రతీకారం తీర్చుకునే దోషి కథగా 'డెకాయిట్' ఉంటుంది. మాజీ ప్రేమికుల మధ్య యాక్షన్, ఎమోషన్, డ్రామాతో నిండిన కథ ఇది'' అని చిత్రబృందం పేర్కొంది. ''అడివి శేష్, షానీల్ డియో కలిసి స్టైలిష్ విజన్‌తో ఓ ఇంటెన్స్ కథను తయారు చేశారు. ఈ చిత్రంలోని నా పాత్ర నటిగా నాలో కొత్త కోణాలను ఆవిష్కరించే విధంగా ఉంది'' అని పేర్కొన్నారు మృణాల్ ఠాకూర్.

ఆ గ్యాప్‌ను ఫిల్ చేయాలనుకుంటున్నాను - రమణ గోగుల

''ఇప్పుడున్న మ్యూజిక్ డైరెక్టర్స్ అందరూ చాలా అద్భుతమైన పాటలు, సంగీతం అందిస్తున్నారు. అయితే ఓ న్యూ కైండ్ ఆఫ్ మ్యూజిక్‌కు ఎక్కడో చిన్న గ్యాప్ ఉందనిపిస్తోంది. ఆ గ్యాప్‌ను ఫిల్ చేయడానికి నేను సిద్ధంగా ఉన్నాను. నాకు కొన్ని కొత్త ఐడియాస్ ఉన్నాయి. మంచి కథ, హీరో, దర్శక–నిర్మాతలు, సరైన సమయం... ఇలా అన్నీ కుదిరితే కచ్చితంగా సినిమా చేసేందుకు సిద్ధంగా ఉన్నాను'' అన్నారు సంగీత దర్శకుడు, గాయకుడు రమణ గోగుల. వెంకటేశ్ హీరోగా నటించిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ నిర్మించిన ఈ చిత్రం జనవరి 14న విడుదల కానుంది. సంగీత దర్శకుడు, గాయకుడు రమణ గోగుల దాదాపు పన్నెండేళ్ల తర్వాత రీ ఎంట్రీ ఇచ్చి, 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలోని 'గోదారి గట్టు..' పాటను పాడారు. ఈ సందర్భంగా రమణ గోగుల చెప్పిన విశేషాలు.

- వెంకటేశ్‌గారి 'ప్రేమంటే ఇదేరా..' సినిమాతో సంగీత దర్శకుడిగా నా కెరీర్ మొదలైంది. మళ్లీ కొంత గ్యాప్ తర్వాత వెంకటేశ్‌గారి 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలోని పాటతో తిరిగి ఇండస్ట్రీకి వచ్చాను. ఇదంతా చూస్తుంటే లైఫ్ ఫుల్ సర్కిల్ అవ్వడం ఇదేనేమో అనిపిస్తోంది. నేను యూఎస్‌లో ఉన్నప్పుడు మ్యూజిక్ డైరెక్టర్ భీమ్స్ ఫోన్ చేసి, 'గోదారి గట్టు..' పాట పాడాలని కోరారు. నేనేమో ఇప్పటివరకు వేరే సంగీత దర్శకుల పాటలను పాడింది లేదు. సరే... ఓసారి పాట విందామని విన్నాను. చాలా నచ్చింది. పాటలో ఓ హార్ట్ ఉందనిపించి, ఒప్పుకున్నాను. మధుప్రియ నాతో కలిసి చాలా బ్యాలెన్సింగ్‌గా పాడారు. భాస్కరభట్లగారు అద్భుతమైన లిరిక్స్ ఇచ్చారు. ఈ సినిమా దర్శకుడు అనిల్ రావిపూడి, భీమ్స్ ఈ పాట పాడేందుకు నాకు క్రియేటివ్ ఫ్రీడమ్ ఇచ్చారు. వెంకటేశ్‌గారు నాకు లవ్లీ ఫ్రెండ్. ఆయన ఫోన్ చేసి, అభినందించారు. పాట రిలీజైన తర్వాత పాజిటివ్ రెస్పాన్స్ వచ్చింది. ఇప్పటివరకు 27 మిలియన్ల వ్యూస్ వచ్చాయి. ఎవరో ఓ వ్యక్తి మాది గుంటూరు అంటూ ఫోన్ చేసి, 'గోదారి..' పాట బాగుందని మాట్లాడాడు. చాలా హ్యాపీ ఫీలయ్యాను.
- నాకు మ్యూజిక్‌తో పాటు టెక్నాలజీ అంటే ఇష్టం. దీంతో అబ్రాడ్‌లో ఓ మల్టీనేషనల్ కంపెనీకి వర్క్ చేశాను. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డాటా ఎనలిటిక్స్ వంటి అంశాలపై పని చేశాను. అలాగని సంగీతానికి దూరంగా లేను. నాకు ఇష్టమైనప్పుడు మా ఇంట్లో పియానోను, గిటార్‌ను ప్లే చేస్తూనే ఉంటాను. ఏఐతో సాంగ్స్ క్రియేట్ చేస్తున్నారు. కానీ హ్యూమన్ టచ్ ఉన్నప్పుడే సాంగ్స్ బాగుంటాయి. ఇండస్ట్రీకి కాస్త దూరంగా ఉన్నా నాకు చాలా అవకాశాలు వచ్చాయి. ఈ గ్యాప్‌లో దాదాపు వంద సినిమాలు రిజెక్ట్ చేసి ఉంటాను. నాకు ఇష్టం అయితేనే సాంగ్స్ కంపోజ్ చేస్తాను.



పదేళ్లు గుర్తుండిపోతుంది - 'అల్లరి' నరేశ్

''హీరో క్యారెక్టరైజేషన్ పాజిటివా? నెగటివా? అనే విషయాలను పక్కనపెట్టి, హీరో తాలూకు కొత్త రకం ఎమోషన్స్‌ను ఆడియన్స్ కోరుకుంటున్నారు. ఆ తరహా ఎమోషన్స్ బచ్చల మల్లి క్యారెక్టర్‌లో ఉంటాయి. చెప్పాలంటే... ప్రతి మనిషిలోనూ కొంత గ్రే షేడ్ ఉంటుంది. ఈ ప్రకారం ప్రతి మనిషిలోనూ బచ్చల మల్లి ఉంటాడు. 'అర్జున్ రెడ్డి, కేజీఎఫ్, పుష్ప' తరహా సినిమాలను చూసి, ఆడియన్స్ ఏం మారలేదు. 'పుష్ప' సినిమా చూసి, ఎవరూ చందనం కొట్టడానికి అడివికి వెళ్లలేదు. అలాగే 'బచ్చల మల్లి' క్యారెక్టర్‌ను కూడా ఎవరూ బ్యాడ్‌గా తీసుకోరని అనుకుంటున్నా. ఒకవేళ మంచి తీసుకోవాలనుకుంటే మద్యం సేవించకూడదని ఈ సినిమాలో చెప్పాం. ఈ సందేశాన్ని తీసుకోవచ్చు'' అని 'అల్లరి' నరేశ్ అన్నారు. 'అల్లరి' నరేశ్ టైటిల్ రోల్ చేసిన చిత్రం 'బచ్చల మల్లి'. ఈ చిత్రంలో అమృతా అయ్యర్ కథానాయిక. రాజేశ్ దండా, బాలాజీ గుత్తా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న విడుదల కానుంది. ఈ సందర్భంగా 'అల్లరి' నరేశ్ చెప్పిన విశేషాలు.

- 'బచ్చల మల్లి' కథ 1990, 2005.. ఇలా రెండు కాలమానాల్లో జరుగుతుంది. ఓ ఊర్లో ట్రాక్టర్ నడుపుకునే వ్యక్తి బచ్చల మల్లి (అల్లరి నరేశ్ పాత్ర పేరు). తనను ఎవరైనా వద్దనుకుంటే ఇక తన జీవితంలో వాళ్లు ఉండాలని కోరుకోడు. మూర్ఖత్వంతో ప్రవర్తిస్తుంటాడు. అలాంటి వ్యక్తి జీవితంలోకి కావేరి (అమృతా అయ్యర్ పాత్ర పేరు) వచ్చిన తర్వాత అతని జీవితమే మారిపోతుంది. చెడు అలవాట్లకు దూరంగా ఉంటుంటాడు. కానీ గతంలో బచ్చల మల్లి చేసిన తప్పులు అతన్ని వెంటాడుతుంటాయి? అప్పుడు ఏం జరిగింది? అన్నదే ఈ సినిమా కథ. బచ్చలమల్లి క్యారెక్టరైజేషన్‌లో హ్యూమర్ చాలా తక్కువ. మిగిలిన అన్ని ఎమోషన్స్ ఉంటాయి. బచ్చల మల్లి ఏడిపిస్తాడు... నవ్విస్తాడు. 'గమ్యం'లో నేను చేసిన గాలి శీను పాత్రలా బచ్చల మల్లి పాత్ర కూడా పదేళ్ల పాటు ఆడియన్స్‌కి గుర్తుండిపోతుంది.
- బచ్చల మల్లి ఎవరిదో ఆటోబయోగ్రఫీ అని అంటున్నారు. కానీ కాదు. దర్శకుడు సుబ్బు ఊర్లో బచ్చల మల్లి అనే వ్యక్తి ఉన్నారు. ఆయన జీవితంలోని కొన్ని సంఘటనలను తీసుకుని కథను రెడీ చేశారు. నిజమైన బచ్చల మల్లిని నేను సెట్స్‌లో కూడా కలిశాను. ఈ క్యారెక్టరైజేషన్ తాలూకు బాడీ లాంగ్వేజ్ చాలెంజింగ్‌గా అనిపించింది. నా నడకలో మూర్ఖత్వం ఉండాలని అడిగేవాడు సుబ్బు. అలాగే కొత్తగా ఏడ్వమన్నాడు. అంటే నా పాత సినిమాల ప్రభావం ఈ సినిమాపై రాకుండా సుబ్బు జాగ్రత్తలు తీసుకున్నాడు. సినిమా మొదలైన ఐదు నిమిషాలకే బచ్చల మల్లి వరల్డ్‌లోకి ఆడియన్స్ వెళ్తారు. తెరపై 'అల్లరి' నరేశ్ కనిపించడు. బచ్చల మల్లి మాత్రమే కనిపిస్తాడు.
- 'ఇట్లు మారేడుమిల్లి ప్రజానీకం' దగ్గర్నుంచి నిర్మాత రాజేశ్‌తో నా ప్రయాణం మొదలైంది. ఆయన 'బచ్చల మల్లి' కథ విన్నప్పుడు ఎమోషనల్ అయ్యారు. 'రంగస్థలం' సినిమాలో రామ్‌చరణ్‌గారికి ఎంత మంచి పేరు వచ్చిందో, నటుడిగా అంత మంచి పేరు నాకు ఈ సినిమాతో వస్తుందని నిర్మాత అన్నారంటే ఆయన సినిమాకు అంత కనెక్ట్ అయ్యారు. 'రంగస్థలం' సినిమాకు ఓ నటుడిగా రామ్‌చరణ్‌గారికి వచ్చిన పేరులో నాకు సగం గుర్తింపు వచ్చినా చాలు.
- కామెడీ నా హోమ్‌గ్రౌండ్. సీరియస్ సినిమాలతో పాటు కామెడీ చిత్రాలు చేస్తుంటాను. అయితే ఆర్గానిక్ కామెడీ రాసే రైటర్స్ తక్కువైపోయారు. కొంతమంది రైటర్స్ దర్శకులుగా బిజీ అవుతున్నారు. 'సుడిగాడు 2' సినిమా కోసం కథ రాస్తున్నాను. ఇందులో పాన్ ఇండియా సినిమాలపై స్పూఫ్స్ చేస్తాను. నార్త్ ఇండియా సినిమాల ప్రస్తావన కూడా ఉంటుంది. 'జెండా' అనే కథ ఉంది. నా ప్రస్తుత కమిట్‌మెంట్స్ పూర్తయిన తర్వాత ఈ కథతో సినిమా ప్రారంభిస్తాను.

ప్రపంచం ఒకేలా ఉండదు


శ్రీ మురళి

తెలుగు చిత్ర పరిశ్రమలోని ప్రముఖ నిర్మాణ సంస్థల్లో ఒకటైన పీపుల్ మీడియా ఫ్యాక్టరీలో ఓ సినిమా చేయనున్నారు కన్నడ నటుడు శ్రీ మురళి. పీపుల్ మీడియా ఫ్యాక్టరీలోని ఈ 47వ సినిమాను టీజీ విశ్వప్రసాద్ నిర్మించనున్నారు. డిసెంబరు 17 శ్రీ మురళి బర్త్ డే సందర్భంగా ఈ సినిమాని ప్రకటించి, పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ''చక్రం తిరగడం ప్రారంభమైంది. ఇకపై ప్రపంచం ఎప్పటికీ ఒకేలా ఉండదు'' అని ఈ పోస్టర్‌పై ఉంది. ఇక ఈ సినిమాలోని ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని మేకర్స్ తెలిపారు. అలాగే శ్రీ మురళి హీరోగా నటించనున్న మరో సినిమా 'పరాక్'. బ్రాండ్ స్టూడియోస్ హాలేష్ కోగుండి టీమ్ నిర్మాణంలో ఈ చిత్రం షూటింగ్ వచ్చే ఏడాది మార్చిలో ఆరంభం కానుంది.

ఫీల్ గుడ్ వినోదం


అనగ అజిత్, షణ్ముఖ్ జస్వంత్

షణ్ముఖ్ జస్వంత్ లీడ్ రోల్‌లో నటించిన ఫీల్ గుడ్ ఎంటర్‌టైనర్ మూవీ 'లీలా వినోదం'. ఈ చిత్రంలో అనగ అజిత్ హీరోయిన్‌గా నటించగా, గోపరాజు రమణ, ఆమని, రూపాలక్ష్మి ఇతర కీలక పాత్రల్లో నటించారు. పవన్ సుంకర దర్శకత్వంలో శ్రీధర్ మారిసా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 19 నుంచి ఈటీవీ విన్ ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో షణ్ముఖ్ జస్వంత్ మాట్లాడుతూ– ''కొత్త కాన్సెప్ట్‌తో మేం చేసిన 'లీలా వినోదం' ప్రేక్షకులను మెప్పిస్తుంది'' అన్నారు. ''ఈ సినిమాలో ఓవర్ థింకింగ్ అనే కాన్సెప్ట్‌ని చూపిస్తున్నాం'' అని తెలిపారు పవన్ సుంకర. ''ఎంతో కష్టపడి ఈ ప్రాజెక్ట్ చేశాం. ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు నిర్మాత శ్రీధర్. ఈ సమావేశంలో ఈటీవీ విన్ బిజినెస్ హెడ్ సాయికృష్ణ, ఈటీవీ విన్ కంటెంట్ హెడ్ నితిన్ చక్రవర్తి మాట్లాడారు.

సాక్షి బిజినెస్

బుధవారం
18-12-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
1,064	332
80,684	24,336

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	20,103	▽	75
డోజోన్స్	43,473	▽	245
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,195	▽	67
డాక్స్	20,246	▽	67
షాంఘై	3,361	▽	25
నికాయ్	39,364	▽	93

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)		
76,362	▽	1
బంగారం (99.5 స్వచ్ఛత)		
76,056	▽	554
వెండి (కేజీ)		
88,525	▽	990

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	84.49	85.51
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	106.40	109.27
€	యూరో	ఒకటి	88.09	90.69
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	54.54	55.93
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	52.99	55.17
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.55	65.23
SAR	సౌదీ రియాల్	ఒకటి	21.74	23.30
UAE D	యూఏఈ దిర్హామ్	ఒకటి	22.22	24.01
¥	చైనా యువాన్	ఒకటి	10.78	12.60



గ్రీన్ హైడ్రోజన్.. గేమ్ చేంజర్!

ఉత్పత్తి వ్యయాన్ని భారీగా తగ్గించడంపై కంపెనీల ఫోకస్	ఏఐ సహా అధునాతన టెక్నాలజీల వాడకం	ప్రస్తుతం కేజీ ఉత్పాదక వ్యయం 4-5 డాలర్లు	దీన్ని 1-2 డాలర్లకు చేర్చడమే లక్ష్యం

రిలయన్స్, అదానీ, అవాడా, హైజెన్కో, థెర్మాక్స్ భారీ ప్రణాళికలు

హైడ్రోజన్ కార్లు.. బస్సులు.. రైళ్లు.. నౌకలు.. పరిశ్రమలు... ఇలా ప్రపంచమంతా ఇప్పుడు గ్రీన్ హైడ్రోజన్ నామ జపం చేస్తోంది! పునరుత్పాదక ఇంధన రంగంలో గేమ్ చేంజర్‌గా అభివర్ధిస్తున్న గ్రీన్ హైడ్రోజన్ కోసం భారత్ కూడా వేట మొదలుపెట్టింది. దేశీ కార్పొరేట్ దిగ్గజాలైన రిలయన్స్, అదానీ గ్రూపులతో పాటు అవాడా, హైజెన్కో గ్రీన్ ఎనర్జీస్, థెర్మాక్స్ వంటి సంస్థలు ఈ రంగంలో ఇప్పటికే భారీ ప్రణాళికలతో చకచకా ముందుకు సాగుతున్నాయి. ముఖ్యంగా ఈ నయా ఇంధనాన్ని వినియోగదారులకు చౌకగా అందించేందుకు ఉత్పాదక వ్యయాన్ని రెండింతలకు పైగా తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి.

ప్రస్తుతం దేశంలో గ్రీన్ హైడ్రోజన్ ఉత్పాదక వ్యయం ఒక్కో కేజీకి 4-5 డాలర్లు (దాదాపు రూ.340-430)గా ఉంటోంది. అదే గ్రే హైడ్రోజన్ ఉత్పత్తి ఖర్చు 1-2 డాలర్లు (రూ.85-170) మాత్రమే. గ్రే హైడ్రోజన్ ఉత్పత్తి కాలుష్యకరమైనది కావడంతో ప్రపంచవ్యాప్తంగా దీనిపై వ్యతిరేకత వ్యక్తమవుతోంది. దీంతో కంపెనీలు గ్రీన్ హైడ్రోజన్ ఉత్పాదక వ్యయాన్ని గణనీయంగా తగ్గించడంపై దృష్టిపెట్టాయి. సరికొత్త టెక్నాలజీలతో పాటు వినూత్న ఉత్పత్తులు, ఇతరత్రా మార్గాలను ఎంచుకుంటున్నాయి. 2030 నాటికి భారత్ ప్రతిష్టాత్మకంగా నిర్దేశించుకున్న 50 లక్షల వార్షిక టన్నుల ఉత్పత్తి లక్ష్యం సాకారం కావాలంటే, ఉత్పాదక వ్యయాన్ని తగ్గించడం చాలా కీలకమని నిపుణులు పేర్కొంటున్నారు.

టెక్నాలజీ దన్ను...

గ్రీన్ హైడ్రోజన్ ఉత్పాదనలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో పాటు అధునాతన ఎనలిటిక్స్‌ను అవాడా గ్రూప్ ఉపయోగిస్తోంది. 'అత్యాధునిక ఎలక్ట్రోలైజర్ టెక్నాలజీ వల్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యం మెరుగుపడి, హైడ్రోజన్ ఉత్పత్తికి తక్కువ విద్యుత్ అవసరమవుతుంది. దీంతో వ్యయం భారీగా దిగొస్తోంది' అని కంపెనీ చైర్మన్ వినీత్ మిట్టల్ పేర్కొన్నారు. హైజెన్కో సంస్థ అయితే, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ), ఏఐతో పాటు మెషీన్ లెర్నింగ్‌ను ఉపయోగించి గ్రీన్ హైడ్రోజన్, అమోనియా ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకుంటోంది. కంపెనీ ఒడిశాలోని గోపాల్‌పూర్‌లో 1.1 మిలియన్ టన్నుల సామర్థ్యంతో గ్రీన్ అమోనియా ప్రాజెక్టును నెలకొల్పే ప్రణాళికల్లో ఉంది. వెల్‌స్పన్ న్యూ ఎనర్జీ కూడా గ్రీన్ హైడ్రోజన్‌ను చౌకగా అందించేందుకు సౌర, పవన విద్యుత్‌తో పాటు బ్యాటరీల్లో స్టోర్ చేసిన విద్యుత్‌ను కూడా ఉపయోగిస్తోంది. అంతేకాకుండా పెద్దయెత్తున జల విద్యుత్‌ను కూడా వినియోగించే సన్నాహాల్లో ఉన్నట్లు కంపెనీ సీఈఓ కపిల్ మహేశ్వరి పేర్కొన్నారు. ఇక గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి అవసరమైన మాడ్యూల్స్ తయారీ, విక్రయం, సర్వీస్ కోసం థర్మాక్స్ బ్రిటన్‌కు చెందిన సెరెస్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. తద్వారా దాని ఆక్సైడ్ ఎలక్ట్రాలిసిస్ టెక్నాలజీని ఉపయోగించుకోనుంది. తక్కువ ఉష్ణోగ్రతతో కూడిన ఎలక్ట్రాలిసిస్ సాంకేతికతతో పోలిస్తే ఇది 25% మెరుగైనదని సంస్థ సీఈఓ ఆశిష్ భండారీ వెల్లడించారు.

50 లక్షల టన్నులు — 2030 నాటికి భారత గ్రీన్ హైడ్రోజన్ వార్షిక ఉత్పత్తి సామర్థ్య లక్ష్యం

10 బిలియన్ డాలర్లు — గ్రీన్ హైడ్రోజన్ ఎకో సిస్టమ్‌పై వచ్చే ఆరేళ్లలో రిలయన్స్ పెట్టుబడుల ప్రణాళిక

1 డాలర్ — 2030 కల్లా కేజీ గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి వ్యయానికి సంబంధించి రిలయన్స్ టార్గెట్

అంబానీ, అదానీ గిగా ఫ్యాక్టరీలు



దేశంలో గ్రీన్ హైడ్రోజన్ సమగ్ర వ్యవస్థ (ఎకో సిస్టమ్) నెలకొల్పేందుకు రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్‌ఐఎల్) 10 బిలియన్ డాలర్లను వెచ్చించనుంది. 2030 నాటికి కేజీ గ్రీన్ హైడ్రోజన్‌ను ఒక డాలరుకే ఉత్పత్తి చేయాలనేది కంపెనీ లక్ష్యం. 2026 కల్లా తొలి ఎలక్ట్రోలైజర్ గిగా ఫ్యాక్టరీని ఏర్పాటు చేయనున్నట్లు ఆర్‌ఐఎల్ చైర్మన్ ముకేశ్ అంబానీ తాజా ఏజీఎంలో ప్రకటించారు కూడా. ఇంధన సామర్థ్యాన్ని మెరుగుపరిచి, కొత్త తరం ఎలక్ట్రోలైజర్ల కోసం పెట్టుబడి వ్యయాలను తగ్గించుకోవడానికి అధునాతన ఎలక్ట్రాలిసిస్ ఆధారిత టెక్నాలజీలను కూడా కంపెనీ అభివృద్ధి చేస్తోంది. ఇక ప్రపంచవ్యాప్తంగా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిలో దిగ్గజ సంస్థల్లో ఒకటిగా అదానీ న్యూ ఇండస్ట్రీస్‌ను తీర్చిదిద్దే సన్నాహాల్లో అదానీ గ్రూప్ నిమగ్నమైంది. 2030 నాటికి 10 లక్షల టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి తోడ్పడేలా సమగ్ర ఎకో సిస్టమ్‌ను అభివృద్ధి చేస్తోంది. తదుపరి పదేళ్లలో ఈ సామర్థ్యాన్ని 30 లక్షల టన్నులకు పెంచాలనేది అదానీ లక్ష్యం. ఈ వ్యవస్థలో గ్రీన్ అమోనియా, గ్రీన్ మిథనాల్, పర్యావరణానుకూల విమాన ఇంధనం వంటి పలు ఉత్పత్తులు ఉంటాయి.

గ్రీన్ హైడ్రోజన్: ప్రకృతిలో అపారంగా దొరికే నీటిని పునరుత్పాదక ఇంధనాలైన సౌర, పవన, జల విద్యుత్‌ను ఉపయోగించి హైడ్రోజన్, ఆక్సిజన్‌గా విడగొడతారు. ఎలక్ట్రోలైజర్‌లో జరిపే ఈ ప్రక్రియను ఎలక్ట్రాలిసిస్‌గా పేర్కొంటారు. ఉత్పత్తిలోనూ, వినియోగంలోనూ 100 శాతం పర్యావరణానుకూలమైనది కావడంతో దీనికి ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పెరుగుతోంది. దీన్ని నిల్వ చేయడం చాలా సులభం. అంతేకాకుండా, వాహనాల నుండి పరిశ్రమల వరకు అనేక అవసరాల కోసం వాడుకోవచ్చు.

గ్రే హైడ్రోజన్: హైడ్రోజన్ ఉత్పత్తిలో ఇది అత్యంత సాధారణ ప్రక్రియ. స్టీమ్ మీథేన్ రిఫార్మింగ్ (ఎస్ఎంఆర్) అనే ప్రక్రియలో సహజవాయువును ఉపయోగిస్తారు. తయారీలో గణనీయంగా కార్బన ఉద్గారాలను విడుదల చేయడం వల్ల దీనిపై వ్యతిరేకత నెలకొంది. వినియోగంలో మాత్రం 100% పర్యావరణ హితమైనదే.

- సాక్షి, బిజినెస్ డెస్క్

ఫెడ్ ఫీవర్

- అన్ని రంగాల షేర్లలోనూ అమ్మకాలే
- 81 వేల స్థాయి దిగువకు సెన్సెక్స్
- 332 పాయింట్లు నష్టపోయిన నిఫ్టీ



ముంబై: ఫెడరల్ రిజర్వ్ ద్రవ్య సమావేశ నిర్ణయాల వెల్లడికి ముందు ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించడంతో మంగళవారం స్టాక్ సూచీలు ఒకశాతానికి పైగా నష్టపోయాయి. అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు 3-2% నష్టపోయాయి. ఫలితంగా సెన్సెక్స్ 1,064 పాయింట్లు క్షీణించి 81వేల స్థాయి దిగువున 80,684 వద్ద ముగిసింది. నిఫ్టీ 332 పాయింట్లు పతనమై 24,336 వద్ద నిలిచింది. ఇరు సూచీలకిది వరుసగా రెండోరోజూ నష్టాల ముగింపు. ముఖ్యంగా ఫైనాన్స్, మెటల్, ఎఫ్ఎంసీజీ, ఐటీ షేర్లలో భారీ అమ్మకాల ఒత్తిడి నెలకొంది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 1,136 పాయింట్లు క్షీణించి 80,612 వద్ద, నిఫ్టీ 365 పాయింట్లు పతనమై 24,303 వద్ద కనిష్టాలు నమోదు చేశాయి. ఆసియా మార్కెట్లు 2%, యూరప్ మార్కెట్లు 1.5% పడ్డాయి. అమెరికా సూచీలు అరశాతం నష్టాల్లో ట్రేడవుతున్నాయి. ఇన్వెస్టర్ల సంపద ఒక్కరోజులో రూ.4.92 లక్షల కోట్లు ఆవిరైంది. బీఎస్ఈ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.455 లక్షల కోట్లకు దిగివచ్చింది.

నష్టాలు ఎందుకంటే...

అమెరికా సెంట్రల్ బ్యాంక్.. ఫెడరల్ రిజర్వ్ మరో పావు శాతం వడ్డీరేట్ల కోత అంచనాలున్నప్పటికీ.. భవిష్యత్తులో కఠిన ద్రవ్య విధానానికి మొగ్గుచూపచ్చనే ఆందోళనలు నెలకొన్నాయి. బ్యాంక్ ఆఫ్ జపాన్, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ వడ్డీరేట్లను ప్రస్తుత స్థాయిల వద్ద యథాతథంగా కొనసాగించాలని యోచిస్తున్నాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ జీవితకాల కనిష్టానికి పతనమైంది. ద్రవ్య లోటు రికార్డు గరిష్టానికి చేరుకుంది. అమెరికా బాండ్లపై రాబడులు పెరగడంతో విదేశీ ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను దేశీయ మార్కెట్లో ఉపసంహరించుకొని బాండ్లలోకి మళ్లిస్తున్నారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

క్విక్ కామర్స్‌లోకి మ్యాజిక్‌పిన్	ఆర్థిక మందగమనం తాత్కాలికమే..: సీతారామన్

భారత్‌లో రియల్‌మీ 14ఎక్స్ 5జీ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రియల్‌మీ భారత్‌లో 14ఎక్స్ 5జీ స్మార్ట్‌ఫోన్‌ను ఆవిష్కరించింది. రూ.15,000 లోపు ధరకే ఈ ఫోన్ లభిస్తుంది. ఈ సెగ్మెంట్లో ఐపీ69 వాటర్ రెసిస్టెన్స్ రేటింగ్‌తో భారత్‌లో ఇదే మొదటి ఫోన్ అని కంపెనీ తెలిపింది. సోనిక్‌వేవ్ వాటర్ ఇజెక్షన్, రెయిన్‌వాటర్ స్మార్ట్ టచ్ ఫీచర్లు ఉన్నాయి. మిలిటరీ గ్రేడ్ షాక్ రెసిస్టెన్స్, 6000 ఎంఏహెచ్ బ్యాటరీ, 45 వాట్స్ సూపర్‌వూక్ చార్జింగ్, మీడియాటెక్ డైమెన్సిటీ 6300 5జీ చిప్‌సెట్ జోడించింది. 6/8 జీబీ వేరియంట్లలో డైమండ్ డిజైన్‌తో తయారైంది. తొలి సేల్ డిసెంబర్ 18న ప్రారంభమై డిసెంబర్ 22 వరకు ఉంటుంది.

జోయాలుక్కాస్ ఎన్ఆర్ఐ గోల్డ్ ఫెస్ట్

Joyalukkas

హైదరాబాద్: జ్యువెలరీ బ్రాండ్ జోయాలుక్కాస్ ఎన్ఆర్ఐ గోల్డ్ ఫెస్ట్ ప్రకటించింది. ఇందులో భాగంగా పాత బంగారంపై ప్రతి గ్రాముకు రూ.50 అదనంగా చెల్లిస్తుంది. వజ్రాలు, అన్‌కట్ డైమండ్స్, ప్రెషస్ స్టోన్స్ మజూరు చార్జీలపై 25% డిస్కౌంట్‌తో పాటు వాటి స్టోన్ విలువపై 25% తగ్గింపు ఇస్తుంది. జనవరి 5 వరకు అందుబాటులో ఉండే ఎన్ఆర్ఐ గోల్డ్ ఫెస్ట్ ఆఫర్లను కస్టమర్లంతా వినియోగించుకోవాలని జోయాలుక్కాస్ గ్రూప్ చైర్మన్ జాయ్ అలుక్కాస్ కోరారు.

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

న్యూజిలాండ్.. నూతన పోస్ట్ స్టడీ వర్క్ వీసా!

విదేశాల్లో విద్య.. ఆ తర్వాత అక్కడే ఉద్యోగం! నేడు ఎక్కువ మంది భారతీయ విద్యార్థుల లక్ష్యం ఇదే!! విదేశీ విద్యార్థులకు ఉన్నత విద్యతోపాటు పోస్ట్ స్టడీ వర్క్ అవకాశాలనూ కల్పిస్తున్న న్యూజిలాండ్.. తాజాగా మరింత సరళీకృత విధానాలు ప్రకటించింది. ఇటీవల నూతన పోస్ట్ స్టడీ వర్క్ వీసా విధానం ప్రకటించింది. ఈ నేపథ్యంలో.. న్యూజిలాండ్ తాజా పోస్ట్ స్టడీ వర్క్ వీసా విధానం, భారతీయ విద్యార్థులకు కలిగే ప్రయోజనాలు, ఉద్యోగాల పరంగా డిమాండ్ నెలకొన్న రంగాలు తదితర వివరాలు..

» మూడేళ్ల వర్క్ వీసా.. వయా 30 వారాల పీజీ డిప్లొమా
» 30 వారాల పీజీ డిప్లొమాతో పీజీ, పోస్ట్ స్టడీ వర్క్ అవకాశం
» భారతీయ విద్యార్థులకు ఎంతో మేలంటున్న నిపుణులు

న్యూజిలాండ్ ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన నిబంధనల ప్రకారం-ఆ దేశంలో 30 వారాల వ్యవధిలోని పీజీ డిప్లొమా కోర్సులు పూర్తి చేసుకుని ఆ తర్వాత మాస్టర్స్ (పీజీ) కోర్సుల్లో ప్రవేశం పొందినవారు.. పోస్ట్ స్టడీ వర్క్‌కు అర్హత పొందుతారు. ఉదాహరణకు.. మేనేజ్‌మెంట్ విభాగంలో 30 వారాల వ్యవధిలోని పీజీ డిప్లొమా పూర్తి చేసుకుని బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో ప్రవేశం పొందితే.. పోస్ట్ స్టడీ వర్క్ వీసాకు దరఖాస్తు చేసుకోవచ్చు. గతంలో ఇలాంటి అవకాశం ఉండేది కాదు. ఇప్పటి వరకు మాస్టర్ కోర్సులు (పీజీ) కోర్సులు పూర్తి చేసిన వారికే పోస్ట్ స్టడీ వర్క్ అవకాశం ఉండేది.

చదువుకుంటూనే ఉద్యోగం

తాజాగా పీజీ బదులు పీజీ డిప్లొమా పూర్తి చేసుకున్న వారికి కూడా పోస్ట్ స్టడీ వర్క్ వీసా కల్పించడం వల్ల విద్యార్థులు ఒకవైపు చదువుకుంటూనే.. మరో వైపు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అవకాశం లభిస్తుంది. అంతేకాకుండా.. పీజీ కోర్సు పూర్తయిన తర్వాత స్టూడెంట్ వీసాతో మరో 12 నెలలు అక్కడే ఉండి ఉద్యోగాన్వేషణ సాగించొచ్చు. ఆ సమయంలో ఉద్యోగం సొంతం చేసుకుంటే మూడేళ్ల వ్యవధికి పోస్ట్ స్టడీ వర్క్ వీసా మంజూరు చేస్తారు.

జాబితాలోని కోర్సులు

న్యూజిలాండ్ పోస్ట్ స్టడీ వర్క్ నిబంధనలను అనుసరించి న్యూజిలాండ్ క్వాలిఫికేషన్స్ అండ్ క్రెడెన్షియల్స్ ఫ్రేమ్‌వర్క్ ప్రకారం-లెవల్ 7లో ఉన్న ప్రోగ్రామ్స్ పూర్తి చేసుకోవాలి. లెవల్-7లో ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, టీచింగ్, కన్‌స్ట్రక్షన్, అగ్రికల్చర్ వంటి కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఒకవేళ ఈ జాబితాలో లేని కోర్సులను అభ్యసించిన వారు.. ఆ కోర్సు ముగిశాక 12 నెలల లోపు కనీసం పీజీ డిప్లొమా స్థాయిలో లెవెల్ -7 లోని కోర్సులు పూర్తి చేసుకుంటే.. పోస్ట్ స్టడీ వర్క్ వీసాకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తారు.

జీవిత భాగస్వాములకు అవకాశం

న్యూజిలాండ్ పోస్ట్ స్టడీ వర్క్ వీసా విధానం ద్వారా ఉద్యోగం పొందిన వారు.. తమ జీవిత భాగస్వాములను తీసుకెళ్లే అవకాశం కూడా ఉంది. వారు సైతం న్యూజిలాండ్ గ్రీన్ లిస్ట్‌లో ఉన్న కోర్సులను అనుసరించి.. అర్హతకు సరితూగే ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఉద్యోగం లభిస్తే వారికి కూడా వర్క్ వీసా మంజూరు చేస్తారు.

వీసా ఫీజుల పెంపు

పోస్ట్ స్టడీ వర్క్ వీసా నిబంధనలను సరళీకృతం చేసిన న్యూజిలాండ్ ప్రభుత్వం.. స్టూడెంట్ వీసా అప్లికేషన్ ఫీజులను మాత్రం పెంచింది. ఇప్పటి వరకు 300 న్యూజిలాండ్ డాలర్లుగా ఉన్న ఈ మొత్తాన్ని.. 485 న్యూజిలాండ్ డాలర్లకు పెంచింది.

స్పాన్సర్‌షిప్ లెటర్

పోస్ట్ స్టడీ వర్క్ వీసా పొందే క్రమంలో.. విద్యార్థులు ఎంప్లాయర్ స్పాన్సర్‌షిప్ లెటర్ ఆధారంగా ఇమిగ్రేషన్ విభాగానికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. సదరు ఉద్యోగం అర్హతలకు సరితూగే విభాగానికి సంబంధించినదై ఉండాలి. అదే విధంగా న్యూజిలాండ్ ప్రభుత్వం విధించిన కనీస వేతన పరిమితికి అనుగుణంగా వేతనం ఉండాలి. గంటకు 23.15 న్యూజిలాండ్ డాలర్లు, రోజుకు 185.20 న్యూజిలాండ్ డాలర్లు,వారానికి 926 న్యూజిలాండ్ డాలర్లు చొప్పున కనీస వేతనం ఉండాలి. ఆయా అర్హతలకు అనుగుణంగా వీటిని పెంచి ఇచ్చే అవకాశం ఉంటుంది.

భారత విద్యార్థులకు మేలు

న్యూజిలాండ్ తాజా విధానంతో.. భారత విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కారణం న్యూజిలాండ్‌లో అడుగుపెడుతున్న విదేశీ విద్యార్థుల్లో భారత విద్యార్థులు రెండో స్థానంలో ఉంటున్నారు. 2023లో న్యూజిలాండ్‌లో 55 వేలకుపైగా విదేశీ విద్యార్థులు ఉన్నత విద్య కోర్సులకు దరఖాస్తు చేసుకోగా.. వారిలో భారత విద్యార్థులు 11 శాతం మేర ఉన్నారు. వీరంతా తాజా వీసా విధానంతో ప్రయోజనం పొందే వీలుంది.

విభిన్న కోర్సులు

న్యూజిలాండ్‌లో ప్రపంచ టాప్ యూనివర్సిటీలు, విభిన్న కోర్సులు అందుబాటులో ఉన్నాయి. భారతీయ విద్యార్థులు ఎక్కువగా ఆసక్తి చూపే ఎంఎస్, ఇంజనీరింగ్,మేనేజ్‌మెంట్‌తోపాటు కామర్స్, హ్యుమానిటీస్, మెడిసిన్, ఐటీ, ప్యూర్ సైన్సెస్ వంటి విభాగాల్లో అండర్ గ్రాడ్యుయేషన్ నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు పలు కోర్సులను అక్కడి ఇన్‌స్టిట్యూట్స్ అందిస్తున్నాయి.

14 నెలల నుంచి 24 నెలల వరకు

న్యూజిలాండ్‌లో కోర్సుల వ్యవధి అభ్యర్థి ఎంపిక చేసుకున్న ప్రోగ్రామ్‌ను అనుసరించి యూనివర్సిటీ నిబంధనల మేరకు 14 నెలల నుంచి 24 నెలల వరకు ఉంటోంది. ఈ సమయంలో యూనివర్సిటీలు అప్పటికే పలు పరిశ్రమలతో కుదుర్చుకున్న ఇండస్ట్రీ ఎక్స్ఛేంజ్ కొలాబరేషన్స్ ఆధారంగా సదరు సంస్థల్లో రియల్ టైం ఎక్స్‌పోజర్ లభించే విధంగా ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం కూడా అందుబాటులో ఉంది.

ఫీజుల భారం

న్యూజిలాండ్‌లో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల ఫీజు 20 వేల నుంచి 40 వేల న్యూజిలాండ్ డాలర్లుగా; పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల ఫీజు 20 వేల న్యూజిలాండ్ డాలర్ల నుంచి 45 వేల న్యూజిలాండ్ డాలర్ల మధ్యలో ఉంటుంది.

స్కాలర్‌షిప్స్ తోడ్పాటు

విద్యార్థులకు ఫీజుల విషయంలో ఆర్థిక తోడ్పాటును కూడా అక్కడి ప్రభుత్వం కల్పిస్తోంది. విదేశీ విద్యార్థులను ఆకర్షించాలనే ఉద్దేశంతో న్యూజిలాండ్ సర్కారు యూనివర్సిటీల ఫీజుల నుంచి మినహాయింపు లభించేలా స్కాలర్‌షిప్ పథకాలను అందిస్తోంది. ప్రైవేటు ఎన్‌జీఓలు సైతం విదేశీ విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందిస్తున్నాయి. ఇలా ఏటా వందకు పైగా స్కాలర్‌షిప్స్ లభిస్తాయి. వీటికోసం అభ్యర్థులు తమ డిపార్ట్‌మెంట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.



పాపులర్ కోర్సులు

న్యూజిలాండ్‌లో ప్రస్తుతం పీజీ స్థాయిలో ఆదరణ పొందుతున్న కోర్సులు.. ఎంబీఏ(వ్యవధి: 14 నెలల నుంచి 24 నెలలు), ఇంజనీరింగ్(వ్యవధి రెండేళ్లు), ప్రొఫెషనల్ అకౌంటింగ్ (12 నెలల నుంచి 18 నెలలు), పీజీ డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ సైన్స్ (12 నెలల నుంచి 16 నెలలు), మాస్టర్ ఆఫ్ టూరిజం (18 నెలల నుంచి 24 నెలల వ్యవధి).

స్టాండర్ టెస్ట్ స్కోర్స్

న్యూజిలాండ్‌లోని పీజీ కోర్సుల్లో ప్రవేశానికి అభ్యర్థులు ఎంపిక చేసుకున్న కోర్సుల ఆధారంగా స్టాండర్ టెస్ట్ స్కోర్లు తప్పనిసరి. యూఎస్, యూకే, ఆస్ట్రేలియా వంటి దేశాలతో పోల్చుకుంటే.. ఇక్కడి యూనివర్సిటీలు నిర్దేశించే స్కోర్లు కొంత తక్కువగా ఉండటం అభ్యర్థులకు కలిసొచ్చే అంశంగా చెప్పొచ్చు. మేనేజ్‌మెంట్ పీజీ విద్యార్థులు జీమ్యాట్ 600 స్కోర్‌తో అడ్మిషన్ పొందే అవకాశం ఉంది. ఇంజనీరింగ్, సైన్స్ కోర్సుల విద్యార్థులు 250 నుంచి 300 స్కోర్‌తో అడ్మిషన్ ఖరారు చేసుకోవచ్చు. కొన్ని యూనివర్సిటీలు ఈ స్థాయి స్కోర్లు లేకున్నా.. అభ్యర్థుల అకడమిక్ ట్రాక్ రికార్డ్ ఆధారంగా ప్రవేశం కల్పిస్తున్నాయి.

ముఖ్యాంశాలు

- తాజాగా పోస్ట్ స్టడీ వర్క్ నిబంధనల సరళీకృతం.
- 30 వారాల వ్యవధిలో పీజీ డిప్లొమా అర్హతగా మాస్టర్స్ చేస్తే పోస్ట్ స్టడీ వర్క్ వీసా.
- కోర్సు పూర్తయ్యాక 12 నెలల పాటు అక్కడే ఉండి ఉద్యోగాన్వేషణ అవకాశం.
- ఉద్యోగం సొంతమయ్యాక మూడేళ్లపాటు పోస్ట్ స్టడీ వర్క్, తర్వాత దానిని పొడిగించుకునే అవకాశం
- విదేశీ విద్యార్థుల్లో రెండో స్థానంలో భారత విద్యార్థులు
- ఉపయోగపడే వెబ్‌సైట్స్: www.immigration.govt.nz/newzealandvisas/visas/visa/poststudyworkvisa

డిమాండింగ్ జాబ్ ప్రొఫైల్స్

న్యూజిలాండ్ ప్రభుత్వ అధికారిక సమాచారం ప్రకారం-ప్రస్తుతం ఇమ్మిడియేట్ స్కిల్ షార్టేజ్ లిస్ట్‌లో.. ఇంజనీరింగ్, కన్‌స్ట్రక్షన్, అగ్రికల్చర్, హెల్త్ అండ్ సోషల్ సర్వీసెస్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, టూరిజం, హాస్పిటాలిటీ విభాగాలు ముందంజలో ఉన్నాయి.

ఆర్‌సీఎఫ్ఎల్, ముంబైలో 378 అప్రెంటిస్‌లు

ముంబైలోని రాష్ట్రీయ కెమికల్స్ అండ్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ (ఆర్‌సీఎఫ్ఎల్).. వివిధ విభాగాల్లో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 378.
» **స్టైపెండ్:** నెలకు రూ.7000 నుంచి రూ.9000.
» **ఖాళీల వివరాలు:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లు-182, టెక్నీషియన్ అప్రెంటిస్‌లు-90, ట్రేడ్ అప్రెంటిస్‌లు-106.
» **గ్రాడ్యుయేట్ అప్రెంటిస్: విభాగాలు:** అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్, సెక్రటేరియల్ అసిస్టెంట్, రిక్రూట్‌మెంట్ ఎగ్జిక్యూటివ్(హెచ్ఆర్).
» **అర్హత:** బీకాం, బీబీఏ, ఏదైనా డిగ్రీతో పాటు ఆంగ్ల భాష/కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలి.
» **టెక్నీషియన్ అప్రెంటిస్: విభాగాలు:** అటెండెంట్ ఆపరేటర్(కెమికల్ ప్లాంట్), బాయిలర్ అటెండెంట్, ఎలక్ట్రీషియన్, హార్టికల్చర్ అసిస్టెంట్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్(కెమికల్ ప్లాంట్), ల్యాబొరేటరీ అసిస్టెంట్(కెమికల్ ప్లాంట్), మెడికల్ ల్యాబొరేటరీ టెక్నీషియన్(పాథాలజీ).
» **అర్హత:** ట్రేడును అనుసరించి పదో తరగతి, పన్నెండో తరగతి, బీఎస్సీ ఉత్తీర్ణులైఉండాలి. **వయసు:** 01.12.2024 నాటికి 25 ఏళ్ల మించకూడదు.
» **ఎంపిక విధానం:** సంబంధిత విద్యార్హతల్లో సాధించిన మెరిట్ మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.12.2024.
» **శిక్షణ ప్రాంతం:** ట్రాంబే(ముంబై), థాల్(రాయ్‌గఢ్ జిల్లా).
» **వెబ్‌సైట్:** https://www.rcfltd.com



సెంట్రల్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్‌లో 179 పోస్టులు

న్యూఢిల్లీలోని సెంట్రల్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ దేశవ్యాప్తంగా ఉన్న సీడబ్ల్యూసీ కార్యాలయాలు/కన్‌స్ట్రక్షన్‌సెల్స్/ఐసీడీఎస్/సీఎఫ్ఎస్ఎస్/వేర్‌హౌసుల్లో వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 179.
» **పోస్టుల వివరాలు:** మేనేజ్‌మెంట్ ట్రైనీ (జనరల్)-40, మేనేజ్‌మెంట్ ట్రైనీ (టెక్నికల్)-13, అకౌంటెంట్-09, సూపరింటెండెంట్ (జనరల్)-22, జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్-81, సూపరింటెండెంట్(జనరల్)-ఎస్ఆర్‌డీ(ఎన్ఈ)-02, జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్-ఎస్ఆర్‌డీ(ఎన్ఈ)-10, జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్-ఎస్ఆర్‌డీ(లద్దాక్ యూటీ)-02.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, బీకాం, సీఏ, పీజీ, ఎంబీఏ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వేతనం:** నెలకు మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టులకు రూ.60,000 నుంచి రూ.1,80,000, అకౌంటెంట్/ సూపరింటెండెంట్ పోస్టులకు రూ.40,000 నుంచి రూ.1,40,000, జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులకు రూ.29,000 నుంచి రూ.93,000.
» **గరిష్ట వయో పరిమితి:** 12.01.2025 నాటికి అకౌంటెంట్, సూపరింటెండెంట్ పోస్టులకు 30 ఏళ్లు, ఇతర పోస్టులకు 28 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 12.01.2025.
» **వెబ్‌సైట్:** https://cewacor.nic.in

ఎంజీయూ నల్గొండలో 14 పార్ట్‌టైమ్ ఫ్యాకల్టీ పోస్టులు

నల్గొండలోని మహాత్మా గాంధీ యూనివర్శిటీ(ఎంజీయూ) 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పార్ట్‌టైమ్/గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **విభాగాల వారీగా ఖాళీలు:** ఎంఏ సైకాలజీ-03, ఎంఏ ఎకనామిక్స్-01, ఎంఏ ఇంగ్లిష్-02, ఎంఏ హిస్టరీ అండ్ టూరిజం-01, బీటెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్-03, ఎంబీఏ(జనరల్)-01, ఎంబీఏ(టీటీఎం)-02, ఎంబీఏ(ఇంటిగ్రేటెడ్)-01.
» **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. నెట్/సెట్/స్లెట్ లేదా పీహెచ్‌డీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మార్కులు, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును రిజిస్ట్రార్, మహాత్మా గాంధీ యూనివర్శిటీ(ఎంజీయూ), ఎల్లారెడ్డిగూడెం, నల్గొండ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 28.12.2024.
» **వెబ్‌సైట్:** https://www.mguniversity.ac.in

సమస్య ఏదైనా 'పోలీస్ అక్క'కు చెప్పండి

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

విద్యార్థినులు, మహిళలకు అండగా వినూత్న కార్యక్రమం

సిరిసిల్ల క్రైం: విద్యార్థినులు, మహిళల రక్షణకు రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసులు మరో అడుగు ముందుకు వేశారు. ఇప్పటి వరకు ఉన్న షీటీమ్‌కు అనుసంధానంగా ఇక నుంచి 'పోలీస్ అక్క'పేరిట సేవలు అందించ నున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. మంగళవా రం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో పోలీసు అక్క కార్యక్ర మాన్ని ప్రారంభించారు. ప్రతీ పోలీస్ స్టేషన్‌లో 'పోలీస్ అక్క'పేరుతో కొందరు మహిళా కానిస్టేబుళ్లను ఎంపిక చేసి వారికి మహిళల భద్రత విధులు కేటాయించారు. వీరు షీటీమ్‌తో కలసి పని చేస్తూ.. పోక్సో, మహిళా చట్టాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ఈవ్ టీజింగ్ వంటి అంశాలపై అవగాహన కల్పిస్తారని ఈ సందర్భంగా ఎస్పీ వెల్లడించారు. ఈ బృందంలోని కానిస్టేబుళ్లు ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని పాఠశాలలు, కళాశాలలను సందర్శిస్తూ విద్యార్థులకు మహిళా చట్టా లపై అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు సమస్యలు ఎదురైనప్పుడు సంప్రదించేందుకు షీటీమ్, డయల్ 100, పోలీస్ అక్క నంబర్లను వినియోగించే పద్ధతులను నేర్పిస్తారని వివరించారు. సోషల్ మీడియా వేదికగా విద్యార్థినులను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థినులు, మహిళలు వేధింపులకు గురైతే నిర్భయంగా జిల్లా షీటీమ్ నంబర్ 87126 56425కి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ ఏడాది 52 మంది ఆకతాయిలను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నామని, మహిళలు, విద్యార్థులను వేధిస్తున్నవారిపై 60 పెట్టి కేసులు, 44 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని వెల్లడించారు.


పోస్టర్ ఆవిష్కరణలో ఎస్పీ అఖిల్ మహాజన్ తదితరులు

చేపల బుట్టకు చిక్కిన మొసలి పిల్ల

మంచిర్యాల రూరల్ (హాజీపూర్): చేపలు పడతాయన్న ఆశతో నదిలో ఏర్పాటు చేసిన బుట్టకు ఓ మొసలి పిల్ల చిక్కింది. హాజీపూర్ మండలంలో జరిగిన ఈ సంఘటన వివరాలివి. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం రాపల్లి గ్రామానికి చెందిన మత్స్యకారుడు కునారపు రామయ్య చేపలు పట్టేందుకు.. గ్రామ శివారులోని గోదావరి తీరంలో ఇనుప బుట్టను ఏర్పాటు చేశాడు. రోజూ చేపలు పట్టి విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు.



మంగళవారం బుట్టను బయటికి తీసినపుడు బరువుగా ఉంది. దీంతో బొమ్మె చేపలు బాగానే పడి ఉంటాయన్న ఆశతో బయటకు తీసి చూడగా.. మొసలి పిల్ల కనిపించడంతో భయాందోళనకు గురయ్యాడు. అటవీ అధికారులకు సమాచా రం అందించగా హాజీపూర్ డెప్యూటీ రేంజ్ అధికారి సునీత మొసలి పిల్లను స్వాధీనం చేసుకున్నారు. రాపల్లి శివారులోని గోదావరికి తీసుకొచ్చి ఎల్లంపల్లి శ్రీపాద ప్రాజెక్ట్ నీటిలో వదిలిపెట్టారు. మొసలి పిల్ల వయసు దాదాపు 6 నెలలు ఉంటుందని తెలిపారు.



పీజీ మెడికల్‌పై ఏం చేద్దాం?

హైకోర్టు తీర్పుతో కౌన్సెలింగ్‌పై సర్కార్ సమాలోచనలు

తీర్పు సర్కారుకు వ్యతిరేకంగా రావటంతో మల్లగుల్లాలు

ఇప్పటికే ఆలస్యమైన పీజీ మెడికల్ అడ్మిషన్ల ప్రక్రియ

ఒకటిరెండు రోజుల్లో కొత్త కౌన్సెలింగ్ విధానం ప్రకటించే అవకాశం

సాక్షి, హైదరాబాద్: పీజీ మెడికల్ సీట్ల భర్తీలో స్థానికతపై హైకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం భవిష్యత్ కార్యాచరణపై ఉన్నత స్థాయిలో సమీక్షిస్తోంది. తెలంగాణలో పీజీ కోర్సుల్లో ప్రవేశానికి ప్రభుత్వం నిర్ణయించిన 'స్థానికత' జీవోలు 148, 149 లను హైకోర్టు మంగళవారం కొట్టివేయటంతో కౌన్సెలింగ్‌లో ఎలాంటి విధానాలను అవలంభించాలనే అంశంపై దృష్టి సారించింది. కోర్టు కేసు కారణంగా ఇప్పటికే మొదటి సంవత్సరం పీజీ కౌన్సెలింగ్ ఆలస్యమైంది. ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వస్తే వెంటనే అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టాలని భావించిన కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం.. ఇప్పుడు ప్రభుత్వ నిర్ణయం కోసం వేచి చూస్తోంది. హైకోర్టు ప్రస్తావించిన అంశాలను పరిగణనలోకి తీసుకొని ఒకటి రెండు రోజుల్లో పీజీ కౌన్సెలింగ్‌పై విధి విధానాలను వెల్లడించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

'స్థానిక' వివాదంతో నిలిచిన ప్రవేశాలు

గత అక్టోబర్ నెలాఖరున 2024–25 సంవత్సరానికి కన్వీనర్ కోటా కింద ఎండీ, ఎంఎస్, పీజీ డిప్లొమా మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ జారీ చేసింది. కాళోజీ వర్సిటీకి, నిమ్స్‌కు అనుబంధంగా ఉన్న మెడికల్ కాలేజీల్లో సీట్ల భర్తీకి ఈ నోటిఫికేషన్ జారీ చేశారు. నీట్ పీజీ–2024లో అర్హత సాధించిన అభ్యర్థుల నుంచి అక్టోబర్ 31 నుంచి నవంబర్ 7వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానించారు. వెంటనే కౌన్సెలింగ్ ప్రారంభమవ్వాల్సి ఉండగా.. 'స్థానికత' నిబంధనపై అభ్యర్థులు కోర్టును ఆశ్రయించడంతో ఈ ప్రక్రియ నిలిచిపోయింది. ఈ జాప్యం ఇప్పటికే పీజీ మెడికల్ మొదటి సంవత్సరం పూర్తి చేసిన పీజీ విద్యార్థులకు సైతం ఇబ్బందిగా మారింది. ఈ విద్యా సంవత్సరానికి మొదటి ఏడాది అడ్మిషన్లు పూర్తయితే తప్ప.. ఇప్పటికే మొదటి సంవత్సరం పూర్తయినవారు అక్కడి నుంచి రిలీవ్ అయ్యే పరిస్థితి లేకుండా పోయింది.

వివాదం ఇదీ..

- తెలంగాణ స్థానికత కలిగిన విద్యార్థులు సైతం ఇతర రాష్ట్రాల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ పూర్తి చేస్తే.. వారు తెలంగాణలో పీజీ మెడికల్ అడ్మిషన్లలో స్థానికేతరులు అవుతారని ప్రభుత్వం జారీచేసిన 148, 149 జీవోల్లో స్పష్టం చేయడంతో వివాదం మొదలైంది.
- అలాగే కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం ప్రకటించిన పీజీ మెడికల్ నోటిఫికేషన్ ప్రకారం స్థానిక అభ్యర్థి అంటే ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు వరుసగా నాలుగు సంవత్సరాలకు తక్కువ కాకుండా తెలంగాణలో చదివి ఉండాలి. ఇంటర్మీడియట్, ఎంబీబీఎస్ కూడా ఇక్కడే చదివి ఉండాలి.
- విజయవాడలోని సిద్ధార్థ మెడికల్ కాలేజీలో చదివిన తెలంగాణ విద్యార్థులు కూడా స్థానికులేనని కాళోజీ వర్సిటీ ప్రకటించింది.
- ఈ ఉత్తర్వుల వల్ల తెలంగాణ విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, వారు అటు ఏపీలో, ఇటు తెలంగాణలోనూ స్థానికులు కాకుండా పోతున్నారనే ఆందోళన వ్యక్తమైంది.
- నీట్ పరీక్ష కారణంగా తెలంగాణకు చెందిన టాప్ ర్యాంకర్లు ఎక్కువగా జాతీయస్థాయిలో ప్రసిద్ధి చెందిన విద్యాసంస్థల్లో ఎంబీబీఎస్‌లో చేరుతున్నారు. వారు ఈ జీవోల వల్ల రాష్ట్రంలో పీజీ మెడికల్ అడ్మిషన్లలో స్థానికేతరులు అవుతున్నారు.
- ఇంటర్మీడియేట్ వరకు ఇతర రాష్ట్రాల్లో చదివి, ఎంబీబీఎస్ తెలంగాణలో చదివినప్పటికీ జీవో 148, 149 వల్ల స్థానికేతరులే అవుతున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ స్థానికత ఉండి ఇతర రాష్ట్రాల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ చదివినా.. తెలంగాణ స్థానికత లేకుండా ఇక్కడ ఎంబీబీఎస్, బీడీఎస్ చదివినా కూడా స్థానికులుగా పరిగణించాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది.

తెలంగాణలో ఎంబీబీఎస్ చేస్తే.. పీజీలో 'స్థానికులే'

- 'లోకల్' అర్హత ఉండి రాష్ట్రం వెలుపల ఎంబీబీఎస్ చేసినా స్థానికులే
- మెడికల్ పీజీ సీట్ల భర్తీపై హైకోర్టు కీలక తీర్పు
- 2024–25 విద్యా సంవత్సరానికి మాత్రమే తీర్పు పరిమితం
- ప్రభుత్వం జారీచేసిన జీఓ 148, 149 చట్ట విరుద్ధమని ప్రకటన

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో ఎంబీబీఎస్ కోర్సు చదివిన వారిని మెడికల్ పీజీ సీట్ల భర్తీలో స్థానికులుగా పరిగణించాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ధర్మాసనం తేల్చిచెప్పింది. అలాగే, తెలంగాణ వెలుపల ఎంబీబీఎస్ పూర్తి చేసిన అభ్యర్థులకు రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం 'స్థానికత' వర్తింపజేయాలని ఆదేశించింది. తెలంగాణ మెడికల్ కాలేజీల (పీజీ), పీజీ (ఆయుష్) కోర్సుల నిబంధనలు 2021ను సవరిస్తూ అక్టోబర్ 28న రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓలు 148, 149లను చట్ట వ్యతిరేకమని కోర్టు కొట్టివేసింది. తెలంగాణ మెడికల్ కాలేజీల (పీజీ మెడికల్ కోర్సులలో ప్రవేశం) నిబంధనలు 2021లోని రూల్ 3(ii)(a) (జీజీ)లో ప్రభుత్వం చేసిన సవరణను సవాల్ చేస్తూ మంచిర్యాలకు చెందిన డాక్టర్ ఎస్ సత్యనారాయణ, హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ వి. రజిత హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. స్థానికత అంశంపైనే మరో 96 పిటిషన్లు కూడా దాఖలయ్యాయి. వీటిని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం సుదీర్ఘంగా విచారించి ఈ నెల 4న తీర్పును రిజర్వ్ చేసింది. మంగళవారం తుది తీర్పును ప్రకటించింది. ఈ తీర్పు 2024–25 విద్యా సంవత్సరానికి మాత్రమే వర్తిస్తుందని ప్రకటించింది. ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 148, 149 చట్ట వ్యతిరేకమని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదించారు. ఈ జీవోల ప్రకారం 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు తెలంగాణలో చదవడంతో పాటు ఇక్కడ బ్యాచిలర్ మెడికల్ డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులను మాత్రమే పీజీ మెడికల్ అడ్మిషన్లలో స్థానికులుగా పరిగణిస్తున్నారని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో ఎంబీబీఎస్ పూర్తి చేసినా, తామంతా తెలంగాణకు చెందినవారమే అయినందున స్థానిక అభ్యర్థులుగా గుర్తించేలా ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.



ఫలితాలు వచ్చాక మార్పులు సరికాదు

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 95 నేపథ్యంలో రాష్ట్రపతి ఉత్తర్వులు తెలంగాణకు వర్తించవని, రాష్ట్రపతి ఉత్తర్వులను అన్వయించుకోలేదన్న ప్రభుత్వ వాదనను ధర్మాసనం తప్పుబట్టింది. విద్యకు సంబంధించి రాష్ట్రపతి ఉత్తర్వులు అమల్లో ఉంటాయని ప్రకటించింది. ఈ సందర్భంగా 2023లో ఇదే హైకోర్టు ఇచ్చిన తీర్పును ఉదహరించింది. రాష్ట్ర విభజన తర్వాత ఏర్పాటుచేసిన మెడికల్ కాలేజీల్లో జాతీయ కోటా (15 శాతం) పోను.. మిగిలిన కన్వీనర్ కోటా సీట్లు (85 శాతం) స్థానిక విద్యార్థులకే కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ 72ను సమర్థిస్తూ గత సెప్టెంబర్‌లో డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును సమర్థించింది. ఆ తీర్పు రాష్ట్రపతి ఉత్తర్వులు 1974ను ఉల్లంఘించలేదని స్పష్టం చేసింది. 148, 149 జీఓలు రాష్ట్రపతి ఉత్తర్వులకు విరుద్ధంగా ఉన్నాయని, రాష్ట్ర విద్యా సంస్థల నియంత్రణ చట్టంలోని సెక్షన్ 3(2)కు విరుద్ధమని ప్రకటించింది. పీజీ మెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు ఆగస్టు 11న పరీక్ష నిర్వహించి, 23న ఫలితాలు ప్రకటించిన తర్వాత అడ్మిషన్ నిబంధనలు మార్చడాన్ని ధర్మాసనం తప్పుబట్టింది. ఒకసారి నియామక ప్రక్రియ ప్రారంభమయ్యాక మధ్యలో మార్పులు సరికాదని తేల్చి చెప్పింది. ఎంబీబీఎస్‌తో పాటు బీఏఎంఎస్, బీహెచ్‌ఎంఎస్ పూర్తి చేసిన పిటిషనర్లకు కూడా స్థానికత వర్తిస్తుందని తుది తీర్పులో ప్రకటించింది. రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం స్థానికత, రాజ్యాంగంలోని ఆర్టికల్ 371డీ, ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 95తో పాటు పలు తీర్పులను తీర్పులో ప్రస్తావించింది.

మనోజ్ ఆరోపణల్లో వాస్తవం లేదు

నా పుట్టిన రోజు వేడుకలో విష్ణు ఎలాంటి గొడవ చేయలేదు

పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్‌కు మోహన్‌బాబు సతీమణి నిర్మల లేఖ


పహాడీషరీఫ్/ఫిలింనగర్: మోహన్‌బాబు ఇంట్లో కొద్ది రోజులుగా వివాదాలు నడుస్తున్న విషయం తెలిసిందే. ఈ నెల 14న నిర్మల పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసే నెపంతో జల్‌పల్లిలోని ఇంటికి వచ్చిన తన సోదరుడు విష్ణు గొడవ చేశారంటూ మనోజ్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసిన విషయం విదితమే. దీనికి స్పందనగా నిర్మల పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్‌కు.. విష్ణు ఎలాంటి గొడవ చేయలేదని లేఖ రాసి పంపారు. తన పుట్టినరోజును పురస్కరించుకొని ఇంటికి వచ్చిన విష్ణు, కేక్ కట్ చేయించి వేడుక చేశాడని తెలిపారు. అయితే మనోజ్ ఇందుకు భిన్నంగా, విష్ణు ఇంట్లోకి వచ్చి గొడవ చేశారంటూ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. విష్ణు తన మనుషులను వెంట పెట్టుకొని ఇంట్లోకి వచ్చి దౌర్జన్యం చేసినట్లు మనోజ్ చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు.

పిస్టల్ సరెండర్ చేసిన మోహన్‌బాబు: మోహన్‌బాబు తన లైసెన్స్‌డ్ పిస్టల్‌ను మంగళవారం ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో సరెండర్ చేశారు. మోహన్‌బాబుకు రెండు లైసెన్స్‌డ్ తుపాకులు ఉన్నాయి. ఇందులో ఒకదానిని 2రోజుల క్రితమే చంద్రగిరి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. కుటుంబ తగాదాల నేపథ్యంలో పిస్టళ్లను పోలీసులకు అప్పగించాలని మోహన్‌బాబును రాచకొండ కమిషనర్ ఆదేశించిన నేపథ్యంలో ఆయన ప్రతినిధి గజేంద్రనాయుడు ఫిలింనగర్ పోలీసులకు మరో పిస్టల్‌ను అందజేశారు.


చీరల డిజైన్‌ను పరిశీలిస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో సీతక్క, పొంగులేటి, పొన్నం, మహేశ్‌గౌడ్

లేత నీలం రంగు చీర.. మువ్వన్నెల అంచు

ఎస్‌హెచ్‌జీల చీరల డిజైన్ ఖరారు చేసిన సీఎం



సాక్షి, హైదరాబాద్: స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) మహిళలకు అందించేందుకు ఎంపిక చేసిన చీరల డిజైన్‌ను సీఎం రేవంత్ రెడ్డి ఖరారు చేశారు. నీలం రంగు చీరకు కాషాయం, తెలుపు, ఆకుపచ్చ రంగులతో కూడిన (మువ్వన్నెలు ప్రతిబింబించేలా) బార్డర్‌తో ఉన్న డిజైన్‌ను ఎంపిక చేశారు. మంగళవారం అసెంబ్లీలోని తన చాంబర్‌లో ఈ చీరలకు సంబంధించిన పలు డిజైన్లతో కూడిన నమూనాలను మంత్రులతో కలిసి సీఎం పరిశీలించారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ద్వారా రాష్ట్రంలోని 63 లక్షల మంది మహిళా స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీ), స్త్రీనిధి, మెప్మా సభ్యులకు ఏకరూప దుస్తులు (యూనిఫామ్) అందించడంలో భాగంగా ఈ చీరలు పంపిణీ చేయనున్నారు. రాష్ట్ర చేనేత సహకార సంఘం (టెస్కో) ద్వారా తయారు చేయించిన చీరలను ఏడాదికి రెండు చొప్పున మహిళా సంఘాల సభ్యులకు ఉచితంగా పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. గతంలోనే ఈ చీరలకు సంబంధించిన పలు డిజైన్లను పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క పరిశీలించి, కొన్ని మార్పులు చేర్పులతో ఎంపిక నిమిత్తం కొన్ని నమూనా చీరలను సిద్ధం చేయించారు. రాష్ట్రంలో ఎస్‌హెచ్‌జీ, ఇతర సంఘాల మహిళలకు తొలిసారిగా ఈ దుస్తులను అందజేయనున్నారు. ఈ చీరలను పవర్‌లూమ్‌లపై తయారీకి సంబంధించి చేనేత కార్మికులకు ఆర్డర్లు ఇవ్వనున్నట్టు సమాచారం. కార్యక్రమంలో మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

ఆగని ప్రమాదాలు

పేరుకే రక్షణ పక్షోత్సవాలు

సూచనలు, సలహాలకే పరిమితం

సింగరేణి బొగ్గు గనుల్లో పెరుగుతున్న ప్రమాదాలు



ఆర్జీ3 ఏరియాలోని ఓసీపీ2 పరిధిలోని సేఫ్టీ రూం

సాక్షి, పెద్దపల్లి: సింగరేణి బొగ్గు గనులు, వివిధ విభాగాల్లో ప్రస్తుతం రక్షణ పక్షోత్సవాలు కొనసాగుతున్నాయి. 'రక్షణే ప్రథమం.. రక్షణే ఎల్లప్పుడు'అని ప్రతీ గని, డిపార్ట్‌మెంట్‌పై కార్మికులతో అధికారులు ప్రతిజ్ఞ చేయిస్తున్నారు. అయితే, రక్షణ పక్షోత్సవాలు వేడుకల కోసమేనని, క్షేత్రస్థాయిలో కార్మికుల రక్షణకు తీసుకుంటున్న చర్యలేవీ లేవనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చినా.. సింగరేణిలో ప్రమాదాలు మాత్రం తగ్గడం లేదు. నిమ్, యూఎంటీఐ, వీటీసీ, అత్యాధునిక సిమ్‌టార్స్.. ఇలా ఎన్ని శిక్షణ సంస్థలు ఏర్పాటు చేసినా ప్రమాదాలు నియంత్రణలోకి రావడం లేదు. తట్టాచెమ్మాస్, సెమీ మెకనైజ్డ్, పూర్తిస్థాయి యాంత్రీకరణ జరిగినా రక్షణలో వైఫల్యాలతో బొగ్గు గనుల్లో ప్రమాదాలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. ఏటా కార్మికులు చనిపోతున్నా, ప్రమాదాలపై సమీక్షించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బొగ్గు ఉత్పత్తి విషయంలో సింగరేణి చూపుతున్న శ్రద్ధ ప్రమాదాల నియంత్రణకు తీసుకోవడం లేదని కార్మిక సంఘాల నేతలు మండిపడుతున్నారు.

ఐదేళ్లలో జరిగిన ప్రమాదాలు

ఏడాది	మృతులు	తీవ్రగాయాలు	స్వల్ప గాయాలు
2020	12	102	108
2021	13	122	107
2022	05	96	122
2023	05	68	70
2024(ఇప్పటి వరకు)	06	84	72
మొత్తం	41	472	479

17ఓసీపీలు.. 22 భూగర్భ గనులు

ఏటా మాదిరిగానే ప్రమాద రహిత సింగరేణిగా తీర్చిదిద్దడం లక్ష్యంగా యాజమాన్యం ఈనెల 9 నుంచి 21వ తేదీ వరకు రక్షణ పక్షోత్సవాలు నిర్వహిస్తోంది. సింగరేణిలోని 11 ఏరియాల్లో 17 ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులు, 22 భూగర్భ గనులు ఉన్నాయి. వీటిలో దాదాపు 42 వేల మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారు. వీరికి కాంట్రాక్ట్ కార్మికులు అదనం. వీరు సుమారు 30 వేల మంది వరకు ఉంటారని అంచనా. రక్షణ పక్షోత్సవాల్లో భాగంగా 12 బృందాలు వివిధ గనులు, సీఎస్పీలు తదితర విభాగాల్లో తనిఖీలు చేసి అత్యుత్తమ రక్షణ చర్యలు పాటించే గనులకు బహుమతులు అందిస్తాయి. అయితే కార్మికులకు రక్షణ సూత్రాల గురించి వివరిస్తున్న అధికారులు.. వాటిని అమలు చేయాలని అవగాహన కల్పిస్తున్నారు. మరోవైపు.. కార్మికులతోపాటు అధికారులు యూనిఫాం, టోపీలు ధరించకుండానే అవగాహన కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని కార్మికుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సరైన పర్యవేక్షణ లేకే..

రక్షణ పక్షోత్సవాల్లో చేయించిన ప్రతిజ్ఞ, సూచనలు ఆచరణలో సాధ్యం కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 15 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా జీఎం స్థాయి అధికారుల బృందం తనిఖీలు చేసి నివేదికలు తయారు చేసి వెళ్లిపోతుంది. అప్పటివరకు ఏరియా అధికారులు గనులు, డిపార్టుమెంట్లలో సూచిక బోర్డులు, రక్షణకు సంబంధించిన కొటేషన్లు రాసి, జెండాలు కట్టి హంగూ ఆర్భాటాలతోనే సరిపెట్టుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి.

నోటీస్ బోర్డులపై కానరాని సమాచారం

ప్రమాదాల్లో కొందరు ప్రాణాలు కోల్పోతుండగా మరికొన్ని సందర్భాల్లో క్షతగాత్రులవుతున్నారు. గనులపై ప్రమాదాల సమాచారం వెల్లడించాల్సి ఉన్నా.. ఎక్కడ కూడా నోటీసు బోర్డులపై కానరావడం లేదు. ఉన్నతాధికారులు సందర్శనకు వచ్చినప్పుడు హడావుడి చేసి.. ఆ తర్వాత మళ్లీ పట్టించుకోవడం లేదు. ఏడాది పొడవునా రక్షణ చర్యలు తీసుకునే అంశాలను మరుగున పడేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇదే విషయమై సింగరేణి స్టేపీ అధికారులను సంప్రదించగా.. సింగరేణివ్యాప్తంగా సేఫ్టీ మేనేజ్‌మెంట్ పద్ధతులు పాటిస్తున్నామని స్పష్టం చేశారు. ఉద్యోగులకు వాటిపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. గతంతో పోల్చితే ప్రస్తుతం ప్రమాదాల సంఖ్య తగ్గిందని, అయినా, జీరో హార్మ్ సంస్థగా సింగరేణిని తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని వివరించారు.



సింగరేణి గనుల్లో పనిచేస్తున్న కార్మికులు

రాష్ట్రంలో 38 పారిశ్రామిక యూనిట్ల పునరుద్ధరణ

ఎంపీ చామల ప్రశ్నకు కేంద్రం సమాధానం



కేంద్రమంత్రి జితిన్ ప్రసాద

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలో కుంటుపడిన 38 పారిశ్రామిక యూనిట్లను పునరుద్ధరించినట్లు కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. తెలంగాణ ఇండస్ట్రియల్ హెల్త్ క్లినిక్ లిమిటెడ్ (టీఐహెచ్‌సీఎల్) ద్వారా వీటిని పునరుద్ధరించినట్లు తెలిపింది. ఈ మేరకు మంగళవారం లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం నుంచి అందిన సమాచారం ప్రకారం ఆదిలాబాద్‌లో 13 సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) యూనిట్లు, నల్లగొండలో 25 యూనిట్లు ఉన్నాయని వెల్లడించారు. ఇందుకోసం ఆదిలాబాద్‌లో రూ.26 లక్షలు, నల్లగొండలో రూ.47.95 లక్షలు ఇప్పటివరకు ఖర్చు చేసినట్లు కేంద్రమంత్రి తెలిపారు.

జాతీయ అవార్డుపై సిబ్బందికి అభినందనలు

'తెలంగాణ పోలీస్ కంప్యూటర్ సర్వీసెస్'కు అవార్డుపై శ్రీనివాసరావు హర్షం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పోలీస్ కంప్యూటర్ సర్వీసెస్, స్టాండరైజేషన్ విభాగానికి జాతీయ అవార్డు దక్కడంపై అదనపు డీజీ టెక్నికల్ సర్వీసెస్ వీవీ శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఈమేరకు ఆయన సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ 'టెక్నాలజీ వినియోగంలో తెలంగాణ పోలీస్ విభాగం దేశవ్యాప్తంగా విశిష్టమైన స్థానాన్ని దక్కించుకుంటోంది. ఈ–పెట్టీ కేస్ సిస్టం చిన్న నేరాల నిర్వహణను సులభతరం చేసి, సాక్ష్యాధారాలతో చర్యలు తీసుకోవడం, ప్రజల్లో నమ్మకాన్ని పెంచడంలో కీలకపాత్ర పోషిస్తోంది' అని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ కంప్యూటర్ సర్వీసెస్, స్టాండరైజేషన్ (పీసీఎస్అండ్ఎస్) విభాగానికి మొబైల్ గవర్నెన్స్ కేటగిరీలో 'ఈ–పెట్టీ కేసెస్' ప్రాజెక్టుకు 15వ జాతీయ డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ అవార్డు–2024 లభించింది. ఈనెల 13న గువాహటిలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర పోలీస్ విభాగం తరపున ఈ అవార్డును తెలంగాణ పీసీఎస్అండ్ఎస్ ఎస్పీ కిరణ్ కుమారి, డీఎస్పీ (ఐటీ) ఎస్.రవిచంద్ర.. అసోం రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ సెక్రటరీ (ఐటీ) కేఎస్‌పీవీ పవన్ కుమార్ చేతులమీదుగా అందుకున్నారు.

పదేళ్లలో తెలంగాణ సంపద పెంచాము

రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీ సురేశ్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ సాధించిన తర్వాత పదేళ్ల కాలంలో కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రంలో సంపదను పెంచడంతో పాటు ప్రజలందరికీ సమానంగా పంచామని బీఆర్ఎస్ ఎంపీ కేఆర్ సురేశ్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ నేతృత్వంలో 13 సంవత్సరాల పాటు పోరాడి.. అనేక మంది ప్రాణ త్యాగాల తర్వాత తెలంగాణను సాధించుకున్నామని రాజ్యసభకు గుర్తుచేశారు. 2014లో తెలంగాణ ఏర్పడినప్పుడు అనేక విమర్శలను ఎదుర్కొన్నప్పటికీ.. రాజ్యాంగం ఇచ్చిన భరోసాతో వెనుకబడిన ప్రాంతం నుంచి 10 ఏళ్లలో దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా ఎదిగామని సభ దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం రాజ్యసభలో భారత రాజ్యాంగ 75వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని జరిగిన చర్చలో సురేశ్‌రెడ్డి ప్రసంగించారు. రాజ్యాగం అమలులో భాగంగా ఆర్టికల్ 3 ద్వారానే తాను రాజ్యసభ సభ్యుడిగా తెలంగాణ నుంచి సభలో గర్వంగా నిలబడ్డానని అన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత 10 ఏళ్లలో రాష్ట్ర ప్రజలను ధనవంతులుగా తయారుచేశామన్నారు. తలసరి ఆదాయంలోనూ తెలంగాణను దేశంలోనే మొదటి స్థానానికి తీసుకొచ్చామని.. జీడీపీలోనూ తెలంగాణ వాటా 4.8 శాతంగా ఉందని పేర్కొన్నారు. ఫిరాయింపుల నిరోధక చట్టంలో ఉన్న లొసుగులను తొలగించి చట్టాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రజా వ్యతిరేకులే జమిలి బిల్లును వ్యతిరేకిస్తున్నారు

బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు



సాక్షి, న్యూఢిల్లీ: ప్రజా వ్యతిరేకులే పార్లమెంటులో వన్ నేషన్ –వన్ ఎలక్షన్ బిల్లును వ్యతిరేకి స్తున్నారని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఆరో పించారు. బిల్లును వ్యతిరేకిస్తున్న పార్టీలు అందుకు కారణాలు చెప్పాలన్నారు. మంగళవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. అసాధ్యా లను సుసాధ్యం చేసేదే మోదీ ప్రభుత్వమని చెప్పారు. మెజారిటీ రాజకీయ పార్టీలు ఇప్ప టికే జమిలి ఎన్నికలకు మద్దతు తెలిపాయని గుర్తుచేశారు. జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానిగా ఉన్నప్పుడు సాధ్యమైన జమిలి ఎన్నికలను మోదీ ప్రధానిగా ఉన్నప్పుడు మాత్రం కాంగ్రెస్ పార్టీ ఎందుకు వ్యతిరేకిస్తోందని రఘునందన్‌రావు ప్రశ్నించారు. సభలో బిల్లుపై చర్చించేందుకు కాంగ్రెస్ ముందుకు రావాలని డిమాండ్ చేశారు.

నాలుగో రోజుకు మోడల్ స్కూల్ టీచర్ల ఆందోళన

సాక్షి, హైదరాబాద్: మోడల్ పాఠశాలలను విద్యాశాఖలో విలీనం చేయాలని.. ఆ పాఠశాలల ఉపాధ్యాయులు చేపట్టిన నిరసన మంగళవారం నాలుగో రోజుకు చేరింది. దశల వారీగా ఆందోళనను తీవ్రతరం చేస్తామని మోడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ తెలంగాణ (పీఎంటీఏ టీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు తరాల జగదీశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒకే నోటిఫికేషన్ కింద ఎంపికైన మోడల్ పాఠశాల ఉపాధ్యాయులకు నోషనల్ సర్వీస్ కల్పించాలని కోరారు. హెల్త్ కార్డులు ఇవ్వాలని, మరణించిన ఉపాధ్యాయుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు, పదోన్నతులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

ఏడాదైంది.. హామీలెక్కడ అమలయ్యాయి?: బీజేపీ

సాక్షి, హైదరాబాద్: అధికారం కోసం అలవి కాని హామీలిచ్చి ఏడాదైనా ఎక్కడ అమలు చేశారో చెప్పాలని బీజేపీ ఎమ్మెల్యేలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో బీజేపీ ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, పాయల్ శంకర్, రామారావు పటేల్, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, పాల్వాయి హరీశ్‌బాబు విలేకరులతో మాట్లాడారు. గతేడాది డిసెంబర్ 17న సభాముఖంగా ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినా ఎక్కడా అమలు కాలేదని ఆరోపించారు. ఆరు గ్యారంటీల్లో ఏ ఒక్క హామీ అమలు చేయలేదని, ప్రజలను మోసం చేసిన సీఎంపై 420 కేసు పెట్టాలన్నారు. ఇష్టానుసారంగా ఇచ్చిన హామీలు అమలు చేయలేమని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఏం చేశారని ఏడాది సంబురాలు చేస్తున్నారో చెప్పాలని నిలదీశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అలాగే చేసింది.. తాము కూడా అలాగే చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తున్నట్లుగా ఉందని, బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని హెచ్చరించారు.

స్థానికంలో కాంగ్రెస్–బీజేపీ మధ్యే ప్రధాన పోటీ

కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం


సాక్షి, హైదరాబాద్: రాబోయే రోజుల్లో జరిగే స్థానికంతో పాటు ఇతర ఎన్నికల్లోనూ ప్రధానంగా కాంగ్రెస్–బీజేపీల మధ్యే పోటీ ఉంటుందని కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. పదేళ్ల పాటు బీఆర్ఎస్ అధికారంలో ఉండటంతో పాటు తమ పాలనలో చేసిన పనులకు ఇప్పుడు ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటోందని తెలిపారు. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ ముఖ్యనేతలు అసెంబ్లీలో, బయటా వ్యవహరిస్తున్న తీరు, లేవనెత్తుతున్న అంశాలే ప్రజల్లో వారిపై మరింతగా వ్యతిరేకత పెరిగేందుకు దోహదపడతాయని చెప్పారు. మంగళవారం అసెంబ్లీ లాబీల్లో యెన్నం మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి మంచి స్పందన రావడంతో క్రమంగా ఆదరణ పెరుగుతోందన్నారు.

నకిలీ క్లినిక్‌లో డీసీఏ సోదాలు

రూ.1.5 లక్షల విలువైన మందులు స్వాధీనం

సాక్షి, హైదరాబాద్: నకిలీ క్లినిక్ నిర్వహిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) అధికారులు వనపర్తి జిల్లా పెద్దేముల మండలం జంగమాయిపల్లి గ్రామంలో సోమవారం సోదాలు నిర్వహించారు. గ్రామంలో బత్తుల రాములు అనే వ్యక్తి నకిలీ క్లినిక్ నిర్వహిస్తున్నట్టు గుర్తించారు. క్లినిక్‌లో రూ.1.5 లక్షల విలువైన 45 రకాల మందులను స్వాధీనం చేసుకున్నట్టు డీసీఏ డీజీ కమలాసన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతి లేకుండా మందులు నిల్వ చేయడం, విక్రయించడం చట్టరీత్యా నేరమని ఆయన హెచ్చరించారు.

కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర విద్యాశాఖలో సమగ్ర శిక్ష అభియాన్'కింద పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి విజ్ఞప్తి చేశారు. రోస్టర్, మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్, రాత పరీక్షల ద్వారా జిల్లా, మండల, స్కూల్ కాంప్లెక్స్, పాఠశాల స్థాయిల్లోని వివిధ పోస్టులలో.. దాదాపు 18 ఏళ్లుగా రాష్ట్రవ్యాప్తంగా 19,600 మందికి పైగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారని వివరించారు. ఎన్నికలకు ముందు వీరి ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తామని హామీ ఇవ్వడాన్ని గుర్తు చేశారు. వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరించి విద్యాశాఖలో విలీనం చేయాలని.. లేదా తక్షణమే ఉద్యోగ భద్రత కల్పించి పే స్కేల్ ఇవ్వాలని కోరారు.

రూ.82 వేల కోట్లతో ధాన్యం సేకరణ

ఎంపీ అనిల్‌కుమార్‌కు కేంద్రం సమాధానం



సాక్షి, న్యూఢిల్లీ: రైతుల నుంచి ధాన్యం సేకరించేందుకు తెలంగాణ రాష్ట్రానికి రూ.82,738.01 కోట్ల రాయితీ విడుదల చేసినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు మంగళవారం రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి మౌఖికంగా సమాధానం ఇచ్చారు. కేంద్రం నుంచి ఇవ్వాల్సిన ఈ రాయితీ మొత్తాన్ని గడచిన మూడేళ్లతో పాటు 2024–25 ఆర్థిక సంవత్సరం నవంబర్ నాటికి ఆహార, ప్రజా పంపిణీ విభాగం (డీఎఫ్‌పీడీ) భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) ద్వారా విడుదల చేసినట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు.

ద్వైపాక్షిక సమావేశంలో 'ఈటల'

భారత్‌కు ఆర్మేనియా నేషనల్ అసెంబ్లీ బృందం



సాక్షి, న్యూఢిల్లీ: భారత్–ఆర్మేనియా ద్వైపాక్షిక సమావేశంలో బీజేపీ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొన్నారు. ఐదురోజుల పర్యటన కోసం భారత్‌కు రిపబ్లిక్ ఆఫ్ ఆర్మేనియా నేషనల్ అసెంబ్లీ ప్రెసిడెంట్ అలెన్ సియోన్యాన్ బృందం వచ్చింది. ఈ సందర్భంగా.. మంగళవారం పార్లమెంటు హౌస్ కాంగ్రెస్‌లో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. రెండు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులతో పాటు పరస్పర ప్రయోజనాలకు సంబంధించిన పలు అంశాలపై ఇరు పక్షాల నేతలు చర్చించారు. అనంతరం ఆర్మేనియన్ ప్రతినిధి బృందానికి ఓం బిర్లా ఇచ్చిన విందుకు ఈటల రాజేందర్ హాజరయ్యారు.

భూమ్మీద అడవుల లెక్క ఇదీ..

ప్రపంచంలో అత్యధికంగా అడవులున్న దేశాలు.. (విస్తీర్ణం.. చ.కి.మీలలో)

దేశం	అడవుల విస్తీర్ణం	మొత్తం అడవుల్లో శాతం
రష్యా	81,53,116	20.1
బ్రెజిల్	49,53,914	12.3
కెనడా	34,68,911	8.6
యూఎస్ఏ	30,97,950	7.7
చైనా	22,18,578	5.5
ఆస్ట్రేలియా	13,40,051	3.3
డీఆర్ కాంగో	12,50,539	3.1
ఇండోనేషియా	9,15,277	2.3
ఇండియా	7,24,264	1.8
పెరూ	7,21,575	1.8

(ప్రపంచ బ్యాంకు గణాంకాల ప్రకారం..)



- 2022లో ప్రపంచవ్యాప్తంగా నరికివేతకు గురైన అడవులు.. 41 లక్షల హెక్టార్లు (సుమారు కోటి ఎకరాలు).
- అంటే ప్రతి ఒక్క నిమిషానికి నరికివేత జరిగిన విస్తీర్ణం.. 11 ఫుట్‌బాల్ గ్రౌండ్లతో సమానం
- ఏడాదిలో తగ్గిపోయిన అడవుల వల్ల భూమి వాతావరణంలోకి అదనంగా చేరిన కార్బన్ డయాక్సైడ్.. 2.7 గిగాటన్నులు
- ఇది భారతదేశం మొత్తంలో ఒక ఏడాది పాటు బొగ్గు, పెట్రోల్ వంటి శిలాజ ఇంధనాలు వినియోగిస్తే వెలువడే కార్బన్ డయాక్సైడ్‌తో సమానం.
- ఇండియా స్టేట్ ఆఫ్ ఫారెస్ట్ రిపోర్ట్ (ఐఎస్ఎఫ్ఆర్) –2021 నివేదిక ప్రకారం మన దేశ విస్తీర్ణంలో అడవుల శాతం.. 21.72%
- దేశంలో 2019తో పోలిస్తే 2021 నాటికి అదనంగా పెరిగిన అడవులు.. 1,540 చదరపు కిలోమీటర్లు..

అడవుల నరికివేత అధికంగా గల దేశాలివీ..

దేశం	కోల్పోయిన అడవులు (లక్షల హెక్టార్లలో)
బ్రెజిల్	11.4
డీఆర్‌సీ	5.3
బొలివియా	4.9
ఇండోనేషియా	2.9
పెరూ	1.5
లావోస్	1.4
కామెరూన్	1.0
మడగాస్కర్	0.8
మలేసియా	0.8
కొలంబియా	0.7

(వరల్డ్ రీసోర్స్ ఇనిస్టిట్యూట్ 2023 గణాంకాల మేరకు..)



చలిచలి.. రాత్రి 11.30కు నాంపల్లి రైల్వేస్టేషన్ వద్ద ఇలా..

క్లుప్తంగా...

ఐఐటీ మద్రాస్‌లో 'కల్చర్ ఎక్సలెన్స్ అండ్ గ్రాడ్యుయేషన్' కోర్సు

సాక్షి, చెన్నై: మద్రాసు ఐఐటీలో ఫైన్ ఆర్ట్స్, కల్చర్ ఎక్సలెన్స్ అండ్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ అడ్మిషన్లు 2025–26కు పరిచయం చేశారు. దేశంలో ఈ ప్రోగ్రామ్‌లకు శ్రీకారంచుట్టిన తొలి విద్యా సంస్థ తమదేనని ఐఐటీ మద్రాసు డైరెక్టర్ వి. కామకోటి తెలిపారు. అన్ని బీటెక్, బీఎస్ ప్రోగ్రామ్‌లకు రెండు సీట్లు చొప్పున కేటాయించామని ప్రకటించారు. ఇందులో ఒక సీటు మహిళకు రిజర్వ్‌డ్ చేశామన్నారు. మంగళవారం స్థానికంగా ఐఐటీ మద్రాస్ డీన్ (స్టూడెంట్స్) సత్యనారాయణ ఎన్ గుమ్మడితో కలిసి ఈ వివరాలను కామకోటి ప్రకటించారు. ఫేస్ అడ్మిషన్‌లో నైపుణ్యం సాధించిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఐఐటీ మద్రాసు తన అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లలో ఒకటిగా ఈ ఫేస్ అడ్మిషన్ల ద్వారా భారత సంతతికి చెందిన వారికి అవకాశం కలిస్తామన్నారు. ఈ అడ్మిషన్ కోసం అభ్యర్థులు ఐఐటీఎం, ఫేస్ అడ్మిషన్ పోర్టల్ (httpr://SgŒæbèleadv.iitm.ac.in/face) ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సింటుందని సూచించారు. ఐఐటీ మద్రాసులోని వివిధ విద్యా కార్యక్రమాలలో ప్రవేశానికి మాత్రమే ఈ ఫేస్ ప్రవేశం కింద అడ్మిషన్ పోర్టల్‌ను ఉపయోగించాలని సూచించారు.

ఎయిడెడ్ పాఠశాలలకు క్రీడా కిట్లు కేటాయించాలి

సాక్షి, అమరావతి: ఎయిడెడ్ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు క్రీడా పరికరాలు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిట్టిబాబు, ఎల్‌కే చిన్నప్ప, ప్రతినిధి ప్రభాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలకు సర్కార్ క్రీడా కిట్లను అందిస్తోందని, ఈ క్రమంలో 595 పాఠశాలల విద్యార్థులకు కిట్లను అందించాలని ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

గోదావరి–కావేరి అనుసంధానమే ప్రధాన అజెండా

రేపు ఎన్‌డబ్ల్యూడీఏ 38వ వార్షిక సమావేశం

సాక్షి, అమరావతి: గోదావరి–పెన్నా–కావేరి అనుసంధానంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈ అంశాన్ని గురువారం నిర్వహించనున్న జాతీయ జలవనరుల అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) 38వ వార్షిక సాధారణ సమావేశం అజెండాలో ప్రధానంగా చేర్చింది. కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన ఢిల్లీలో జరిగే ఈ సమావేశంలో కేంద్ర జల్ శక్తి శాఖ, సీడబ్ల్యూసీ(కేంద్ర జలసంఘం), ఎన్‌డబ్ల్యూడీఏ అధికారులు పాల్గొంటారు. వర్చువల్‌గా రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరవుతారు. దీంతోపాటే నదుల అనుసంధానంపై ఏర్పాటైన ప్రత్యేక కమిటీ 22వ సమావేశాన్ని కూడా నిర్వహించనున్నారు. ఈ సమావేశం అజెండాలోనూ గోదావరి–పెన్నా–కావేరి అనుసంధానం అంశాన్ని చేర్చారు. ఇచ్చంపల్లి నుంచి 147.92 టీఎంసీల గోదావరి జలాలను నాగార్జునసాగర్ (కృష్ణా), సోమశిల(పెన్నా) మీదుగా కావేరి(గ్రాండ్ ఆనకట్ట)కు తరలించేలా ఎన్‌డబ్ల్యూడీఏ ప్రతిపాదించింది. ఈ అనుసంధానంపై బేసిన్‌లోని ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు భిన్నాభిప్రాయాలు వ్యక్తంచేస్తున్న నేపథ్యంలో నిర్వహిస్తున్న సమావేశం కావడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. బేసిన్ పరిధిలోని ముఖ్యమంత్రులతో కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ ఈ సమావేశంలో సంప్రదింపులు జరిపి ఏకాభిప్రాయాన్ని సాధించేందుకు కృషి చేస్తారని అధికార వర్గాలు తెలిపాయి.

కేంద్ర ప్రభుత్వ పెన్షన్లలో వ్యత్యాసాన్ని సరిచేయాలి

గాంధీనగర్ (విజయవాడసెంట్రల్): పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాల్లో ఉన్న వ్యత్యాసాలను సరిచేయాలని సెంట్రల్, స్టేట్ పెన్షనర్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు కె.వెంకటప్పయ్య డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో 42వ అఖిల భారత పెన్షనర్ల దినోత్సవం మంగళవారం జరిగింది. వెంకటప్పయ్య మాట్లాడుతూ.. కేంద్రం తక్షణమే 8వ వేతన సంఘాన్ని నియమించాలని డిమాండ్ చేశారు. కమ్యూటేషన్ పరిధిని 12 సంవత్సరాలకు తగ్గించాలన్నారు. వివిధ రాష్ట్రాల్లో ఉన్న వేతనాలను, కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లకు వ్యత్యాసాన్ని సరిచేయాలని తీర్మానం చేశారు. గౌరవ అధ్యక్షుడు కె.హనుమంతరావు మాట్లాడుతూ.. పెన్షనర్ల సమస్యలన్నింటిని కేంద్రప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలన్నారు.

బెబ్బులి బెదురుతోంది!

ఎన్‌ఎస్‌టీఆర్‌లో పులి ఆవాసానికి, ఆహారానికి పెను ముప్పు!

దేశంలోనే విస్తీర్ణంలో అతి పెద్దదైన పెద్ద పులుల అభయారణ్యం శ్రీశైలం – నాగార్జున సాగర్ టైగర్ రిజర్వ్ (ఎన్‌ఎస్‌టీఆర్). అలాంటి చోటే వాటికి పెను ముప్పు ఎదురవుతోంది. పెరుగుతున్న పులుల సంతతికి తగ్గట్టు ఆవాసం, ఆహార లభ్యత దొరకడం లేదు. వీటి ప్రధాన ఆహార జంతువులైన దుప్పులు, కణుతుల సంఖ్య పెరగకపోగా రోజురోజుకు వాటి సంఖ్యలో తరుగుదల కనిపిస్తోంది. ఇందుకు అటవీ పరిధిలో వేటగాళ్లు మాటు వేయడం.. వారిని కట్టడి చేసే స్థాయిలో సిబ్బంది సంఖ్య లేకపోవడంతో ఎంతో భద్రమైనదిగా భావించే నల్లమలలోనే వాటి సంరక్షణ గాలిలో దీపంలా మారింది.



- పులుల సంతతికి అనుగుణంగా పెరగని ఆహార లభ్యత
- నల్లమలలో వేటగాళ్ల స్వైర విహారం..అడుగడుగునా ఉచ్చులు
- తగ్గుతున్న దుప్పులు, కణుతుల సంఖ్య
- పిడికెడు సిబ్బందితో వేల చ.కి.మీ. జల్లెడ పట్టలేని అటవీశాఖ
- ఎన్‌ఎస్‌టీఆర్‌లో ఉండాల్సిన సిబ్బంది 750..ఉన్నది 250 మాత్రమే!

ఆత్మకూరు రూరల్: అటవీ ఆవరణ వ్యవస్థలో అగ్రభాగాన ఉండే పెద్దపులులు అధికారిక లెక్కల ప్రకారం శ్రీశైలం– నాగార్జున సాగర్ టైగర్ రిజర్వ్‌లో 87 ఉన్నాయి. అయితే, పులులు పెరిగే కొద్ది వాటి ఆవాస ప్రాంతం, ఆహార లభ్యత పెరగడం లేదు. ఇందుకు తగినన్ని గడ్డి మైదానాలు అభివృద్ధి కాలేదు. పులుల ప్రధాన ఆహార జంతువుల సంఖ్య పెరగడమూ లేదు. నల్లమలలోని ఆత్మకూరు, నంద్యాల , గిద్దలూరు,మార్కాపురం డివిజన్‌లలో వేటగాళ్ల కదలికలు రోజురోజుకు పెరుగుతుండడమే అందుకు ప్రధాన కారణమని తెలుస్తోంది. అటవీ సమీప గ్రామాల్లో తిష్టవేసిన కొందరు వేటగాళ్లు గడ్డితినే జంతువులు సంచరించే నీటివనరుల వద్ద, జేడ (సాల్ట్ లిక్)మైదానాల వద్ద ఉచ్చులు వేసి మాటు గాస్తున్నారు. ఆ ఉచ్చులకు చిక్కిన వన్యప్రాణులను మాంసంగా మార్చి పట్టణాల్లో పెద్ద మొత్తానికి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.



ప్రమాదకర స్థితిలో పులి

ఎంతో భద్రమైనదని భావించే ఎన్‌ఎస్‌టీఆర్ లో ప్రాణాంతక వైరస్‌లా వేటగాళ్ల చొరబాటు పెరుగుతోంది. ఇందుకు ప్రధాన కారణం సిబ్బంది కొరతేనన్నది విస్పష్టం.ఎన్‌ఎస్‌టీఆర్ సర్కిల్‌లో మొత్తం నాలుగు డివిజన్‌లలో 750 (ఇది పాత లెక్క)మంది సిబ్బంది ఉండాల్సిన చోట కేవలం 250 మందే ఉన్నారు. ఈ అరకొర సిబ్బందితో వేటగాళ్లను నియంత్రించ లేని పరిస్థితి. ఫలితంగా పులి సంరక్షణ ప్రమాదకర స్థితిలో పడింది.

ఫుట్ పెట్రోలింగ్‌కు అదే సమస్య

అటవీ సంరక్షణలో రోజువారి ఫుట్ పెట్రోలింగ్ (కాలి నడకతో ప్రదేశాన్ని చుట్టి రావడం)కు కూడా సిబ్బంది కొరతే ప్రధాన అడ్డంకిగా ఉంది. సుమారు 3,750 చ.కిమీ విస్తీర్ణంలో ఉన్న విశాలమైన ఎన్‌ఎస్‌టీఆర్‌లో ఫుట్ పెట్రోలింగ్‌కు ఉన్న వనరులు కేవలం బేస్ క్యాంప్ సిబ్బంది మాత్రమే. పులి సంరక్షణలో మేటి అని చెప్పుకునే ఆత్మకూరు అటవీ డివిజన్‌లో ఉన్న 23 బేస్ క్యాంపుల్లో సుమారు వంద మంది ప్రొటెక్షన్ వాచర్లు పని చేస్తుంటారు.అయితే, వీరిలో కొందరు వీక్లీ ఆఫ్‌లో ఉంటారు. మిగతా వారిని ప్రత్యేకించి ఫుట్ పట్రోలింగ్‌కు కేటాయించలేని పరిస్థితి. ప్రొటెక్షన్‌వాచర్లను పర్యవేక్షించేందుకు ఒక్కో బేస్ క్యాంపులో ఒక రెగ్యులర్ అటవీ సిబ్బంది ఉండాలి. ఈ రూల్ పుస్తకాలకు మాత్రమే పరిమితమైంది.



వేధిస్తోన్న ఆహార కొరత ..

శ్రీశైలం – నాగార్జున సాగర్ టైగర్ రిజర్వ్‌లో ఉన్న ఆహార లభ్యతను బట్టి ఒక్కో పెద్దపులి తన అధీన ప్రాంతం (టెరటరీ)గా సుమారు 40 చ.కిమీ పరిధిని ఉంచుకుంటోంది. పులి సాధారణంగా ఆరు సార్లు దాడులు చేస్తే ఒకసారి వేట సాఫల్యమవుతుంది. ఇందుకోసం అది ఆరు రోజులు కూడా ఆకలితో నకనకలాడాల్సి ఉంటుంది. కనీసం వారానికో జంతువును వేటాడినా ప్రస్తుతం నల్లమలలో ఉన్న పులులకు వారానికి సుమారు 90 ఆహార జంతువులు అవసరమవుతాయి. నెలకు 360, సంవత్సరానికి దరిదాపుగా నాలుగు వేలకు పైగా జంతువులు అందుబాటులో ఉండాలి. ఇది కనిష్ట అవసర స్థితి. ఈ నిష్పత్తిలో ఆహార లభ్యత లేక పోతే పులుల అధీన ప్రాంతం క్రమేపీ పెరుగుతుంది. దీంతో పులుల మధ్య ఆహారం కోసం యుద్ధాలు జరుగుతాయి. ఈ పోరులో ఎన్నో పులులు మరణించే అవకాశం ఉంది. ఇలాంటి సంక్లిష్ట పరిస్థితుల్లో పులి ఆహారం వేటగాళ్ల చౌర్యానికి గురైతే జరిగే నష్టం లెక్కకట్టలేనిది.

అడపాదడపా కేసులు... శిక్షలు శూన్యం?

అటవీ అధికారులు అడపాదడపా ఎవరో ఒకరిని వన్యప్రాణి వేట కేసుల్లో పట్టుకుని కేసులు పెడుతున్నారు. అయితే, వారిలో ఏ ఒక్కరికీ కఠిన శిక్షలు పడిన దాఖలాలు లేవు. ఇందుకు ప్రధాన కారణం కూడా సిబ్బంది కొరతే. కనీసం పీఓఆర్‌ను కాని చార్జ్ షీట్‌ను కాని ముద్దాయిలకు శిక్ష పడేలా రాసుకోలేని పరిస్థితి. ఈ ఏడాది జనవరిలో ఆత్మకూరు రేంజ్ లోని గుమ్మడాపురం కు చెందిన కొందరు దుప్పి తలతో అధికారులకు చిక్కారు. ఇదే రేంజ్ లోని శివపురం సమీపంలో ఏప్రిల్ నెలలో ఇద్దరు ఎలుగు బంటి మాంసంతో చిక్కారు. ముసలమడుగు సమీపంలో అక్టోబర్ నెలలో కొందరు అడవి పంది మాంసంతో పట్టుబడ్డారు. వీరందరిపై పీఓఆర్ నమోదు అయి కోర్టు ముందు హాజరు పరిచారు. అయితే వారిపై సరైన సెక్షన్లు పెట్టకపోవడంతో నిందితులు 24 గంటల్లో బెయిల్‌పై తిరిగి వస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎవరీ వేటగాళ్లు...

నల్లమల పులి ఆహారానికి పీడగా మారిన వేటగాళ్ల గురించి ఆరా తీస్తే కొన్ని ఆసక్తి కర విషయాలు బయట పడుతున్నాయి. ప్రధానంగా ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలో వేటగాళ్ల కదలికలను గమనిస్తే అవి ఎక్కువగా మండలంలోని వెంకటాపురం, నల్లకాల్వ, కొత్తరామాపురం,సిద్దాపురం పరిధిల్లోనే కనిపిస్తున్నాయి. మండలంలోని మాజీ నేరస్తుల ఆవాస గ్రామానికి చెందిన కొందరు దాదాపు ప్రతి గ్రామంలోనూ తాత్కాలిక నివాసం ఏర్పాటు చేసుకుని అక్కడ అక్రమ మద్యం దుకాణాలు నడుపుతున్నారు. ఆయా గ్రామాల్లో ఉండే లుంపెన్ తరగతులకు చెందిన యువకులను తమ వెంట తిప్పుతూ ఇటు నాటుసారా అక్రమ రవాణాకు, అటు వన్యప్రాణుల వేటకు వినియోగించుకుంటున్నారు.



ఉచ్చులతో పులికీ ప్రమాదం

వేటగాళ్లు పులి ఆహార జంతువులైన జింకల కోసం నీటి వనరుల వద్ద ఉచ్చులు పన్ని ఉంచు తారు. అయితే ఈ ఉచ్చులలో ప్రమాదవశాత్తు అప్పుడప్పుడు పెద్ద పులులు కూడా చిక్కు కుని మరణిస్తుంటాయి. గతంలో సిద్దాపురం చెరువులో పన్నిన ఉచ్చులకు ఓ పెద్దపులి చిక్కుకుని ప్రాణాలు కోల్పోగా రెండేళ్ల కిందట ఆత్మకూరు డివిజన్ లోని నల్లకాల్వ సెక్షన్ లో ఓ పులి కళేబరం గాలేరు ప్రవాహంలో కొట్టుకు వచ్చింది. దాని మెడలో ఒక ఉచ్చు బిగిసి ఉంది. ఇలా వేటగాళ్ల వల్ల పులుల ఆహార జంతువులు తగ్గిపోవడంతో పాటు కొన్నిసార్లు అవి కూడా ప్రాణాలు కోల్పోవాల్సి రావడం ఆందోళన కలిగిస్తోంది. అదే పూర్తి స్థాయిలో సిబ్బంది ఉంటే వేటగాళ్లను నియంత్రించవచ్చు. ఆ దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. కాగా దీనిపై ఎన్‌ఎస్‌టీఆర్ ఆత్మకూరు డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ సాయిబాబా వివరణ కోరగా ప్రస్తుతం సిబ్బంది కొరత ఉందని, కింది స్థాయిలో రిక్రూట్‌మెంట్ జరగడం లేదని, తమ వరకు పులుల సంరక్షణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు.



ఉచ్చుకు బలి అయిన పెద్ద పులి కళేబరం (ఫైల్)



అధికారుల అదుపులో వన్య ప్రాణి వేటగాళ్లు (ఫైల్)



16 గంటల.. సుదీర్ఘ రాత్రి



ఈ నెల 21న శీతాకాలపు అయనాంతం

- సూర్యకాంతి ఉండేది 8గంటలే..
- మిగిలిన 16 గంటలు రాత్రి
- ఆ రోజున సూర్యునికి సుదూరంలో భూమి
- ఐక్యత, శ్రేయస్సుకు చిహ్నంగా భావిస్తున్న ఆసియా దేశాలు
- తగ్గనున్న పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు

తిరుపతి సిటీ: సాధారణంగా శీతాకాలంలో పగలు తక్కువగాను, రాత్రి సమయం ఎక్కువ ఉంటుంది. ఏటా వేసవిలో భూమి సూర్యుడికి దగ్గరగా, శీతాకాలంలో భూమి సూర్యుడికి దూరంగా కక్ష్య దిశలో మార్పులు జరుగుతుంటాయి. ఈ క్రమంలో ఏర్పడే ప్రక్రియనే వేసవి కాలపు అయనాంతం, శీతాకాలపు అయనాంతం అంటారు. ఈ ఏడాది శీతాకాలంలో డిసెంబర్ 21న వింత చూడబోతున్నాం. ఆ రోజు సుదీర్ఘమైన రాత్రి ఏర్పడనుంది. ఏకంగా 16 గంటల పాటు రాత్రి సమయం, 8గంటల పాటు పగలు సమయం మాత్రమే ఉంటుంది. ఇలా జరగడాన్ని శీతాకాల అయనాంతం (వింటర్ సోల్‌స్టైస్) అంటారు.

సూర్యుడికి సుదూరంగా భూమి

శీతాకాలపు అయనాంతం ఏర్పడే రోజున భూమి సూర్యుడికి దూరంగా ఉంటుంది. ఆ రోజున భూమి ధ్రువం వద్ద 23.5 డిగ్రీల వంపులో ఉంటుంది. ఈ సహజ మార్పు కారణంగా 2024లో అత్యంత తక్కువ సమయం పగలు ఉంటుంది. దీంతో సూర్యకాంతి 8 గంటలు, చంద్రుడి కాంతి 16 గంటల వరకు ఉంటుంది. భూమి తన అక్ష్యం వైపు తిరిగే సమయంలో దక్షిణ అర్ధగోళంలో భూమి, సూర్యుడి మధ్య దూరం గరిష్టంగా ఉంటుంది. ఆ సమయంలో ఏర్పడే దానినే అయనాంతరం అంటారు. సూర్యుడు మధ్యాహ్న సమయంలో ఆకాశంలో అత్యధిక లేదా అత్యల్ప స్థానానికి చేరుకున్నప్పుడు సూర్యుని చుట్టూ భూమి కక్ష్యలో ఉండే రెండు బిందువులను అయనాంతం అంటారు. దీని ఫలితంగా సంవత్సరంలో పొడవైన రోజు (వేసవి కాలపు అయనాంతం), అతి తక్కువ రోజు (శీతాకాలపు అయనాంతం) వస్తుంది. ఇది ఏటా రెండు సార్లు జరిగే ఘట్టం. సంవత్సరం పొడవునా, ఉత్తర లేదా దక్షిణ అర్ధగోళం సూర్యుని వైపు వంగి ఉంటుంది. వేసవి కాలపు అయనాంతం అనేది అత్యంత పొడవైన రోజు.

అయనాంతంపై ప్రగాఢ నమ్మకాలు

శీతాకాలంలో ఏర్పడే అయనాంతంపై పలు దేశాలలో పలురకాల నమ్మకాలను ప్రజలు పాటిస్తుంటారు. చైనాతో పాటు ఇతర తూర్పు ఆసియా దేశాలలో బౌద్ధమతంలోని యన్, యాంగ్ శాఖకు చెందిన ప్రజలు ఐక్యత, శ్రేయస్సుకు ప్రతీకగా నమ్ముతూ పలు కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉత్తర భారత్‌లో శ్రీకృష్ణునికి నైవేద్యం సమర్పించి, గీతాపారాయణం చేస్తారు. రాజస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో పుష్య మాస పండుగను ఘనంగా జరుపుకుంటారు. సూర్యుడి ఉత్తరాయణ ప్రక్రియ శీతాకాలపు అయనాంతం నుంచి మొదలవుతుంది. అందుకే మన దేశంలో దీనికి ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది.

ఇదో వింత అనుభూతి



భూ భ్రమణంలో భాగంగా సూర్యుడు, భూమి మధ్య దూరం ఏడాదిలో ఒక్కసారి పెరగడం, తగ్గడం జరుగుతుంటుంది. వేసవిలో సూర్యుడికి దగ్గరగానూ, శీతాకాలంలో సూర్యుడికి దూరంగా భూభ్రమణం జరుగుతుంటుంది. భూమి సూర్యుడికి దగ్గరగా వచ్చినప్పుడు వేసవి అయనాంతంగానూ, సూర్యుడికి సుదూరంగా భూభ్రమణం జరిగినప్పుడు శీతాకాలపు అయనాంతంగా పేర్కొంటారు.

– నెహ్రూ, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్, రీజినల్ సైన్స్ సెంటర్

21న తగ్గనున్న ఉష్ణోగ్రతలు

శీతాకాలపు అయనాంతం ఏర్పడే రోజు, తేదీ ఏటా మారుతూ ఉంటుంది. అయితే, కచ్చితంగా డిసెంబర్ 20 నుంచి 23 తేదీలలోపు మాత్రమే వస్తుంటుంది. ఈ ఏడాది 21వ తేదీన ఈ అరుదైన ఘట్టం సంభవిస్తుందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. దీంతో సూర్యకిరణాలు ఆలస్యంగా భూమికి చేరుతాయి. ఈ కారణంగా ఉష్ణోగ్రతలలో మార్పులు సంభవించి, దేశవ్యాప్తంగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంటుంది.

మార్చిలోపు అన్ని పంచాయతీలకు బ్రాడ్ బ్యాండ్ సర్వీసులు

భారత్ డిజిటల్ నిధి అధికారులతో ఏపీఫైబర్‌నెట్ ఎండీ కె. దినేష్ కుమార్

సాక్షి, అమరావతి: వచ్చే మార్చి నెలాఖరులోపు రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీలకు బ్రాడ్ బ్యాండ్ సేవలు అందుబాటులోకి తీసుకువస్తామని భారత్ డిజిటల్ నిధి అధికారులకు ఏపీ ఫైబర్‌నెట్ ఎండీ కె. దినేష్ కుమార్ తెలిపారు. రాష్ట్రంలో డిజిటల్ భారత్ నిధి నిధులతో చేపడుతున్న భారత్‌నెట్–2 ప్రాజెక్టు పనుల ప్రగతి గురించి మంగళవారం విజయవాడలోని బీఎస్ఎన్ఎల్ ప్రధాన కార్యాలయంలో సమీక్ష జరిగింది. ఈ సమావేశంలో ఏపీ ఫైబర్ నెట్ ఎండీ కె. దినేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో భారత్ నెట్ ప్రాజెక్టు పనుల ప్రగతి గురించి వివరించారు. 2025 మార్చి నెలాఖరులోపు ఆంధ్రప్రదేశ్ లోని అన్ని గ్రామ పంచాయతీలకు బ్రాడ్ బ్యాండ్ సర్వీసుల సదుపాయం కల్పించాలనేది రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని, ఈ మేరకు పనులు వేగవంతంగా చేపడుతున్నామని తెలిపారు. భారత్ నెట్ పథకంలో భాగంగా ఇప్పటికే రాష్ట్రంలోని 15 వేల మందికి ఫైబర్ నెట్ ద్వారా బ్రాడ్ బ్యాండ్ కనెక్టివిటీ కల్పించామన్నారు. వచ్చే ఏడాది మార్చి నెలాఖరులోపు మరో 11,254 పంచాయతీలకు బ్రాడ్ బ్యాండ్ కనెక్టివిటీ కల్పిస్తామని తెలిపారు. కాగా ఆంధ్రప్రదేశ్‌లో భారత్ నెట్ ప్రాజెక్టు పనుల అమలు తీరుపై కేంద్ర ప్రభుత్వం సంతృప్తి వ్యక్తం చేసింది. డిజిటల్ భారత్ నిధి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సంజయ్ కుమార్ వర్ష్నే మాట్లాడుతూ ఏపీలో భారత్‌నెట్–2 ప్రాజెక్టు పనులు బాగా జరుగుతున్నాయన్నారు.



ప్రీమియం భారమై పంటల బీమాకు దూరమైన రైతులు

- వైఎస్సార్‌సీపీ రైతు విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డి రఘురాం



సాక్షి, అమరావతి: ప్రీమియం భరించలేక రాష్ట్రంలోని రైతులు పంటల బీమాకు దూరమవుతున్నారని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, అప్కాడా మాజీ కో వైస్ చైర్మన్ వడ్డి రఘురాం ఆందోళన వ్యక్తం చేశారు. ఉచిత పంటల బీమా పథకాన్ని చంద్రబాబు రద్దు చేసి, ఆ భారాన్ని రైతుల నెత్తిన వేశారని చెప్పారు. పది రోజుల్లో గడువు ముగుస్తున్నప్పటికీ రబీలో ఇప్పటివరకు సాగైన విస్తీర్ణంలో 20 శాతం కూడా బీమా పరిధిలోకి రాలేదని చెప్పారు. ఆయన మంగళవారం విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ.. ప్రతి రైతుకు రూ.20 వేల పెట్టుబడి సాయం అందిస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు పీఎం కిసాన్‌తో ముడిపెట్టడం సమంజసం కాదన్నారు. ఈ ఏడాది ఒక్క విడత కూడా పెట్టుబడి సాయం అందించకపోవడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో ఒక్క రైతుకు కూడా కనీస మద్దతు ధర దక్కలేదని తెలిపారు. ధాన్యం రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు,వైఎస్ జగన్ ఇచ్చిన పిలుపు మేరకు నిర్వహించిన రైతు పోరుబాట ఫలితంగానే నేడు ధాన్యం సొమ్ములు జమ చేస్తున్నారని చెప్పారు. అయినప్పటికీ మిల్లర్లతో కుమ్మక్కై, తేమ శాతం సాకుతో బస్తాకు రూ. 400 వరకు కోతపెడుతున్నారని ఆరోపించారు. జోన్‌తో సంబంధం లేకుండా ఆక్వా రైతులకు యూనిట్ రూ.1.50కే విద్యుత్ ఇస్తామని ఎన్నికల్లో నమ్మించిన చంద్రబాబు.. బడ్జెట్‌లో రూపాయి కూడా కేటాయించకుండా మోసగించారన్నారు.

ఆధ్యాత్మిక సమాచారం

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 25 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 62,112 మంది స్వామివారిని దర్శించుకోగా 22,541 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.36 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది.

వేడుకగా గొబ్బిదేవత పుర ఉత్సవం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం వేడుకగా గొబ్బిదేవత పుర ఉత్సవం నిర్వహించారు. తొలుత ఆలయ అలంకార మండపంలో గొబ్బిదేవతకు పలు అభిషేకాలు చేసి, విశేషాలంకరణ చేశారురు. అనంతరం పుర ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయాధికారులు తదితరులు పాల్గొన్నారు.

అఖండ శివనామ సంకీర్తన ప్రారంభం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని రెండో గేటు వద్ద అఖండ శివనామ సంకీర్తన, నిత్యభజనలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా భక్తకన్నప్ప జానపద కళాక్షేత్రం సభ్యుడు సంక్రాంతి వెంకటయ్య మాట్లాడుతూ తమకు శివనామ సంకీర్తన అవకాశం కల్పించిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ఈఓ బాపిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే నిత్యభజనలు చేసే వారికి స్వామి అమ్మవార్ల శీఘ్ర దర్శనం కల్పించి ప్రసాదాలను అందజేయాలని కోరారు.

20న గోదాదేవికి క్షేత్రోత్సవం

రాపూరు: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పెంచలకోనలో శుక్రవారం గోదాదేవికి క్షేత్రోత్సవం నిర్వహించనున్నట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. ధనుర్మాసం పురస్కరించుకుని పెంచలకోనలో గోదాదేవికి నాలుగు శుక్రవారాలు ప్రత్యేక పూజలు, క్షేత్రోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా మొదటి శుక్రవారం గోదాదేవికి క్షేత్రోత్సవం నిర్వహిస్తారని పేర్కొన్నారు.

మైనింగ్‌పై కూటమి పిడుగు

- కన్సిడరేషన్ ఫీజు బకాయిలు చెల్లించాలని ఆదేశం
- లేదంటే పర్మిట్లు రద్దు చేస్తామని హెచ్చరిక
- బకాయిలు రూ.లక్షల్లో ఉండటంతో యజమానుల ఆందోళన
- ప్రభుత్వ తీరును నిరసిస్తూ రాయల్టీ చెక్‌పోస్టు వద్ద ధర్నా

కొలిమిగుండ్ల: నాపరాతి గనుల యజమానులపై మరో పిడుగు పడింది. ఇప్పటికే నష్టాల్లో కూరుకుపోయిన పరిశ్రమపై మళ్లీ కూటమి ప్రభుత్వం మరో బాదుడుకు రంగం సిద్ధం చేసింది. పెండింగ్‌లో ఉన్న కన్సిడరేషన్ ఫీజు బకాయిలు చెల్లించాలని లీజుదారులకు ఆదేశాలు అందాయి. దీంతో మంగళవారం మైనింగ్ యజమానులు బందార్లపల్లె క్రాస్ రోడ్డులోని రాయల్టీ చెక్‌పోస్టు వద్ద నిరసనకు దిగారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు భూగర్భ గనుల శాఖ అధికారులు కన్సిడరేషన్ ఫీజు బకాయిలు చెల్లించాలని ఆన్‌లైన్‌లో ఆదేశించడంతో మైనింగ్ యజమానులు షాక్ గురయ్యారు. ఒక్కో లీజుదారుడు రూ.20 లక్షలు మొదలుకొని రూ.60 లక్షల వరకు చెల్లించాలని ఆన్‌లైన్‌లో చూపిస్తుండటంతో కంగుతిన్నారు. గతంలో రాయల్టీలు (పర్మిట్లు) తీసుకున్న వారంతా బల్క్‌గా కేటాయించిన అమౌంట్‌ను 2025 జనవరి 10లోగా చెల్లించాలని డెడ్‌లైన్ విధించారు. లేదంటే పర్మిట్లు రద్దవుతాయని హెచ్చరికలు జారీ చేశారు. ఇకపై కన్సిడరేషన్ మొత్తాన్ని బల్క్‌గా కాకుండా ప్రతి పర్మిట్‌పై వసూలు చేసేందుకు రంగం సిద్ధమైంది. మైనింగ్ లీజుదారులు ఆన్‌లైన్‌లో రాయల్టీ పొందాలంటే డీఎంఎఫ్‌తో కలిసి రూ.482 చెల్లించేవారు. ఇకపై ప్రతి రాయల్టీపై కన్సిడరేషన్ మొత్తాన్ని సైతం చెల్లించాల్సి వస్తోంది. అంటే రాయల్టీపై యజమానులకు అదనపు భారం పడనుంది. లక్షలాది రూపాయలు జరిమానా రూపంలో డెడ్‌లైన్ విధించి మరీ చెల్లించాలనడంతో యజమానులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. బనగానపల్లె నియోజకవర్గంలో 1,150 హెక్టార్లలో మైనింగ్ జరుగుతుండగా.. 600 మందికిపై లీజుదారులు ఉన్నారు. ఈసీ, మైనింగ్ ప్లానింగ్ తదితర రికార్డులు ఉన్న లీజుదారులకు మాత్రమే రాయల్టీలు వస్తున్నాయి. మిగిలిన లీజుదారులకు కూటమి ప్రభుత్వం 3 నెలల నుంచి ఆన్‌లైన్ రాయల్టీలు విడుదల చేయకపోవడంతో చాలామంది యజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఆందోళనతో స్తంభించిన రవాణా

మైనింగ్ యజమానులు ఆందోళనతో నాపరాళ్లను రవాణా చేసే ట్రాక్టర్లు, లారీలు ఇరువైపులా భారీగా నిలిచిపోయాయి. సీఐ రమేష్‌బాబు రాయల్టీ చెక్‌పోస్టు వద్దకు చేరుకుని మైనింగ్ యజమానులతో చర్చించి నిలిచిపోయిన వాహనాలను పంపించారు. ధర్నాలో టీడీపీ నాయకులు పాల్గొని ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేయడం కొసమెరుపు.

సాగుబడి
మూల కార్తె : డిసెంబర్ 17 నుంచి

కొత్త పంట

మంకీ జాక్ మనకు అనువైన పంట. ఏడాదంతా ఆకులతో పచ్చగా, నిలువుగా పెరుగుతుంది. దీని కలప విలువైనది. పరికరాలు తదితర వస్తువులు తయారీకి వాడుతారు. మంకీ జాక్ పండు ఆరోగ్యకరమైనది. ఇందులో పోషక విలువలతో పాటు ఔషధ విలువలు కూడా ఉంటాయి. ఉష్ణోగ్రతలు అంతకంతకూ పెరుగుతున్న ఈ కాలంలో ఆగ్రో ఫారెస్ట్రీ పద్ధతిలో ఈ చెట్లను సాగు చేస్తూ.. ఈ చెట్లు అందించే పాక్షిక నీడలో ఇతర స్వల్పకాలిక పంటలు పండించుకోవచ్చు. వ్యవసాయానికి సుస్థిరత చేకూర్చటానికి మంకీ జాక్ చెట్లు ఎంతగానో దోహదపడతాయి. కలప కోసం పెంచే రైతుకు పండ్లు కూడా ఇస్తుంది. మంకీ జాక్‌ను బాదల్, దెఫల్, దావ్ లేదా లకూచ తదితర పేర్లతో పిలుస్తారు. ఆగ్రోఫారెస్ట్రీకి ఎంతగానో ఉపయోగపడే ఈ జాతి చెట్లు విస్మరణకు గురయ్యాయి. ఇకనైనా దృష్టి కేంద్రీకరించాల్సిన దీర్ఘకాలిక పంట ఇది. మంకీ జాక్ చెట్లు పర్యావరణరంగా, ఆర్థికపరంగానే కాక పోషకాహార స్థాయిని పెంపొందించడానికి దోహదం చేస్తాయని నిపుణులు చెబుతున్నారు.



మంకీ జాక్

మంకీ జాక్ బొటానికల్ నేమ్ ఆర్టోకార్పస్ లకుచ. పనస, మల్బరీ కూడా ఇదే కుటుంబానికి చెందినవి. అందుకే మంకీ జాక్ పండు ఆకారం, దానిలో తొనలు, గింజలు పనసను పోలి ఉంటాయి. కాకపోతే కొంచెం చిన్నవి. భారత్, నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్, థాయ్‌లాండ్, మయన్మార్‌లోని కొన్ని ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదయ్యే ప్రాంతాల్లో సైతం చక్కగా పెరిగే బహుళ ప్రయోజనకారి మంకీ జాక్ చెట్టు. నిటారుగా పెరిగే చెట్టు ఇది. అంతర పంటలతో కూడిన తోటల్లో ప్రధాన వృక్ష జాతిగా మంకీ జాక్ చెట్లను పెంచుకోవచ్చు.

పర్యావరణపరమైన సమతుల్యతను కాపాడే అనేక ప్రయోజనాలు అందించటం మంకీ జాక్ చెట్ల ప్రత్యేకత. నిటారుగా 15 మీటర్ల ఎత్తు పెరుగుతుంది. దీని ఆకులు పెద్దగా, గట్టిగా ఉంటాయి. కొన్ని ప్రాంతాల్లో ఈ చెట్ల ఆకులు ఏడాదికి ఒకసారి రాలిపోతాయి. దీని పండ్లు మెత్తగా ఉంటాయి. పచ్చిగా ఉన్నప్పుడు ఆకుపచ్చగా, పండినప్పుడు పసుపు రంగులోకి మారతాయి. ఈ చెట్టు బెరడు ముదురు రంగులో ఉంటాయి. దీని పూలు సువానతో తేనెటీగలను ఆకర్షిస్తూ పరపరాగ సంపర్కానికి దోహదపడుతూ ఉంటాయి. ఇన్ని ప్రత్యేకతలు, ప్రయోజనాలు ఉన్నప్పటికీ మంకీ జాక్ చెట్ల పెంపకం పెద్దగా కనపడకపోవటం విశేషం. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడో ఒక్కచోట తప్ప ఈ చెట్లు కనిపించవు.

పండ్లు తినొచ్చు.. పచ్చడి పెట్టుకోవచ్చు..

మంకీ జాక్ కొత్త వాతావరణ పరిస్థితులకు, భిన్నమైన నేలలకు ఇట్టే అలవాటు పడిపోతుంది. ఏ ప్రాంతంలోనైనా ఇతర పంటలతో కలిపి సాగు చేయటానికి అనువైన జాతి ఇది. పండ్లు, పశుగ్రాసం, కలప, ఔషధ గుణాలు, సహజ రంగుగా వాడటానికి ఉపయోగపడే బెరడు వంటి ఉపయోగాలున్నాయి.

మంకీ జాక్ పండును నేరుగా తినొచ్చు. పచ్చళ్లు,



సాస్‌లు, చట్నీలు తయారు చేసుకోవచ్చు. ఈ పండ్ల గుజ్జు తింటే కాలేయ జబ్బులు తగ్గిపోతాయట. యాంటీఆక్సిడెంట్లతో పాటు కాలేయాన్ని రక్షించే గుణాలు పుష్కలంగా ఉండటం దీని ప్రత్యేకత. వయోభారం వల్ల చర్మం ముడతలు పడటం వంటి సమస్యల్ని దూరం చేసే చికిత్సల్లో దీన్ని వాడుతున్నారు. యాంటీ ఇన్‌ఫ్లమేటరీ థెరపీలో వాడుతున్నారు. జార్కండ్ వంటి చోట్ల గిరిజనుల సంప్రదాయ వైద్యంలో మంకీ జాక్‌ను ఉపయోగిస్తున్నారు.

మంకీ జాక్ చెట్టు ఆకుల్లో ప్రొటీన్ అత్యధికంగా 28.6% ఉంటుంది. అందువల్ల ఈ ఆకులు పశువులకు అత్యంత విలువైన గ్రాసం అని చెప్పొచ్చు. కాబట్టి పాడి పశువుల పాల ఉత్పత్తిని పెంపొందించడానికి మంకీ జాక్ చెట్టు ఆకులు బాగా ఉపయోగపడతాయి. ప్రత్యేకించి ఎండా కాలంలో ఇతర పచ్చి మేత అందుబాటులో లేని పరిస్థితుల్లో ఈ చెట్ల ఆకులు చక్కని పచ్చిమేతగా ఉపయోగపడతాయి. దీని బెరడు నుంచి వచ్చే జిగురు ఉపయోగకరం. అన్నిటికీ మించి దీని కలప ఎంత గట్టిగా ఉంటుందంటే చెద పురుగులు కూడా ఏమీ చేయలేవు. అందువల్ల కుర్చీలు, బల్లలు వంటి ఫర్నీచర్ తయారీలో దీని చెక్కను వాడుతున్నారు. పడవలు, నౌకల తయారీలో, నిర్మాణ రంగంలో కూడా ఈ కలపను ఉపయోగిస్తున్నారు.

పర్యావరణ, పౌష్టికాహార ప్రయోజనాలు

మంకీ జాక్ చెట్లు సుస్థిర వ్యవసాయ పద్ధతులకు అనేక విధాలుగా దోహదపడతాయి. భూసారాన్ని పెంపొందించటం, గాలికి వర్షానికి మట్టి కొట్టుకుపోకుండా కాపాడటం, జీవవైవిధ్యాన్ని పెంపొందించడానికి ఈ చెట్లు దోహదపడతాయి. వేడిని, గాలిలో తేమను తట్టుకొని పెరుగుతాయి. తరచూ కరువు బారిన పడే నిస్సారమైన భూముల్లో సైతం ఈ చెట్లు పెరుగుతాయి. ఈ చెట్ల నీడ సానుకూల సూక్ష్మ వాతావరణాన్ని కలిగిస్తుంది కాబట్టి అంతర పంటలు సాగు చేసుకోవచ్చు.

ఇక పోషకాల సంగతికి వస్తే.. మంకీ జాక్ పండ్లు, ఆకులు పోషకాల గనులే. పండ్ల గుజ్జులో డయటరీ ఫైబర్, పొటాషియం, విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. విత్తనాలు, జిగురులో యాంటీఆక్సిడెంట్లు దండిగా ఉన్నాయి. ఈ పండ్లను క్రమం తప్పకుండా తీసుకుంటే కాలేయం ఆరోగ్యంగా ఉంటుంది. జీర్ణశక్తి ఇనుమడిస్తుంది. నాచురల్ యాంటీ ఇన్‌ఫ్లమేటరీ ఎజెంట్‌గా పనిచేస్తుంది. ఈ గుణగణాలు మనుషులకు, పశువులకు ఆరోగ్యాన్నందిస్తాయి. తద్వారా పశువుల ఉత్పాదకత పెరుగుతుంది.



పండ్ల ధర కిలో రూ. 175

మంకీ జాక్ చెట్లు వర్షాధార వ్యవసాయం చేసే చిన్న,సన్నకారు రైతులకు మంచి ఆదాయాన్ని సమకూర్చుతాయి. ఒక చెట్టు ఆకుల నుంచి 200 కిలోల పచ్చి మేతను పొందవచ్చని, ఆ మేరకు పాడి పశువుల పోషణ ఖర్చు తగ్గిపోతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ చెట్ల పచ్చి ఆకులు క్వింటాలు రూ. 300 విలువ చేస్తాయి. పండ్లు కిలో రూ. 175 పలుకుతామంటున్నారు.

చీడపీడలను తట్టుకునే స్వభావం కలిగిన ఈ చెట్లను పెంచటం చాలా సులభం. దీని కలప, పండ్ల ద్వారా కూడా ఇంకా ఆదాయం సమకూరుతుంది. మంకీ జాక్ చెట్లు రాల్చే ఆకులు భూమిని సారవంతం చేస్తాయి. అంటే రైతులు రసాయనాలపై ఆధారపడటం తగ్గుతుంది. అంతర పంటలకు అనువైన తోటల్లో పెంచడానికి మంకీ జాక్ చెట్లు ఎంతో అనువైనవి.

భూతాపోన్నతితో వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల కలిగే అతివృష్టి, అనావృష్టిని తట్టుకునే స్వభావం, నిస్సారమైన భూముల్లోనూ పెరిగే స్వభావం ఈ చెట్లకు ఉండటం రైతులకు ఎంతో ఉపయోగపడే విషయం. ఒక్క మాటలో చెప్పాలంటే, మంకీ జాక్ చెట్ల పెంపకాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తే గ్రామీణాభివృద్ధికి, పేదరికాన్ని పారదోలటానికి, పశుగ్రాసం కొరతను తీర్చడానికి, పశువుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి, వ్యవసాయదారుల ఆదాయాన్ని పెంపొందించడానికి బహువిధాలుగా ఉపయోగపడుతుంది.

అళగర్ మునగ అదుర్స్

- పాతికేళ్ల పాటు దిగుబడినిచ్చే అరుదైన మునగ రకాన్ని రూపొందించిన రైతు శాస్త్రవేత్త
- ఎకరాకు 30 టన్నులకు పైగా మునగ కాయల దిగుబడి
- అళగర్ స్వామి రూపొందించిన మునగ వంగడం పీఏవీఎంకు విశేష ప్రాచుర్యం
- 90 లక్షలకుపైగా మునగ మొక్కలను రైతులకందించిన అళగర్ స్వామి
- సృష్టి సమ్మాన్ పురస్కారం సహా వందకు పైగా అవార్డులు





ఉద్యోగం వద్దు వ్యవసాయమే ముద్దు అని అతను నమ్మాడు. సాగులోకి దిగింది మొదలు నిరంతర కృషితో రుషిలా తపించి ఒక అద్భుత మునగ వంగడాన్ని రూపొందించారు. ఈ వంగడం ఖ్యాతి దేశం నలుమూలలకు విస్తరించింది. అధిక దిగుబడులనిస్తూ అళగర్ స్వామికే కాదు అనేక రాష్ట్రాల్లోని వేలాది మంది రైతులకూ కనక వర్షం కురిపిస్తోంది. ఈ ఆవిష్కరణతో అళగర్ స్వామి వ్యవసాయ క్షేత్రం మునగ నర్సరీగా మారిపోయింది.

ఏరోజు కారోజు విధులు ముగించుకొని బాధ్యతలు తీర్చుకునే ఉద్యోగం కాదు రైతు జీవితం. అలాగని పంటలు పండించటం, అమ్ముకోవటంతోనే దింపుకునే తల భారమూ కాదు. ఎంత చాకిరీ చేసినా వద్దనని పొలం సముద్రాన్ని ఈదటంలా అనిపిస్తుంటే.. అలసిపోని చేపలా మారి ఆ ప్రయాణాన్ని ఆస్వాదించగలిగితేనే రాణింపు, సంతృప్తి. అళగర్‌స్వామి చేసింది అదే. తమిళనాడు దిండిగల్ జిల్లాలోని పల్లపట్టి గ్రామం స్వామి జన్మస్థలం. ఆర్ట్స్‌లో పీజీ విద్యను పూర్తి చేసిన స్వామి మక్కువతో వ్యవసాయాన్ని చేపట్టారు. మొక్కుబడి వ్యవసాయం చేయకుండా నిరంతరం శాస్త్రవేత్తలతో చర్చిస్తూ ఆధునిక పద్ధతులను ఆకళింపు చేసుకుంటూ.. వ్యవసాయాన్ని కొత్త పుంతలు తొక్కించారు.

దిండిగల్ నుంచి మధురైకి వెళ్లే ప్రధాని రహదారి పక్కనే అళగర్ స్వామికి చెందిన 20 ఎకరాల వ్యవసాయ క్షేత్రం ఉంది. బీడు భూమిని సాగులోకి తెచ్చే క్రమంలో మునగ వంగడాన్ని రూపొందించేందుకు కృషిని ముమ్మురం చేసి 2002లో ఒక నూతన మునగ వంగడాన్ని ఆవిష్కరించారు. రెండు స్థానిక రకాలను సంకరం చేసి ఈ వంగడాన్ని సృష్టించారు. దీనికి 'పళ్లపట్టి అళగర్ స్వామి వెళ్లిమాలై మురుగన్'(పీఏవీఎం) అని తన పేరే పెట్టుకున్నారు. తక్కువ నీటితో సాగయ్యే ఈ వంగడం కరవు పరిస్థితులను, చీడపీడలు, తెగుళ్లను సమర్థవంతంగా తట్టుకొని మంచి దిగుబడినిస్తుంది. సాగులో ఉన్న రకాలకన్నా అధిక దిగుబడులను ఇస్తుండటంతో ఆనోటా ఈనోటా ప్రచారంలోకి వచ్చిన ఈ వంగడం ఖ్యాతి దేశమంతటా పాకింది. దక్షిణాది రాష్ట్రాలతో పాటు మునగకు పుట్టినిల్లయిన ఉత్తర భారతదేశంలోనూ రైతులు ఈ వంగడం సాగుపై మొగ్గు చూపుతున్నారు.

తమిళనాడు, కర్నాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన 20 వేల మంది రైతులు 30 వేల ఎకరాల్లో పీఏవీఎం మునగ వంగడాన్ని సాగు చేస్తున్నారు. దాదాపు 90 లక్షల పీఏవీఎం మునగ మొక్కలను అళగర్ స్వామి వివిధ రాష్ట్రాల రైతులకు అందించారు. గ్రాఫ్టింగ్ లేదా ఎయిర్ లేయర్ పద్ధతుల్లో అంట్లు కడుతున్నారు.

20 అడుగులకో మొక్క...

మునగను సేంద్రియ పద్ధతుల్లో సాగు చేసే పద్ధతులను అళగర్ స్వామి అనుసరిస్తున్నారు. పంచగవ్యను కనుగొన్న డాక్టర్ నటరాజన్‌తో ఆయనకు సన్నిహిత సంబంధం ఉంది. పంచగవ్యను క్రమం తప్పకుండా వాడతారు. భూమిని దున్ని సిద్ధం చేసుకున్న తర్వాత.. తూర్పు పడమర దిశలో మొక్కలు, సాళ్ల మధ్య 20 అడుగుల ఎడం ఉండేలా నాటుకోవాలి. దీనివల్ల మొక్కలకు గాలి, వెలుతురు ధారాళంగా లభిస్తుంది. ఎకరాకు 150 నుంచి 200 మొక్కల వరకు నాటుకోవచ్చు. మునగ మొక్కలు పెళుసుగా ఉంటాయి కాబట్టి రవాణాలోను.. నాటుకునేటప్పుడు జాగ్రత్త వహించాలి. 50 సెం. మీ. లోతు వెడల్పుతో గుంతలు తీసుకోవాలి. 20 రోజుల వయసు మొక్కలను నాటుకొని, గాలులకు పడిపోకుండా కర్రతో ఊతమివ్వాలి. ప్రతి మొక్కకు 5 కిలోల కంపోస్టు ఎరువు లేదా 10 కిలోల పశువుల ఎరువు వేసుకోవాలి. కొత్త మట్టితో గుంతను నింపితే మొక్క త్వరగా వేళ్లూనుకుంటుంది. నాటిన మరుసటి రోజు నుంచి రెండు నెలల పాటు నీరు పోయాలి. తెగుళ్లు వ్యాపించే అవకాశం ఉంది కాబట్టి తగుమాత్రంగా తడులు ఇవ్వాలి. పూత కాత దశలో మాత్రం సమృద్ధిగా నీరందించాలి. మిగతా సమయాల్లో పొలం బెట్టకొచ్చినట్టనిపిస్తే తడి ఇవ్వాలి. వర్షాధార సాగులో నెలకు రెండు తడులు ఇస్తే చాలు. అంతర కృషి చేసి చెట్ల మధ్య కలుపును ఎప్పటికప్పుడు తొలగించాలి. ఒకటిన్నర ఏడాది తర్వాత కొమ్మల కత్తిరింపు చేపట్టాలి. బలంగా ఉన్న నాలుగైదు కొమ్మలను మాత్రమే చెట్టుకు ఉంచాలి. పెద్దగా చీడపీడలు ఆశించవు. పశువుల బారి నుంచి కాపాడుకునేందుకు కంచె వేసుకోవాలి.

> **ఐదేళ్లలో చెట్టుకు 3 క్వింటాళ్ల దిగుబడి..**
>
> ఇతర వంగడాలు నాటిన 9 నెలలకు కాపు కొస్తాయి. పీఏవీఎం మునగ ఆరు, ఏడు నెలల నుంచే కాస్తుంది. సాళ్లు, మొక్కల మధ్య 20 అడులు దూరంలో ఎకరానికి 150 మొక్కలు నాటుకోవాలని అళగర్ స్వామి సూచిస్తున్నారు. నాటిన ఏడాదిన్నర నుంచి ఎకరానికి 10 – 15 టన్నుల కాయల దిగుబడి వస్తుంది. ఐదేళ్ల వయసు చెట్టు సగటున ఏడాదికి 300 కిలోల దిగుబడినిస్తుంది. ఐదేళ్ల తోట నుంచి ఏడాదికి 30 టన్నుల దిగుబడి వస్తుంది. సాధారణ రకాల్లో కాయల దిగుబడి 20 టన్నులే. పైగా అవి ఐదారేళ్లపాటే నిలకడగా దిగుబడులిస్తాయి. పీఏవీఎం మాత్రం ఏడాదికి 8 –9 నెలల చొప్పున 20–25 ఏళ్ల పాటు మంచి దిగుబడి నిస్తుంది. తమిళనాడు రైతులు స్థానిక మార్కెట్లలో కాయ రూ. 5 – 20 చొప్పున విక్రయిస్తున్నారు. ఖర్చులు పోను ఏటా ఎకరాకు రూ. లక్షకు పైగా ఆదాయం ఆర్జిస్తున్నారు. కొందరు రైతులు కంచె పంటగాను ఈ వంగడాన్ని సాగు చేస్తున్నారు.

లక్షల మొక్కల సరఫరా...

ఆళ్వార్ స్వామి ప్రస్తుతం మునగ కాయల సాగుపైన కన్నా నర్సరీపైనే దృష్టి కేంద్రీకరిస్తున్నారు. 100 మంది కూలీలతో పల్లపట్టి గ్రామంలో నర్సరీని ఏర్పాటు చేసి రైతులకు పీఏవీఎం మొక్కలను సరఫరా చేస్తున్నారు. 90 లక్షలకు పైగా మొక్కలను విక్రయించారు. ఏటా రూ. 6 లక్షలకు పైగా ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు.

అళగర్ స్వామి కృషికి మెచ్చి ఎన్నో అవార్డులు ఆయనను వెతుక్కుంటూ వచ్చాయి. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ అందించే ప్రతిష్ఠాత్మక సృష్టి సమ్మాన్ అవార్డుతోపాటు సీఐఐ అవార్డు, మహీంద్రా టెక్ అవార్డు వంటి దాదాపు వంద అవార్డులు ఆయనను వరించాయి. సిటీ బ్యాంక్ ఉత్తమ ఔత్సాహిక వ్యాపార వేత్త అవార్డుతో సత్కరించడం విశేషం. అద్భుతమైన ఆవిష్కరణతో ఖ్యాతి గడించిన అళగర్ స్వామి స్థానిక గ్రామీణ ఆవిష్కర్తల సంఘానికి అధ్యక్షుడిగా వ్యవహరిస్తూ రైతులకు స్ఫూర్తినిస్తున్నారు.

• క్లైమెట్ మర్మాలు

అడాప్టేషన్

ప్రకృతి వైపరిత్యాలు, సముద్ర నీటిమట్టం పెరుగుదల, జీవవైవిధ్యం క్షీణత, ఆహార – నీటి అభద్రత వంటి వాతావరణ మార్పుల వల్ల ప్రస్తుతం ఎదురవుతున్న, భవిష్యత్తులో ఎదురయ్యే దుష్ప్రభావాలను తట్టుకునే శక్తిని పెంపొందించే రక్షక చర్యలనే అడాప్టేషన్ అంటారు.

వాతావరణ మార్పుల నష్టాన్ని సాధ్యమైనంత వరకు స్థానిక స్థాయిలో అమలు చేయాలినవి అడాప్టేషన్ చర్యలు. అంటే, అడాప్టేషన్ చర్యలను అమలుపరచటంలో గ్రామీణ ప్రజలు, నగరాలు, పట్టణాల్లో నివసించే ప్రజలు కీలకపాత్ర పోషించాల్సి ఉంటుంది. ప్రకృతి / సేంద్రియ వ్యవసాయ పద్ధతుల వంటి పునరుజ్జీవన వ్యవసాయ పద్ధతులను అనుసరించటం.. కరువును తట్టుకునే వంగడాలను సాగు చేయటం.. నీటి నిల్వ – వినియోగ పద్ధతులను మెరుగుపరచటం.. అడవులు తగులబడకుండా అడ్డుకునే రీతిలో భూముల నిర్వహణ చర్యలు చేపట్టడం.. వరదలు, వడగాడ్పులు వంటి తీవ్ర వాతావరణ పరిస్థితులను ఎదుర్కొనేందుకు బలమైన రక్షణ వ్యవస్థలను నిర్మించటం.. ఇవన్నీ అడాప్టేషన్ చర్యలే.



అయితే, స్థానికంగా చర్యలు తీసుకుంటే అడాప్టేషన్ పూర్తి కాదు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కూడా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. వాతావరణ మార్పుల దుష్ప్రభావాన్ని తగ్గించుకునేందుకు దారితీసే విధానాల రూపకల్పనతో పాటు ప్రభుత్వాలు అనేక భారీ నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. సముద్ర నీటి మట్టాలు పెరగటం వల్ల దెబ్బతిన్న కోస్తా ప్రాంతాల్లోని మౌలిక సదుపాయాలను బలోపేతం చేయటం లేదా వేరే సురక్షిత ప్రాంతానికి తరలించటం.. మరింత తీవ్ర వాతావరణ పరిస్థితులు నెలకొన్నా తట్టుకునే విధంగా మౌలిక సదుపాయాలను పటిష్టం చేయటం.. ప్రకృతి వైపరిత్యాల గురించి ముందస్తు హెచ్చరికలు చేసే వ్యవస్థలను విస్తరింపజేసి వైపరిత్యాల సమాచారాన్ని అందుబాటులోకి తేవటం.. ప్రత్యేకించి వాతావరణ మార్పులకు సంబంధించిన నష్టాలను పూడ్చేందుకు బీమా సదుపాయాలను అభివృద్ధి చేయటం.. ప్రకృతిసిద్ధమైన పర్యావరణ వ్యవస్థలకు, వన్యప్రాణులకు సరికొత్త రక్షణ చర్యలు చేపట్టం.. ఇవన్నీ క్లైమెట్ ఛేంజ్ అడాప్టేషన్ చర్యలే!

బిజినెస్ రీల్

సుమన్ బెరీకి కొత్త బాధ్యతలు

పీఎం ఆర్థిక సలహా మండలి చైర్మన్

న్యూఢిల్లీ: నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బెరీకి ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి (ఈఏసీ-పీఎం) చైర్మన్‌గా అదనపు బాధ్యతలు కట్టబెట్టినట్టు ప్రభుత్వం ప్రకటించింది. పీఎం ఆర్థిక సలహా మండలి చైర్మన్‌గా ఉన్న వివేక్ దేబ్రాయ్ నవంబర్ 1న మరణించడంతో ఈ మార్పు చోటుచేసుకుంది. దీంతో నెల క్రితమే బెరీకి ఈఏసీ-పీఎంగా అదనపు బాధ్యతలు అప్పగించినట్టు ఓ అధికారి తాజాగా వెల్లడించారు. ఆర్థిక అంశాల్లో కేంద్ర ప్రభుత్వానికి, ముఖ్యంగా ప్రధానమంత్రికి ఈఏసీ సలహాలిస్తుంటుంది.

మైండ్‌స్పేస్ నుంచి తప్పుకుంటున్న ఏడీఐఏ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్స్ ఆర్ఈఐటీలో వెల్త్ ఫండ్ అబుదాబీ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (ఏడీఐఏ) తనకున్న 9.2 శాతం వాటాను విక్రయిస్తోంది. ఈ బ్లాక్ డీల్ విలువ రూ.1,903 కోట్లు అని సమాచారం. ఫ్లోర్ ప్రైస్ ఒక్కో యూనిట్‌కు రూ.350 నిర్ణయించినట్టు తెలుస్తోంది. సెప్టెంబర్ త్రైమాసికంలో కంపెనీ నికర నిర్వహణ ఆదాయం 5 శాతం అధికమై రూ.503 కోట్లు నమోదైంది. మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్స్ ఆర్ఈఐటీ హైదరాబాద్, ముంబై, పుణే, చెన్నైలో గ్రేడ్-ఏ కార్యాలయాలను నిర్వహిస్తోంది.

కియా ఇండియా స్క్రాపేజీ ప్రోత్సాహక పథకం

న్యూఢిల్లీ: పాతబడిన వాహనాలను తుక్కుగా చేయడాన్ని ఎంచుకునేలా కస్టమర్లను ప్రోత్సహించే దిశగా ఆటోమొబైల్ సంస్థ కియా ఇండియా తాజాగా స్క్రాపేజీ ఇన్సెంటివ్ స్కీమును ఆవిష్కరించింది. కంపెనీ లేదా మోడల్‌తో సంబంధం లేకుండా ఏ పాత కారునైనా ఎక్స్ఛేంజ్ చేసుకుని లేదా స్క్రాప్ కింద మార్చేందుకు ఇచ్చి కొత్త కియా కారును కొనుగోలు చేయొచ్చని సంస్థ పేర్కొంది. ఇందుకు గాను కియా కారు ఎక్స్-షోరూం ధరలో 1.5 శాతం లేదా రూ. 20,000 (ఏది తక్కువైతే అది) రాయితీ పొందవచ్చని వివరించింది.

కోరమాండల్, కృష్-ఈ భాగస్వామ్యం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎరువుల తయారీలో ఉన్న కోరమాండల్ ఇంటర్నేషనల్ తాజాగా మహీంద్రా గ్రూప్‌నకు చెందిన వ్యవసాయ పరికరాల విభాగం కృష్-ఈ భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. ఇందులో భాగంగా కోరమాండల్ డ్రోన్ స్ప్రేయింగ్ సేవలైన గ్రోమోర్ డ్రైవ్‌ను విస్తరిస్తారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌లో గ్రోమర్ డ్రైవ్ సేవలు అందిస్తున్నారు. ఈ కార్యకలాపాలకు ఆర్‌పీటీవో శిక్షణ పొందిన పైలట్స్ నిమగ్నమయ్యారు.

ఎంబసీ ఆర్ఈఐటీకి రూ.1,000 కోట్లు

న్యూఢిల్లీ: ఎంబసీ ఆఫీస్ పార్క్స్ ఆర్ఈఐటీ తాజాగా నాన్-కన్వర్టబుల్ డిబెంచర్స్ (ఎన్‌సీడీ) జారీ చేయడం ద్వారా రూ.1,000 కోట్లను సమీకరించింది. 7.73 శాతం వార్షిక వడ్డీ రేటుతో ఐదేళ్ల కూపన్స్ జారీ చేసినట్టు కంపెనీ తెలిపింది. ప్రస్తుత రుణాన్ని తిరిగి చెల్లించడానికి ఈ మొత్తాన్ని ఉపయోగించుకుంటామని వివరించింది. ఈ రీఫైనాన్స్ ద్వారా ఎంబసీ ఆర్ఈఐటీ ఇప్పటికే ఉన్న రేటు నుండి దాదాపు 70 బేసిస్ పాయింట్ల వడ్డీ పొదుపులను పొందగలుగుతుంది. కంపెనీ ఈ మొత్తాన్ని అత్యంత పోటీ రేటుతో అందుకుందని ఎంబసీ రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ తాత్కాలిక చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రిత్విక్ భట్టాచార్జీ వెల్లడించారు. ఎంబసీ ఆర్ఈఐటీ భారత్‌లో లిస్ట్ అయిన తొలి రియల్టీ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

18-12-2024

విశాఖ	600-00
చిత్తూరు	603-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	610-00
విజయవాడ	610-00
రిటైల్ ధర (డజను)	84.00
హైదరాబాద్	580-00
వరంగల్	582-00
రిటైల్ ధర	6.40

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,521
ఎన్ఎస్ఈ	1,08,064
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	2,00,170
ఎఫ్ఐఐ	- 6,410
డీఐఐ	+2,706

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	69.56	$ 70.71
బ్రెంట్	73.11	$ 73.91

ఆర్థిక మందగమనం తాత్కాలికమే..!



క్యూ2లో 5.4 శాతం జీడీపీ వృద్ధిపై నిర్మలా సీతారామన్ వ్యాఖ్య

రానున్న త్రైమాసికాల్లో చక్కటి పురోగమనం సాధ్యమేనని భరోసా

న్యూఢిల్లీ: భారత్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) రెండవ త్రైమాసికంలో (జూలై-సెప్టెంబర్) 5.4 శాతం పురోగతి ''తాత్కాలిక ధోరణి'' మాత్రమేనని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. రాబోయే త్రైమాసికాల్లో ఆర్థిక వ్యవస్థ చక్కటి వృద్ధిని చూస్తుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. గ్రాంట్ల కోసం తొలి సప్లిమెంటరీ డిమాండ్‌కు సంబంధించి లోక్‌సభలో జరిగిన చర్చకు ఆమె సమాధానమిస్తూ, భారతదేశం స్థిరమైన వృద్ధిని చూసిందని, గత మూడేళ్లలో దేశం జీడీపీ వృద్ధి రేటు సగటున 8.3 శాతంగా నమోదైందని తెలిపారు. ఆమె ప్రసంగంలో మరికొన్ని ముఖ్యాంశాలు...

- ఏప్రిల్‌తో ప్రారంభమైన ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2024-25) తొలి రెండు త్రైమాసికాల్లో జీడీపీ వృద్ధి రేట్లు వరుసగా 6.7 శాతం, 5.4 శాతాలుగా నమోదయ్యాయి. రెండవ త్రైమాసిక ఫలితం ఊహించినదానికన్నా తక్కువగానే ఉంది. రెండవ త్రైమాసికం భారత్‌కే కాదు, ప్రపంచంలోని ఇతర దేశాలకుసైతం ఒక సవాలుగా నిలిచింది.
- ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ కొనసాగుతోంది. సవాళ్లను ఎదుర్కొంటూనే, వారి ఆకాంక్షలను నెరవేర్చుకుంటూ ఎకానమీ పురోగతికి దోహదపడుతున్న భారత ప్రజలకు ఈ ఘనత దక్కుతుంది.
- తయారీ రంగంలో విస్తృత స్థాయి మందగమనం లేదు. మొత్తం తయారీ బాస్కెట్‌లోని సగం రంగాలు పటిష్టంగానే కొనసాగుతున్నాయి. తయారీలో పూర్తి మందగమనాన్ని ఊహించలేం. ఎందుకంటే సవాళ్లు కొన్ని విభాగాలకే పరిమితం అయ్యాయి. పారిశ్రామిక ఉత్పత్తి సూచీలోని 23 తయారీ రంగాలలో సగం ఇప్పటికీ పటిష్టంగానే ఉన్నాయి.
- జూలై-అక్టోబర్ 2024 మధ్య కేంద్ర ప్రభుత్వ మూలధన వ్యయం 6.4 శాతం పెరిగడం ఒక హర్షణీయ పరిణామం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం మూలధన కేటాయింపులు రూ.11.11 లక్షల కోట్లు పూర్తి స్థాయిలో వ్యయమవుతాయని భావిస్తున్నాం. మూలధన వ్యయాల ద్వారా వృద్ధికి ఊతం ఇవ్వడానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుంది.
- ద్రవ్యోల్బణం విషయానికి వస్తే, యూపీఏ హయాంలో కొనసాగిన 'రెండంకెల రేటు'తో పోల్చితే ఎన్‌డీఏ పాలనా కాలంలో ధరల స్పీడ్ తక్కువగా ఉంది. 2024-25 ఏప్రిల్ నుంచి అక్టోబర్ మధ్య ఈ రేటు 4.8 శాతం. కోవిడ్ మహమ్మారి దేశాన్ని కుదిపివేసిన తర్వాత ఇంత తక్కువ స్థాయి ద్రవ్యోల్బణం నమోదుకావడం గమనార్హం. ఫుడ్, ఇంధన ధరల ఒడిదుడుకులతో సంబంధంలేని కోర్ ద్రవ్యోల్బణం (తయారీ తత్సంబంధ) ఇదే కాలంలో కేవలం 3.6 శాతంగా ఉండడం గమనార్హం.
- 2017-18లో 6 శాతంగా ఉన్న నిరుద్యోగ రేటు ప్రస్తుతం 3.2 శాతానికి తగ్గింది.

రూ.44,143 కోట్ల అదనపు వ్యయాలకు ఆమోదం

ఆర్థిక మంత్రి సమాధానం తర్వాత లోక్‌సభ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 44,143 కోట్ల అదనపు నికర వ్యయానికి ఆమోదం కోరుతూ సంబంధిత గ్రాంట్ల కోసం అనుబంధ డిమాండ్‌లను ఆమోదించింది. ప్రధానంగా వ్యవసాయం, ఎరువులు, రక్షణ మంత్రిత్వ శాఖలు అధిక వ్యయం చేస్తున్న నేపథ్యంలో ఈ అనుబంధ డిమాండ్ అవసరం అయ్యింది.

చార్జింగ్ వసతులకు రూ.16,000 కోట్లు

- చార్జింగ్ సేవలకు జీఎస్టీ తగ్గింపు
- టాప్-20 నగరాలకు ప్రాధాన్యత
- ఫిక్కీ తాజా నివేదికలో సూచనలు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ వెహికిల్స్ (ఈవీ) కోసం దేశంలో పెరుగుతున్న పబ్లిక్ చార్జింగ్ డిమాండ్‌ను తీర్చడానికి.. అలాగే 2030 నాటికి 30 శాతానికి పైగా ఈవీలు ఉండాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని సాధించడానికి భారత్‌కు రూ.16,000 కోట్ల మూలధన వ్యయం అవసరమని ఫిక్కీ సోమవారం విడుదల చేసిన నివేదిక తెలిపింది. 'ప్రస్తుతం ఈవీ చార్జింగ్ స్టేషన్ల వినియోగం 2 శాతం లోపే ఉంది. దీంతో ఇవి లాభసాటిగా లేవు. ఇవి లాభాల్లోకి రావడానికి, మరింత విస్తరణ చెందేందుకు 2030 నాటికి వీటి వినియోగాన్ని 8-10 శాతానికి చేర్చే లక్ష్యంతో పనిచేయాలి. ఇంధన వినియోగంతో సంబంధం లేకుండా స్థిర ఛార్జీలతో విద్యుత్ టారిఫ్ ఉండడం, అలాగే పబ్లిక్ చార్జింగ్ స్టేషన్లలో తక్కువ వినియోగం కారణంగా బ్రేక్ ఈవెన్ సాధించడం సవాలుగా మారింది. యూపీ, ఢిల్లీ, గుజరాత్ వంటి రాష్ట్రాలు సున్నా లేదా తక్కువ స్థిర సుంకాలను కలిగి ఉన్నాయి. అయితే స్థిర సుంకాలు ఎక్కువగా ఉన్న ఇతర రాష్ట్రాల్లో మనుగడ సవాలుగా మారింది' అని నివేదిక తెలిపింది.

అనుమతి అవసరం లేని..

స్వచ్ఛ ఇంధనం, సుస్థిరత వైపు భారత పరివర్తనను ప్రారంభించడానికి విధాన రూపకర్తలు, పరిశ్రమలు, ప్రభుత్వ సంస్థలతో సహా కీలక వాటాదారులు రంగంలోకి దిగాలి. పబ్లిక్ చార్జింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను పెంచడానికి పరిమిత ఆర్థిక సాధ్యత, డిస్కమ్ లేదా విద్యుత్ సంబంధిత సమస్యలు, భూమి సమస్యలు, కార్యాచరణ సవాళ్లు, ప్రామాణీకరణ మరియు ఇంటర్-ఆపరేబిలిటీ వంటి కీలక సవాళ్లను పరిష్కరించాల్సిన అవసరం ఉంది. ఈవీ వ్యవస్థ అంతటా పన్నుకు అనుగుణంగా చార్జింగ్ సేవలకు జీఎస్టీ రేట్లను 18 నుండి 5 శాతానికి ప్రామాణీకరించాలి. అన్ని రాష్ట్రాలలో స్థిర ధరలతో రెండు-భాగాల టారిఫ్ నుండి సింగిల్-పార్ట్ టారిఫ్‌కు మార్చాలి. ఎలక్ట్రిక్ త్రీవీలర్ కొనుగోలు కోసం ఎటువంటి అనుమతి అవసరం లేని విధానాన్ని రాష్ట్రాలు ప్రోత్సహించాలి. అలాగే సీఎన్‌జీ త్రీ-వీలర్ నుండి ఎలక్ట్రిక్‌కు మారడానికి అదే అనుమతిని ఉపయోగించేలా వెసులుబాటు ఇవ్వాలి' అని నివేదిక పేర్కొంది.

టాప్-40 నగరాల్లో..

చార్జింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రోడ్ మ్యాప్ అమలును ప్రారంభించడానికి, పర్యవేక్షించడానికి పరిశ్రమల వాటాదారులు, రాష్ట్ర, కేంద్ర అధికారుల ప్రాతినిధ్యంతో రాష్ట్ర-స్థాయి సెల్‌ను ఏర్పాటు చేయాలి. పబ్లిక్ చార్జింగ్ స్టేషన్లను సకాలంలో స్థాపించేందుకు రాష్ట్ర డిస్కమ్‌ల కోసం ఈవీ ఛార్జింగ్ మౌలిక సదుపాయాల యొక్క సంస్థాపన, నిర్వహణకై విద్యుత్ మంత్రిత్వ శాఖ మార్గదర్శకాలు ఉండాలి. 2015 నుండి 2023-24 వరకు ఈవీ విక్రయాల ఆధారంగా విశ్లేషించిన 700లకుపైగా నగరాలు, పట్టణాల్లోని టాప్-40, అలాగే 20 హైవేల్లో చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రస్తుత ఈవీ స్వీకరణ రేటు, అనుకూల రాష్ట్ర విధానాలను బట్టి ఈ ప్రధాన 40 నగరాలు, పట్టణాలు రాబోయే 3-5 సంవత్సరాలలో అధిక ఎలక్ట్రిక్ వాహనాల వ్యాప్తిని కలిగి ఉంటాయని అంచనా. ఈ 20 హైవేలు 40 ప్రాధాన్యత నగరాలను కలుపుతున్నాయి. మొత్తం వాహనాల్లో ఈ నగరాల వాటా 50 శాతం' అని నివేదిక వివరించింది.

టాటా మోటార్స్‌కు భారీ ఆర్డర్



న్యూఢిల్లీ: వాహన తయారీ దిగ్గజం టాటా మోటార్స్ తాజాగా ఉత్తర్ ప్రదేశ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (యూపీఎస్ఆర్‌టీసీ) నుండి భారీ ఆర్డర్‌ను దక్కించుకుంది. ఇందులో భాగంగా యూపీఎస్ఆర్‌టీసీకి 1,297 బస్ ఛాసిస్‌లను కంపెనీ సరఫరా చేయనుంది. ఒక ఏడాదిలో యూపీఎస్ఆర్‌టీసీ నుండి ఆర్డర్ అందుకోవడం టాటా మోటార్స్‌కు ఇది మూడవది. మొత్తం ఆర్డర్ పరిమాణం 3,500 యూనిట్లకుపైమాటే. పోటీ ఈ-బిడ్డింగ్ ప్రక్రియ ద్వారా ఆర్డర్ గెలుచుకున్నట్టు టాటా మోటార్స్ తెలిపింది. పరస్పరం అంగీకరించిన నిబంధనల ప్రకారం బస్ ఛాసిస్‌లను దశలవారీగా డెలివరీ చేస్తామని వివరించింది. టాటా ఎల్‌పీవో 1618 డీజిల్ బస్ ఛాసిస్ నగరాల మధ్య, సుదూర ప్రయాణాల కోసం ప్రత్యేకంగా అభివృద్ధి చేశారు. 'ఈ ఆర్డర్ మెరుగైన మొబిలిటీ పరిష్కారాలను అందించడంలో సంస్థ నిబద్ధతకు శక్తివంతమైన ధృవీకరణ. స్థిర పనితీరు, అభివృద్ధి చెందుతున్న యూపీఎస్ఆర్‌టీసీ రవాణా అవసరాలను తీర్చగల సామర్థ్యం.. ప్రజా రవాణా పర్యావరణ వ్యవస్థలో కంపెనీ సాంకేతిక నైపుణ్యం, విశ్వసనీయతను ప్రదర్శిస్తాయి' అని టాటా మోటార్స్ వైస్ ప్రెసిడెంట్, కమర్షియల్ ప్యాసింజర్ వెహికల్స్ బిజినెస్ హెడ్ ఎస్.ఆనంద్ తెలిపారు.

ఐటీసీ హోటళ్ల విడదీత జనవరి 1న

అన్ని సంస్థల నుంచీ గ్రీన్‌సిగ్నల్



న్యూఢిల్లీ: ఆతిథ్య విభాగ విడదీత 2025 జనవరి 1నుంచి అమల్లోకి రానున్నట్లు డైవర్సిఫైడ్ దిగ్గజం ఐటీసీ లిమిటెడ్ తాజాగా పేర్కొంది. హోటళ్ల బిజినెస్‌ను విడదీసేందుకు అన్ని రకాల అనుమతులు లభించినట్లు వెల్లడించింది. ఎన్‌సీఎల్‌టీ సైతం అక్టోబర్ 4న ఓకే చెప్పడంతో కొత్త ఏడాది నుంచి ఐటీసీ హోటల్స్ విడివడనున్నట్లు తెలియజేసింది. ఐటీసీ హోటల్స్ ప్రత్యేక కంపెనీగా ఏర్పాటయ్యేందుకు ఇప్పటికే వాటాదారులు ఆమోదముద్ర వేసిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించింది. వెరసి హోటళ్లు, ఆతిథ్య రంగ బిజినెస్‌తో పూర్తి అనుబంధ కంపెనీగా ఐటీసీ హోటల్స్ అవతరించనున్నట్లు వివరించింది. ఐటీసీ హోటల్స్‌లో బే ఐల్యాండ్స్ హోటల్స్, ఫార్చూన్ పార్క్ హోటల్స్, ల్యాండ్‌బేస్ ఇండియా, శ్రీనివాస రిసార్ట్స్, వెల్‌కమ్ హోటల్స్ లంక, గుజరాత్ హోటల్స్, ఇంటర్నేషనల్ ట్రావెల్ హౌస్, మహారాజ హెరిటేజ్ రిసార్ట్స్ భాగంకానున్నాయి.

బీఎస్ఈలో ఐటీసీ షేరు యథాతథంగా రూ. 470 వద్ద ముగిసింది.

భారత్‌లో ఎంఎస్ఐ ల్యాప్‌టాప్స్

న్యూఢిల్లీ: ల్యాప్‌టాప్స్ రంగంలో ఉన్న తైవాన్ కంపెనీ ఎంఎస్ఐ తాజాగా భారత్‌లో తయారీ కార్యకలాపాలను ప్రారంభించినట్లు ప్రకటించింది. చెన్నైలో కంపెనీకి ప్లాంటు ఉంది. మేక్ ఇన్ ఇండియా లక్ష్యానికి అనుగుణంగా ఎంఎస్ఐ స్థానికంగా తయారైన రెండు ల్యాప్‌టాప్ మోడల్స్‌ను పరిచయం చేస్తోంది. వీటిలో మోడర్న్ 14, థిన్ 15 ఉన్నాయి. థిన్ 15 ధర రూ.73,990, మోడర్న్ 14 రూ.52,990 నుంచి ప్రారంభం. 'సంస్థకు అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలో భారత్ ఒకటిగా మారింది. బ్రాండ్ స్థిరంగా దేశవ్యాప్తంగా తన ఉనికిని విస్తరిస్తోంది. అధిక పనితీరు గల ల్యాప్‌టాప్‌లకు డిమాండ్ పెరుగుతూనే ఉన్నందున అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా స్థానికంగా తయారైన పరికరాలను అందించడం ద్వారా.. భారత్‌లో అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పర్యావరణ వ్యవస్థకు సహకరించడానికి కంపెనీ ఉత్సాహంగా ఉంది. భారత్‌లో ఉత్పత్తుల లభ్యతను మెరుగుపరచడానికి మరిన్ని ల్యాప్‌టాప్ బ్రాండ్ స్టోర్లు, క్రోమా, రిలయన్స్ రిటైల్ సహా టచ్‌పాయింట్స్ సంఖ్యను పెంచుతున్నాం' అని ఎంఎస్ఐ వివరించింది.



క్విక్ కామర్స్‌లోకి మ్యాజిక్‌పిన్

మ్యాజిక్‌నౌ పేరుతో ఫుడ్ డెలివరీ సర్వీసులు



న్యూఢిల్లీ: హైపర్-లోకల్ ఈ-కామర్స్ సంస్థ మ్యాజిక్‌పిన్ తాజాగా ఫుడ్ డెలివరీ సేవలకు సంబంధించి క్విక్ కామర్స్ విభాగంలోకి అడుగుపెట్టింది. మ్యాజిక్‌నౌ బ్రాండ్‌ను ఆవిష్కరించింది. చాయోస్, ఫాసోస్, మెక్‌డొనాల్ట్స్, బర్గర్ కింగ్ వంటి 2,000 పైచిలుకు ఫుడ్ బ్రాండ్లు, 1,000కి పైగా మర్చంట్లతో కలిసి పని చేయనున్నట్లు సంస్థ తెలిపింది. 1.5 కి.మీ. నుంచి 2 కి.మీ. పరిధిలో వేగంగా ఫుడ్ డెలివరీ సేవలు అందిస్తామని పేర్కొంది. ముందుగా హైదరాబాద్, బెంగళూరు, ముంబై, చెన్నై, ఢిల్లీ-ఎన్‌సీఆర్, పుణెల్లో ఈ సర్వీసులను ప్రారంభిస్తామని వివరించింది. ఫుడ్ డెలివరీకి ఇతరత్రా క్విక్ కామర్స్ సంస్థల తరహాలో డార్క్ స్టోర్స్ విధానాన్ని పాటించబోమని కంపెనీ పేర్కొంది. నవంబర్ 14 – డిసెంబర్ 15 మధ్య ఢిల్లీ-ఎన్‌సీఆర్, బెంగళూరులో నాలుగు వారాలపాటు పైలట్ ప్రాజెక్టు నిర్వహించినట్లు, 75,000 పైగా ఫుడ్ డెలివరీలు నమోదు చేసినట్లు తెలిపింది. ఫుడ్ డెలివరీ సేవల కోసం తమ లాజిస్టిక్స్ అగ్రిగేటర్ విభాగం వెలాసిటీని ఉపయోగించుకుంటామని మ్యాజిక్‌పిన్ తెలిపింది. ప్రస్తుతం కేఎఫ్‌సీ, బర్గర్ కింగ్, ఐజీపీ గిఫ్టింగ్ వంటి బ్రాండ్లకు వెలాసిటీ సర్వీసులను అందిస్తోంది.

అంబుజా సిమెంట్స్‌లో పెన్నా సిమెంట్స్, సంఘీ ఇండస్ట్రీస్ విలీనం



న్యూఢిల్లీ: అనుబంధ సంస్థలు సంఘీ ఇండస్ట్రీస్ (ఎస్ఐఎల్), పెన్నా సిమెంట్ ఇండస్ట్రీస్‌ను విలీనం చేసుకోనున్నట్లు అంబుజా సిమెంట్స్ వెల్లడించింది. వచ్చే 9-12 నెలల వ్యవధిలో ఈ లావాదేవీ పూర్తి కాగలదని అంచనా వేస్తున్నట్లు పేర్కొంది. సంస్థ స్వరూపాన్ని క్రమబద్ధీకరించుకునేందుకు, గవర్నెన్స్‌ను మెరుగుపర్చుకునేందుకు ఈ కన్సాలిడేషన్ ఉపయోగపడగలదని ఒక ప్రకటనలో వివరించింది. అదానీ గ్రూప్‌లో అంబుజా సిమెంట్స్ భాగంగా ఉంది. 2023లో కొనుగోలు చేసిన సంఘీ ఇండస్ట్రీస్‌లో కంపెనీకి 58.08 శాతం వాటాలు ఉన్నాయి. అలాగే 2024 ఆగస్టులో ఆంధ్రప్రదేశ్ సంస్థ పెన్నా సిమెంట్‌ను కొనుగోలు చేసింది. విలీన స్కీము ప్రకారం ప్రతి 100 ఎస్ఐఎల్ షేర్లకు గాను అంబుజా సిమెంట్స్ 12 షేర్లను జారీ చేస్తుంది. అలాగే, పెన్నా సిమెంట్స్ ఈక్విటీ షేర్‌హోల్డర్లకు ఒక్కో షేరుపై రూ. 321.50 లభిస్తుంది. ఎస్ఐఎల్, పెన్నా సిమెంట్స్ షేర్ల ముఖ విలువ రూ. 10గా ఉండగా, అంబుజా సిమెంట్స్ షేరు ముఖవిలువ రూ. 2గా ఉంది.

ఒకే ఏడాదిలో 20 లక్షల కార్ల ఉత్పత్తి

2024లో తొలిసారిగా సాధించిన మారుతీ సుజుకీ



న్యూఢిల్లీ: దేశీ ఆటోమొబైల్ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ) 2024లో 20 లక్షల కార్ల ఉత్పత్తి మైలురాయిని అధిగమించింది. ఒక క్యాలెండర్ సంవత్సరంలో ఈ ఘనత సాధించడం తమకు ఇదే ప్రథమం అని కంపెనీ తెలిపింది. సుజుకీ మోటర్ కార్పొరేషన్‌కి అంతర్జాతీయంగా ఉన్న తయారీ ప్లాంట్లకి సంబంధించి కూడా ఈ మైలురాయిని దాటిన తొలి సంస్థ తమదేనని వివరించింది. ఇరవయ్యో లక్ష కారుగా ఎర్టిగాను మానేసర్ ప్లాంటు నుంచి విడుదల చేసినట్లు పేర్కొంది. మొత్తం 20 లక్షల కార్లలో దాదాపు 60 శాతం వాహనాలను హర్యానాలో, మిగతా 40 శాతం వాహనాలను గుజరాత్ ప్లాంటులో ఉత్పత్తి చేసినట్లు ఎంఎస్ఐ వివరించింది. 2024లో అత్యధికంగా ఉత్పత్తి చేసిన టాప్5 కార్లలో బాలెనో, ఫ్రాంక్స్, ఎర్టిగా, వ్యాగన్ఆర్, బ్రెజా ఉన్నట్లు పేర్కొంది. కంపెనీకి హర్యానాలో రెండు (గుర్గావ్, మానేసర్), గుజరాత్‌లో ఒకటి (హన్సల్‌పూర్) చొప్పున మొత్తం మూడు ప్లాంట్లు ఉన్నాయి. వీటి వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 23.5 లక్షల యూనిట్లుగా ఉంటుంది. దేశీయంగా ఆటోమొబైల్స్‌కి భారీగా డిమాండ్ పెరుగుతుందనే అంచనాల నేపథ్యంలో వార్షికోత్పత్తి సామర్థ్యాన్ని 40 లక్షల యూనిట్లకు పెంచుకునే ప్రణాళికల్లో ఉంది.

రెచీ ప్రెసిషన్‌తో డైకిన్ జేవీ

రూ.1,000 కోట్ల పెట్టుబడి



న్యూఢిల్లీ: ఎయిర్ కండీషనింగ్, రిఫ్రిజిరేషన్ సిస్టమ్స్ తయారీలో ఉన్న జపాన్ కంపెనీ డైకిన్ ఇండస్ట్రీస్ తాజాగా తైవాన్‌కు చెందిన రెచీ ప్రెసిషన్‌తో జాయింట్ వెంచర్ ఏర్పాటు చేస్తోంది. ఈ జేవీ ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీ సిటీలో కంప్రెసర్లను తయారు చేయనుంది. భారత్, కొన్ని విదేశీ మార్కెట్లలో ఇన్వర్టర్, నాన్-ఇన్వర్టర్ ఏసీల కోసం రోటరీ కంప్రెసర్ల తయారీ, డిజైన్, అమ్మకం కోసం జేవీని ఏర్పాటు చేస్తున్నట్లు డైకిన్ ప్రకటించింది. పెట్టుబడి వివరాలను ప్రకటించనప్పటికీ, జేవీలో మెజారిటీ భాగస్వామిగా ఉంటామని కంపెనీ వెల్లడించింది. రాబోయే 5-6 సంవత్సరాలలో జేవీలో దాదాపు రూ.1,000 కోట్లు పెట్టుబడి పెట్టే అవకాశం ఉంది. జాయింట్ వెంచర్ 2025 జనవరి-మార్చిలో కార్యరూపం దాల్చనుందని భావిస్తున్నారు. శ్రీ సిటీలో మూడవ ఫెసిలిటీని ఏర్పాటు చేస్తున్న డైకిన్.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత్‌లో 20 లక్షల యూనిట్లను తయారు చేయాలని భావిస్తోంది.

పీ2పీ రుణాల్లో 17 శాతానికి ఎన్‌పీఏలు

ఆర్‌బీఐ చర్యలతో స్థిరత్వానికి అవకాశం



ముంబై: పీర్ టు పీర్ లెండింగ్ విభాగంలో నిరర్థక ఆస్తులు (వసూలు కాని రుణాలు/ఎన్‌పీఏలు) రెట్టింపై 2024 మార్చి నాటికి రూ.1,163 కోట్లకు చేరాయి. ఈ ప్లాట్‌ఫామ్‌లపై జారీ అయిన రుణాల్లో ఎన్‌పీఏలు 2023 మార్చి నాటికి రూ.472 కోట్లుగా ఉన్నట్టు క్యాపిటల్‌మైండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అనే సంస్థ వెల్లడించింది. ఓ సమాచార హక్కు దరఖాస్తుకు ఆర్‌బీఐ ఇచ్చిన సమాచారం ఆధారంగా ఈ వివరాలను విడుదల చేసింది. మొత్తం మీద ఈ విభాగంలో ఎన్‌పీఏలు 17 శాతంగా ఉండొచ్చని అంచనా వేసింది. లోన్ పూలింగ్, రుణ గ్రహీతల సమగ్ర వివరాలు, క్రెడిట్ స్కోర్ తదితర సమగ్రమైన సమాచారంతో పారదర్శకత పెంచుకోవాలంటూ పీ2పీ సంస్థలకు ఆర్‌బీఐ తీసుకొచ్చిన నిబంధనలను క్యాపిటల్‌మైండ్ ప్రస్తావించింది. దీంతో రుణాలిచ్చే వారు తగిన నిర్ణయాలు తీసుకునేందుకు, ఎన్‌పీఏలను నివారించేందుకు వీలుంటుందన్నది ఆర్‌బీఐ నిబంధనల ఉద్దేశ్యమని తెలిపింది. అలాగే, రుణాల విషయంలో పరిమితులను సైతం గుర్తు చేసింది. ఈ చర్యలు ఈ రంగంలో స్థిరత్వానికి దారితీస్తాయని.. అదే సమయంలో అసాధారణ వృద్ధిని అడ్డుకుంటాయని అభిప్రాయపడింది. వ్యక్తిగత రుణదాతలు, రుణ గ్రహీతలను కలిపే వేదికలే పీ2పీ వేదికలు. ఈ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా వ్యక్తులు, సంస్థలకు సైతం అధిక రేటుపై రుణాలు ఇవ్వడం ద్వారా మెరుగైన ఆదాయానికి అవకాశం ఉంటుంది.

జనవరి చివరికి ఆర్‌క్యాప్ కొనుగోలు పూర్తి

- హిందుజా గ్రూప్ ఆశాభావం
- ఐదేళ్లలో 50 బిలియన్ డాలర్లకు వ్యాపారం



న్యూఢిల్లీ: రిలయన్స్ క్యాపిటల్ కొనుగోలు జనవరి చివరికి పూర్తి అవుతుందని హిందుజా గ్రూప్ కంపెనీ ఐఐహెచ్ఎల్ ఆశాభావం వ్యక్తం చేసింది. ఆర్‌క్యాప్ కొనుగోలుతో బ్యాంకింగ్, ఫైనాన్షియల్‌సర్వీసెస్ (బీఎఫ్ఎస్ఐ) వ్యాపారాన్ని వచ్చే ఐదేళ్లలో 50 బిలియన్ డాలర్లకు చేర్చాలనే లక్ష్యంతో ఉన్నట్టు తెలిపింది. ప్రస్తుత విలువ 15 బిలియన్ డాలర్లుగా ఉంది. ''రిలయన్స్ క్యాపిటల్‌కు సంబంధించి చాలా వరకు అనుమతులు, పరిష్కార ప్రక్రియలు ముగింపునకు వచ్చాయి. మరికొన్ని ప్రక్రియలు అడ్మినిస్ట్రేటర్, సీవోసీ స్థాయిలో పూర్తి కావాల్సి ఉంది. వచ్చే 4-6 వారాల్లో ఇవి పూర్తవుతాయని భావిస్తున్నాం'' అని ఐఐహెచ్ఎల్ చైర్మన్ అశోక్ పి. హిందుజా ప్రకటించారు. రూ.9,650 కోట్లకు ఆర్‌క్యాప్ కొనుగోలు బిడ్డింగ్‌లో ఐఐహెచ్ఎల్ విజేతగా నిలవడం తెలిసిందే. ఇందులో రూ.2,750 కోట్లను ఈక్విటీ రూపంలో సమకూర్చనుండగా, మిగిలిన మొత్తాన్ని రుణాలకు చెల్లించాల్సి ఉంది. దీనికి కట్టుబడి ఉన్నట్టు హిందుజా తెలిపారు. ఇండస్ ఇండ్ బ్రాండ్ ప్రచారం చేయాలని అనుకుంటున్నామని, బ్రాండ్ ప్రచారంపై ఏజెన్సీలు పనిచేస్తున్నట్టు ప్రకటించారు. ఐఐహెచ్ఎల్ మరో సబ్సిడరీ అయిన ఇండస్ఇండ్ బ్యాంక్‌తో బ్యాంక్ అష్యూరెన్స్ ఒప్పందం కోసం ఆర్‌క్యాప్ చర్చించనున్నట్టు తెలిపారు.



టాప్-3లో స్మృతి మంధాన

ఐసీసీ మహిళల వన్డే, టి20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) మహిళల ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ స్మృతి మంధాన రెండు ఫార్మాట్‌లలో (వన్డే, టి20) తన ర్యాంక్‌ను మెరుగుపర్చుకుంది. మంగళవారం విడుదలైన తాజా ర్యాంకింగ్స్‌లో స్మృతి వన్డే ఫార్మాట్‌లో మూడు స్థానాలు ఎగబాకి రెండో ర్యాంక్‌ను అందుకుంది. స్మృతి ఖాతాలో 734 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. దక్షిణాఫ్రికా బ్యాటర్ లౌరా వొల్వార్ట్ 773 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో కొనసాగుతోంది. భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ రెండు స్థానాలు పడిపోయి 13వ ర్యాంక్‌లో నిలిచింది. జెమీమా రోడ్రిగ్స్ 27వ స్థానంలో కొనసాగుతుండగా... దీప్తి శర్మ ఐదు స్థానాలు పడిపోయి 32వ ర్యాంక్‌లో ఉంది. మరోవైపు టి20 ఫార్మాట్‌లో స్మృతి ఒక స్థానం మెరుగుపర్చుకొని మూడో ర్యాంక్‌కు చేరుకుంది. స్మృతి ఖాతాలో 741 రేటింగ్ పాయింట్లు ఉన్నాయి. ఆస్ట్రేలియాకు చెందిన బెత్ మూనీ 757 పాయింట్లతో అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ ఒక స్థానం పురోగతి సాధించి 11వ ర్యాంక్‌లో నిలిచింది. షఫాలీ వర్మ 13వ ర్యాంక్‌లోనే ఉండగా... జెమీమా రోడ్రిగ్స్ ఆరు స్థానాలు ఎగబాకి 15వ ర్యాంక్‌ను అందుకుంది.

ప్రేక్షకులకు ప్రవేశం ఉచితం

హాకీ ఇండియా లీగ్ నిర్వాహకుల నిర్ణయం

న్యూఢిల్లీ: ఈ నెల 28 నుంచి ప్రారంభం కానున్న హాకీ ఇండియా లీగ్ (హెచ్ఐఎల్) మ్యాచ్‌లను తిలకించేందుకు ప్రేక్షకులను ఉచితంగా అనుమతించాలని లీగ్ నిర్వాహకులు నిర్ణయించారు. ఆటను అభిమానులకు చేరువ చేసేందుకు ఇది సరైన మార్గం అని హెచ్ఐఎల్ గవర్నింగ్ కమిటీ చైర్మన్ దిలీప్ టిర్కీ పేర్కొన్నాడు. డిసెంబర్ 28 నుంచి రూర్కెలాలోని బిర్సా ముండా స్టేడియంలో పురుషుల హెచ్ఐఎల్ ప్రారంభం కానుంది. మొత్తం 8 జట్లు పాల్గొననున్న ఈ లీగ్ వచ్చే ఏడాది ఫిబ్రవరి 1న జరగనున్న ఫైనల్‌తో ముగియనుంది. మరోవైపు రాంచీ వేదికగా వచ్చే ఏడాది జనవరి 12 నుంచి 26 మధ్య నిర్వహించనున్న మహిళల హెచ్ఐఎల్ లీగ్‌లో 4 జట్లు పాల్గొంటున్నాయి. 'టికెట్ల విక్రయంతో డబ్బు సంపాదించడంకన్నా... ఆటను అభిమానులకు చేరువ చేయడం ముఖ్యం. ప్రత్యక్షంగా మ్యాచ్‌లు చూసే అనుభూతి ప్రతి ఒక్కరూ పొందాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నాం' అని హాకీ ఇండియా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. 'మైదానాల్లోకి ఉచిత ప్రవేశం కల్పించడంతో ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా... ప్రతి ఒక్కరూ ఉన్నత స్థాయి పోరాటాలను నేరుగా వీక్షించే అవకాశం ఉంది' అని హెచ్ఐఎల్ గవర్నింగ్ కమిటీ చైర్మన్ దిలీప్ టిర్కీ అన్నాడు.



ప్రిక్వార్టర్స్‌లో రష్మిక

నవీ ముంబై: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల డబ్ల్యూ50 టోర్నమెంట్‌లో తెలంగాణ క్రీడాకారిణి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన సింగిల్స్ తొలి రౌండ్‌లో రష్మిక 6-4, 6-2తో థాయ్‌లాండ్‌కు చెందిన బున్‌యావి థామ్‌చైవాట్‌పై గెలుపొంది ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. 83 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రష్మిక నాలుగు ఏస్‌లు సంధించి, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తన సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో రియా భాటియా (భారత్) 6-3, 6-4తో భారత్‌కే చెందిన తనీషా కశ్యప్‌పై, టాప్ సీడ్ అంకితా రైనా (భారత్) 1-6, 6-4, 6-4తో వాలెంటిని (గ్రీస్)పై నెగ్గగా... ఆకాంక్ష నిట్టూరె (భారత్) 6-7 (8/10), 4-6తో సహో సాటో (జపాన్) చేతిలో ఓడిపోయింది. డబుల్స్ విభాగంలో తెలంగాణకే చెందిన సహజ యామలపల్లి క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. తొలి రౌండ్‌లో సహజ (భారత్)-హిరోకొ కువాటా (జపాన్) ద్వయం 6-3, 4-6, 10-7తో 'సూపర్ టైబ్రేక్'లో వైష్ణవి-పూజా (భారత్) జంటపై గెలిచింది.





సాక్షి

423 పరుగుల తేడాతో...

చివరి టెస్టులో ఇంగ్లండ్‌పై న్యూజిలాండ్ ఘనవిజయం ● సిరీస్‌ను 2-1తో సొంతం చేసుకున్న స్టోక్స్ బృందం

హామిల్టన్: తొలి రెండు మ్యాచ్‌ల్లో పేలవ ప్రదర్శనతో ఇంగ్లండ్ చేతిలో టెస్టు సిరీస్ కోల్పోయిన న్యూజిలాండ్ జట్టు నామమాత్రమైన ఆఖరి మ్యాచ్‌లో మాత్రం భారీ విజయం సాధించింది. సొంతగడ్డపై మంగళవారం ముగిసిన మూడో టెస్టులో న్యూజిలాండ్ జట్టు 423 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌ను చిత్తు చేసింది. టెస్టు క్రికెట్‌లో పరుగుల తేడా పరంగా న్యూజిలాండ్‌కు ఇదే అతిపెద్ద విజయం. 2018 శ్రీలంకపై కూడా న్యూజిలాండ్ సరిగ్గా 423 పరుగుల తేడాతోనే గెలిచింది. 658 పరుగుల లక్ష్యఛేదనలో... ఓవర్‌నైట్ స్కోరు 18/2తో నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్ చివరకు 47.2 ఓవర్లలో 234 పరుగులకు ఆలౌటైంది. జాకబ్ బెథెల్ (96 బంతుల్లో 76; 13 ఫోర్లు, 1 సిక్స్), జో రూట్ (64 బంతుల్లో 54; 10 ఫోర్లు) అర్ధశతకాలతో ఆకట్టుకోగా... అట్కిన్సన్ (41 బంతుల్లో 43; 7 ఫోర్లు, 1 సిక్స్) చివర్లో ధాటిగా ఆడాడు. హ్యారీ బ్రూక్ (1), ఒలీ పోప్ (17) విఫలం కాగా... కెప్టెన్ బెన్ స్టోక్స్ కండరాలు పట్టేయడంతో బ్యాటింగ్‌కు దిగలేదు. కొండంత లక్ష్యఛేదనలో ఇంగ్లండ్ జట్టు ఏ స్థితిలోనూ మెరుగ్గా కనిపించలేదు. న్యూజిలాండ్ బౌలర్లలో సాంట్నర్ 4 వికెట్లు పడగొట్టగా... కెరీర్‌లో చివరి టెస్టు ఆడేసిన టిమ్ సౌతీ, మ్యాట్ హెన్రీ రెండేసి వికెట్లు పడగొట్టారు. అంతకుముందు న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 347 పరుగులు చేయగా... ఇంగ్లండ్ 143 పరుగులకు పరిమితమైంది. రెండో ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్ 453 పరుగులు చేయడంతో ఇంగ్లండ్ ముందు భారీ లక్ష్యం నిలిచింది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన సాంట్నర్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', ఇంగ్లండ్ బ్యాటర్ హ్యారీ బ్రూక్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు దక్కాయి.



విన్నర్స్ ట్రోఫీతో స్టోక్స్

సౌతీ వీడ్కోలు

న్యూజిలాండ్ సీనియర్ పేసర్ టిమ్ సౌతీ ఈ మ్యాచ్‌తో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఇంగ్లండ్‌తో మూడో టెస్టుతో కెరీర్ ముగించనున్నట్లు ముందే ప్రకటించిన సౌతీని మ్యాచ్ అనంతరం సహచరులు ప్రత్యేకంగా అభినందించారు. 2008లో ఇంగ్లండ్‌పైనే అరంగేట్రం చేసిన సౌతీ... 16 ఏళ్ల తర్వాత అదే ఇంగ్లండ్ జట్టుపై చివరి టెస్టు ఆడటం విశేషం. జాతీయ జట్టు తరఫున మొత్తం 107 టెస్టులు ఆడిన సౌతీ 391 వికెట్లు పడగొట్టాడు. సుదీర్ఘ కాలంగా కివీస్ ప్రధాన పేసర్‌గా కొనసాగిన సౌతీ ఒకే ఇన్నింగ్స్‌లో 15 సార్లు ఐదేసి వికెట్లు పడగొట్టాడు. బ్యాటింగ్‌లోనూ కీలక ఇన్నింగ్స్‌లు ఆడిన సౌతీ 2245 పరుగులు సాధించాడు.

డీడీసీఏ అధ్యక్షుడిగా రోహన్ జైట్లీ ఎన్నిక



న్యూఢిల్లీ: ఢిల్లీ అండ్ డిస్ట్రిక్ట్ క్రికెట్ సంఘం (డీడీసీఏ)అధ్యక్షుడిగా రోహన్ జైట్లీ మూడోసారి ఎన్నికయ్యాడు. తాజా ఎన్నికల్లో భారత మాజీ క్రికెటర్ కీర్తి ఆజాద్‌పై రోహన్ జైట్లీ విజయం సాధించాడు. సుప్రీంకోర్టు న్యాయవాది అయిన రోహన్ డీడీసీఏ అధ్యక్షుడిగా ఎన్నికవడం ఇది వరుసగా మూడోసారి కావడం విశేషం. డీడీసీఏలో మొత్తం 3,748 ఓట్లకు గానూ... 2,413 మంది ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. విజయానికి 1207 ఓట్లు అవసరం కాగా... 35 ఏళ్ల రోహన్ జైట్లీ 1,577 ఓట్లతో ఘన విజయం సాధించాడు. 1983లో వన్డే ప్రపంచకప్ గెలిచిన భారత జట్టులో సభ్యుడైన కీర్తి ఆజాద్‌కు 777 ఓట్లు వచ్చాయి. రోహన్ జైట్లీ తండ్రి దివంగత అరుణ్ జైట్లీ గతంలో 14 ఏళ్ల పాటు డీడీసీఏ అధ్యక్షుడిగా కొనసాగారు. 2020లో రజత్ శర్మ అధ్యక్ష పదవికి రాజీనామా చేయడంతో తొలిసారి డీడీసీఏ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన రోహన్ జైట్లీ... ఏడాది తర్వాత జరిగిన ఎన్నికల్లో వికాస్ సింగ్‌పై విజయం సాధించి రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. బీసీసీఐ మాజీ తాత్కాలిక అధ్యక్షుడు సీకే ఖన్నా సహకారంతో రోహన్ సులువుగా ఈ ఎన్నికల్లో విజయం సాధించాడు. సీకే ఖన్నా కూతురు శిఖా తాజా ఎన్నికల్లో ఉపాధ్యక్షురాలిగా ఘనవిజయం సాధించింది. కార్యదర్శిగా అశోక్ శర్మ, కోశాధికారిగా హరీశ్ సింగ్లా జాయింట్ సెక్రటరీగా అమిత్ గ్రోవర్ ఎన్నికయ్యారు. కొత్తగా ఎన్నికైన కార్యవర్గం మూడేళ్ల పాటు కొనసాగనుంది.

అర్జున్ సూపర్ రెయిడింగ్

- 17 పాయింట్లతో అదరగొట్టిన జైపూర్ పింక్ పాంథర్స్ ప్లేయర్
- మాజీ చాంపియన్ జట్టు ఖాతాలో 11వ విజయం

పుణే: ప్రొ కబడ్డీ లీగ్‌లో భాగంగా మంగళవారం జరిగిన మ్యాచ్‌లో మాజీ చాంపియన్ జైపూర్ పింక్ పాంథర్స్ 35-26 పాయింట్ల తేడాతో బెంగళూరు బుల్స్‌పై గెలుపొందింది. పింక్ పాంథర్స్ తరఫున స్టార్ రెయిడర్ అర్జున్ దేశ్వాల్ 17 పాయింట్లతో విజృంభించాడు. మ్యాచ్ ఆరంభం నుంచి తన సూపర్ రెయిడింగ్‌తో ఆకట్టుకున్న అర్జున్ ప్రత్యర్థి డిఫెన్స్‌కు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా చెలరేగాడు. బెంగళూరు బుల్స్ స్టార్ రెయిడర్ ప్రదీప్ నర్వాల్ 5 పాయింట్లకే పరిమితమయ్యాడు. ఓవరాల్‌గా ఈ మ్యాచ్‌లో పింక్ పాంథర్స్ 20 రెయిడ్ పాయింట్లు సాధించగా... బుల్స్ 12 రెయిడ్ పాయింట్లకే పరిమితమైంది. తాజా సీజన్‌లో 20 మ్యాచ్‌లాడిన పింక్ పాంథర్స్ 11 విజయాలు, 7 పరాజయాలు, 2 'టై'లతో 64 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టికలో ఐదో స్థానానికి చేరింది. మరోవైపు 20 మ్యాచ్‌లాడిన బుల్స్ 2 విజయాలు, 17 పరాజయాలు, ఒక 'టై'తో పట్టిక అట్టడుగున కొనసాగుతోంది. మరోవైపు యూపీ యోధాస్ జట్టు ప్లే ఆఫ్స్‌కు చేరువైంది. తాజా సీజన్‌లో ఇప్పటికే హరియాణా స్టీలర్స్, దబంగ్ ఢిల్లీ జట్లు ప్లే ఆఫ్స్‌కు చేరుకోగా... యూపీ యోధాస్ పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి ఎగబాకింది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో యూపీ యోధాస్ 31-24 పాయింట్ల తేడాతో హరియాణా స్టీలర్స్‌పై విజయం సాధించింది. యూపీ యోధాస్ తరఫున భవానీ రాజ్‌పుత్ 11 పాయింట్లు సాధించగా... స్టీలర్స్ తరఫున వినయ్, విశాల్ చెరో 6 పాయింట్లు సాధించారు. లీగ్‌లో ఇప్పటి వరకు 20 మ్యాచ్‌లాడిన యోధాస్ 11 విజయాలు 6 పరాజయాలు, 3 'టై'లతో 69 పాయింట్లు ఖాతాలో వేసుకొని ప్లే ఆఫ్స్‌కు అడుగు దూరంలో నిలిచింది. ఇప్పటికే బెర్త్ ఖరారు చేసుకున్న స్టీలర్స్ వరుసగా రెండో మ్యాచ్‌లో పరాజయం పాలైంది. లీగ్‌లో భాగంగా నేడు తమిళ్ తలైవాస్‌తో బెంగాల్ వారియర్స్ (రాత్రి 8 గంటలకు), పట్నా పైరేట్స్‌తో తెలుగు టైటాన్స్ (రాత్రి 9 గంటలకు) తలపడనున్నాయి.



అర్జున్



తెలంగాణ జట్లకు మిశ్రమ ఫలితాలు

సాక్షి, హైదరాబాద్: జాతీయ సబ్ జూనియర్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో ఆతిథ్య తెలంగాణ జట్లకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. తెలంగాణ బాలికల జట్టు 49-34 పాయింట్లతో ఉత్తరాఖండ్ జట్టుపై గెలుపొందగా... తెలంగాణ బాలుర జట్టు 58-63 పాయింట్లతో ఛత్తీస్‌గఢ్ చేతిలో ఓడిపోయింది. తెలంగాణ బాలుర జట్టుకిది వరుసగా రెండో పరాజయం. ఫలితంగా ఆతిథ్య జట్టు తదుపరి దశకు అర్హత పొందే అవకాశాలకు దెబ్బ పడింది. తెలంగాణ జట్టు తరఫున అభిరామ్ 20 పాయింట్లు స్కోరు చేశాడు. అంతకుముందు హిమాచల్‌ప్రదేశ్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో తెలంగాణ బాలుర జట్టు 48-52తో ఓడిపోయింది. మరోవైపు బాలికల విభాగంలో జరిగిన ఇతర మ్యాచ్‌ల్లో ఛత్తీస్‌గఢ్ 63-18తో పంజాబ్‌పై, కేరళ 45-29తో ఉత్తరప్రదేశ్‌పై, చండీగఢ్ 82-16తో జమ్మూ కశ్మీర్‌పై, పశ్చిమ బెంగాల్ 39-38తో గుజరాత్‌పై, చండీగఢ్ 84-30తో హిమాచల్‌ప్రదేశ్‌పై గెలుపొందాయి.

పృథ్వీ షాపై వేటు

విజయ్ హజారే టోర్నీకి ముంబై జట్టులో దక్కని చోటు



న్యూఢిల్లీ: దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీ కోసం ప్రకటించిన ముంబై జట్టులో ఓపెనర్ పృథ్వీ షాకు చోటు దక్కలేదు. గత కొంతకాలంగా స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోతున్న పృథ్వీ షా... రంజీ ట్రోఫీ మధ్యలోనే జట్టు నుంచి ఉద్వాసనకు గురయ్యాడు. అనంతరం సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీకి ఎంపికైనా... తనదైన ముద్ర వేయడంలో విఫలమయ్యాడు. దీంతో సెలెక్టర్లు అతడిని పక్కన పెట్టగా... దీనిపై సామాజిక మాధ్యమాల వేదికగా పృథ్వీ తన ఆవేదన వెల్లగక్కాడు. 'దేవుడా.. నేను ఇంకేం చూడాలి. 65 ఇన్నింగ్స్‌ల్లో 55.7 సగటుతో 3399 పరుగులు చేశాను. స్ట్రయిక్ రేట్ కూడా 126 (విజయ్ హజారే టోర్నీ) పైనే ఉంది. ఇవి సరిపోవా. అయినా నేను నమ్మకాన్ని కోల్పోను. నేను కచ్చితంగా తిరిగి వస్తానని ప్రజలకు నాపై విశ్వాసం ఉంది' అని పృథ్వీ ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ పెట్టాడు. ఈ నెల 21 నుంచి ప్రారంభం కానున్న విజయ్ హజారే టోర్నీలో ముంబై జట్టుకు శ్రేయస్ అయ్యర్ సారథ్యం వహించనుండగా... 17 మందితో కూడిన జట్టులో భారత ఆటగాళ్లు సూర్యకుమార్ యాదవ్, శార్దుల్ ఠాకూర్, శివమ్ దూబే ఉన్నారు. ఇటీవల ముస్తాక్ అలీ టోర్నీలో అద్భుతమైన ప్రదర్శనతో 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచిన సీనియర్ బ్యాటర్ రహానే వ్యక్తిగత కారణాలతో తొలి మూడు మ్యాచ్‌లకు దూరంగా ఉన్నాడు. **ముంబై జట్టు:** శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), ఆయుష్ మాత్రే, అంగ్‌క్రిష్ రఘువంశీ, జయ్ బిస్తా, సూర్యకుమార్ యాదవ్, శివమ్ దూబే, సూర్యాంశ్ షెగ్డే, సిద్ధేశ్ లాడ్, హార్దిక్ తమోరె, ప్రసాద్ పవార్, అథర్వ అంకొలేకర్, తనుశ్ కొటియాన్, శార్దుల్ ఠాకూర్, రాయ్‌స్టన్ దియాస్, జునేద్ ఖాన్, హర్ష్ తన్నా, వినాయక్ భోర్.

ఒడిశా సంచలనం



సాక్షి, హైదరాబాద్: సంతోష్ ట్రోఫీ జాతీయ సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో ఒడిశా జట్టు సంచలనం సృష్టించింది. గ్రూప్ 'బి'లో భాగంగా మంగళవారం డెక్కన్ ఎరీనాలో జరిగిన మ్యాచ్‌లో ఒడిశా 2-0 గోల్స్ తేడాతో ఐదుసార్లు చాంపియన్ గోవా జట్టును ఓడించింది. ఒడిశా తరఫున రాహుల్ (60వ నిమిషంలో), కార్తీక్ (64వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. ఇతర లీగ్ మ్యాచ్‌ల్లో ఢిల్లీ 2-0తో తమిళనాడుపై, కేరళ 1-0తో మేఘాలయపై గెలిచాయి.

హిమతరువులు...



తీవ్ర హిమపాతం కారణంగా జర్మనీలోని పారిశ్రామిక నగరం ఒబెర్రీఫెన్‌బర్గ్‌లోని ఓ చర్చి ప్రాంగణంలోని చెట్లు ఇలా మంచుతో శ్వేతవర్ణం సంతరించుకున్నాయి.

భవనద్వీపం...



పెరుగుతున్న సముద్ర మట్టాలతో పనామాలోని కొన్ని దీవులు ఖాళీ అవుతున్నాయి. అందులో గర్డి సుగ్‌డబ్ దీవి కూడా ఉంది. సముద్రం కబళిస్తుండటంతో ఈ దీవిలోని భవనాలు కనిపిస్తున్నాయిలా..

మంచుపాతం...



కశ్మీర్‌లో భారీగా మంచుకురుస్తోంది. ఉష్ణోగ్రతలు మైనస్ 5.3 డిగ్రీలకు పడిపోయాయి. మంగళవారం బారాముల్లా జిల్లా ద్రుంగ్‌లోని జలపాతం ఇలా గడ్డకట్టుకుపోయింది.

ఈ ఉద్యోగాలు చేస్తుంటే...
మతిమరుపు రాదు!

అల్జీమర్స్. వయసుతో పాటు వచ్చే మతిమరుపు. ఇది కొందరిలో మరణానికీ దారి తీస్తుంది. అయితే కొన్ని రకాల వృత్తుల్లోని వారికి అల్జీమర్స్ వచ్చే అవకాశమే లేదంటున్నాయి అధ్యయనాలు! ముఖ్యంగా డ్రైవింగ్‌లో ఉండేవాళ్లు ఆల్జీమర్స్‌తో మరణించే ప్రమాదం తక్కువట. అయితే బైక్ నడిపేవాళ్లు ఈ జాబితాలోకి రారు. అలాగే పైలట్లకు కూడా ఇది వర్తించదు. టాక్సీ, అంబులెన్స్ వంటివాటిని నడిపేవాళ్లకే అల్జీమర్స్ వచ్చే అవకాశం తక్కువట.

అల్జీమర్స్ మెదడు వ్యాధి. జ్ఞాపకశక్తిని, ఆలోచనలను, రోజువారీ పని చేసే శక్తిని క్రమంగా తగ్గించేస్తుంది. ఇది వృద్ధులపై ఎక్కువగా ప్రభావం చూపతుంది. మెదడు కణాలు దెబ్బతినడం, సరిగా పని చేయకపోవడం అల్జీమర్స్‌కు దారితీస్తుంది. దాంతో గందరగోళంగా మాట్లాడటం, అత్యంత సన్నిహితులను కూడా గుర్తించలేకపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి. అమెరికాలోని మాస్ జనరల్ బ్రిగమ్ పరిశోధకులు దీనిపై అధ్యయనం చేశారు. 2020 నుంచి 2022 మధ్య మరణించిన 90 లక్షల మంది వైద్య చరిత్రను పరిశీలించారు. వీరిలో 443 రకాల వృత్తులకు సంబంధించిన వారున్నారు. వారిలో 3.88 శాతం మరణాలు, అంటే మూడున్నర లక్షల మంది అల్జీమర్స్‌తో చనిపోయారు. వారిలో ట్యాక్సీ, అంబులెన్స్ డ్రైవర్లు చాలా తక్కువ మంది ఉండటాన్ని పరిశోధకులు గమనించారు.

ఆ డ్రైవర్లకు ఎందుకు రాదంటే...

పరిశోధన ఫలితాలను లోతుగా అధ్యయనం చేసిన మీదట ఆసక్తికరమైన అంశాలు వెల్లడైనట్టు సైంటిస్టులు తెలిపారు. అవేమిటంటే...

- అల్జీమర్స్ ప్రారంభంలో మెదడులోని హిప్పోకాంపస్ ప్రాంతాన్ని ప్రభావితం చేస్తుంది.
- టాక్సీ, అంబులెన్స్ డ్రైవర్లలో రియల్ టైమ్ స్పేషియల్ థికింగ్, నావిగేషన్ ఈ హిప్పోకాంపస్‌కు చక్కని వ్యాయామంలా పని చేస్తున్నాయట.
- ఈ నిరంతర వ్యాయామం వల్ల వారిలో అది చురుగ్గా, చైతన్యవంతంగా పని చేస్తోంది.
- అదే బస్సు డ్రైవర్లు, విమానాల పైలట్లలో అంత నావిగేషన్ స్కిల్స్ ఉండటం లేదని అధ్యయన బృందం సారథి డాక్టర్ విశాల్ పటేల్ తెలిపారు.
- నావిగేషన్స్ స్కిల్స్ పెంచే మానసిక వ్యాయామాలు మెదడును ప్రభావితం చేసి చురుగ్గా ఉంచుతాయని ఆయన వివరించారు.
- కనుక వాటిపై దృష్టి పెడితే చాలని అధ్యయనకారులు చెబుతున్నారు.
- మానసికంగా చురుగ్గా ఉంటే అల్జీమర్స్ వంటి జ్ఞాపకశక్తి సంబంధిత వ్యాధులకు దూరంగా ఉండొచ్చని తేల్చారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఖైదీ కాదు, గూఢచారి!
సిరియాలో సీఎన్ఎన్ విడిపించింది ఓ నేర చరితున్ని



దమాస్కస్: అంతర్జాతీయ మీడియా సంస్థ సీఎన్ఎన్ తీవ్ర భంగపాటుకు గురైంది. అమాయకుడని చెబుతూ సిరియా జైలు నుంచి ఇటీవల ఆ సంస్థ చొరవ తీసుకుని మరీ విడుదల చేసిన ఓ ఖైదీ నిజమైన ఖైదీ కాదని తేలింది. తాజా మాజీ అధ్యక్షుడు అసద్ పాలనలో నిఘా విభాగంలో పని చేసిన అధికారి అని నిజ నిర్ధారణలో వెల్లడైంది. అతని పేరు సలామా మహమ్మద్ సలామా అని, చిత్రహింసలకు, దోపిడీలకే గాక యుద్ధ నేరాలకు కూడా పాల్పడ్డాడని స్థానిక నిజ నిర్ధారణ సంస్థ వెరిఫై–సై తెలిపింది. దాంతో సీఎన్ఎన్ తన తప్పును కప్పిపుచ్చుకునే పనిలో పడింది. ఎందుకంటే సీఎన్ఎన్ చీఫ్ ఇంటర్నేషనల్ కరస్పాండెంట్ క్లారిస్సా వార్డ్, అమె బృందం తిరుగుబాటు బృందంతో పాటు ఇటీవల సిరియా ఇంటలిజెన్స్ కార్యాలయంలోకి వెళ్లింది. అక్కడి ఓ జైలు గదిని తిరుగుబాటుదారులు తెరిచారు. అందులో ఒక వ్యక్తి వణుకుతూ కన్పించాడు. తన పేరు అదెల్ గుర్బల్ అని, మూడు నెలలుగా బందీగా దుర్భర పరిస్థితుల్లో నరకం అనుభవిస్తున్నానని చెప్పుకున్నాడు. అతన్ని వార్డ్ బృందం చొరవ తీసుకుని బయటకు తీసుకొచ్చింది. ఈ దృశ్యాలను సీఎన్ఎన్ ప్రముఖంగా ప్రసారం చేసుకుంది. ఇది తన జీవితంలోనే అత్యంత దారుణమైన ఘటన అని వార్డ్ చెప్పుకొచ్చారు. అసద్ క్రూరమైన పాలన తాలూకు బాధితుల్లో అతనొకడని సీఎన్ఎన్ అభివర్ణించింది. అతనికి ఆహారం అందించి అత్యవసర సేవల విభాగంలో చేర్చినట్టు కథనం ప్రసారం చేసింది. దాంతో పలువురు నెటిజన్లు సీఎన్ఎన్‌ను అభినందించారు. కానీ ఈ వ్యవహారంపై వెరిఫై–సై అనుమానాలు వ్యక్తం చేసింది. 90 రోజులు ఏకాంతంలో, వెలుతురు కూడా లేని గదిలో తీవ్ర నిర్బంధంలో ఉన్న వ్యక్తి అంత ఆరోగ్యంగా ఎలా కన్పిస్తారని ప్రశ్నించింది. అసలు తను స్థానికుడేనని చెప్పడానికి ఎలాంటి ఆధారాలూ లేవని చెప్పింది. అనంతరం కూపీ లాగి, అతను సలామా అని, అసద్ వైమానిక దళం నిఘా విభాగంలో ఫస్ట్ లెఫ్టినెంట్‌గా చేశాడని వెల్లడించింది. వసూళ్ల తాలూకు అక్రమ సంపాదనను పంచుకునే విషయంలో పై అధికారితో పేచీ రావడంతో నెల రోజులుగా జైల్లో ఉన్నట్టు వివరించింది. అతను సైనిక దుస్తుల్లో ఉన్న ఫొటోలను కూడా బయట పెట్టింది. దాంతో సీఎన్ఎన్ కంగుతిన్నది. ఆ వ్యక్తి తమకు తప్పుడు వివరాలు చెప్పి ఉంటాడని అప్పుడే అనుకున్నామంటూ మాట మార్చింది. అతని నేపథ్యం గురించి తామూ లోతుగా విచారణ చేస్తున్నట్టు చెప్పుకొచ్చింది. సీఎన్ఎన్ వివాదాస్పద రిపోర్టింగ్ శైలితో అభాసుపాలు కావడం ఇది తొలిసారేమీ కాదు. గతేడాది ఇజ్రాయెల్, గాజా సరిహద్దు వద్ద రిపోర్టింగ్‌కు సంబంధించి కూడా క్లారిస్సా వార్డ్ ఆరోపణలు ఎదుర్కొన్నారు.

మహిళా జడ్జీల తొలగింపుపై సుప్రీంకోర్టు తీర్పు రిజర్వు

న్యూఢిల్లీ: ఆరుగురు మహిళా సివిల్ జడ్జీలను విధుల నుంచి తొలగిస్తూ మధ్యప్రదేశ్ హైకోర్టు తీసుకున్న నిర్ణయంపై మంగళవారం వాదనలు ముగించిన సుప్రీంకోర్టు తీర్పును రిజర్వు చేసింది. జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఎన్‌ఏ సింగ్‌ల ధర్మాసనం మధ్యప్రదేశ్ హైకోర్టు చేసిన సుదీర్ఘ వాదనలు వింది. ఆరుగురు మహిళా జడ్జీల్లో ప్రొబేషన్‌లో ఉన్నందున తొలగించవచ్చని, ఈ నిర్ణయంలో పక్షపాతానికి తావులేదని న్యాయవాది అర్జున్ గర్గ్ వాదించారు. దీనిపై జస్టిస్ నాగరత్న స్పందిస్తూ.. 'ప్రవర్తన, సేవకు సంబంధించిన అంశాలకు సంబంధించిన నిర్ణయమైతే వేరుగా ఉండేది. కానీ ఫిర్యాదుల ఆధారంగా తీసుకున్న చర్య కాబట్టి, తొలగింపు సులభం కాదు' అని పేర్కొన్నారు. అంతకు ముందు జరిగిన విచారణ సందర్భంగా సివిల్ జడ్జీల తొలగింపును తప్పుపట్టిన న్యాయస్థానం..కొందరు జడ్జీలను తిరిగి విధుల్లోకి తీసుకునేందుకు నిరాకరించడం తెలిసిందే.

కెనడా ప్రధాని ట్రూడోకు షాక్

ఒట్టావా: కెనడా ప్రధానమంత్రి జస్టిన్ ట్రూడోకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆర్థిక మంత్రి క్రిస్టియా ఫ్రీల్యాండ్ పదవికి రాజీనామా చేశారు. అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన ట్రంప్ కెనడా వస్తువులపై 25 శాతం పన్ను వసూలు చేస్తామంటూ బెదిరించడం వల్లనే వైదొలుగుతున్నట్లు రాజీనామా లేఖలో ఆమె పేర్కొన్నారు. ఆర్థిక శాఖ బాధ్యతలను వదిలి అందుకు బదులుగా వేరే శాఖ తీసుకోవాలంటూ గత వారం ట్రూడో సూచించడంతో తనంతట తానే వైదొలగడమే మేలనే నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. అయితే, ఆర్థిక పరమైన నిర్ణయాల్లో ఇద్దరి మధ్య ఇటీవలి కాలంలో విభేదాలు పెరిగినట్లు చెబుతున్నారు. ఇప్పటికే తగ్గిపోయిన ప్రజాదరణ, సొంత పార్టీ నుంచే ఎదురవుతున్న అసమ్మతితో సతమతమవుతున్న ట్రూడోకు ఇది మింగుడు పడని పరిణామం. క్రిస్టియా రాజీనామాపై ఆయన స్పందించలేదు.

ఇనుప గనిలో మహిళల షిఫ్ట్

జంషెడ్‌పూర్: జార్ఖండ్ రాష్ట్రం సింగ్‌భూమ్ జిల్లాలోని నవోముండి ఇనుప గనిలో దేశంలోనే మొట్టమొదటి సారిగా పూర్తిగా మహిళలే బాధ్యతలు నిర్వహించే షిఫ్ట్‌ను టాటా స్టీల్ కంపెనీ ప్రారంభించింది. సోమవారం ఈ షిఫ్టును మైన్స్ సేఫ్టీ డిప్యూటీ డీజీ(రాంచీ) శ్యామ్ సుందర్ ప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. భారీ ఎర్త్ మూవింగ్ యంత్రాలు, షావెల్, లోడర్, డ్రిల్, డోజర్ ఆపరేటర్లు, షిఫ్ట్ సూపర్ విజన్ సహా అన్ని రకాల మైనింగ్ కార్యకలాపాలను ఈ షిఫ్టులోని మహిళా సిబ్బందే నిర్వహించారని టాటా స్టీల్ తెలిపింది. మన పురుషాధిక్య పరిశ్రమల్లో మహిళలకు సాధికారిత కల్పించేందుకు తాము కట్టుబడి ఉంటామనేందుకు ఇదే తిరుగులేని ఉదాహరణ అని పేర్కొంది.

తాలిబన్లపై ఉగ్ర ముద్ర చెరిపేయనున్న రష్యా

మాస్కో: అఫ్గానిస్తాన్‌లో అధికారంలో ఉన్న తాలిబన్లపై ఉగ్రవాద ముద్రను చెరిపేసేందుకు రష్యా ప్రయత్నాలు ప్రారంభించింది. ఇందుకు ఉద్దేశించిన బిల్లుకు రష్యా పార్లమెంట్‌లోని దిగువ సభ డ్యూమా ఆమోదం తెలిపింది. అనంతరం ఎగువసభ ఆమోదం పొంది, అధ్యక్షుడు పుతిన్ సంతకం చేస్తే చట్ట రూపం దాలుస్తుంది. రష్యా ప్రభుత్వం తాలిబన్ గ్రూపును 2003లో ఉగ్రసంస్థగా ప్రకటించింది. ఇటువంటి సంస్థతో సంబంధాలు పెట్టుకున్న వారు శిక్షార్హులవుతారు. అయితే, రష్యా ఆధ్వర్యంలో జరిగిన పలు అంతర్జాతీయ భేటీల్లో తాలిబన్ ప్రతినిధులు పాల్గొనటం గమనార్హం. అఫ్గానిస్తాన్ సుస్థిరత కోసమే వారితో చర్చలు జరుపుతున్నట్లు అప్పట్లో రష్యా యంత్రాంగం దీనిని సమర్థించుకుంది. అఫ్గానిస్తాన్‌లో మూడేళ్లుగా ఎదురులేకుండా అధికారంలో ఉన్న తాలిబన్లకు గుర్తింపు విషయంలో అంతర్జాతీయ సమాజంలో భిన్నాభిప్రాయాలున్నాయి.

గాజాలో ఒకే కుటుంబంలోని 8 మంది మృతి

జెరుసలేం: గాజాపై ఇజ్రాయెల్ మరోసారి దాడికి పాల్పడింది. గాజా నగర శివారు ప్రాంతం దారాజ్‌పై సోమవారం రాత్రి జరిగిన దాడిలో ఒకే కుటుంబంలోని 8 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో తండ్రి, అతడి నలుగురు పిల్లలు, వారి అమ్మమ్మ ఉన్నారని పాలస్తీనా వైద్య సిబ్బంది మంగళవారం తెలిపారు. ఈ ఘటనపై ఇజ్రాయెల్ స్పందించలేదు. మరో పరిణామం..యెమెన్ రాజధాని సనాలోని హౌతీల మిలటరీ స్థావరంపై బాంబులు వేసినట్లు మంగళవారం అమెరికా ప్రకటించింది. తమ రక్షణ శాఖ భవన సముదాయంపై జరిగిన దాడిలో కొంత భాగం దెబ్బతిందని ఇరాన్ మద్దతున్న హౌతీలు ప్రకటించారు. ఎర్ర సముద్రం, గల్ఫ్ ఆఫ్ ఎడెన్‌లో ప్రయాణించే అమెరికా నేవీ, వాణిజ్య నౌకలపై హౌతీల దాడుల క్షిపణి దాడులు ఇక్కడి నుంచే జరిగాయని అమెరికా తెలిపింది. అంతకుముందు, ఇజ్రాయెల్‌పైకి హైపర్‌సోనిక్ బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించినట్లు హౌతీలు ప్రకటించుకున్నారు. దీంతో, టెల్అవీవ్‌లో ముందస్తు సైరన్లు మోగాయి. క్షిపణిని సరిహద్దుల్లోనే కూల్చి వేసినట్లు ఇజ్రాయెల్ తెలిపింది.

సిరియా నేతతో బ్రిటన్, జర్మనీ చర్చలు

లండన్/బెర్లిన్: సిరియా రాజధాని డమాస్కస్‌లో సోమవారం తమ దౌత్యప్రతినిధులు హయత్ తహ్రీర్ అల్–షామ్(హెచ్‌టీఎస్) గ్రూపు నేత అహ్మద్ అల్–షరాతో సమావేశమైనట్లు బ్రిటన్, జర్మనీ, ఈయూ ప్రకటించాయి. అమెరికా, బ్రిటన్ తదితర దేశాలు హెచ్‌టీఎస్‌ను ఉగ్ర సంస్థగా ప్రకటించాయి. సిరియా పాలకుడు అసద్‌ను గద్దె దించడంలో హెచ్‌టీఎస్ కీలకంగా ఉండటం తెలిసిందే. ఈ పరిణామం నేపథ్యంలో హెచ్‌టీఎస్‌పై ఉగ్ర ముద్రను ఉపసంహరించుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు బ్రిటన్ తెలిపింది. అయితే, ఇందుకు కొంత సమయం పడుతుందని పేర్కొంది. తమ దేశంపై ఆంక్షలను ఎత్తివేయాలని, ఇజ్రాయెల్ దాడులను ఆపాలని అల్ షరా పశ్చిమ దేశాలను డిమాండ్ చేస్తున్నారు. తమకు ఎవరితోనూ యుద్ధం చేయాలని ఆసక్తి లేదంటున్నారు. అల్–షరాతో ఇప్పటికే అమెరికా చర్చలు జరపడం తెలిసిందే.

'ఆర్థిక' రిజర్వేషన్లపై ఆలోచించాలి: దేవెగౌడ

న్యూఢిల్లీ: దేశంలో కుల ప్రాతిపదికన రిజర్వేషన్లు కొనసాగించాలా లేక ఆర్థిక ప్రాతిపదికన రిజర్వేషన్లను ఇవ్వాలా అనే విషయం ఆలోచించాలని మాజీ ప్రధానమంత్రి, జేడీఎస్ నేత దేవె గౌడ మంగళవారం రాజ్యసభలో పేర్కొన్నారు. రాజ్యాంగంపై చర్చలో పాల్గొన్న ఆయన..గత అనుభవాలను మననం చేసుకుంటూ కేవలం పేదరికం ప్రాతిపదికన రిజర్వేషన్లను ఇవ్వొచ్చా అనేది నిర్ణయించాలన్నారు. దశాబ్దాలపాటు కులం ఆధారంగా రిజర్వేషన్లను అమలు చేస్తున్నా దేశంలో ఇప్పటికీ అర్ధాకలితో అలమటిస్తున్న వారెందరో ఉన్నారన్నారు. అందుకే, కడు పేదరికంతో బాధపడుతున్న వారికి మాత్రమే రిజర్వేషన్లలో ప్రాధాన్యం ఇస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. ఈ విషయం ఆలోచించాలని సభ్యులకు, నేతలకు, ప్రధాని మోదీకి ఆయన సూచించారు.

న్యాయశాస్త్రం చదివేందుకు 24 ఏళ్ల న్యాయ పోరాటం!
66 ఏళ్ల వయసులో సాధించిన వైనం

న్యాయశాస్త్రం చదవాలన్నది ఆయన కల. దాన్ని నిజం చేసుకోవడానికి ఏకంగా 24 ఏళ్ల పోరాటం చేశారు. చివరికి 66 ఏళ్ల వయసులో అనుకున్నది సాధించారు. గుజరాత్‌కు చెందిన శశికుమార్ మెహతా స్ఫూర్తి గాథ ఇది. ఆయన 2000లో గుజరాత్ వర్సిటీకి చెందిన డీటీ లా కాలేజీలో మూడేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సులో చేరేందుకు ప్రయత్నించారు. అప్పటికాయనకు 42 ఏళ్లు. విద్యార్హతలు సరిపోవంటూ అడ్మిషన్ ఇచ్చేందుకు కాలేజీ నిరాకరించింది. ఎల్ఎల్‌బీలో చేరాలంటే ప్లస్ టూ, మూడేళ్ల డిగ్రీ చేయాలని, మొత్తంగా 15 ఏళ్లు చదివి ఉండాలని చెప్పింది. కానీ మెహతా కోల్‌కతాలో పుట్టి పెరిగారు.

అప్పట్లో పశ్చిమ బెంగాల్‌లో ప్లస్ టూకు బదులు ప్లస్ వన్, ఆ తర్వాత నేరుగా గ్రాడ్యుయేషన్ పద్ధతే ఉండేది. ఆ ప్రకారం చదవి బీకాం పట్టా అందుకున్నారు. ఆ విద్యార్హత చెల్లదంటూ గుజరాత్ కాలేజీ తన దరఖాస్తును తిరస్కరించడంతో 2001లో ఆయన కోర్టును ఆశ్రయించారు. మన దేశంలో కేసులంటే ఎన్నేళ్లు పడుతుందో తెలుసుకదా! అలా ఈ కేసూ వాయిదా పడుతూ వచ్చింది. అయినా మాత్రం పట్టువదలని విక్రమార్కుడిలా మెహతా ప్రయత్నిస్తూనే వచ్చారు. ఎల్ఎల్‌బీ తన డిగ్రీ సరిపోతుందన్న ఆయన వాదనతో కోర్టు ఏకీభవించింది. 15 ఏళ్ల కఠిన నిబంధనను తప్పుబట్టింది. ఆయనకు అడ్మిషన్ ఇవ్వాల్సిందిగా కాలేజీని ఆదేశించింది. అలా మెహతా కల ఎట్టకేలకు ఫలించింది. అన్నట్టూ, ఆయన స్టాక్ మార్కెట్ ప్రొఫెషనల్‌గా పని చేస్తున్నారు!

- సాక్షి, నేషనల్ డెస్క్



రాతి కొండను జయించింది!

- ఎల్ కేపిటన్‌ను అధిరోహించిన ఆస్ట్రియావాసి
- ఈ ఘనత సాధించిన తొలి మహిళగా రికార్డు

దాని ఎత్తు 3 వేల అడుగులే. అంటే దాదాపు ఓ కిలోమీటరు. కానీ దాన్ని ఎక్కాలంటే కొమ్ములు తిరిగిన ప్రొఫెషనల్ పర్వతారోహకులకు సైతం ముచ్చెమటలు పడతాయి. ఎందుకంటే అది నిట్టనిలువుగా ఉండే ఏకశిల! అమెరికాలో కాలిఫోర్నియాలోని యోసెమైట్ నేషనల్ పార్క్‌లో ఉంది. పేరు ఎల్ కాపిటన్. ఆ నిలువు రాతి కొండను ఎక్కాలంటే ప్రొఫెషనల్స్‌కు కూడా ఎన్నో ఏళ్ల అకుంఠిత పరిశ్రమ, సాధన తప్పనిసరి. అలాంటి కొండను ఎలాంటి తడబాటూ లేకుండా ఏకబిగిన ఎక్కేసింది ఆస్ట్రియాకు చెందిన బాబ్సీ జాంగెర్ల్ అనే 36 ఏళ్ల మహిళ. అది కూడా తొలి ప్రయత్నంలోనే! అంతేకాదు, ఈ ఘనత సాధించిన తొలి మహిళగా కూడా నిలిచిందామె!!

క్లిష్టమైన మార్గంలో...

ఎల్ కాపిటన్‌ను ఎక్కడానికి గోల్డెన్ గేట్, ఫ్రీ రైడర్, ప్రొఫెట్, డాన్‌వాల్ అని నాలుగు మార్గాలున్నాయి. ఫ్రీ రైడర్ మార్గంలో ఎక్కే ప్రయత్నంలో అనుభవజ్ఞులు కూడా పదేపదే కాలు జారుతుంటారు. కానీ వృత్తిరీత్యా రేడియోగ్రఫీ డాక్టర్ అయిన జాంగెర్ల్ మాత్రం తొలి ప్రయత్నమే ఆ మార్గంలోనే ప్రయత్నించి అసలు తడబాటే లేకుండా ఎక్కేశారు. ఇందుకామెకు నాలుగు రోజులు పట్టింది. రాత్రులు కొండ తాలూకు గోడలపై ఉండే స్థలాల్లో నిద్రించారు. పర్వతారోహణలో భాగస్వామి అయిన బాయ్ ఫ్రెండ్ జాకోపో లార్చర్ కూడా ఆమెతో పాటు ఎక్కడానికి ప్రయత్నించారు. కానీ మధ్యలోనే పడిపోయారు. ''మేమిద్దరం కలిసి ఈ ఫీట్ సాధించాలనుకున్నాం. లా ర్చర్ విఫలమవడం బాధగా ఉంది. కానీ ఓడినా నాకు స్ఫూర్తినిచ్చాడు''అంటూ అత డిని పొగడ్తలతో ముంచెత్తింది జాంగెర్ల్. ఆ మె కంటే ముందు ఫ్రీ రైడర్ మార్గంలో ఎల్ కేపిటన్ పైకి ఎక్కేందుకు ఎందరో పర్వతారోహకులు ప్రయత్నించి విఫలమయ్యారు. ఈ జాబితాలో ప్రముఖ బ్రిటిష్ పర్వతారోహకుడు పీట్ విటేకర్ కూడా ఉన్నారు. అలెక్స్ హోనాల్డ్ మాత్రం ఎలాంటి తాళ్లు లేకుండా ఫ్రీ రైడర్ మార్గంలో ఎల్ కాపిటన్‌ను అధిరోహించాడు. ఆ డాక్యుమెంటరీ 'ఫ్రీ సోలో'ఆస్కార్ అవార్డు కూడా గెలుచుకుంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

సెంగోల్‌పై ఎన్డీయే, కాంగ్రెస్ వాగ్యుద్ధం

న్యూఢిల్లీ: బ్రిటిష్ పాలకుల నుంచి అధికార మార్పిడికి గుర్తుగా పార్లమెంట్‌లో ప్రతిష్ఠించిన సెంగోల్‌పై మంగళవారం రాజ్యసభలో అధికార ఎన్డీయే, ప్రతిపక్ష కాంగ్రెస్ మధ్య వాగ్యుద్ధం జరిగింది. సెంగోల్ గురించి చెబుతున్నదంతా అబద్ధమని కాంగ్రెస్ కొట్టిపారేయగా, ప్రభుత్వం దీటుగా బదులిచ్చింది. రాజ్యసభలో రాజ్యాంగంపై చర్చ సందర్భంగా కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్..స్వాతంత్ర్యం సిద్ధించిన సమయంలో అందిన సెంగోల్‌ను న్యాయానికి చిహ్నంగా భావించాల్సింది పోయి జవహర్‌లాల్ నెహ్రూ చేతికర్రగా వాడుకుంటున్నారంటూ ప్రస్తావించడంపై కాంగ్రెస్ సభ్యులు అభ్యంతరం తెలిపారు.

అదంతా అబద్ధమని, చరిత్రలో అటువంటిది లేనే లేదని కాంగ్రెస్‌కు చెందిన జై రాం రమేశ్ అన్నారు. సెంగోల్‌ను ఎవరూ అధికారికంగా ఇవ్వలేదన్నారు. అయితే, చోళుల కాలంలో అధికార మార్పిడి సమయంలో సెంగోల్‌ను అందజేసే సంప్రదాయం ఉండేదని సి. రాజగోపాలాచారి చెప్పడాన్ని జేపీ నడ్డా ప్రస్తావించారు. '1947 ఆగస్టు 14వ తేదీన మద్రాస్ నుంచి సెంగోల్‌ను విమానంలో ఢిల్లీకి తెచ్చారు. నెహ్రూ నివాసంలో ఉంచేటప్పుడు ఓ ఉత్సవం కూడా జరిగింది. అనంతరం ఆనంద్‌భవన్‌కు, మ్యూజియంకు దానిని మార్చారు. అప్పుడే నెహ్రూ చేతికర్రగా దానిని వాడారంటూ చరిత్ర చెబుతోంది'అని నడ్డా తెలిపారు. దీనిపై ప్రతిపక్ష ఎంపీలంతా ఒక్కపెట్టున నిరసనకు దిగారు.

వృక్ష ప్రేమి తులసిగౌడ కన్నుమూత
30 వేలకు పైగా మొక్కల సంరక్షణ ● సేవలకు గుర్తుగా పద్మశ్రీ అవార్డు

యశవంతపుర: కర్ణాటకలో తన జీవితాన్ని మొక్కలు, చెట్ల పోషణకు అంకితం చేసిన తులసిగౌడ (90) కన్నుమూశారు. ఉత్తర కన్నడ జిల్లా అంకోలా తాలూకా హొన్నళ్లికి చెందిన తులసిగౌడ మంగళవారం వృద్ధాప్య సమస్యలతో మృతి చెందారు. మొక్కలు నాటితే చాలదు, వాటిని అలాగే సంరక్షించాలని సూచించేవారు. 17 ఏళ్ల పాటు ఆమె అటవీశాఖలో దినసరి కూలీగా పని చేశారు. ఆమె సేవలను గుర్తించిన అప్పటి అటవీశాఖ అధికారి యల్లప్పరెడ్డి ఆమెను పర్మినెంట్ ఉద్యోగిని చేశారు. ఆమె ఉద్యోగంలో ఉన్నా, రిటైరైనా మొక్కలపైనే మనసంతా ఉండేది. అనేక గ్రామాలలో రోడ్డు పక్కన వేలాదిగా మొక్కలు నాటి సంరక్షించారు. ఫలితంగా పచ్చదనం పెంపొందించారు. సుమారు 30 వేల మొక్కలను నాటి ఉంటారని ఒక అంచనా. ఎంత ఎదిగినా అత్యంత నిరాడంబరంగా ఉండడం ఆమెకే చెల్లింది. తులసిగౌడ సేవలకు గుర్తుగా 2020 జూలైలో అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నుంచి పద్మశ్రీ అవార్డును అందుకున్నారు. ఇటీవల ఆమె సొంతూరిలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం ఆనకట్ట కట్టాలని అధికారులు సర్వే చేశారు. ఇందుకోసం అటవీ ప్రాంతంలో చెట్లను నరకటంతో ఆమె ఆగ్రహించి ఆనకట్ట వద్దంటూ సర్వే అధికారులను వెనక్కి పంపారు.

ప్రధాని మోదీ సంతాపం

పర్యావరణవాది, పద్మశ్రీ తులసిగౌడ మరణం తీవ్ర విషాదకరమని ప్రధాని మోదీ ఎక్స్‌లో సంతాపం తెలిపారు. మొక్కల సంరక్షణకే తులసిగౌడ జీవితాన్ని ధారపోశారని, భూమిని రక్షించడానికి యువతకు స్ఫూర్తినిచ్చారని కొనియాడారు.



మొక్కలకు నీరు పోస్తున్న తులసిగౌడ (ఫైల్)

ద్విసభా పద్ధతి అమల్లో ఉన్న రాష్ట్రాలేవి?

రాష్ట్ర శాసనసభ

(విధాన సభ - విధాన పరిషత్)

మనదేశంలో కేంద్ర స్థాయిలో ద్విసభా విధానాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్ర స్థాయిలో ద్విసభా విధానాన్ని ఐచ్ఛిక అంశంగా నిర్ణయించారు. దేశంలో తొలిసారిగా రాష్ట్ర స్థాయిలో ద్విసభా పద్ధతిని 1935లో ప్రవేశపెట్టారు.

రాజ్యాంగంలోని ఆరో భాగంలో 168 నుంచి 212 వరకు ఉన్న ప్రకరణల్లో రాష్ట్ర శాసన సభ నిర్మాణం, అర్హతలు, ఎన్నిక పద్ధతి, అధికార విధులు తదితర అంశాల గురించి పేర్కొన్నారు.

రాష్ట్ర శాసన సభ నిర్మాణం: 168వ ప్రకరణ రాష్ట్ర శాసనసభ నిర్మాణం గురించి తెలుపుతుంది. శాసనసభలో రాష్ట్ర గవర్నర్, ఎగువ సభ, దిగువ సభలుంటాయి. రాష్ట్ర గవర్నర్ శాసన సభలో సభ్యుడు కానప్పటికీ, శాసన సభలో అంతర్భాగమే.

రాష్ట్ర ఎగువసభ (విధాన పరిషత్)

విధాన పరిషత్ ఏర్పాటు, రద్దు ప్రక్రియ గురించి ప్రకరణ 169(1) తెలుపుతుంది. దీని ప్రకారం రాష్ట్ర దిగువ సభ (విధాన సభ) 2/3వ వంతు మెజారిటీతో ఒక ప్రత్యేక తీర్మానం చేయాలి. ఆ తీర్మానాన్ని పార్లమెంటు ధ్రువీకరిస్తే రాష్ట్రపతి ఎగువ సభను ఏర్పాటు చేయవచ్చు లేదా రద్దు చేయవచ్చు.

ద్విసభా పద్ధతి అమల్లో ఉన్న రాష్ట్రాలు

- ఉత్తరప్రదేశ్
- మహారాష్ట్ర
- బిహార్
- ఆంధ్రప్రదేశ్
- తెలంగాణ
- కర్ణాటక

వివరణ:

- ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా 1957లో విధాన పరిషత్ ఏర్పాటైంది. 1985లో దీన్ని రద్దు చేశారు. తిరిగి 2005లో వై.ఎస్. రాజశేఖరరెడ్డి ప్రభుత్వం శాసనమండలిని పునరుద్ధరించింది. 2007 నుంచి అమల్లోకి వచ్చింది.
- 1956లో ఏడో రాజ్యాంగ సవరణ ద్వారా మధ్యప్రదేశ్‌లో ఎగువ సభను ఏర్పాటు చేస్తూ చట్టం చేశారు. కానీ, అది ఇంతవరకు అమల్లోకి రాలేదు. 1986లో తమిళనాడు, 1969లో పంజాబ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలు ఎగువ సభను రద్దు చేశాయి.
- మరోసారి ఎగువ సభ ఏర్పాటుకు తమిళనాడు ప్రభుత్వం 2010లో తీర్మానం చేసింది. ఆ సమయంలో డీఎంకే అధికారంలో ఉంది. విధాన పరిషత్ ఏర్పాటు వాస్తవరూపం దాల్చే లోపు 2011లో అన్నాడీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. జయలలిత ప్రభుత్వం దాన్ని రద్దు చేస్తూ మరో తీర్మానం చేసింది.

రాష్ట్ర ఎగువ సభ నిర్మాణం: ప్రకరణ 171లో రాష్ట్ర విధాన పరిషత్ నిర్మాణం గురించి పేర్కొన్నారు. ఎగువ సభలో ఉండాల్సిన కనిష్ఠ సభ్యుల సంఖ్య 40. అలాగే రాష్ట్ర విధానసభలో మూడో వంతు కంటే మించకూడదు.

ఎన్నిక పద్ధతి: విధాన పరిషత్ సభ్యులను ప్రత్యక్ష, పరోక్ష ఓటర్లు ఎన్నుకుంటారు. విధాన పరిషత్ సభ్యులు నైష్పత్తిక ప్రాతినిధ్య పద్ధతిలో ఓటు బదలాయింపు ప్రక్రియ ద్వారా ఎన్నికవుతారు.

కేంద్ర స్థాయిలో లోక్‌సభ, రాజ్యసభల మాదిరిగానే రాష్ట్రస్థాయిలో శాసన సభ, శాసన మండలిని ఏర్పాటు చేశారు. శాసన మండలినే విధాన పరిషత్ అంటారు. రాష్ట్రస్థాయిలో ద్విసభా విధాన ఏర్పాటు ఐచ్ఛికాంశం కావడం వల్ల అన్ని రాష్ట్రాలూ విధాన పరిషత్‌ను ఏర్పాటు చేసుకోలేదు. ఆంధ్రప్రదేశ్‌లో 1985లో విధాన పరిషత్‌ను రద్దు చేశారు. వై.ఎస్.రాజశేఖరరెడ్డి ప్రభుత్వ చొరవతో తిరిగి 2007లో మండలి మనుగడలోకి వచ్చింది.

- ప్రకరణ 171(3)(ఎ) ప్రకారం 1/3వ వంతు సభ్యులను స్థానిక సంస్థల ప్రతినిధులు ఎన్నుకుంటారు.
- ప్రకరణ 171(3)(బి) ప్రకారం 1/12వ వంతు సభ్యులను పట్టభద్రులు ఎన్నుకుంటారు.
- ప్రకరణ 171(3)(సి) ప్రకారం 1/12వ వంతు సభ్యులు ప్రభుత్వ ఉపాధ్యాయులచేత ఎన్నికవుతారు.
- ప్రకరణ 171(3)(డి) ప్రకారం మొత్తం సభ్యుల్లో 1/3వ వంతు సభ్యులను ఆ రాష్ట్ర విధానసభ సభ్యులు ఎన్నుకుంటారు.
- ప్రకరణ 171(3)(ఈ), 171(5) ప్రకారం మిగతా 1/6వ వంతు సభ్యులను గవర్నర్ నామినేట్ చేస్తారు. వీరు కళలు, సాహిత్యం, సంఘ సేవ, సహకార, శాస్త్ర సాంకేతిక రంగాల్లో నిష్ణాతులై ఉండాలి.

వివరణ: పైన తెలిపిన నిర్మాణం తాత్కాలికమైందే. పార్లమెంటు ఒక చట్టం ద్వారా మార్పులు చేయవచ్చు. అలాగే ఎవరికి ఓటు హక్కు కల్పించాలనే అంశం పై రాష్ట్ర శాసన సభ చట్టాలు చేయవచ్చు.

ఉదా: ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో స్థానిక సంస్థల సభ్యులచేత ఎన్నికయ్యే ఎమ్మెల్సీల ఎన్నికల్లో గ్రామ సర్పంచ్, పంచాయతీ వార్డు సభ్యులకు ఓటు హక్కు లేదు. కానీ కర్ణాటకలో ఓటు హక్కు ఉంది. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం కాలానుగుణంగా వీటికి మార్పులు చేయవచ్చు. పైన ప్రస్తావించిన అర్హతలు, పరిమితులు తాత్కాలికమైనవే.

ఎగువ సభ ఏర్పాటు, రద్దుకు సంబంధించి జాతీయ విధానాన్ని అనుసరించాలని మోదీ ప్రభుత్వం ప్రతిపాదించింది.

పదవీ కాలం: విధాన పరిషత్ శాశ్వత సభ. రద్దు చేయడం కుదరదు. కానీ అబాలిష్ చేయవచ్చు విధానపరిషత్ సభ్యులు ఆరేళ్ల కాలవ్యవధికి ఎన్నికవుతారు. రెండేళ్లకోసారి 1/3వ వంతు సభ్యులు పదవీ విరమణ చేస్తారు.

అర్హతలు: ప్రకరణ 173 ప్రకారం, విధాన పరిషత్‌కు పోటీచేసే అభ్యర్థికి ఉండాల్సిన అర్హతలు...

- భారతీయ పౌరుడై ఉండాలి
- 30 ఏళ్ల పైబడిన వయసు ఉండాలి.
- ఆదాయం పొందే ప్రభుత్వ పదవిలో ఉండరాదు.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

- నేరారోపణ రుజువై ఉండరాదు.
- పార్లమెంటు నిర్ణయించిన ఇతర అర్హతలు ఉండాలి.

గమనిక: శాసనమండలి ఎన్నికల్లో ఎలాంటి రిజర్వేషన్లు వర్తించవు.

రాష్ట్ర విధానసభ

ప్రకరణ 170(1) ప్రకారం రాష్ట్ర విధానసభలో కనిష్ఠంగా 60 మంది సభ్యులు ఉండాలి. గరిష్ఠంగా 500కి మించకూడదు.

వివరణ: రాష్ట్ర విధాన సభలో ఆంగ్లో ఇండియన్లకు తగిన ప్రాధాన్యం లేదని గవర్నర్ భావిస్తే ప్రకరణ 333 ప్రకారం ఆ వర్గానికి చెందిన ఒకరిని విధాన సభకు నామినేట్ చేయవచ్చు. మౌలిక రాజ్యాంగంలో గవర్నర్ నిర్ణయించిన సంఖ్యలో ఆంగ్లో ఇండియన్లను నామినేట్ చేస్తారనే పదం ఉండేది. 1969లో 23వ రాజ్యాంగ సవరణ ద్వారా ఒక ఆంగ్లో ఇండియన్‌ను నామినేట్ చేసేలా దాన్ని మార్పు చేశారు.

- ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్ రాష్ట్రాల్లో ఆంగ్లో-ఇండియన్లకు ప్రాతినిధ్య కల్పిస్తున్నారు.
- రాజ్యాంగంలో నిర్ణయించిన కనిష్ఠ సభ్యుల సంఖ్య 60 కంటే తక్కువగా ఉన్న రాష్ట్రాలు.. సిక్కిం-32, మిజోరాం-40, గోవా - 40.
- కేంద్రపాలిత ప్రాంతాల్లో ఢిల్లీ(70), పుదుచ్చేరి (30)ల్లో మాత్రమే విధానసభ అమల్లో ఉంది.



వివరణ:

- ఆంధ్రప్రదేశ్ శాసనసభలో షెడ్యూల్డ్ కులాలకు 29 స్థానాలను రిజర్వ్ చేశారు. షెడ్యూల్డ్ తెగలకు 7 స్థానాలు కేటాయించారు.
- తెలంగాణ శాసనసభలో షెడ్యూల్డ్ కులాలకు 19 స్థానాలను రిజర్వ్ చేశారు. షెడ్యూల్డ్ తెగలకు 12 స్థానాలు కేటాయించారు.

ఎన్నిక: ప్రకరణ 170(1) ప్రకారం రాష్ట్ర విధానసభ సభ్యులు ప్రాదేశిక నియోజక వర్గాల ప్రతిపాదికన సార్వజనీన వయోజన ఓటు హక్కు ద్వారా ప్రత్యక్షంగా ఎన్నికవుతారు. దీన్నే మెజార్టీ ఓటు అంటారు. దీన్నే సాంకేతికంగా ఫస్ట్ పాస్ట్ ది పోస్ట్ పద్ధతి అంటారు. (లోక్‌సభ సభ్యులను కూడా ఈ విధానంలోనే ఎన్నుకుంటారు.) ఇందుకోసం రాష్ట్రాన్ని జనాభా ప్రాతిపదికన నియోజక వర్గాలుగా విభజిస్తారు.

పదవీకాలం: విధానసభ సభ్యుల పదవీకాలం ఐదేళ్లు. శాసనసభ సాధారణ పదవీకాలం కూడా ఐదేళ్లే. ప్రకరణ 172 ప్రకారం ఐదేళ్ల కంటే ముందే ముఖ్యమంత్రి సలహా మేరకు గవర్నర్ శాసనసభను రద్దు చేయవచ్చు. జాతీయ అత్యవసర పరిస్థితి అమల్లో ఉన్నప్పుడు విధానసభ పదవీ కాలాన్ని ఒక ఏడాది వరకు పొడిగించే అధికారం పార్లమెంట్‌కు ఉంది. అయితే అత్యవసర పరిస్థితి ఎత్తేసిన తర్వాత ఆరు నెలల కంటే ఎక్కువగా పొడిగించడానికి వీల్లేదు.

అర్హతలు: ప్రకరణ 173 ప్రకారం విధానసభకు పోటీ చేయాలంటే ఉండాల్సిన అర్హతలు..

- భారత పౌరుడై ఉండాలి.
- 25 ఏళ్ల కంటే తక్కువ వయసు ఉండరాదు.
- ఆదాయాన్ని పొందే ప్రభుత్వ పదవుల్లో ఉండరాదు.
- నేరారోపణ రుజువై ఉండరాదు.
- పార్లమెంట్ నిర్ణయించిన ఇతర అర్హతలు కూడా ఉండాలి.

సమావేశాలు: ప్రకరణ 174 ప్రకారం రాష్ట్ర శాసనసభ ఏడాదిలో కనీసం రెండుసార్లు సమావేశం కావాలి. అయితే ఒక సమావేశానికి మరో సమావేశానికి మధ్య వ్యవధి ఆరు నెలల కంటే మించరాదు. సమావేశాల సంఖ్యపై గరిష్ఠ పరిమితి లేదు. ప్రస్తుతం శాసన సభ ఏడాదికి మూడు పర్యాయాలు సమావేశమవుతోంది. అవి:

1. బడ్జెటు సమావేశం: ఫిబ్రవరి-ఏప్రిల్
2. వర్షాకాల సమావేశం: జూలై-ఆగష్టు
3. శీతాకాల సమావేశం: నవంబర్ - డిసెంబర్

పై మూడు సందర్భాలు కలిపి, గరిష్ఠంగా 50 నుంచి 60 రోజులపాటు సమావేశాలు జరుగుతాయి. ముఖ్యమంత్రి, మంత్రి మండలి సలహా మేరకు రాష్ట్ర గవర్నర్ శాసన సమావేశాలు ఏర్పాటు చేస్తారు. అలాగే శాసన సభ సమావేశాలను దీర్ఘకాలం పాటు వాయిదా వేస్తారు, రద్దు చేస్తారు.

కోరమ్: ప్రకరణ 189(3) ప్రకారం, రాష్ట్రశాసన సభలో సమావేశాలకు హాజరు కావాల్సిన కనిష్ఠ సభ్యుల సంఖ్య మొత్తం సభ్యుల్లో 1/10 వ వంతు లేదా 10. వీటిలో ఏది ఎక్కువైతే దాన్ని తీసుకుంటారు.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. కింది వాటిలో శాసనమండలి లేని రాష్ట్రం ఏది?
   ఎ) మహారాష్ట్ర బి) రాజస్థాన్
   సి) కర్ణాటక డి) బిహార్
2. రాష్ట్ర శాసనసభలో ఏ రాజకీయ పక్షానికీ మెజార్టీ రానప్పుడు ముఖ్యమంత్రి ఎన్నికకు గవర్నర్ ప్రధానంగా పరిశీలించవలసిన విషయం?
   ఎ) స్థిరమైన మెజార్టీ పొందే అవకాశమున్న యోగ్యుడైన వ్యక్తిని వెతకడం
   బి) రాష్ట్ర శాసన సభలో అతి పెద్ద రాజకీయ పార్టీ
   సి) పార్టీలతో ఏర్పడ్డ అతిపెద్ద కూటమి
   డి) పార్టీ కార్యక్రమానికి దాని సభ్యుల విధేయత
3. భారతదేశంలోని రాష్ట్రాల్లో ఆగంతుక నిధి ఎవరి నియంత్రణలో ఉంటుంది?
   ఎ) గవర్నర్
   బి) రాష్ట్ర ఆర్థిక మంత్రి
   సి) ముఖ్యమంత్రి
   డి) మంత్రిమండలి
4. రాష్ట్ర శాసనాలు రద్దుచేసే అధికారం ఎవరికి ఉంది?
   ఎ) ముఖ్యమంత్రి
   బి) రాష్ట్ర అసెంబ్లీలో మెజారిటీ సభ్యుల ఆమోదం, పార్లమెంటు ఆమోదం
   సి) ప్రధానమంత్రి డి) రాష్ట్రపతి

సమాధానాలు

1) బి; 2) ఎ; 3) ఎ; 4) బి.

మాదిరి ప్రశ్నలు

1. రాష్ట్ర ఎగువ సభకు, దిగువ సభకు ఈ కింది ఏ అంశంలో పోలికలు ఉన్నాయి?
   ఎ) నిర్మాణం బి) పదవీ కాలం
   సి) అధికారాలు డి) పైవేవీ కాదు
2. రాష్ట్ర ఎగువ సభ సభ్యులు ఎన్నికయ్యేది?
   ఎ) ప్రత్యక్షంగా బి) పరోక్షంగా
   సి) ప్రత్యక్షం, పరోక్షం
   డి) అందరూ నామినేట్ అవుతారు
3. ఈ కింది ఏ సభలకు కనిష్ఠ, గరిష్ఠ సభ్యుల సంఖ్య పరిమితి ఉంది?
   ఎ) విధాన సభ బి) విధాన పరిషత్
   సి) లోక్‌సభ డి) పైవన్నీ
4. ఈ కింది ఏ సభ రద్దు విషయంలో ఆ సభకు ప్రమేయం ఉండదు?
   ఎ) విధాన పరిషత్ బి) రాజ్య సభ
   సి) లోక్‌సభ డి) ఎ, బి
5. ఈ కింది ఎన్ని రాష్ట్రాల విధాన సభ సభ్యుల సంఖ్య సమానంగా ఉంది?
   ఎ) 5 బి) 6 సి) 7 డి) 8

సమాధానాలు

1) డి 2) సి 3) డి 4) ఎ 5) డి

సమాచార ప్రసారానికి తోడ్పడే వాతావరణ పొర ఏది?

పర్యావరణం

భూమిపై ఉన్న ఘన, ద్రవ, వాయు, జీవ సమ్మేళనాన్ని పర్యావరణం అంటారు. జీవుల మనుగడకు అవసరమైన గాలి, నీరు, ఆహారం పూర్తిగా కలుషితమవుతున్నాయి. సహజ వనరులు తరిగిపోతుండటంతో డిమాండ్ పెరుగుతోంది. ఫలితంగా వాటి దుర్వినియోగం కూడా అధికమై పర్యావరణానికి నష్టం వాటిల్లుతోంది. పేద, అభివృద్ధి చెందుతున్న దేశాల్లోని గ్రామీణ ప్రాంతాల ఆర్థిక స్థితిగతులపై పర్యావరణ నష్ట ప్రభావం తీవ్రంగా ఉంది. వంట చెరకు లభ్యత, పశుగ్రాసం, భూగర్భ, ఉపరితల వనరులు తగ్గి గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అవుతోంది. ఒక ప్రాంత సుస్థిరాభివృద్ధి పర్యావరణ పరిరక్షణపై ఆధారపడి ఉంటుంది.

పర్యావరణ విభాగాలు

పర్యావరణాన్ని నాలుగు భాగాలుగా విభజించవచ్చు.

అవి..

1. వాతావరణం(అట్మాస్పియర్)
2. శిలావరణం(లిథోస్పియర్)
3. జలావరణం(హైడ్రోస్పియర్)
4. జీవావరణం(బయోస్పియర్)

వాతావరణం (అట్మాస్పియర్)

భూమి ఉపరితలంపై ఉన్న వాయు పొరల నిర్మాణమే వాతావరణం లేదా అట్మాస్పియర్. గురుత్వాకర్షణ శక్తి వల్ల ఇది భూమిపై ఉంటుంది. ఇందులో ట్రోపోస్పియర్, స్ట్రాటోస్పియర్, మీసోస్పియర్, థర్మోస్పియర్ అనే నాలుగు విభాగాలున్నాయి. రెండు పొరల మధ్య హద్దుగా ఉండే ప్రాంతాన్ని 'పాజ్' అంటారు. ఉదాహరణకు.. స్ట్రాటోస్పియర్, మీసోస్పియర్ మధ్యనున్న ప్రాంతాన్ని స్ట్రాటోపాజ్ అంటారు.

ట్రోపోస్పియర్

ఇది భూమి ఉపరితలానికి దగ్గరగా ఉన్న వాతావరణ పొర. ఈ పొర ధ్రువాల వద్ద 6-8 కి.మీ. ఎత్తు వరకు, భూమధ్యరేఖ వద్ద 18 కి.మీ. ఎత్తు వరకు విస్తరించి ఉంటుంది. పైకి వెళ్లేకొద్దీ ప్రతి కిలోమీటరుకు ఉష్ణోగ్రత ఆరు డిగ్రీల చొప్పున తగ్గుతుంది. సుమారు 12 కి.మీ. ఎత్తు వద్ద ట్రోపోపాస్ అనే పరివర్తన ప్రాంతం మొదలవుతుంది. ఈ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు భారీగా తగ్గుతాయి.

స్ట్రాటోస్పియర్

వాతావరణంలోని రెండో పొర అయిన స్ట్రాటోస్పియర్, ట్రోపోపాజ్ నుంచి మొదలై 50 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉంటుంది. ఇక్కడ ఉష్ణోగ్రత మైనస్ 60 డిగ్రీలుగా ఉంటుంది.

టీజీపీఎస్సీ ప్రవేశపెట్టిన జనరల్ స్టడీస్ పేపర్‌లో పర్యావరణ అంశాలను చేర్చారు. పర్యావరణ విభాగాలు, జీవావరణ శాస్త్రం, పర్యావరణ కాలుష్యం, జీవ వైవిధ్యం, వన్యప్రాణుల సంరక్షణ, ఘన వ్యర్థ పదార్థాలు - నిర్వహణ, శీతోష్ణస్థితి మార్పు, అంతర్జాతీయ, జాతీయ పర్యావరణ ఒప్పందాలు, చట్టాలు... పర్యావరణ అంశాల పరిధిలోకి వస్తాయి.

ఈ ప్రాంతంలో గంటకు 320 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయి. స్ట్రాటోస్పియర్‌లో ఓజోన్ అధిక మోతాదులో ఉండటం వల్ల దీన్ని ఓజోనోస్పియర్ అని కూడా అంటారు. హానికర అతినీలలోహిత కిరణాలు నేరుగా భూమిని చేరకుండా ఈ పొర అడ్డుకుంటుంది.

మీసోస్పియర్

స్ట్రాటోపాజ్ నుంచి దాదాపు 80 కి.మీ. ఎత్తు వరకు ఈ ప్రాంతం విస్తరించి ఉంటుంది. ఉష్ణోగ్రతలు తీవ్రంగా పడిపోతాయి. మీసోస్పియర్ పైనున్న ప్రాంతం వాతావరణంలోని అన్ని భాగాల కంటే అత్యంత శీతలంగా ఉంటుంది. ఉల్కాపాతం భూమిని చేరకపోవడానికి మీసోస్పియరే కారణం.

థర్మోస్పియర్

ఇది మీసోపాజ్ నుంచి మొదలవుతుంది. థర్మోస్పియర్‌ను ఐనోస్పియర్, ఎక్సోస్పియర్‌లుగా విభజిస్తారు. కింది భాగమైన ఐనోస్పియర్ భూవాతావరణంలో 100-120 కి.మీ. ఎత్తు నుంచి 550 కి.మీ. ఎత్తు వరకు విస్తరించి ఉంటుంది. ఐనోస్పియర్‌లో నత్రజని, ఆక్సిజన్ లాంటి మూలకాల పరమాణువులు సౌర వికిరణాన్ని గ్రహించి అయానీకరణం చెందుతాయి. భూ ఉపరితలం నుంచి వచ్చే రేడియో తరంగాలను పరావర్తనం చేసి సమాచార ప్రసారానికి ఐనోస్పియర్ తోడ్పడుతోంది. బలమైన సౌరగాలులు వీచినప్పుడు ఐనోస్పియర్ సంఘటనం మారే ప్రమాదం ఉంది. ఫలితంగా సమాచార వ్యవస్థలు దెబ్బతింటాయి.

శిలావరణం

భూమిపై ఉన్న ఖండాలన్నింటినీ కలిపి శిలావరణం అంటారు. భూమి ఉపరితలం మొత్తం కొన్ని ప్రత్యేక ఫలకాలపై అమరి ఉంటుంది. ఈ ఫలకాల నిర్మాణం, వాటి కదలికలను ప్లేట్ టెక్టానిక్స్ సిద్ధాంతం వివరిస్తుంది. 200 మిలియన్ సంవత్సరాల కిందట భూభాగం మొత్తం ఒకే చోట కలిసి ఉండేది. దీన్ని పాంజియా అని పిలుస్తారు. 50 మిలియన్ ఏళ్ల క్రితం ఇది రెండు భాగాలుగా చీలింది. ఉత్తరంగా ఉన్న భాగాన్ని లారెన్షియా అని, దక్షిణ దిశగా విడిపోయిన ప్రాంతాన్ని గోండ్వానా అని పిలుస్తారు. ఇవి మరింత దూరం కదిలి ప్రస్తుత ఖండాలు ఏర్పడ్డాయి. ఖండ చలన సిద్ధాంతం.. ఖండాల నిర్మాణం, వాటి కదలికలను వివరిస్తుంది.

భూమి ఉపరితలం నుంచి లోపలి వైపు మూడు భాగాలుంటాయి. భూపటలం(క్రస్ట్), భూప్రావారం (మాంటెల్), భూకేంద్రం(కోర్). భూపటలం ఉపరితలం నుంచి సుమారు 100 కి.మీ. లోతు వరకు ఉంటుంది. భూపటల ఉపరితలంపై వదులుగా ఉండే పొరలను మృత్తిక లేదా నేల అంటారు. 100 కి.మీ. లోతు నుంచి 2900 కి.మీ. లోతు వరకు భూప్రావారం(మాంటెల్) అనే పొర ఉంటుంది. దీని తర్వాత మధ్యభాగం భూకేంద్రం(కోర్). దీనిలో బాహ్యకేంద్రం, అంతర కేంద్రం అనే రెండు భాగాలు ఉంటాయి. బాహ్యకేంద్రం 2900 కి.మీ. నుంచి 5100 కి.మీ. వరకు ఉంటుంది. అంతర కేంద్రం 5100 కి.మీ. నుంచి సుమారు 6378 కి.మీ. వరకు ఉంటుంది.

జలావరణం

భూమిపై వివిధ రూపాల్లో ఉన్న మొత్తం నీటిని జలావరణం లేదా హైడ్రోస్పియర్ అంటారు. పూర్వం సముద్ర జలమంతా పూర్తిగా సాదుజలంగా ఉండేది. కొన్ని మిలియన్ సంవత్సరాల నుంచి నేల క్రమక్షయం జరిగి ఖనిజాలు సముద్రంలోకి



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

ఎన్విరాన్‌మెంట్

చేరడంతో లవణీయత పెరిగింది. భూమి ఉపరితలం 75 శాతం నీటితో నిండి ఉంది. భూమిపై ఉన్న మొత్తం నీటిలో 97.5 శాతం సముద్రాల్లోనే ఉంది. మిగతా 2.5 శాతం నీరు సాదుజలం లేదా మంచి నీరు. మంచి నీటిలో 0.3 శాతం నదులు, సరస్సుల్లో ఉంది. భూగర్భ జలంగా 30.8 శాతం, హిమనీనదాల రూపంలో 68.9 శాతం ఉంది.

భూమిపై నీటి విస్తరణను జల వలయం నిర్ధారిస్తుంది. నీరు ఆవిరై మేఘాల రూపంలోకి సాంద్రీకరణం చెంది ఆ తర్వాత మంచు, వర్షం రూపంలో భూమిని చేరుతుంది. ఇలా చేరిన నీటిలో కొద్ది మొత్తం భూగర్భంలోకి ఇంకుతుంది. మిగతాది నదులు, సముద్రాల్లోకి చేరుతుంది. ధ్రువ ప్రాంతాల్లో శీతాకాలంలో ఈ నీరు గడ్డకట్టి వేసవిలో కరుగుతుంది. ఈ రకమైన నిరంతర నీటి ఆవిరి కదలికలను జలవలయం అంటారు.

జీవావరణం

భూమిపై ఉన్న జీవులు, జీవం విస్తరించిన ప్రాంతాలన్నింటినీ కలిపి బయోస్పియర్ అంటారు. భూమిపై సుమారు 3.5 బిలియన్ సంవత్సరాల క్రితం జీవం ఆవిర్భవించింది. అనేక సిద్ధాంతాలు భూమిపై జీవం ఆవిర్భవించే విధానాన్ని వివరిస్తున్నాయి.

వీటిలో ముఖ్యమైనవి...

1. **ప్రత్యేక సృష్టి సిద్ధాంతం:** దీని ప్రకారం భూమిపై జీవులను దేవుడు సృష్టించాడు. ఈ సిద్ధాంతానికి తగిన నిదర్శనాలు లేని కారణంగా దీన్ని నమ్మకంగానే భావిస్తారు.
2. **పాన్‌స్పెర్మియ సిద్ధాంతం:** దీని ప్రకారం భూమిపై జీవులు ఆవిర్భవించలేదు. భూమి ఆవల నుంచి గ్రహశకలాలు లేదా గ్రహాంతర వాసుల ద్వారా భూమిపైకి చేరి ఆ తర్వాత పరిణామ క్రమంలో మార్పు చెందాయి.
3. **జీవ ఆవిర్భావ సిద్ధాంతం:** అలెగ్జాండర్ ఇవనోవిచ్ ఒపారిన్, జె.బి.ఎస్. హాల్డేన్ అనే శాస్త్రవేత్తలు ఈ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. దీని ప్రకారం భూమిపై జీవ ఆవిర్భావానికి ముందు జీవ రసాయనాలు ఆవిర్భవించాయి. ఈ జీవ రసాయనాల చర్యల ద్వారా భూమిపై పూర్వ జీవకణాలు ఏర్పడ్డాయి. తర్వాత వాటి నుంచి సంపూర్ణ జీవకణాలు ఆవిర్భవించాయి. భూమిపై ఆవిర్భవించిన తొలి తరం జీవులన్నీ అవాయు జీవులు. ఇలాంటి కొన్ని అవాయు జీవులు నీటి అణువులను విచ్ఛిన్నం చేయడంతో గాల్లోకి క్రమంగా ఆక్సిజన్ విడుదలైంది. తొలుత కేంద్రక పూర్వ జీవులు ఏర్పడి ఆ తర్వాత నిజ కేంద్రక జీవులు ఆవిర్భవించాయి.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. ఆవరణ వ్యవస్థలో గతిశీల భాగం? (గ్రూప్-2, 2008)
   ఎ) ఆహార గొలుసు బి) ఇకలాజికల్ నిచే
   సి) ఎకోటోన్ డి) ఏదీకాదు
2. పాన్‌స్పెర్మియ సిద్ధాంతాన్ని ప్రతిపాదించింది? (2004 గ్రూప్-1)
   ఎ) అర్హీనియస్ బి) ఒపారిన్
   సి) స్పాలెంజ్ డి) ఎవరూ కాదు
3. తక్కువ ఉష్ణోగ్రతలను తట్టుకునే జీవులను ఏమంటారు? (గ్రూప్-1 2010 రీ ఎగ్జామ్)
   ఎ) స్టోనోథర్మల్ బి) సైక్రోఫైల్స్
   సి) యూరిథర్మల్ డి) పైకిలో థర్మల్
4. భారతదేశంలోని విశిష్టమైన స్త్రీ పర్యావరణ వేత్త (ఎన్విరాన్‌మెంటలిస్ట్) ఎవరు? (గ్రూప్-1, 1999)
   ఎ) మేధాపాట్కర్ బి) మమతా బెనర్జీ
   సి) సరోజిని మహర్షి డి) మార్గరెట్ ఆల్వా
5. కింది వాటిలో ఫ్లోటింగ్ నేషనల్ పార్కు ఏది? (సివిల్స్ ప్రిలిమ్స్-2015)
   ఎ) కజిరంగ జాతీయ పార్కు
   బి) కైబుల్ లామ్జావు జాతీయ పార్కు
   సి) కార్బెట్ జాతీయ పార్కు
   డి) ఏదీకాదు

సమాధానాలు

1) ఎ; 2) ఎ; 3) ఎ; 4) ఎ; 5) బి.

మాదిరి ప్రశ్నలు

1. ఓజోన్ పొర సంరక్షణకు ఏర్పాటైన అంతర్జాతీయ ఒప్పందం?
   ఎ) క్యోటో ఒప్పందం
   బి) మాంట్రియాల్ ఒప్పందం
   సి) స్టాక్‌హోమ్ ఒప్పందం
   డి) రామ్సార్ ఒప్పందం
2. కింది వాటిలో ఓజోన్ పొరను దెబ్బతీసేది?
   ఎ) క్లోరోఫ్లోరో కార్బన్లు
   బి) హాలోన్లు సి) మిథైల్ బ్రోమైడ్
   డి) పైవన్నీ
3. చిప్కో ఉద్యమం ఏ ప్రాంతంలో ప్రారంభమైంది?
   ఎ) ఉత్తరాంచల్ బి) కర్ణాటక
   సి) బిహార్ డి) మధ్యప్రదేశ్
4. చిప్కో ఉద్యమంలో పాల్గొన్నవారు?
   ఎ) సుందర్‌లాల్ బహుగుణ
   బి) చండీ ప్రసాద్ భట్
   సి) సుదేశాదేవి డి) పైవారందరూ
5. సైలెంట్ స్ప్రింగ్ అనే గ్రంథాన్ని రచించి అమెరికాలో డి.డి.టి.కి వ్యతిరేకంగా ఉద్యమం నిర్వహించింది ఎవరు?
   ఎ) జాన్ ముయర్
   బి) బెంజిమిన్ ఫ్రాంక్లిన్
   సి) రాచెల్ కార్సన్
   డి) ఎవరూ కాదు
6. 'ఎ శాండ్ కౌంటీ ఆల్మనాక్' గ్రంథ రచయిత ఎవరు?
   ఎ) డేవిడ్ హెన్రీ బి) ఆల్డో లియోపోల్డ్
   సి) జాన్ ముయర్
   డి) బెంజిమిన్ ఫ్రాంక్లిన్
7. అటవీ హక్కు చట్టం ఎప్పుడు అమల్లోకి వచ్చింది?
   ఎ) 2006 బి) 2007
   సి) 2008 డి) 2009
8. 1986లో అమల్లోకి వచ్చిన చట్టం?
   ఎ) జల కాలుష్య నివారణ, నియంత్రణ చట్టం
   బి) వాయు కాలుష్య నివారణ, నియంత్రణ చట్టం
   సి) పర్యావరణ పరిరక్షణ చట్టం
   డి) జల కాలుష్య సుంకం చట్టం
9. జీవవైవిధ్య చట్టాన్ని అమలు చేసే నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ ఎక్కడ ఉంది?
   ఎ) చెన్నై, తమిళనాడు
   బి) బెంగళూరు, కర్ణాటక
   సి) హైదరాబాద్, తెలంగాణ
   డి) తిరువనంతపురం, కేరళ
10. భూమిపై ఆవిర్భవించిన మొదటి పూర్వకణానికి ఒపారిన్ ఇచ్చిన పేరు?
    ఎ) ప్రోటినాయిడ్ బి) సింబయాంట్
    సి) కొయసెర్వేట్ డి) ప్రోక్యారియోట్

సమాధానాలు

1) బి; 2) డి; 3) ఎ; 4) డి; 5) సి; 6) బి; 7) ఎ; 8) సి; 9) ఎ; 10) సి.

ఖనిజాల ఖజానా... ఖమ్మం జిల్లా!

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

జాగ్రఫీ



తెలంగాణ రాష్ట్ర ఖనిజ వనరులు

భూపటలం నుంచి వెలికితీసే రెండు లేదా అంతకంటే ఎక్కువ రసాయనిక మూలకాలతో ఏర్పడే ముడి పదార్థాన్ని 'ఖనిజం' అంటారు. ఖనిజాలు సహజ సిద్ధంగా ఏర్పడతాయి. ఇవి పునరుద్ధరించలేని వనరులు. అందువల్ల వీటిని వివిధ ప్రణాళికా పద్ధతుల ద్వారా అభిలషణీయ రీతిలో వినియోగించుకోవాలి.

ఖనిజాలను ప్రధానంగా మూడు రకాలుగా వర్గీకరించవచ్చు. **అవి:**

లోహ ఖనిజాలు: తమ ద్వారా విద్యుత్‌ను ప్రసరింపజేసే ఖనిజాలను 'లోహ ఖనిజాలు' అంటారు.

ఉదా: ఇనుము, రాగి, వెండి, బంగారం, మాంగనీస్, జింక్, సీసం.

అలోహ ఖనిజాలు: తమ ద్వారా విద్యుత్‌ను ప్రసరింపజేయని ఖనిజాలను 'అలోహ ఖనిజాలు' అంటారు.

ఉదా: బెరైటీస్, జిప్సం, సున్నపురాయి, ఆస్‌బెస్టాస్, డోలమైట్, మైకా.

ఇంధన ఖనిజాలు: ఇంధనాలుగా ఉపయోగించే ఖనిజాలను 'ఇంధన ఖనిజాలు' అంటారు. వీటిలో శిలాజ ఇంధనాలు, అణు ఇంధనాలు అనే రెండు రకాల ఖనిజాలు ఉంటాయి.

1. **శిలాజ ఇంధనాలు:** మండించినప్పుడు శక్తిని విడుదల చేసే వాటిని 'శిలాజ ఇంధనాలు' అంటారు.

ఉదా: బొగ్గు, పెట్రోల్, డీజిల్.

2. **అణు ఇంధనాలు:** భార, అస్థిర కేంద్రకాలను కలిగి ఉండి, న్యూట్రాన్‌తో తాడనం చెందించినప్పుడు సమాన భారాలున్న రెండు కేంద్రకాలుగా విడిపోయి అత్యధిక శక్తిని విడుదల చేసే ఖనిజాలను 'అణు ఇంధనాలు' అంటారు.

ఉదా: థోరియం, యురేనియం.

- దక్షిణ భారతదేశంలో బొగ్గు నిక్షేపాలు ఉన్న ఏకైక రాష్ట్రం - తెలంగాణ.
- రంగారెడ్డి జిల్లాలోని తాండూర్‌లో నీలి సున్నపురాయి బండలు లభిస్తున్నాయి. వీటినే 'షాబాద్ బండలు'గా వ్యవహరిస్తారు. వీటిని దక్షిణ భారతదేశంలో అత్యధికంగా గచ్చు కోసం ఉపయోగిస్తున్నారు.
- కరీంనగర్ జిల్లాలో ప్రత్యేకత ఉన్న 'టాన్ బ్రౌన్ గ్రానైట్' నిల్వలు ఉన్నాయి. వీటిని ప్రైవేట్ రంగంలో పెద్ద మొత్తంలో ఎగుమతి చేస్తున్నారు.

ప్రధాన ఖనిజాలు

బొగ్గు (కోల్)

250 మిలియన్ ఏళ్ల కిందట జరిగిన ప్రకృతి ఉత్పాతాల వల్ల 'గోండ్వానా బొగ్గు' ఏర్పడింది. ఈ బొగ్గు తెలంగాణతో పాటు జార్ఖండ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల్లో విస్తరించి ఉంది. గోండ్వానా బొగ్గు అత్యంత నాణ్యమైన ద్వితీయ శ్రేణి బొగ్గు. ఇది 'బిట్యూమినస్' రకానికి చెందింది.

- తెలంగాణ రాష్ట్రంలో బొగ్గు నిల్వలు ప్రధానంగా 'ప్రాణహిత - గోదావరి' లోయ ప్రాంతంలో అధికంగా ఉన్నాయి.
- తెలంగాణలో బొగ్గు నిక్షేపాలు విస్తరించి ఉన్న జిల్లాలు - ఖమ్మం, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్.
- బొగ్గు నిల్వలు అధికంగా ఉన్న జిల్లా - ఆదిలాబాద్ కాగా, బొగ్గును అధికంగా ఉత్పత్తి చేస్తున్న జిల్లా ఖమ్మం.
- దేశం మొత్తం మీద ఉన్న బొగ్గు నిల్వల్లో 20 శాతం మన రాష్ట్రంలోనే ఉన్నాయి.
- 2013-14లో సింగరేణి సంస్థ ద్వారా ఉత్పత్తి చేసిన మొత్తం బొగ్గు 50.5 మిలియన్ టన్నులు. బొగ్గు ఆధారంగా వివిధ పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో ఇనుము - ఉక్కు, థర్మల్ విద్యుత్ కేంద్రాలు, సిమెంట్, రైల్వేస్, గృహ సంబంధ ఇంధన పరిశ్రమలు ముఖ్యమైనవి.

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్: తెలంగాణ రాష్ట్రంలో విస్తరించి ఉన్న బొగ్గును సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్) వెలికి తీస్తుంది. దీన్ని మొదట 1886లో ఒక ప్రైవేట్ బ్రిటిష్ కంపెనీ నెలకొల్పింది. 1920లో దీన్ని హైదరాబాద్ నిజాం కొనుగోలు చేశాడు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారత ప్రభుత్వం దీన్ని జాతీయం చేసింది. ఈ సంస్థ భారత, తెలంగాణ ప్రభుత్వాల ఉమ్మడి కంపెనీ. తెలంగాణ రాష్ట్రంలోని నాలుగు జిల్లాల్లో ఈ కంపెనీ ప్రస్తుతం 15 ఓపెన్ కాస్ట్ గనుల్లో, 35 భూగర్భ గనుల్లో తవ్వకాలు చేపడుతోంది. ఈ కంపెనీలో సుమారు 65,000 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. దీని ప్రధాన కార్యాలయం ఖమ్మం జిల్లాలోని కొత్తగూడెంలో ఉంది.

ఇనుము (ఐరన్)

నాణ్యత ఆధారంగా ఇనుప ఖనిజాన్ని నాలుగు రకాలుగా విభజించవచ్చు.

అవి: మాగ్నటైట్, హెమటైట్, లియోనైట్, సిడరైట్.

రాష్ట్రంలో ఇనుము అధిక మొత్తంలో హెమటైట్ రూపంలో, తక్కువ మొత్తంలో మాగ్నటైట్ రూపంలో లభిస్తోంది.

- తెలంగాణలో ఇనుము విస్తరించి ఉన్న జిల్లాలు - ఖమ్మం (బయ్యారం, చెరువుపురం, నావపాడు, కొత్తగూడెం), ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్.
- ఆదిలాబాద్ జిల్లాలోని బిత్వాల్, కల్లాడ, రస్తూరాబాద్, రోబాన్‌పల్లి, లక్సెట్టిపేట్ మొదలైన ప్రాంతాల్లో 'మాగ్నటైట్' రకానికి చెందిన ఇనుప ఖనిజం నిల్వలు ఉన్నాయి.

ఇనుము ఆధారిత పరిశ్రమలు: ఉక్కు, స్పాంజ్ ఐరన్, పిగ్ ఐరన్ మొదలైనవి.

బెరైటీస్ (ముగ్గురాయి)

తెలంగాణ రాష్ట్రంలో బెరైటీస్ (ముగ్గురాయి) ప్రధానంగా ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో విస్తరించి ఉంది. బెరైటీస్‌ను అధికంగా ఉత్పత్తి చేస్తున్న జిల్లా - ఖమ్మం.

- **ఖమ్మం జిల్లాలో బెరైటీస్ గనులు విస్తరించి ఉన్న ప్రాంతాలు:** రుద్రంకోట, వెంకటాయపాలెం, గోపాల్‌పూర్, బాలాపేట్, కోడంపూర్, చెరువుపురం.
- **మహబూబ్‌నగర్ జిల్లాలో విస్తరించి ఉన్న ప్రాంతాలు:** బొల్లారం, వీరభద్ర దుర్గం.
- **ముగ్గురాయి ఆధారిత పరిశ్రమలు:** పెట్రోలియం వెలికితీత, రంగులు, టైర్లు, రబ్బరు వస్తువులు, పేపర్స్, రసాయనాల పరిశ్రమలు.

మాంగనీస్

- ఇది ప్రధానంగా ఆదిలాబాద్ జిల్లాలో విస్తరించి ఉంది. ఈ జిల్లాలోని భీమసరి, అంతంపల్లి, మంచిర్యాల, బెల్లంపల్లి ప్రాంతాల్లో విస్తరించి ఉంది.
- **మాంగనీస్ ఆధారిత పరిశ్రమలు:** సిమెంట్, కార్బైడ్, ఇనుము - ఉక్కు, సోడాయాష్, రసాయనాలు, చక్కెర, పేపర్, ఎరువులు, గాజు మొదలైనవి.

సున్నపురాయి

రాష్ట్రంలో బొగ్గు నిల్వల తర్వాత అధిక విస్తీర్ణంలో ఉన్న ఖనిజం సున్నపురాయి. ఇది ప్రధానంగా నల్లగొండ, రంగారెడ్డి, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లో విస్తరించి ఉంది. దీన్ని అత్యధికంగా ఉత్పత్తి చేస్తున్న జిల్లా నల్లగొండ.

- సున్నపురాయిని సిమెంట్ పరిశ్రమలో ముడి ఖనిజంగా ఉపయోగిస్తారు.
- తెలంగాణ రాష్ట్ర ఖనిజ వనరుల అభివృద్ధి సంస్థ ఆదిలాబాద్ జిల్లాలోని దేవపూర్ మైన్‌లో 210 హెక్టార్ల విస్తీర్ణంలో సున్నపురాయి నిల్వలను వెలికితీసింది.

గ్రానైట్

తెలంగాణ రాష్ట్రంలో వరంగల్, ఖమ్మం, కరీంనగర్, రంగారెడ్డి, నల్లగొండ, మెదక్, నిజామాబాద్ జిల్లాల్లో గ్రానైట్ నిక్షేపాలు విస్తరించి ఉన్నాయి.

- **గ్రానైట్ ఆధారిత పరిశ్రమలు:** కటింగ్ అండ్ పాలిషింగ్ ఇండస్ట్రీస్, గృహాలంకరణ, స్మారక నిర్మాణాలు, ఫ్లోరింగ్ పరిశ్రమలు.

అమెథిస్ట్ క్వార్ట్జ్:

తెలంగాణ రాష్ట్రంలో మెదక్, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లో అమెథిస్ట్ క్వార్ట్జ్ నిక్షేపాలు విస్తరించి ఉన్నాయి. ఈ రకం రాళ్లను ఆభరణాల తయారీ పరిశ్రమల్లో ఉపయోగిస్తారు.

బంకమట్టి (జంబాలాలు)

సూక్ష్మ రేణుయుతంగా ఉండే మెత్తని మట్టిని సాధారణంగా బంకమట్టి (జంబాలాలు) అంటారు. జంబాలాలు అనేవి అవక్షేప నిక్షేపాలు. కయొలిన్ (చైనా జంబాలం), అగ్ని సహన జంబాలం, బాల్ జంబాలం వీటిలో ముఖ్యమైన రకాలు. దీన్ని ప్రధానంగా పింగాణి సామగ్రి తయారీలో వాడతారు. దీంతోపాటు ఇటుకలు, పెంకులు, డ్రైనేజీ గొట్టాలు, సిమెంట్ తయారీలోనూ ఉపయోగిస్తారు.

- **బంకమట్టి (జంబాలాలు) విస్తరించి ఉన్న జిల్లాలు:** ఆదిలాబాద్, రంగారెడ్డి, మెదక్, నిజామాబాద్.

యురేనియం

నల్లగొండ జిల్లాలోని లంబపూర్, పెద్దగట్టు, బిట్రియాల్, కుప్పునూర్, ఆర్.వి. తండ మొదలైన ప్రాంతాల్లో సుమారు 1600 టన్నుల యురేనియం నిక్షేపాలు ఉన్నట్లు అంచనా వేశారు. వీటి వెలికితీత కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి.

- అత్యంత అరుదైన రేడియోధార్మిక ఖనిజమైన 'ఇంథనైట్'ను దేశంలోనే తొలిసారిగా మహబూబ్‌నగర్ జిల్లాలోని 'అక్కారం' ప్రాంతంలో గుర్తించారు.
- **ఖమ్మం జిల్లాలో లభించే రేడియో ధార్మిక ఖనిజ మూలకాలు:** కోరండం, గార్నెట్, గెలీనా, జిర్కోన్, కయోనైట్.

మార్బుల్

మార్బుల్ నిక్షేపాలు ఎక్కువగా ఖమ్మం జిల్లాలో విస్తరించి ఉన్నాయి. వీటిని గృహాలంకరణ వస్తువుల తయారీలో, ఫ్లోరింగ్‌లో ఉపయోగిస్తారు. ప్రానెల్స్‌గానూ వాడతారు.

బంగారం

రాష్ట్రంలో ఖమ్మం జిల్లాలోని కిన్నెరసాని, గోదావరి నదుల సంగమ ప్రాంతం; వరంగల్ జిల్లాలోని మంగపేట; మహబూబ్‌నగర్ జిల్లాలోని అత్మాకర్, గద్వాల్ ప్రాంతాల్లో బంగారం నిల్వలు ఉన్నాయి.

వజ్రాలు

మహబూబ్‌నగర్ జిల్లాలోని బొల్లారం, అమర్‌గిరి, సోమశిల, మద్దె మడుగు ప్రాంతాల్లో డైమండ్ గనులు విస్తరించి ఉన్నాయి.

ఫెల్‌స్పార్

నల్లగొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, ఖమ్మం జిల్లాల్లో ఈ నిక్షేపాలు ఉన్నాయి.

- నల్లగొండ జిల్లాలో అత్యంత నాణ్యమైన ఫెల్‌స్పార్ ముడి ఖనిజం లభిస్తోంది.
- **ఫెల్‌స్పార్ ఆధారిత పరిశ్రమలు:** సిరామిక్స్, గాజు, అబ్రాసిక్, ఎనామిల్, ఎలక్ట్రికల్, కొలిములు మొదలైనవి.
- **ఖమ్మం జిల్లాలో లభించే ఇతర ముఖ్యమైన ఖనిజ మూలకాలు:** క్రోమైట్, డోలమైట్, రాగి, మైకా, గ్రాఫైట్.
- క్వార్ట్జ్ నిక్షేపాలు మహబూబ్‌నగర్, నిజామాబాద్, రంగారెడ్డి, ఖమ్మం, మెదక్ జిల్లాల్లో విస్తరించి ఉన్నాయి.
- కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో స్పియటైట్ నిల్వలు ఉన్నాయి.

మాదిరి ప్రశ్నలు

1. తెలంగాణ రాష్ట్రంలో అధిక మొత్తంలో ఉన్న ఇనుప ఖనిజం ఏది?
   1) మాగ్నటైట్ 2) హెమటైట్
   3) సిడరైట్ 4) లియోనైట్
2. బయ్యారం ఇనుప గనులు ఏ జిల్లాలో ఉన్నాయి?
   1) మెదక్ 2) నల్గొండ
   3) వరంగల్ 4) ఖమ్మం
3. దేశంలో అత్యంత అరుదైన ఖనిజం 'ఇంథనైట్'ను మొదటిసారిగా ఎక్కడ గుర్తించారు?
   1) చెరువుపురం (ఖమ్మం)
   2) రస్తూరాబాద్ (ఆదిలాబాద్)
   3) అక్కారం (మహబూబ్‌నగర్)
   4) మంగపేట (వరంగల్)
4. తెలంగాణ రాష్ట్రంలో 'సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్' ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?
   1) రామగుండం 2) బెల్లంపల్లి
   3) భూపాలపల్లి 4) కొత్తగూడెం
5. బెరైటీస్‌ను అత్యధికంగా ఉత్పత్తి చేస్తున్న తెలంగాణ జిల్లా ఏది?
   1) ఖమ్మం 2) ఆదిలాబాద్
   3) రంగారెడ్డి 4) మెదక్
6. కిందివాటిలో తెలంగాణ రాష్ట్రంలో బొగ్గు నిల్వలు లేని జిల్లా ఏది?
   1) కరీంనగర్
   2) ఖమ్మం 3) నల్లగొండ
   4) ఆదిలాబాద్
7. తెలంగాణలో అత్యంత నాణ్యమైన ఫెల్‌స్పార్ ముడిఖనిజం ఏ జిల్లాలో లభిస్తోంది?
   1) రంగారెడ్డి 2) నిజామాబాద్
   3) కరీంనగర్ 4) నల్లగొండ
8. బెల్లంపల్లి దేనికి ప్రసిద్ధి చెందింది?
   (టీఎస్‌పీఎస్సీ సీబీఆర్‌టీ ఏఈఈ మెకానికల్, 18 అక్టోబర్ 2015)
   1) చక్కెర పరిశ్రమ
   2) కాగితం పరిశ్రమ
   3) ముడి ఇనుము పరిశ్రమ
   4) బొగ్గు పరిశ్రమ

సమాధానాలు

1) 2; 2) 4; 3) 3; 4) 4; 5) 1; 6) 3; 7) 4; 8) 4.

To emphasise a subject...



BANK EXAMS

General English

PRONOUNS

Pronouns stand in for nouns in a sentence. Pronouns follow the same agreement rules as nouns, so when using a pronoun, it is important to be clear about what noun it is replacing.

The following tips are noteworthy, pay attention:

- We should use the personal pronouns in the order of second person, third person and first person. The order first person, second person and third person is possible when we admit guilt.
- A pronoun in the nominative form should be compared with the same form of the pronoun.
- When two singular nouns are joined by and refer to the same person the pronoun used in their place should be singular in form.
- A singular pronoun should be used when two singular nouns are joined by *either or, neither nor*.
- A pronoun in the plural form should be used when two nouns of different members are joined by *'or'* or *'nor'*.
- The distributive pronouns *'either, neither, none, any, no one'* are used with singular verbs.
- The indefinite pronoun *"one"* should be used as *"one's"* for its possessive case.
- The verbs such as *cheat, introduce, present, absent, satisfy, prepare, enjoy, hurt, avail of* are followed by either an object or a reflexive pronoun.
- The word *'who'* as a relative pronoun in the nominative case takes a verb.
- If a pronoun is to be placed after *'to be'*, the pronoun in the subjective case is used.

Relative Pronouns

Which, that and *who* are relative pronouns. A relative pronoun must refer to the word immediately preceding it. If the meaning of the sentence is unclear, the pronoun is in the wrong position. *Which* introduces non-essential clauses; *that* introduces essential clauses. *Who* refers to an individual; that refers to a group of persons, class, type or species.

Examples: This is the doctor who treated me for typhoid.

Scientists have found a gene that may be linked to heart attacks.

My parents live in Patna, which is the capital of Bihar.

Impersonal Pronouns

It, you, one and *they* are impersonal pronouns. Impersonal pronouns serve as a noun without a specific identity.

Examples: It is going to be chilly tomorrow.

How do you get to the theatre from here?

One should always find time to enjoy life.

They say the time it takes to restore normalcy after the calamity depends on many factors.

Possessive pronouns

Possessive pronouns are used in place of nouns to indicate the meaning of belonging or possession. The group includes *mine, ours, yours, his, hers* and *theirs.*

Reflexive pronouns

Reflexive pronouns are used when the subject and the object of a verb (or preposition) both refer to the same person, animal, place or thing. The group consists of *myself, ourselves, yourself, yourselves, himself, herself, itself* and *themselves.*

Examples: I saw myself in the mirror.

Sarala cut herself while chopping vegetables.

Reflexive pronouns are also often used to emphasize a subject noun or pronoun they represent.

Example: Sireesha painted the house herself. (On her own)

Do not use reflexive pronouns to emphasize any word that is not a noun or a pronoun.

Example: She will send you the form now itself. (Incorrect)

She will send you the form now. (Correct)

Demonstrative pronouns

Demonstrative pronouns, *this, that, these* and *those* (by themselves, without a following noun), are used to point to someone or something close to the speaker in space or time.

Examples: Sumalatha wrote this.

Those are Ravi Verma's paintings.

Indefinite pronouns

Indefinite pronouns are also used in place of nouns when we do not know or do not want to specify the identity and number of the person or thing we are referring to. The group consists of the words *some, any, others, another, someone, somebody, something, everyone, everybody, everything, anyone, anybody, anything, one, no one, nobody* and *nothing.*

Examples: She writes short stories. Some are very good.

He saw two peacocks in the park, but I didn't see any.

No one (nobody) knows where the keys are.

Everyone (everybody) says that Chandigarh is a planned city.

Note:

- The words in the pairs some one... somebody, anyone... anybody and no one ... nobody mean the same and that you can use them interchangeably.
- All the compounds above except no one are written as one word.
- Pronouns of number and quantity and numbers, one, two, three, etc., can also be used as pronouns in place of nouns.
- Other pronouns that can be used to refer to number as well as quantity are *all, many, several, much, none, more, most, both, few, a few, little* and *a little.*

The hotel has twenty rooms; all face the park. (Meaning the rooms)

Many are not happy with the way the company is being run. (Meaning many people, employees, etc.)

Distributive pronouns

Distributive pronouns, *each, either* and *neither* are also used in place of nouns that are referred to individually, not as a group or a collection.

Examples: There were ten dancers on the stage. Each was dressed in brightly coloured costumes. (Meaning each of the dancers)

Would you like to have tea or coffee? Either will do, thanks. (Meaning either one)

David has two pens, but neither writes. (Meaning neither pen)

Reciprocal pronouns

Reciprocal pronouns, *each other* and *one another*, are used on their own in place of nouns that are two or more in number, these pronouns show a reciprocal relationship among the members of a group.

Examples: Shabana and her sister-in-law hugged each other.

The players congratulated one another on winning the football tournament.

Interrogative pronouns

Interrogative pronouns, *who, whom, whose, which* and *what* are used in questions to refer to people or things.

Examples: Who is your chemistry teacher?

Which is your torch?

What are you reading?

Note: The pronouns *who, whom* and *whose* are used only to refer to people, which is used for both people and things, and *what* is used only when referring to things.

PRACTICE TEST

Directions (Q. No. 1-10): Each question below has a blank/ two blanks, indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for the blank that best fits the meaning of the sentence as a whole.

1. We all told the manager that we wanted to have ____ salaries paid in advance but she just ignored ____.
   1) ours; it 2) his; we
   3) their; our 4) we; his
   5) our; us
2. When Harish asked me how I had got ____ address, I told him that I was given it by a relative of ____.
   1) my; me 2) his; his
   3) mine; his 4) his; him
   5) him; him
3. Although ____ in the room seemed to follow ____ said by the speaker, he never intended to simplify his language.
   1) no one; anything
   2) anybody; anything
   3) nobody; nothing
   4) anyone; nothing
   5) someone; something
4. I hope you will enjoy ____ at the birthday party this weekend because I won't be able to be there ____.
   1) You; myself
   2) yourself; mine
   3) yours; oneself
   4) yourself; myself 5) you; me
5. We decided to do all the cooking ____ instead of hiring a catering company for the party.
   1) of our own 2) oneself
   3) by ourselves 4) ours
   5) each other
6. Hundreds of children nowadays prefer doing ____ homework with a background of music to doing ____ in a quiet room.
   1) theirs; them 2) his; its
   3) them; it's 4) they; them
   5) their; it
7. You and ____ sister need to take time to prepare ____ for the long journey which will start next month.
   1) his; yourself
   2) yours; ourselves
   3) their; you
   4) your; yourselves
   5) her; by themselves
8. The students watched each gesture of ____ as if their teacher were a stranger.
   1) them 2) hers 3) him
   4) her 5) himself
9. Trademarks enable a company to distinguish ____ products from ____ of another company.
   1) their; it 2) it; that
   3) our; this 4) it's; those
   5) my; these
10. ____ cannot see through translucent materials, but light can pass through ____.
    1) we; it 2) Anything; their
    3) One; them 4) No one; its
    5) Everyone; their

Key:

1) 5 2) 2 3) 1 4) 4
5) 3 6) 5 7) 4 8) 2
9) 4 10) 3